

# ఇట్లు ఒక రైతు

గొర్రెపాటి నరేంద్రనాథ్

నరేంద్ర-ఇట్లు
98487

# ఇట్లు
# ఒక రైతు

గొర్రెపాటి నరేంద్రనాథ్

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

633
C. 12219
సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. 98487
హైదరాబాద్ - 500032.

ధర : రూ. 50/-
మొదటి ముద్రణ : ఫిబ్రవరి, 2009
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067.
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ: అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్: 23391364, 23304194

# ముందుమాట

స్వానుభవాలను స్వగతంలో చెబితే లేదా రాస్తే ఏ విషయమైనా ఆసక్తికరంగా వుంటుంది. మనసుకు హత్తుకుపోతుంది. గొర్రెపాటి నరేంద్రనాథ్ రాసిన పుస్తకం "ఇట్లు ఒకరైతు" ఆద్యంతమూ ఆసక్తికరంగా వుంది. పుస్తకం చదవడం ఆరంభిస్తే, అయిపోయేంత వరకు వదలిపెట్టడానికి బుద్ధి పుట్టదు. నరేంద్రనాథ్ "ఇట్లు ఒక రైతు"అని అన్నారు. కానీ నిజానికి ఇది రైతులందరి గొడవే. లక్షలాది మంది రైతుల ఘోషను తన గొంతు ద్వారా ఆయన వినిపించారు. అంటే తన రచన ద్వారా తెలియచేశారు. "సేద్యంలో నా గొడవ" అని రాసుకున్నారు. అయితే, సేద్యంతో పాటు అనేక ముఖ్యమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ఈ పుస్తకంలో విశ్లేషించారు.

హైదరాబాద్ వదలి వ్యవసాయం చేయడానికి తమ స్వగ్రామానికి వెళ్తున్నామని ఆయన కొంత ముందుగానే నాతో చెప్పారు. వ్యవసాయం ఉత్తమమనీ, ఎంతో సృజనాత్మకమైనదనీ చెబుతూ, అది కష్ట, నష్టాలతో కూడుకొన్నదని సూచించాను. వ్యవసాయంలోనూ "అభివృద్ధి" పంథాలోనూ ప్రత్యామ్నాయాలను కనుగొనాలనీ, స్వయంగా వాటిని అమలు చేయాలనే సదుద్దేశ్యంతో, ఆశయంతో ఆయన ముందుకెళ్లారు.

నగరంలో పుట్టి పెరిగినవాడూ, విద్యాధికుడూ అయిన యువకుడు పల్లెబాట పట్టాడంటే నిజంగా ఇది ఎంతో ఆదర్శవంతమైనది, స్ఫూర్తి దాయకమయినది.

స్వగ్రామంలో నరేంద్రనాథ్ గత ఇరవై ఏళ్ళుగా సేద్యంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. తన చుట్టూ వున్న జనం, ముఖ్యంగా, పేద వర్గాల వారి అభ్యున్నతికి, సామాజిక మార్పు కోసం ఎంతో కృషి చేశారు. ఈ అంశాలన్నింటిని ఆయన పుస్తకంలో వివరించారు. పుస్తకం మొదట్లోనే ఆయన్ను కలవరపెట్టుతున్న అంశాల్ని ప్రస్తావించారు. పలు ప్రశ్నలు సంధించారు. రైతుల ఆత్మహత్యలు, నిర్వాసిత సమస్య, గిట్టుబాటు కాని సేద్యం, జలయజ్ఞం (ధనయజ్ఞం?), పేదలకు సాగుభూమి, రాష్ట్రాన్ని సారాంధ్రప్రదేశ్‌గా మార్చటం, మొదలైన అంశాలు ఆయన్ను వేదనకు గురిచేస్తున్నాయి. జనాన్ని నిరాశలో పడేస్తున్నాయి. ఆ నిరాశను ఆశగా మార్చడానికి ఈ పుస్తకం దోహదపడుతుందని ఆశిద్దాం.

తన స్వంత అనుభవాలకు తోడుగా, తన చుట్టూ జరుగుతున్న సేద్య పద్ధతులనూ, దేశీయ, దేశాంతర విధానాలనూ పరిశీలించి, అధ్యయనం చేసి, పుస్తకంలో వివరంగా

చర్చించారు. ఈ పుస్తకంలో చీకటి, వెలుగులు రెండు చోటు చేసుకున్నాయి. ఈ ధనిక రైతు స్వయంగా చేసిన సేద్యం నష్టాలకు గురి అయింది.

చేతిలో వున్న డబ్బంతా ఏడేళ్ళకే హరించుకునిపోయింది. అప్పుల పాలయ్యారు. ఈ దుస్థితికి అనేక కారణాలున్నాయి. ఇవి సాధారణంగా రైతులందర్నీ పీడిస్తున్న సమస్యలే. బోర్లలో నీరు ఇంకిపోవడం, కరెంటు కటకటలు, పంటలు ఎండిపోవడం, కరువులు, సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, (ముఖ్యంగా దున్నడం, ఎరువులు, పురుగు మందులు, కూలీలు మొదలైన వాటి ఖర్చు), పెట్టుబడులకు ఇబ్బంది, మార్కెట్ మాయాజాలం, గిట్టుబాటు కాని ధరలు మొదలైన సమస్యలున్నాయి.

పై సమస్యలతో పాటు నరేంద్రనాథ్ సాగించిన సేద్యంలో మరోకోణం వుంది. ఇది చాలా ముఖ్యమైంది. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రత్యామ్నాయంగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఆయన తన పొలాల్లో అమలు చేశారు. పుస్తకాల ద్వారా తెల్సుకున్న విజ్ఞానాన్ని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్న వారి నుంచి నేర్చుకున్న పద్ధతులను, క్షేత్ర సందర్శనాల ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని తన స్వంత భూమిలో అమలు చేశారు. రకరకాల ప్రయోగాలు చేశారు. సేంద్రీయ వ్యవసాయం చేసి తన చేతులు కాల్చుకున్నారు. నష్టపోయారు. వరి, చెరకు, మామిడిపంటల్లో సేంద్రీయ ఎరువులు వేశారు. సేంద్రీయ పురుగు మందులు వాడారు. కానీ ఇవి పెద్దగా పనిచేయలేదని తెలిపారు. రసాయనాల విషవలయం నుండి బయట పడాలని గత 20 ఏళ్ళుగా ప్రయత్నిస్తూనే వున్నారు. సేంద్రీయ పద్ధతులను పాటిస్తే కచ్చితంగా రోగాలను, పురుగులను నివారించగలమని ఈ రోజుకూ వారు చెప్పే పరిస్థితిలో లేరు. సేంద్రీయ మందులను తయారు చేసుకోవడం, ముఖ్యంగా భారీ మోతాదులో కావాలంటే, సాధ్యమయ్యేపనికాదు సేంద్రీయ మందులు కంపెనీల నుండి కొనాలంటే ఖర్చులు చాలా ఎక్కువ. పంట దిగుబడులు కూడా పెరగలేదు. సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించిన ఉత్పత్తులు, ముఖ్యంగా బియ్యం, బెల్లం, అమ్ముకోవడంలోనూ సమస్యలున్నాయి.

ఆధునిక వ్యవసాయం రైతులను అనేక విధాలుగా నష్టపరిచింది. ఇది వాస్తవం. మంచి సాంప్రదాయ పద్ధతులు మరుగున పడ్డాయి. మార్కెట్ శక్తులపై ఆధారపడటం పెరిగింది. పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. దిగుబడుల్లో స్థిరత్వంలేదు. భూమి, నీరు, వాతావరణం కలుషితమయ్యాయి. రసాయనాల ద్వారా పండించిన ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీశాయి. ఇంకా తీస్తూనే వుంటాయి. కాబట్టి, ప్రజల ఆరోగ్యం కాపాడుకోవాలంటే, ఉత్పత్తి ఖర్చులు తగ్గాలంటే, వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే ప్రత్యామ్నాయం సేంద్రీయ వ్యవసాయమే. అయితే దీనికి ప్రభుత్వం యొక్క సంపూర్ణ సహకార, సహాయాలు అవసరం. రసాయనిక ఎరువులకు ఇచ్చే విధంగా, సేంద్రియ ఎరువులకు, అలాగే, సేంద్రియ పురుగు మందులకు భారీగా సబ్సిడీలు ఇవ్వాలి. ఉత్పత్తుల

అమ్మకంలోనూ తోడ్పడాలి. ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశిత విధానాలకు స్వస్తి చెప్పాలి అందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముంది.

పుస్తకంలో నిర్వాసితుల గురించి నరేంద్రనాథ్ రాసిన విషయాలు అక్షర సత్యాలు. "నిర్వాసితం"కు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాల్లో ఆయన ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. బోరుబావులు, కరెంటుకన్నీరు, కంట్రాక్టర్లు - రాజకీయ నాయకుల దోపిడీకి గురి అయిన వాటర్ షెడ్ పథకాలను గురించి వివరించారు.

రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన "జలయజ్ఞం" ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. రాష్ట్రంలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు ఎత్తిపోతల పథకాలే. ఇవి సఫలం కావడం కష్టమే. కోటి ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు (గత $4^{1/2}$ ఏళ్లలో) 14 లక్షల ఎకరాలకు కూడా నీరు అందించలేకపోయింది. నిజానికి సాగునీటి పంటల విస్తీర్ణం తగ్గిందని గణాంక వివరాలు తెలుపుతున్నాయి. మసిపూసి మారేడు కాయలుగా ప్రజలకు చూపిస్తున్నారు పాలకులు.

చిత్తూరు జిల్లాలో రైతులు, ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతులు నిలదొక్కుకోవడానికి పాడి పరిశ్రమ భాగా ఉపయోగపడింది. ఇందులోని సాధక బాధకాలను రచయిత బాగా వివరించారు. గాంధీగారి బాటలో ఆదర్శవంతమైన వ్యవసాయం చేయటంలోనూ, వన సంరక్షణలోనూ అపర్ణా - నగేష్‌లు ఎదుర్కొన్న సమస్యలు తెల్సుకోదగ్గవి.

వ్యవసాయ కూలీల జీవితాల్లో గత 40-50 ఏళ్ళలో చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి. వారికి జీవితాలు మెరుగయ్యాయి. భూస్వామ్య వ్యవస్థ బలహీనపడింది. అయితే కొత్త సంపన్నులు తయారయ్యారు. వ్యవసాయకూలీలు అత్యధికంగా దళిత వర్గాలవారే. అంటరానితనం ఇంకా పల్లెల్లో కొనసాగుతోంది. వారు అనేక విధాలుగా సామాజిక వివక్షతకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే ఉద్యమాల అవసరం ఎంతైనా వుందని రచయిత అభిప్రాయం. దళితులకు భూమిని స్వాధీనపరచినప్పుడే వారి సాంఘిక, ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. చిత్తూరు జిల్లాలో భూపంపకాల విషయంలో కొంత ప్రగతిని సాధించారు. ఇలాంటి ప్రయత్నాలు, పోరాటాలు అన్ని చోట్లా జరగాలి.

అంతర్జాతీయ పరిస్థితిలో నేటి వ్యవసాయాన్ని గురించి మరింత స్పష్టంగా, వివరంగా రాసి వుంటే బాగుండేది. అంతర్జాతయ పరిస్థితులు మన వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. వీటిని అధిగమించడానికి అవసరమైన విధానాలేమిటో విశదీకరించియుంటే ఉపయోగంగా వుండేది. అయితే, వెంకటాపురం బాణాలు, ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, భూమి పంపకాలు, గిట్టుబాటు ధరలు, నిర్వాసిత్వానికి వ్యతిరేకత, బహుళ జాతి సంస్థలకు వ్యతిరేకంగా స్వదేశీ ఉద్యమం మొదలైన వాటి ద్వారా సామ్రాజ్యవాద శక్తులను గట్టిగా ఎదుర్కోవచ్చు, తిప్పికొట్టవచ్చు.

నిరాశ నుండి ఆశావాదానికి వెళ్ళడానికి ప్రకృతి అవకాశమిస్తూనే వుంటుంది. అయినప్పటికీ, మానవ ప్రయత్నతం అతి ముఖ్యం.

పుస్తకం బాగుంది. అయితే ఇదొక కలగూర గంపలాగా అగుపడే ప్రమాదముంది. ఒక భాగం (ఛాప్టర్) నుండి మరొక భాగాన్ని ఒక క్రమ పద్ధతి (సీక్వెన్స్) లో కలిపి (లింక్) వుంటే మరింత అర్థవంతంగా వుండేది. పువ్వులు విడివిడిగా అందంగా వున్నాయి. కానీ దండ కూర్చడంలో కొంత కొరత వున్నట్లు కనబడుతోంది. దారం కరువయ్యింది. ఎడిటింగ్‌లో మరింత శ్రద్ధ పెట్టి వుంటే పుస్తకం ఆకర్షణీయంగా వుండేది. ఏమైనా రైతులు, రైతునాయకులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు, మేధావులు, శాస్త్రజ్ఞులు అవశ్యం చదువాల్సిన పుస్తకమిది. రైతాంగం సంక్షోభంలో కూరుకునిపోయిన ఈ సందర్భంలో, మిక్కిలి ఉపయుక్తమైన, ఉత్తమమైన పుస్తకాన్ని అందించిన నరేంద్రనాథ్ అభినందనీయులు.

- ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి

మార్చి 14, 2009

విద్యానగర్, హైదరాబాద్.

# అంకితం

పాలకుల మూర్ఖత్వంతో "అభివృద్ధి" రథచక్రాల కింద నలిగిపోయి, నిరాశతో దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న లక్షలాది మంది రైతులకు, అనాథలైపోయిన వారి కుటుంబాలకు.

ఎంత ఉన్నత ఉద్యోగంలో వున్నా తన రైతు స్వభావాన్ని మరవని మా నాన్నగారు గొర్రెపాటి రామచంద్రనాయుడు గారికి, నాకు జన్మనిచ్చి అన్ని విధాలా మంచి పనులే చేయమని నిరంతరం ప్రోత్సహించిన మా అమ్మ గొర్రెపాటి లక్ష్మీదేవి గారికి. ...

తన తుది శ్వాస వరకూ గ్రామీణ పేదల కోసం, రైతుల కోసం కృషి చేస్తూ, భూసంస్కరణల అమలుకోసం నిరంతరం పోరాడుతూ, పోరాడమని వెన్నుతట్టి ప్రోత్సహించిన అమరులు కామ్రేడ్ కొల్లా వెంకయ్యగారికి ...

# ఇట్లు ఒక రైతు

"సందిగ్ధంలో ఉన్నపుడు నా దగ్గర ఓ మంచి తాయత్తు వుంది. కళ్ళు మూసుకొని మీ జీవితంలో మీరు చూసిన అత్యంత దరిద్ర నారాయణుడిని గుర్తు చేసుకొంటూ మీరు చేపట్టబోయే చర్య అతన్ని ఏవిధంగా ప్రభావితం చేయగలదో ఆలోచించండి"

– మహాత్మాగాంధీ

1) ఒక పక్క సాలీనా 10 శాతం అభివృద్ధికి మన దేశ ఆర్థిక వ్యవస్థ ఉవ్విళ్ళూరుతుండగా, 300 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం వుండగా, విదేశీ కంపెనీలెన్నో పెట్టుబడులు పెడతామని పోటీ పడుతుండగా, ఐటి కంపెనీలు ఏటా కోట్లకు కోట్లు లాభాలు గడిస్తుండగా, (మరోపక్క) ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా సాయపడతామని ముందుకు వస్తున్నా ఆగని రైతుల ఆత్మహత్యల గురించి ఏం చేయగలం?

2) "అభివృద్ధి" పంథాలో అభివృద్ధి చెందిన దేశాలవలె మన దేశంలో కూడా ఏదో విధంగా రైతాంగమంతా వ్యవసాయాన్ని వదులుకోవలసిందేనా? నేడు సుమారు 60 శాతం జనాభా మన దేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి వున్నారు. వీరు "అభివృద్ధి" చెందిన దేశాల్లో లాగ 15 శాతం నుండి 2-3 శాతంకు తగ్గిపోవలసిందేనా? వారు అప్పుడు ఎక్కడికి పోతారు? ఎలా పోతారు? అంటే దాదాపు 60 కోట్ల మంది ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదా?

3) "అభివృద్ధి" పేరుతో, విదేశీ స్వేచ్ఛా పెట్టుబడుల పేరుతో ఎన్నో కాలుష్యకారక ఫ్యాక్టరీలు, కార్యక్రమాలు దేశానికి తరలి వస్తున్నాయి. ముఖ్యంగా "ప్రత్యేక ఆర్థిక మండళ్ళ" పేరుతో ఎటువంటి దేశీయ చట్టమూ, కార్మిక రక్షణ చట్టాలు పనిచేయని వందల "ఈస్టు ఇండియా కంపెనీల" ను నేడు వేలకు వేల ఎకరాల్లో స్థాపించేందుకు మన దేశపాలకులు ఆహ్వానిస్తున్నారు. ఆ రైతుల నిర్వాసిత సమస్య, కాలుష్య సమస్య ఒక ఎత్తు అయితే, భవిష్యత్తులో వీరు ఎంత మంది స్థానికులకు ఎటువంటి ఉద్యోగాలిప్పిస్తారో అన్నది పెద్ద ప్రశ్న.

4) ధర ఉంటే పంట వుండదు. పంట ఉంటే ధర ఉండదు. దీనికి తోడు గత 17 సంవత్సరాలుగా మన దేశంలోనూ, దాదాపు ప్రపంచ వ్యాప్తంగానూ జరుగుతున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలతో, ఎగుమతుల, దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేయడం, అభివృద్ధి చెందిన దేశాల్లో పంటలకు రాయితీలివ్వడం, మన దేశంలోని

పంటలకు ఉన్న కాసిన్ని రాయితీలను కూడా ఎత్తివేసేందుకు ప్రయత్నించటంతో ఈ సమస్య మరింత తీవ్రమౌతోంది. ఎంత మొత్తుకున్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మార్కెట్లో పంటల ధరలు పడిపోతే వెంటనే రైతును ఆదుకోవటంలేదు. ఏ పంట వేసినా గిట్టుబాటు కానపుడు వ్యవసాయం ఎలా సాగాలి? రైతు ఏ విధంగా బతకాలి? ఎన్నికల ముందు రైతులకు బ్యాంకుల్లో ఉన్న ఋణాలు మాఫీ చేయటంతో సమస్య తీరుతుందా? మళ్ళీ కొత్తగా ఈ రైతులకు అప్పులు ఇస్తారా? ఏమేరకు? మళ్ళీ రైతులు వాటిని తిరిగి కడతారా? లేక మరో ఎలక్షను కోసం ఎదురు చూస్తారా? ప్రైవేటు అప్పుల మాటేమిటి?

5) అకాల వర్షాలు, కరువులతో, అతివృష్టి, అనావృష్టిలతో చేతికొచ్చే పంట మట్టిపాలైతే రైతును ఆదుకునే ఇన్సూరెన్సు పధకాలేవి?

6) రైతు సంఘాలు, రైతు ఉద్యమాలు ఎందుకింత బలహీనంగా వున్నాయి? వాటిని ఎందుకు బలోపేతం చేయలేకపోతున్నాము?

7) దేశంలో 60 శాతం నీటి ఆధారిత పంటలు భూగర్భ జలాలపై ఆధారపడి వున్నాయి. విచ్చల విడిగా బోర్లు వేయటంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. మరింత లోతు నుండి నీరు తోడేయటంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. కరెంటు వాడకం ఎక్కువవుతున్నది. కలుషితమైన నీరు పైకి వచ్చే ప్రమాదం ఎక్కువైంది (ఫ్లోరోసిస్, ఆర్సెనిక్ కలిసిన). వ్యవసాయానికి "ఉచిత కరెంటు" సమస్యలు ఏమేరకు పరిష్కారమౌతాయి?

8) నదీ జలాలను 'జలయజ్ఞం' ద్వారా అందజేస్తూ భూగర్భ జలాలపై వత్తిడి తగ్గించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం యోచన. 'జలయజ్ఞం' కింద లక్ష కోట్ల రూ.లు పైన ప్రజల డబ్బు. అదీ అప్పుగా తెచ్చి ఖర్చుచేసేందుకు సిద్ధమైనది రాష్ట్ర ప్రభుత్వం. ఈ ఐదేళ్ళలో పూర్తి కాకపోతే మరో అయిదేళ్ళు అవకాశమివ్వమంటున్నారు. అన్ని రాష్ట్రాలు మితిమీరి ప్రాజెక్టులు కడుతుండటంతోటి, ఈ ప్రాజెక్టులు పూర్తి అయినా నీళ్ళు వచ్చేది కష్టమే! జిల్లాకి జిల్లా, ప్రాంతానికి ప్రాంతం, రాష్ట్రానికి రాష్ట్రం నీటి తగాదాల్లో ఏటా మునగటమే తప్ప, దీని గురించి ఏమి చేయగలం?

9) వాతావరణ కాలుష్యం వల్ల ముందెన్నడూ లేని విధంగా నేడు పర్యావరణం పెద్ద ముప్పులో పడిపోయింది. కొద్ది సంవత్సరాలుగా హిమాలయాల మంచు శరవేగంగా కరుగుతున్నది. అంటే గంగా, యమునా, సింధూ నదులు ఎండా కాలంలో ఎండిపోయే ప్రమాదం పొంచి వున్నది! అడవులు శరవేగంగా నరికి వేయబడుతున్నాయి. దట్టమైన అడవులు దేశంలో నాలుగు శాతం కూడా లేవు (భూమిపై 33 శాతం వుండాల్సినవి) అడవులను సంరక్షించే బాధ్యత స్థానిక పేదలకివ్వాలా లేక కంపెనీలకు ఇవ్వాలా లేదా ప్రభుత్వమే సంరక్షించాలా అన్నది నేడు పాలకులనీ, మనలనీ సందిగ్దంలో పడవేసింది.

10) దేశీయ పశు సంపద పాల కోసం మాత్రమే గాకుండా దాని పేడ, మూత్రానికున్న విలువను గుర్తించే సంప్రదాయ ఎరువులను కంపోస్టింగు పద్ధతుల ద్వారా పెంచే ప్రయోగం తద్వారా సేంద్రీయ వ్యవసాయ విధానం రైతులు అవలంబించేటట్లు, రసాయనిక ఎరువులు, పురుగు మందులకు వ్యతిరేకంగా నిలబడేటట్లు ఎలా చేయడం? ఎందుకు చేయలేకపోతున్నాం? ఎందుకు గోబర్‌గ్యాస్ (పేడ నుంచి గ్యాస్) వైపు రైతులను మళ్ళించలేకపోతున్నాము? లోపం ఎక్కడున్నది? "శ్రీవరి" పద్ధతి వైపు ఎందుకు మళ్ళించలేకున్నాము? ఏదైనా చేసి చూపించాలి. శ్రమ తక్కువగా, లాభదాయకంగా వుంటే రైతులే వచ్చి అడిగి తెలుసుకుంటారు కదా?

11) నేడు రాష్ట్రంలో సుమారు 60 లక్షల నుండి కోటి ఎకరాల సాగు భూములను పేదల స్వాధీనం చేయాల్సి వుంది. లేదా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిప్పించాల్సి వుంది. (25 శాతం సాగు భూమికి). ముందు ఈ పని కానివ్వాలి. దీనికి వామపక్ష పార్టీలు నడుం కట్టడానికి సిద్ధమేనా? రాజకీయ అధికారం చేజిక్కించుకోనిదే ఇది ఎలా సాధ్యం?!

12) నేడు సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల డీజిలు, పెట్రోల్ తదితర ఇంధనాలను ఏటా దిగుమతి చేసుకుంటున్నాము (75శాతం అవసరాలకు). దీన్ని అధిగమించేందుకు అడవి బంజర్లలోనూ, ఇతర వ్యవసాయ భూముల్లోనూ పెద్దఎత్తున "బయో డీజులు" తోటలను కానుగ, అడవి ఆముదం వగైరా రాష్ట్ర (దేశ) ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. తద్వారా పలు ప్రాంతాల్లో ఆహార పంటల బదులు కొందరు రైతులు ఈ పంటలు సాగు చేయడంతో ఆహార పంటల ఉత్పత్తి పడిపోయింది. ఆహార పంటల ధరలు (అంతర్జాతీయంగా కూడా) పెరగటానికి ఇది కూడా ఒక ముఖ్య కారణం. మరేం చేయాలి? డీజిలు, పెట్రోలు వాడకంలో స్వావలంబన ఎలా సాధించాలి? ఇది సాధ్యమేనా?

13) ఈ సంవత్సరం అధికారికంగా ఒక లక్ష కోట్ల రూ.లు (అనధికారికంగా ఇతర పద్దుల కింద మరో యాభై వేల కోట్ల రూపాయలు) దేశ రక్షణకై ఖర్చు పెడుతున్నారు. (ఇందులో మూడవ వంతు ఖర్చు కాశ్మీరుకే సరిపోతున్నది.) ఎవరి నుండి ఎవరికి రక్షణ? ప్రత్యామ్నాయ మార్గాలు లేవా?

14) నేడు మన రాష్ట్రంలో సర్కారుకు ఎనిమిది వేల కోట్ల రూపాయలు మద్యం అమ్మకాల ద్వారా పన్నుల రూపంలో ఆదాయం వస్తోంది. అంటే అమ్మకాలు దానికి మూడింతలుగా అంటే 24 వేలకోట్లకు పైగా ఉంటున్నది. ఇది పేదల రక్తం! స్వర్ణాంధ్రప్రదేశ్, హరితాంధ్రప్రదేశ్‌కు బదులు సారాంధ్ర ప్రదేశ్, బ్రాందాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తున్నారు. ఎన్ని కుటుంబాలు నాశనమైపోతున్నాయో! తాగుబోతులు సంసారాలను నాశనం చేయటం ఒక విషయమైతే రోజుకు 37 మందికి పైగా మరణిస్తున్న రోడ్డు

ప్రమాదాల్లో (సం॥నికి రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలుపైనే) ఎక్కువ భాగానికి మద్యమే మూలకారణం. దీన్ని ఎలా నిలుపుదల చేయడం? బెల్టుషాపులు ఎత్తివేస్తే సమస్య తీరిపోతుందా? ఎక్కడ పోయిందా మద్యపాన నిషేధ మహిళా శక్తి అంతా?

15) టౌన్లలోని బంధువులలాగ చావులు, పెళ్ళిళ్ళకు వేలు, లక్షలు రైతులు, వ్యవసాయ కూలీలు కూడా ఖర్చు పెట్టి అప్పులపాలై పోతున్నారు. ఇవి అపుడపుడు ఆత్మహత్యలకు కూడా దారితీస్తున్నాయి. ఈ అనవసరపు ఖర్చులు అడ్డుకునేదెలా?

ఇవన్నీ వ్యవసాయం గురించి ఒక రైతుగా, ఒక సంఘ సేవకుడిగా, ఒక పౌరునిగా నన్ను వేధిస్తున్న కొన్ని ముఖ్య ప్రశ్నలు. మన చుట్టూ జరుగుతున్న అరాచకాలు, లంచాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు చూసి విసిగి ఈ దేశం, సమాజం ఎప్పుడు బాగుపడుతుందని నిరాశతో (వున్నారా?) ఆ నిరాశని ఆశగా మార్చేందుకు, ఆ కృషిలో అందరికి అంతో, ఇంతో భాగం కల్పించగలననే ఆశతో ఈ పుస్తకం మీ ముందు వుంచుతున్నాను.

ఈ రచన ఆరు భాగాలుగా వుంది. మొదటి భాగంలో వ్యవసాయంలో గత 20 సం లుగా మా అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ళు వివరించే ప్రయత్నం చేశాము. రెండవ భాగంలో పశుపోషణ, పౌష్టిక ఆహారం, ఆరోగ్యం, అడవుల సంరక్షణలో మా అనుభవాలు కొన్ని వివరించాము. మూడవ భాగంలో దళితులు, ఇతర పేద వర్గాలతో వారి సమస్యలపై పనిచేయటంలో అనుభవాలు రాశాము. నాలుగవ అధ్యాయంలో క్షీణిస్తున్న చేతి వృత్తుల గురించి వివరించాము. ఐదవ అధ్యాయంలో నేటి దేశ, అంతర్జాతీయ పరిస్థితిపైన రాశాము. ఆరవ అధ్యాయంలో ప్రత్యామ్నాయాలు, భవిష్యత్తు కార్యాచరణపైన నా ఆలోచనలు, అభిప్రాయాలు రాశాను. ఈ పుస్తకం చదివి మీ అభిప్రాయాలు నాకు తెలియజేస్తారని ఆశిస్తూ శుభాకాంక్షలతో ...

తేదీ 11/11/2008

గొర్రెపాటి నరేంద్రనాథ్

వెంకట్రామాపురం

చిత్తూరు జిల్లా - 517 152

# I

# పంటలతో నా ప్రయోగాలు

గత 20 సంవత్సరాలుగా నేనూ, నా సమచరిణి ఉమా శంకరి మా స్వగ్రామమైన చిత్తూరు జిల్లాలోని వెంకట్రామాపురంలో చేసిన వ్యవసాయంలో ఎదుర్కొన్న విభిన్న రకాల అనుభవాలలో కొన్ని ముఖ్యమైన వాటిని మీతో పంచుకోదలచుకున్నాము.

అసలు నగరాన్ని వదిలి స్వగ్రామానికెందుకు వెళ్ళాం ...?

1979 చివరిలో ఇందిరాగాంధీ తిరిగి ఎన్నిక కాబోతున్న సమయంలో ఢిల్లీలో ప్రొఫెసర్ రజనీ కొఠారి, ధీరుభాయ్ షేట్, గిరీ దేసింగ్‌కర్, అషిష్ నంది, క్లాడ్ అల్వారిస్, నాతో చదువుకున్న విజయ్ ప్రతాప్ లాంటి కొందరు మేధావులు పెట్టుబడిదారి "అభివృద్ధి" మోడల్‌కి కమ్యూనిస్టు దృక్పథానికి మధ్యన, లేక వాటికి అతీతంగా నేటి ఆర్థిక, రాజకీయ, పర్యావరణ, సాంఘిక సంక్షోభాల పరిష్కారానికి మరో గాంధేయ పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయం ఏమైనా వున్నదా అన్న అన్వేషణలో వున్నారు.

ఆధునిక విజ్ఞాన పద్ధతిని ప్రశ్నించేవారిని, నేటి విద్యావిధానాన్ని ప్రశ్నించేవారిని, "అభివృద్ధి"ని ప్రశ్నించేవారిని వ్యవసాయ విధానాన్ని, నీటి విధానాన్ని, ఆరోగ్య విధానాన్ని ఒకటేమిటి ఈ విధంగా వివిధ రంగాలలో వ్యవస్థను ప్రశ్నించేవారిని, ప్రత్యామ్నాయాల కోసం వారి వారి పద్ధతుల్లో కృషి చేస్తున్న వారిని దేశస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సమావేశ పరిచి, వారంతా చర్చించి మార్పుకోసం కార్యక్రమాలు రూపొందించాలని వాళ్లు ఒక ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నానికి "లోకాయన్" అనే పేరు పెట్టారు. (అంటే ప్రజల వైపు పయనం అన్నమాట). ఇది కొత్త ఢిల్లీలోని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవెలపింగ్ సొసైటీస్ (అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన కేంద్రం) వారి ఒక ప్రాజెక్టుగా మొదలైంది.

నేను, అప్పటి వరకు ఎంతో బాధతో చేస్తున్న బ్యాంకు ఉద్యోగానికి నా సహచరి ఉమ ప్రోత్సాహంతో రాజీనామా పెట్టేసి (గంతేసి) వారితో చేరిపోయాను. 1980 నుండి 1985 వరకు 5 సంవత్సరాలు వారితో కలిసి పని చేశాను. వారి తరఫున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, వామపక్ష సంఘాలు, మేధావులను, కలిశాను. ముఖ్యంగా శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై వ్యవసాయ విద్యాలయ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొ కె.ఆర్. చౌదరిగారి నాయకత్వాన ఒక మంచి నివేదిక తయారు చేశాం. ఆ

తరువాత నిర్వాసితులను కూడగట్టి వారితో ఒక సంఘాన్ని ఏర్పరచటానికి కృషి చేశాం. మళ్లీ 3 సంవత్సరాల తరువాత తిరిగి వారి పరిస్థితిని అధ్యయనం చేశాం. ప్రాజెక్టుల కింద నిర్వాసితుల సమస్యలను దేశ వ్యాప్తంగానూ, ప్రపంచ వ్యాప్తంగానూ వినిపించగలిగాం.

ఆ తరువాత హైదరాబాదులో కేశవరావు జాధవ్, ఎం.టి. ఖాన్ గార్ల నాయకత్వాన మత సామరస్యం గురించి, వసంత కన్నబిరాన్, రమా మెల్కోటె వంటి వారితోనూ స్త్రీ శక్తి సంఘటన, ఆం.ప్ర. పౌరహక్కుల సంఘం వారితోనూ కలిసి "హైదరాబాద్ ఏక్తా" అనే వేదికను ఏర్పాటు చేశాం. మత సామరస్యం కోసం మా వంతు కృషి చేశాం. పాదయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అధ్యయనం (దీపాధనరాజ్ ద్వారా) ఒక సినిమా తీయటం, సమావేశాలు, ఒక చిన్న ఆసుపత్రి పెట్టి నడపటం (2 సం।లు) చేయగలిగాం. ఈ మధ్యలో సైన్సుపైన, నీటిపైన, వ్యవసాయంపైన, విద్యపైన అనేక సదస్సులు జాతీయ స్థాయిలో లోకాయన్ తరపున జరుగుతుండేవి. వీటిలో కొన్నిటిలో నేను పాల్గొన్నాను. ఎన్నో ఆసక్తికర విషయాలు తెలుసుకున్నాను, ఎంతో మంది మేధావులను కలిశాను.

క్రియాత్మక ప్రత్యామ్నాయ ఆచరణ విషయంలో అడుగు ముందుకేయటం అంత సులువుకాదని తెలిసింది. నేటి ప్రముఖ పర్యావరణ వేత్తలు, అభివృద్ధిని ప్రశ్నించే నాయకురాళ్ళు మేథాపాట్కర్, వందనాశివ, అంతా లోకాయిన్ భాగస్వాములే. 5 సంవత్సరాలు లోకాయన్ చర్చల్లో గడిపాక, చెప్పిందే చెప్పటం, అడుగు ముందుకు పడకపోవటం ఒకింత అసంతృప్తి నాలో, ఉమలో ఎక్కువ కాసాగింది. ఆ సమయంలోనే జపాన్ వ్యవసాయ శాస్త్రవేత్త, తాత్వికుడు, రైతు అయిన మసనోబు ఫుకోకా రచించిన "గడ్డి పరకతో విప్లవం" చదివాము. అంతే, వెంటనే మా ఊరికి పోయి సేంద్రీయ వ్యవసాయం మొదలు పెట్టేయాలని ఒక ఉత్సాహం వచ్చేసింది.

1982లో ఈ నిర్ణయానికి వచ్చాం. అన్నిటికీ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించే మా అమ్మ ఆ మరుసటి సంవత్సరమే హఠాత్తుగా అమెరికాలో అగ్ని ప్రమాదంలో మరణించటంతో మా కార్యక్రమాలన్నీ మరో నాలుగు సంవత్సరాలు వాయిదా పడిపోయాయి.

1987లో మా ఊరిలో అడుగు పెట్టేటప్పటికి మా నాన్నగారు కూడా మాతో వచ్చారు. ఆయన మాకు పెద్ద దిక్కుగా వుండి అన్నీ చూసుకునేవారు. ఆయనకు ఈ సేంద్రీయ వ్యవసాయంపైన పెద్దగా నమ్మకం లేక ఒకటి రెండు ఎకరాల్లో చేసుకోమనేవారు. మిగతా అంతా మామూలు పద్ధతిలోనే చేయాలనేవారు. వారు బతికున్న ఆరు సంవత్సరాలు అదే విధంగా జరిగింది కూడా. వారు చెప్పినట్లు 1-2 ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం చేసి వుండవచ్చు. కానీ, నా ఉత్సాహం సన్నగిల్లింది. కానీ ఆ సమయంలో నాకు ఇంకా ముఖ్యమనిపించిన సాంఘిక దురాచారాలపై ఎక్కువ దృష్టి పెట్టాను. (3వ అధ్యాయంలో వాటి వివరాలు చెబుతాను).

మా నాన్నగారు 1993లో చనిపోయారు. ఆ తరువాత నుండి 14 సంవత్సరాలు వ్యవసాయమంతా నా ఆధ్వర్యంలోనే నడిచింది. ఈ 14 సంవత్సరాల అనుభవం మీ ముందుంచుతాను. మా నాన్నగారు పోయాక హైదరాబాదులో మా ఇల్లు, ఇంటి జాగ అమ్మేశాం. మా చేతికి రూ. 30 లక్షలు వచ్చింది. కొంత పన్ను కట్టాం. కొన్ని ఇండ్ల జాగాలు తీసుకున్నాం. ముఖ్యంగా అప్పులు తీర్చుకున్నాం. మిగతాది బ్యాంకులో వేసి హాయిగా వడ్డీ మీద కాలం గడిపేద్దామనుకున్నాం. అయినా అంత డబ్బు మనకెందుకూ ప్రజాసేవకు కొంత కేటాయిద్దాం అని 10 లక్షలతో "స్వదేశీ" అనే ఒక ట్రస్టు పెట్టాలనుకున్నాం. ఆ ఖర్చు, ఈ ఖర్చు పోను చివరికి దానిని 5 లక్షలకు కుదించాల్సి వచ్చింది! మొత్తానికి ఉజ్రమ్మ గారిని (ఆమె ఒక గొప్ప సంఘసేవకురాలు. చేనేత కార్మికులు, చేనేత రంగ స్వయం సమృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు), శంభు ప్రసాద్ గారిని సాక్షులుగా పెట్టి ట్రస్టు రిజిష్టరు చేశాం. డబ్బంతా ట్రస్టులో పెడితే తీసేటప్పుడు ఇంకా దేనికైనా అత్యవసర పరిస్థితికి వాడేటప్పుడు ఇబ్బంది ఔతుందని మా పేర్లమీదే పెట్టుకుని వడ్డీ మాత్రం ట్రస్టు ఖాతాలో జమేసుకోమని మా అన్నయ్య న్యాయవాదిగా ఉచిత సలహా ఇచ్చారు. ఇదీ మంచిదే అనుకొని అలాగే చేశాం.

మా ఉద్దేశం ఈ ట్రస్టు డబ్బు వడ్డీతో ఒక ఆయుర్వేద, స్థానిక సాంప్రదాయ వైద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలు తమకొచ్చే జబ్బులు, రోగాలకు స్థానిక, తమకు పూర్వం నుండి తెలిసిన గృహ వైద్యంతోనే బాగు చేసుకుంటూ, ఈ అల్లోపతి డాక్టర్లపైన, అంతకంటే అధ్వాన్నంగా ఏమీ తెలియని ఆర్.యమ్.పిల పైన ఆధారపడకూడదని. కానీ ఈ ప్రయత్నం చాలా వరకు విఫలమైంది. ఆ అనుభవం తరువాత వివరంగా చెబుతాను. అలాగే మా ప్రాంతంలో (పంచాయితీ, పరిసరాల్లో) పేద పిల్లల చదువుకు సాయం చేయడానికి ఈ డబ్బు ఉపయోగపడగలదని ఆశించాం. ఆయుర్వేద డాక్టరుని పెట్టలేకపోయినా, వైద్యానికి కొంత మందికి, చదువులకి కొందరికి సాయపడగలిగాం.

## మా పొలం ...

ఇంతకీ చెప్పదలచుకున్నదేమంటే మా 32 ఎకరాల సాగు భూమి, మామిడితోపులు నా మేనేజిమెంటుకి వచ్చే సరికి నావద్ద సుమారు రూ. 10 లక్షలు స్వంతబ్యాంకు బ్యాలెన్సు వుండింది. (ట్రస్టు డబ్బు కాకుండా). ఇక నేమి. పూర్తి స్వేచ్ఛతో నా వ్యవసాయ ప్రయోగాలు, ఆశలు, అన్నీ తీర్చేయవచ్చు అని అనుకున్నాను. పైగా మా అన్నదమ్ములు అన్ని విషయాలు పూర్తిగా నాకే వదిలేశారు. నాకు ఎవరూ అడ్డులేరు. నా భార్య కూడా పూర్తిగా సహకరించారు.

ఆ తరువాత 7 సంవత్సరాలుగా ఒక భయంకరమైన కరువు దాపురించింది. అది 4 సంవత్సరాలు తీవ్రంగా పట్టి పీడించింది కాని కేవలం కరువు వల్లనే కాదు. నేను చేసిన సేంద్రీయ వ్యవసాయ ప్రయత్నాలు, రసాయనిక ఎరువులు, మందుల వాడకం, నేరుగా

వ్యవసాయం చేయటం, కౌలుకి ఇచ్చివేయటం, ఈ రకరకాల ప్రయోగాల వల్ల చివరి ఆర్థిక ఫలితం సుమారు 7 సంవత్సరాలకు నా డబ్బంతా అయిపోయింది! పైగా కరువులో డబ్బులేక స్వదేశీ కార్యక్రమాలకని పెట్టిన డబ్బు (నా పేరుతో వుండటంతోటి) కూడా చాలా వరకు వాడేశాను!! (మరీఘోరం). పైగా 4 సంవత్సరాలు కరువు వెళ్ళదీసేకొద్దీ బ్యాంకుల్లోనూ, ఇతరత్రా 2 లక్షల అప్పుపడ్డాను! అప్పుడప్పుడు బయటకు తీస్తున్న మా నాన్నగారి కారును ఇహ లాభం లేదని అమ్మేశాను. (లేకుంటే నెలకు రెండు వేలు జరిమానా విధించేది ఆ కారు!) ఇంతకీ మా అన్నదమ్ములకు ప్రతి ఏటా డబ్బు పంపించానా అంటే అదీ సరిగాలేదు. ఒక సం॥రం పంపిస్తే మరో సం॥రం లేదు. సగటున సంవత్సరానికి చేరో 20 వేలు ఇవ్వగలిగాను. 25 ఎకరాలు మామిడి తోపులు, అందులో 7 ఎకరాలలో 600 కొబ్బరి చెట్లు పెట్టుకుని, నేను సాధించిన ఈ ఘనకార్యం గురించీ (పడిన కష్టాల గురించి) స్పష్టంగా మీతో పంచుకోదలిచాను.

## అన్నదాతల నుండి ఆత్మహత్యల దాక :

ఇంత ఆస్తి వుండిన నా పరిస్థితే ఇలా తయారైతే, 2-3 లేదా 5 ఎకరాలున్న రైతుల పరిస్థితి ఏం గావాలి? వారి ఆత్మహత్యలు, వలసలు జరుగుతున్నాయంటే ఆశ్చర్యం ఎందుకు? ఆ మధ్య వ్యవసాయ శాఖమంత్రిగారు పార్లమెంటులో మాట్లాడుతూ, 1993 నుంచి 1996 వరకు సుమారు ఒక లక్ష మందికి పైగా రైతులు దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారని చల్లగా చెప్పారు. మరో ఒకటిన్నర లక్షల మంది రైతులు 1997 నుండి 2008 మధ్య కాలంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. (మూలం : నేషనల్ క్రైవమ్ బ్యూరో). అనగా సరళీకరణ విధానాలు మొదలైనప్పటి నుండి గత పన్నెండు సంవత్సరాల్లో (1993 నుండి 2005) మొత్తం రెండున్నర లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నమాట! (అంటే ఏటా 20 వేల మందికి పైగానే!)

"దేశమంటే మట్టికాదోయ్ / దేశమంటే మనుజులోయ్" అన్న విషయాన్ని పాలకులు మరిచినట్లున్నారు. అరవై సంవత్సరాలకు ముందు వ్యవసాయ ఉత్పత్తుల విలువ దేశంలోని అన్ని ఉత్పత్తుల విలువలో సగానికిపైగా వుండేవి. వ్యవసాయంపై ఆధారపడ్డ జనాభా 70 శాతంగా వుండేది. ఈ రోజు వ్యవసాయంపై ఆధారపడ్డ జనం 65 శాతానికి తగ్గారు. కానీ వ్యవసాయ ఉత్పత్తుల విలువ మొత్తం దేశ ఉత్పత్తుల విలువలో దారుణంగా 17 శాతానికి పడిపోయింది! అంటే రైతు జనాభా పెద్దగా తగ్గక పోయినా వ్యవసాయ ఉత్పత్తుల విలువ భారీగా పడిపోయింది. ఈ దోపిడీ సరళీకృత విధానాలతో, పెట్టుబడిదారీ ప్రపంచీకరణతో మరింత తీవ్రమైపోతున్నది. రోడ్లు, ఫ్యాక్టరీలు, గనులు, రేవులు మొదలైన వాటివల్ల ఉద్భవించే కాలుష్యం వల్ల రాబోయే 20 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా సుమారు 40 కోట్ల మంది గ్రామీణ జనాభా వ్యవసాయ రంగానికి దూరమై పోతారని ఆర్థిక నిపుణులు పదే పదే చెబుతున్నారు ఈ నిర్వాసితులౌతున్న ప్రజల

భవిష్యత్తు అంధకారమే. నష్టపరిహారంగా కొంత డబ్బు లభించినా, దాన్ని ఉపయోగించే నైపుణ్యం లేక వారు కొద్ది కాలంలోనే వీధిన పడతారు.

ఇలా జరగవలసిందే. చారిత్రకంగా, ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు ఇలాగే నడిచాయని నిపుణులు సూత్రీకరిస్తారు కూడా. మరి ఈ రోజు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి విమోచన లేదా? వున్నది.

ఈ ఆత్మహత్యలు, వలసలు ఆగిపోవాలంటే ముందు అన్నదాతలందరికీ సరిపడ తిండి లభించాలి. అందుకుగాను ప్రతి వ్యవసాయం చేసే కుటుంబానికి సాగు భూమి వుండాలి. ఆ భూమిలో తమకు అవసరమైన, ఆరోగ్యకరమైన తిండి గింజలు, పప్పుదినుసులు, కూరగాయలు పండించుకునే స్వేచ్ఛ వుండాలి. తదనుగుణంగా వ్యవసాయ విధానాలుండాలి.

ఆ విధానాలు సులువుగా, లాభదాయకంగా వుంటేనే వ్యవసాయదారులు వాటివైపు చూస్తారు. రైతాంగంలో 80 శాతంగా వున్న చిన్న సన్నకారు రైతులు తమ కాళ్ళపై తాము నిలబడేటట్లు, స్వతంత్రంగా నిలదొక్కుకునేటట్లు చేయాలంటే ఈ బజారు సంస్కృతి, మార్కెట్టు విషవలయం నుండి, క్రిమి సంహారక మందులు, ఎరువులు, కంపెనీ విత్తనాల కబంధ హస్తాల నుండి వారిని విముక్తి చేయాలి. మన దేశంలో ఈ రోజు వివిధ ప్రాంతాల్లో అనేక మంది వివిధ రకాల సేంద్రీయ పద్ధతుల్లో ఎన్నో పంటలు లాభదాయకంగా పండిస్తున్నారు. ఆ ఫలితాలను, పద్ధతులను దేశ వ్యాప్తంగా నిరూపించాలి, ఇంకా అభివృద్ధి చేయాలి.

తద్వారా మన రైతాంగానికి, పట్టణవాసులకు అవసరమైన తిండి గింజలు, పప్పు దినుసులు, పంటనూనెలు, కూరగాయలు, విరివిగా పండించ వచ్చు. వినియోగదారుల ఖర్చులు అందుబాటులో వుండేటట్లు, రైతులకు లాభదాయకంగా (గిట్టుబాటుగా) వుండేటట్లు తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో పండించి అందరూ ఆరోగ్యవంతమైన, పుష్టికరమైన ఆహారం తినవచ్చును. మన భూమి, నీరు, గాలిలో కాలుష్యాన్ని చాలా వరకు అరికట్టవచ్చు.

కాలుష్య భరిత పరిశ్రమలను నిరోధించి శరవేగంతో క్షీణిస్తున్న అడవుల సంరక్షణలో ఉపాధి, భూగర్భ నీటి వనరుల అభివృద్ధి సాధించవచ్చు. అందుకే సేంద్రీయ వ్యవసాయ ప్రయత్నాలలో, విస్తరణలో భాగం కావాలనుకుంటున్నాము. అలాగే భూ సంస్కరణల కోసం, అడవుల సంరక్షణ కోసం కృషి చేయదలచాము.

"వొట్టి మాటలు కట్టి పెట్టోయ్

గట్టిమేల్ తలపెట్టవోయ్"

అది పాడేంత సులువు కాదు!

10 సంవత్సరాలు రకరకాల ప్రయోగాలు చేశాను వాటిలో కొన్ని, ముఖ్యమైన అనుభూతులను మీ ముందుంచుతాను.

## రాష్ట్రంలో దరిద్ర నారాయణులు ఎంత మంది?

*6 శాతం జనాభా గ్రామీణ ప్రాంతంలో పేదలు కాగా, వీరిలో 18.6 శాతం మంది కటిక పేదలు! జిల్లాల వారీగా పేదరికం శాతం.*

| | |
|---|---|
| ఆదిలాబాద్ - | 78.0 |
| చిత్తూరు | 78.1 |
| నెల్లూరు | 63.9 |
| ఖమ్మం | 62.7 |
| శ్రీకాకుళం | 61.4 |
| అనంతపురం | 61.1 |
| కర్నూలు | 60.2 |
| విశాఖపట్నం | 59.0 |
| నల్లగొండ | 58.5 |
| రంగారెడ్డి | 58.3 |
| మహబూబ్‌నగర్ | 57.3 |
| ప్రకాశం | 55.8 |
| విజయనగరం | 54.2 |
| గుంటూరు | 53.3 |
| కడప | 51.7 |
| వరంగల్ | 51.2 |
| కరీంనగర్ | 50.5 |
| కృష్ణా | 50.0 |
| మెదక్ | 48.6 |
| తూర్పుగోదావరి | 45.6 |
| పశ్చిమ గోదావరి | 41.2 |
| నిజామాబాద్ | 43.4 |

*మూలం : సెస్ మరియు సెర్ప్ సర్వే, (ఆంధ్రజ్యోతి, 11.11.2007లో)*

ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 22 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ దిగువనున్నారు. కానీ వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా వున్నట్లు ఈ సర్వే తెలియజేస్తున్నది.

## "అన్నం బహు కుర్వీతః"

అన్నది మన సంప్రదాయం. భారత దేశంలో ఏ మూలకు పోయినా (పల్లెసీమల్లో) భోజనానికి కొదవ వుండదు. అతిధులకు (అతిధి దేవోభవ) ఆప్యాయంగా పిలిచి భోజనం పెడతారు. ఉన్నదానిలో సర్దుకుంటారు. మన సంప్రదాయంలో దేవాలయాల్లో, గురుద్వారాలలో, మసీదుల దగ్గర, దర్గాల వద్ద ఈ అలవాటు మరీ బలంగా కనిపిస్తుంది. ముఖ్యంగా గురుద్వారాలు, కొన్ని దేవాలయాల వద్ద తప్పనిసరిగా మధ్యాహ్నం పూట వచ్చిన వారికి అందరికీ భోజనం పెడతారు.

సమాజంలో మనుషులకున్న మొట్ట మొదటి అవసరం అన్నం, ఆకలి తీర్చుకొనటం. సమాజం సుఖశాంతుల వైపు అడుగు వేయాలంటే, ఏ వ్యవస్థలోనైనా, ముందు ఆ ప్రజానీకానికి అన్నం సులభంగా లభ్యం కావాలి! అన్నం ఒక సమస్య కాకూడదు! ఏ సమాజంలో, ప్రాంతంలోనైతే భోజనం కారుచౌకగా వుంటుందో అది అభివృద్ధి చెందిన సమాజంగా గుర్తించవచ్చు. మన దేశంలో "అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని" అన్నట్టు భూమి, నీరు, వాతావరణం అనుకూలించినా, భూసంస్కరణలు సరిగా అమలు చేయనందువల్ల, రైతులను డబ్బుల కోసం పరిగెట్టేటట్లు చేయడం వల్ల, తప్పుడు అలవాట్ల వల్ల పట్టణాలకేం ఖర్మ, పల్లెల్లోనే భోజనం సరిగా దొరకని పరిస్థితి ఏర్పడింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే తలసరి ధాన్యాల లబ్ధి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఎంత వుండేదో నేడూ ఇంచు మించు అంతే వుంది!! (ఇదెక్కడి అభివృద్ధి?)

ఆధునిక వ్యవసాయంలో డబ్బు సంపాదనే ప్రథమ కర్తవ్యంగా రైతు ముందుంచారు. ఈ బజారు సంస్కృతిలో, ఈ జూదంలో కొట్టుకుపోయి రైతే ఈనాడు చెప్పలేని దుస్థితిలో, ఊబిలో ఇరుక్కుపోయాడు.

మన దేశంలో (మన రాష్ట్రంలోనూ) ఈ రోజు సంకల్పించిన అన్ని నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసినా కూడా ఇంకా 40 శాతం భూమి వర్షాధార భూమిగానే మిగిలిపోతుంది. ఈ రోజు ప్రాంతాన్ని బట్టి 40 నుండి 80 శాతం సాగు భూమి వర్షాధార పంటలపైన నడుస్తోంది. రైతాంగంలో 60 శాతం జనాభా ఈ ప్రాంతాలలోనే వున్నారు. రాష్ట్ర పంటల ఉత్పత్తిలో 40 శాతం విలువైన పంటలు పండిస్తున్నారు. కానీ గత 20 - 30 సం లుగా ఈ మెట్ట ప్రాంతాల ప్రజల అలవాట్లలో ఎన్నో మౌలిక మార్పులు వచ్చాయి. మన ఆంధ్రప్రదేశ్‌నే తీసుకుంటే, ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రి అయినపుడు, పేదవారందరికీ కిలో రెండు రూపాయలకు బియ్యం సరఫరా పథకం మొదలెట్టాక మెట్ట ప్రాంతాల్లోని పేదవాడు కూడా వారి సంప్రదాయ భోజనమైన జొన్న రొట్టెలు, రాగి

సంకటి, సజ్జ రొట్టెలు, కొఱ్ఱ అన్నం వగైరాలను పక్కకు బెట్టి వరి అన్నం ఎక్కువగా తినడం మొదలెట్టారు! వారి పిల్లలైతే, ముఖ్యంగా స్కూలుకు పోయేవారు వరి అన్నం తప్ప జొన్నరొట్టెలు, రాగి సంకటి అరగదని మొరాయించేవారు (ఇప్పటికీను). రేషను షాపులో రసాయన ఎరువులతో కోస్తా ప్రాంతాల్లో పండించిన, పాలిష్ చేసిన తెల్లటి బియ్యమే వారికి మేలైందిగా కనిపిస్తోంది. దీని వల్ల కుటుంబాల ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. అన్నం తినేవారు సాంస్కృతికంగా, సాంఘికంగా జొన్న రొట్టెలు, రాగి సంకటి తినే వారికన్నా గొప్పవారన్న భావనవల్లే ప్రజల్లో ఈ మార్పు వచ్చింది.

రైతులు కూడా జొన్నలు, రాగులు బదులు ఆదాయం ఎక్కువ ఇచ్చే వేరుశనగ, (వాణిజ్య పంట) వైపు మళ్లడం (అనంతపురం జిల్లాలో), కొన్ని ప్రాంతాల్లో పత్తివైపు మళ్లడం (వరంగల్ జిల్లా) జరిగింది. మైదాన ప్రాంతాల్లోను బోర్లు, నీరు పుష్కలంగా వుంటే కొంత వరి, ఎక్కువగా చెరకు లేదా మామిడితోపులు పెట్టడం జరిగింది, జరుగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రోత్సాహం ఒక కారణమైతే రైతు స్పందనకి మూలకారణం డబ్బు. ఈ రోజు వ్యవసాయానికి అన్నీ పెట్టుబడులతోనే మొదలెట్టాలి. విత్తనం, ఎరువులు, మందులు, దున్నకం, కూలీలు అన్నిటికీ డబ్బు అవసరం. అంతే కాదు పిల్లల చదువులకు, వైద్యానికి, పెళ్ళిళ్లకు, మొదలైన కార్యాలకు అన్నిటికీ డబ్బే కావాలి. డబ్బులేనిదే ఏదీ జరిగేట్టు లేదు. అందుకే ఏ పంటవేస్తే డబ్బు ఎక్కువ వస్తుందో, కొంత "రిస్కు" వున్నా దాని వెనకాలే రైతు పరిగెడుతాడు. ఉదా । టమోటా, పత్తి, మిరప, చెరకు.

అన్నం బహుకుర్విత సంప్రదాయంలో "వ్యవసాయం ఉత్తమం, వ్యాపారం మధ్యమం. ఉద్యోగం అధమం"గా వుండేది. నేడు వ్యవసాయం అధమం అయిపోయింది.

## చిత్తూరు జిల్లాలో పంటలు :

ముందు మా చిత్తూరు జిల్లా వ్యవసాయం గురించి కొంత చెప్పాలి.

తూర్పు ప్రాంతం, పడమటి ప్రాంతం కొంత భిన్నంగా వుంటాయి. తూర్పు ప్రాంతం అనగా శ్రీకాళహస్తి నుండి వుండే 10 మండలాలు నెల్లూరు, చెన్నైలను (50 - 100 కి.మీ.) ఆనుకుని వుంటాయి. అక్కడి భూములు, వ్యవసాయం కూడా కొంత ఇసుకనేలవరస. అక్కడ వరి, వేరుశనగ ప్రధాన పంటలు. చెరువులకిందే వ్యవసాయమైనా నేల సారం, ఇసుక బట్టి విస్తారంగా దిగుబడులు వస్తాయి. వేరుశనగ 30-40 బస్తాలు (12-16 క్వింటాళ్లు) ఎకరాకు పండిస్తారు. వరి కూడా అంతే. (2 నుంచి 3 టన్నులు) పడమటి మండలాల్లో నీటి ఆధారం తక్కువ ఇక్కడ వేరుశనగ, టమోటా ఎక్కువగా పండిస్తారు. (ముఖ్యంగా మదనపల్లి ప్రాంతంలో) ఇక్కడ మెట్ట ప్రాంతం వుండుటవల్ల వాతావరణం చల్లగా, బెంగుళూరు ప్రాంతంలాగ వుంటుంది. (బెంగుళూరు వారికి చాలా

దగ్గర. అంతా 100 - 150కి.మీ. మాత్రమే) కొంత ప్రాంతం కుప్పం తాలూకా మండలాలు, బెంగుళూరు దగ్గర కావడంతో అక్కడికి అవసరమైన కాయగూరలు బీన్సు, అలుగడ్డ, పూలు కూడా పండిస్తారు. ఈ మధ్య కొందరు ద్రాక్ష కూడా పండిస్తున్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇజ్రాయిల్ తరహా కంపెనీ సేద్యం ఈ ప్రాంతంలోనే ప్రయత్నించారు. బిందు సేద్యానికి మించి వారేమీ గొప్ప పాఠాలు రైతులకు నేర్పలేకపోయారు. మొత్తం జిల్లా, ముఖ్యంగా మధ్య భాగంలో చెరకు, మామిడి ప్రధానమైన పంటలు. నీటి వసతి వున్న ప్రాంతాల్లో చెరకు రెండు సంవత్సరాలు వేస్తే దానిలో తరువాత ఒక పంట తప్పనిసరిగా వరి వేస్తారు. తద్వారా నేల సారం తిరిగి రాబట్టుకోవడానికి వీలవుతుంది. జిల్లా వ్యాప్తంగా రెండు సహకార ఫ్యాక్టరీలతో పాటు ఐదు ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీలున్నాయి. చెరుకు ఉత్పత్తి 80 శాతం బెల్లం తయారీకే పోతుంది. ఈ విధంగా రెండు ప్రధాన నగరాలు దగ్గరగా వున్న జిల్లాకు పాలు, గుడ్లు, కూరగాయలు, మాంసం ఎగుమతికి బాగా అనుకూలంగా వుండటంతోటి 1970 దశకంలో ముఖ్యంగా పాడి పరిశ్రమ, వ్యవసాయ రంగం జిల్లాలో బాగా అభివృద్ధి చెందింది. రైతులకు కూడా మంచి ఆదాయం వచ్చింది. చిత్తూరు జిల్లాలో వేయని పంటలేదు. 1999 జనవరి చేరేటప్పటికి ఎందుకీ వ్యవసాయం? అనే స్థితికి రైతులు వచ్చేశారంటే పరిస్థితి ఎంత భయంకరంగా తయారైందో ఆలోచించండి.

## మా వ్యవసాయ భూముల పరిస్థితి :

మాకున్నది 32 ఎకరాలు. మా తాతగారి ఉమ్మడి ఆస్తి 90 ఎకరాల్లో ఇది ఒక భాగం. ఇందులో 25 ఎకరాలు మామిడి తోపులున్నాయి. మామిడితోటలోనే 7 ఎకరాల్లో 600 కొబ్బరిచెట్లున్నాయి. 2 1/2 ఎకరం చెరువు కింద భూమి వుంది. ఇందులో ఎక్కువగా వరి, చెరుకు మార్చిమార్చి పండిస్తాం. ఇది కాకుండా 3-4 ఎకరాలు మరో చెరువు కింద వున్నా ఆ చెరువు నిండేది కష్టం. 5 సంవత్సరాల కొకసారి మరో వర్షం రానపుడు వరి, చెఱకు వేయవచ్చు. వర్షం పెద్దగా లేకపోతే ఆదాయం రాని వేరుశనగ, రాగి, జొన్న వంటి వాటితో సరిపెట్టుకోవాలి. ఒక ఎకరా మాత్రం ఉత్త చేను నేల వుంది. మరోవంక పక్కన 22 ఎకరాలు మామిడి తోపు వుంది. ఇందులో 100 ఏండ్లు దాటిన చెట్లున్నాయి! సుమారు 600 చెట్లు, ప్రధానంగా నీలం, బెంగుళూరు (తోతాపురి) రకాలు వున్నాయి. దీనిలో 25 రకాల పళ్ళు మలగోబ, కాదర్ (అల్ఫాన్సో), కాలేపాడు వంటి రుచికరమైన వాటితోపాటు కొన్ని పెద్దగా రుచిలేని రకాలు (దిల్‌పసంద్, రెడ్డి పసంద్, లాల్‌బేగా వంటివి), అనేక నాటు రకాలు కూడా వున్నాయి. బాగా కాస్తే 100 నుండి 150 టన్నుల దాకా పంట రావచ్చు కానీ మామిడి సంవత్సరం మార్చి సంవత్సరం పంట వస్తుంది! ఏమైనా పంట ఎక్కువగా వున్నపుడు ధర తక్కువగాను, పంట తక్కువగా వున్నపుడు ధర

ఎక్కువగా వుండటంతో ఆదాయంలో పెద్దగా మార్పు వుండదు! ఒక్కొక్కసారి ఎవరికి పండకుండా మనకు మాత్రం పండితే తప్ప! (అలాంటి సందర్భాలు అపుడపుడు తగులుతూ వుంటాయి). ఏది ఏమైనా మామిడి తోపుతో నష్టం రావటం చాలా అరుదు. ఎంతో, కొంత వస్తుంది. ఎందుకంటే పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ. అందుకే ఈ కాలం అందరూ మా ప్రాంతంలో చెరువు కింద భూములను కూడా (చెఱకు, వరి పండేటివి) మామాడి తోపుల కింద మార్చేస్తున్నారు. దీనికి మరో కారణం వుంది.

ప్రతి రైతు తన పిల్లలు పైకి రావాలని ప్రాకులాడతాడు. వాళ్ళంతా బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగాలు చేసి బాగా సంపాదించాలనుకుంటాడు. వాళ్ల పై చదువులకు విపరీతంగా ఖర్చు చేస్తాడు. ఆ తరువాత వాళ్లు ఎక్కడైనా ఉద్యోగాలు సంపాదించాలని భావిస్తాడు. పెళ్లి చేసుకుంటే ఇక అక్కడే టౌన్లలోనే స్థిరపడిపోతారు. మనమివ్వాళ ఉన్నంత కాలం వ్యవసాయం నడుస్తుంది. అందులోనూ సులభమైన వ్యవసాయం అంటే కొబ్బరి, మామిడి చెట్లు పెట్టడం. ఈ మధ్య కాలంలో నీటి ఎద్దడి ఎక్కువైపోయి కొబ్బరి తగ్గింది. చాల నష్టపోయారు కొబ్బరి రైతులు. పంటలకు రోగాలు ముఖ్యంగా కొత్తగా వచ్చిన కొబ్బరి "నల్లి" (ఎరిఫైడ్ మైట్) వల్ల గత 7 సంవత్సరాలుగా కొబ్బరి రైతులకు ఆదాయం దాదాపు శూన్యమనే చెప్పాలి. కానీ మామిడి విస్తీర్ణం శరవేగంతో పరుగెడుతోంది. ప్రతి మడి, చేను మామిడి తోపుగా మారిపోతున్నది. రైతు బిడ్డలు టౌనుకు వలస వెళ్ళడం ఒక కారణం అయితే (అజమాయిషి ఎక్కువగా అవసరం వుండదు కాబట్టి), కూలీలు ఎక్కువగా అవసరమయ్యే ఇతర పంటలు గిట్టుబాటుకాక పోవడం మరో ముఖ్యకారణం. ఏ పంట వేసినా నష్టాలు వస్తా వుంటే మామిడే అంతో, ఇంతో ఆదాయం ఇవ్వడంతో అందరూ మామిడి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ విధంగా ఎన్ని ఎకరాలు మాగాణి భూమి (చెరకు, వరి పండించే భూమి) మామిడి తోపులుగా రైతులు జిల్లాలోను, రాష్ట్రంలోను మార్చారు? మెట్ట ప్రాంతాల్లో బోర్లు వేసి ఎన్ని ఎకరాలు మామడి తోపులుగా మార్చారు? వీటిపైన ఎవరూ లెక్కలు అరా తీసినట్లు లేదు. ప్రభుత్వం వారు కూడా దీన్నే పేదవారిలో కూడా ప్రోత్సహిస్తున్నారు. (పనికి హామీ చట్టం కింద). కాబట్టి మామిడి పంట కూడా త్వరలోనే సంక్షోభంలోకి నెట్టబడుతుందని వేరేగా చెప్పనవసరం లేదు.

ఏ ఏ ప్రాంతాలకు మామిడి ఎగుమతి చేసేవారమో, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా - ఈప్రాంతాల్లో కూడా ఇపుడు మామిడి తోటలు విపరీతంగా పెంచేస్తున్నారు. అంటే పంట ఆ ప్రాంతాల్లో అదే సీజనులో ఎక్కువై పోతుందన్నమాట. మరోపక్క ఖర్చులు రోజు రోజుకి పెరుగుతున్నాయి. సాధారణంగా అన్ని ధరలు, కూలి ఖర్చులు పెరగటం ఒక ఎత్తైతే వాటికి వేసే క్రిమి సంహారక మందులు, పై ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం మరో ఎత్తు.

## మామిడి సేద్యంలో మెలకువలు :

మొదట్లో 1960వ దశకంలో ఎండ్రిన్, డిడిటిలు ఒక్కసారి పిచికారి చేస్తే పురుగులన్నీ చచ్చేవి. మంచి దిగుబడి వచ్చేది. అలా కొంత కాలం గడిచింది. కానీ నూటికి నూరుపాళ్ళు పురుగులు చావవు. ఒక వెయ్యి పురుగుల్లో విషం స్వల్పంగా తాకి చచ్చిచావకుండా బతికి వుండేవి కొన్ని వుంటాయి. వాటికి పుట్టే సంతానం చంద్రగుప్తుని కథలో "విషపు కన్య"లాగ అవి ఆ విషానికి తట్టుకునే శక్తిని అలవాటు చేసుకుంటాయి. ఇంకేమి. ఒక ట్రిప్పు మందు కొట్టే బదులు కొన్ని సంవత్సరాలకి రెండు ట్రిప్పులు మందు కొట్టాల్సి వస్తుంది. మరికొన్ని రోజులకి - మూడు ట్రిప్పులు - అయినా మందు పనిచేయనపుడు దాన్ని మార్చాలి. ఇంకా దాని కంటే శక్తివంతమైన మందు తేవాలి. అలాగే మందు ఎండ్రిన్, డిడిటిలతో మొదలై దానికన్నా భయంకరమైన ఎండోసల్ఫాన్, క్లోరోపైరీఫాస్, అంతకన్నా భయంకరమైన మోనోక్రోటొఫాస్ దాన్ని మించిన సింథటిక్ పైరిథ్రాయిడ్స్ వరకు మన మామిడి రైతులు వెళ్ళిపోయారు. ఇది మహాభయంకరం. ఎందుకంటున్నానంటే ఇవన్నీ "సిస్టమిక్"అనగా చెట్టు కండలోపలికి వెళ్ళిపోయి చెట్టే విషపూరితమైపోతుంది! నిజం చెప్పాలంటే ఈ పళ్ళు ఎగుమతికి పనికిరావు! ఐరోపాలోనూ, పశ్చిమ దేశాల్లోనూ రసాయన క్రిమి సంహారక మందుల అవశేషాలుండే పళ్ళు కొనరు. (ఆహా! ఎంత విడ్డూరం ఈ మందులు, ఎరువులు వాడేది మనకు నేర్పింది వారే.) అంత దూరమెందుకు. మనం కూడా తినకూడదు. కానీ ఇక్కడ అడిగేవారు లేరు కాబట్టి "సబ్ చల్తా హై"!

ఈ విషవలయం నుండి బయట పడాలని గత 20 ఏళ్ళుగా ప్రయత్నం చేశాం. కానీ కచ్చితంగా ఈ సేంద్రీయ పద్ధతులు పాటిస్తే రోగాలను నివారించగలమని చెప్పే పరిస్థితిలో ఈ రోజుకూ లేము.

మొత్తం మామిడి తోపులు 25 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతులు పాటిస్తే సఫలమౌతామో లేదో నన్న సందేహం, భయంతో మాకున్న 20 ఎకరాల పెద్ద తోపులో ఆ జోలికి వెళ్ళలేదు. మిగతా రెండు చిన్న తోపులు రెండున్నర ఎకరాలు చొప్పున రెండింటిలోనూ రకరకాల ప్రయత్నాలు చేశాం. ఇటువంటి ప్రయోగాలు : చేస్తున్న మేధావులని సంప్రదించాం. మూలసూత్రాలు దాదాపు ఒకటే అయినా వారిచ్చే ఫార్ములాలు కొంత భిన్నంగా వుంటున్నాయి. మేము చేసిన ప్రయోగాలు వేప పిండిని నానబెట్టి ఆ పైనీరు వడగట్టి మామిడి పూతకు పిచికారి చేయడం. దానికి తగ్గనపుడు వేపనూనెను సబ్బునీళ్ళలో వేసి (ఒకలీటరుకు 5 మి.లీ. నుండి 25 మి.లీ వరకు) పిచికారీ చేయటం. ఒకసారి 25 మి.లీ నూనె వేసేటప్పటికి కొన్ని చెట్లు అకులు ఆ వేడికి మాడి మసైపోయాయి! ఆ తరువాత ఆవుపంచతం (గోమూత్రం) మగ్గబెట్టి 1:6 నిష్పత్తిలో నీటిలో కలిపి పిచికారీ చేయడం, చివరిగా వేప గింజల పప్పు రుబ్బి వడగట్టి నీటితో

కలిపి పిచికారీ చేశాం. ఇది మరీ కష్టతరంగా వుందని, నేరుగా కంపెనీలో ఉత్పత్తి చేస్తున్న వేపగింజలోని మందు అజార్‌డిక్టెన్ ఎక్స్‌ట్రాక్ట్ 1500 పి.పి.ఎం పిచికారీ చేశాం. (లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున). ఒక్కసారి తెల్ల గడ్డలు (వెల్లుల్లిపాయ) ముద్ద, పచ్చిమిరపకాయల ముద్ద వేరు వేరుగా రుబ్బి కిరసనాయిలుతో కలిపి వడగట్టి నీళ్ళలో కలిపి పిచికారీ చేశాం. ఇంకోసారి చెరువులో వుండే రబ్బరు చెట్ల ఆకు (బేషరమ్) ని రుబ్బి దాని రసాయనంతో పిచికారి చేశాము. ఒక లీటరులో 2 మి.లీ.లు మందు కలిపి పిచికారి చేశాము. వీటిద్వారా మాకు పెద్దగా ఫలితాలు దక్కలేదు.

సాధారణంగా డిసెంబరు – జనవరి నెలల్లో పూత మొదలౌతుంది. పూత రాకముందే నవంబరులోనే ఒక ట్రిప్పు మందు ముఖ్యంగా కొమ్మలకు బాగా పిచికారీ చేయమంటారు శాస్త్రజ్ఞులు. ఆ తరువాత పూత మొగ్గ దశలో రెండవసారి పిచికారీ చేయమంటారు. ఆ తరువాత అవసరాన్నిబట్టి తెనెమంచి పురుగు (హాపర్) కానీ, ట్రిప్స్ (వివిధ రకాలు), ఇతర పురుగులు ఆశిస్తే వెంటనే మరోసారి పిచికారీ చేయాలి. లేకుంటే పిందె రాగి గింజె మాత్రం అయ్యేటపుడు మరోసారి పిచికారి చేయాల్సి వుంటుంది. వాతావరణం పొడిగా వున్నా, ఉదయం పొగమంచు కురవకపోతే మామిడి పంటకు ఆరోగ్యం. అలాగే పంట దశలో ఒక్కసారి శివరాత్రి సమయంలో మరోసారి ఉగాది సమయంలో కొద్దిపాటి (మంచి వర్షం। పొడి చినుకులు కాదు) వర్షం పడితే చెట్టుకు మంచిది, కాయలు బాగా సైజువస్తాయి. మామిడి పిందె రాగి గింజె సైజు వచ్చేటప్పటికి చెట్టుకు నీరు బాగా పెట్టాలి. కాయలో టెంక ఏర్పడేదాక పెట్టాలి. ఆ పైన పెట్టకూడదంటారు. పెడితే కాయ నీరు ఎక్కుతుంది. రుచి వుండదు. తొందరగా మాగి (పండి) పోతుందంటారు.

శివరాత్రికి, ఉగాదికి యిలా మార్చి, ఏప్రిల్ నెలకొకసారి వర్షం పడి, మే నెలలో మధ్యాహ్నం నుండి దాదాపు వారం – పది రోజులకొక్కసారి వాన పడుతూనే వుంటుంది. ఇందులో గాలీ – వాన, వడగళ్ళ వానలు ఎక్కువ. పంట మొత్తం రాలిపోవచ్చు ఒక వానకే! మే నెల మధ్య కాలం నుండి మధ్యాహ్నం మబ్బులెక్కి రోజూ కొంత వర్షం పడే అవకాశం వుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ రెండవ వారం కల్లా వచ్చేస్తాయి. అప్పుడు ఇక ఒకటి, రెండు రోజులు పూర్తిగా వర్షం. ఆ తరువాత ఉదయం పొడిగా వుండి మధ్యాహ్నం, సాయంత్రం కల్లా వాన. అంటే కాయలు త్వరగా పండిపోతాయి, పురుగు పండులో చేరే అవకాశం ఎక్కువ, కాయలు కూడా ఉదయంపూటే కోసేసి మధ్యాహ్నం కల్లా మండీకి పంపించేయాలి.

ఈ విషయాలన్నీ ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానంటే మామిడి పంట పండించి, కోయించడం నేను ముందు చెప్పినంత సులువేం కాదు. మిగతా పంటలతో పోలిస్తే కచ్చితంగా శ్రమ తక్కువే కాని, దీనికి ఎన్నో ఒడి దుడుకులున్నాయి. ఒకే గంటలో చేతికి వచ్చే పంట దూరమై పోగలదు (గాలి వానతో) ! అందుకే పెద్దవాళ్ళు ప్రతి మామిడి

తోపు చుట్టూ ఒక వలయంలాగ చింత, కానుగ, వేప చెట్లను పెంచుకునే వారు. కానీ ఆ విషయం అర్థం గాక ఆధునిక రైతులు అవి వుంటే ఎండ (వేడి) అని ముఖ్యంగా చింత, వేప, వెదురు ఎక్కడా తమ ప్రహరీలో వుండకుండా కొట్టించేశారు. (అందరిదీ ఇదే పద్ధతి). చివరికి పెద్దవాళ్లు చనిపోతే కాడిగట్టేదానికి వెదురు బొంగులు కూడా కరువైపోయాయి! మా చిత్తూరు జిల్లాలో కొన్ని వేల చింత చెట్లు ఈ విధంగా గత 30 సంవత్సరాలలో నరికివేయబడ్డాయి. రోడ్డు వెడల్పు చేయటంలో ఆనాడు ఎంతో ముందు చూపుతో బ్రిటీషు పాలకులు - ఇంజనీర్లు నాటించిన కొన్ని వేల చింత చెట్లకు అదే గతి పట్టింది. ముఖ్యంగా ప్రగతి పథంలో రోడ్లు వెడల్పు చేయటంలో. కాని ఒక్క నాయకుడికి కూడా ఇన్ని ఏండ్ల చెట్లు నరికి వేస్తున్నామే వాటికి బదులు నాటాలనే యోచన రావటం లేదు.

ఇంతకీ అసలు పాయింటు తప్పాను. మామిడితోపు చెట్టు పూత- పిందె - కాయ - పండు వరకు చెప్పేటపుడు ఆ చెట్టు మొగ్గ వేయక ముందు నుంచి పిందె వరకు, కాయ వరకు వాతావరణానిదే ముఖ్య పాత్ర అని మనం గ్రహించాలి. డిసెంబరు నుంచి ముఖ్యంగా జనవరి - ఫిబ్రవరిలో పెద్దగా పొగమంచు లేకపోతే అసలు ఏ మందూ అవసరం లేదు. శివరాత్రి, ఉగాది సమయాల్లో గట్టిగా వాన పడితే (ఒకటి - రెండు పదునులు) అదే అన్ని రోగాలను కడిగేస్తుంది. ఈ సిద్ధాంతంతో ఒకాయన మామిడి చెట్లకు మందులు బదులు ఉత్తనీరే బలంగా పిచికారీ చేసాడు. నేనూ ఆ ప్రయత్నం అపుడపుడు చేస్తున్నాను. పెద్దగా ఫలితం రాలేదు. ఆయన మాత్రం ప్రతి 15 రోజులకొకసారి చేస్తున్నాడు. మంచి ఫలితం అంటాడు. చేసి చూడాలి.

పంట అయిపోయాక చెట్ల కింద బాగా కలియదున్ని సేంద్రీయ ఎరువులు, వర్మికంపోస్టు తగిన మోతాదులో వేసి, ఎండిన కొమ్మలను, కిందకు వాలిన కొమ్మలను, ఆ ఆకుల్ని బాగా కత్తిరించాలి. చెట్టుకింద చివరి అంచులను ఒక మూరలోతు తీసి మట్టిలో కలియవేసి నీరు పెట్టేస్తే చాలు. జూన్ - జులైలో కోత అయిపోయాక డిసెంబరు వరకు ఇంతే పని. ప్రతి చెట్టుకు బాగా గాలీ, వెలుతురు వుండేటట్లు కొమ్మలు కత్తిరించాలి. అకు, ఎరువు వేసి నీరు పెడితే ఆ తరువాత చూడండి దాని తడాకా! ఆరోగ్యమే మహాభాగ్యం! ఆ చెట్టుకి ఎటువంటి రోగమూ అంత తేలిగ్గా రాదు. కాయలు కూడా బలంగా వుంటాయి.

ఇంతకీ నేను చెప్పదలుచుకుందేమంటే ప్రకృతి అందరికన్నా పెద్ద డాక్టరు! ఈ సంవత్సరం పంట బాగొస్తుందో లేక రోగాలు ఎక్కువ వస్తాయా, గాలి వాన వస్తుందా కరువు వెడుతుందా అంతా ప్రకృతి (దేవుడు) చేతుల్లోనే వుంది. అందుకే దేవుడంటే పల్లె ప్రాంతంలో అంత భక్తి. అంత గట్టి నమ్మకం. తిరుపతికి దగ్గరున్నాము కాబట్టి మా వారంతా ఎక్కువగా ఆ వెంకటేశ్వరస్వామికి లేదా కాణిపాకం వినాయక స్వామికి

మొక్కుకుంటుంటారు. ఈ మధ్య అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి (కావిడి ఎత్తడం) మొక్కులు కూడా ఎక్కువగానే వుంటున్నాయి. వీరు గాక గ్రామ దేవతలు వుండనే వున్నారు. గ్రామస్తులను ఆపదల నుంచి (ముఖ్యంగా ఆరోగ్య ఇబ్బందుల నుంచి) కాపాడేందుకు. (ఎలాగూ ప్రభుత్వం వీటిలో వెనకడుగు వేస్తోంది కాబట్టి).

అంటే మందుల పాత్ర, రసాయనికమైనా, సేంద్రీయమైనా, చాలా చిన్నదన్న మాట. వాతావరణం అంతగా అనుకూలించనపుడు పరిస్థితుల్లో కొంత మార్పు తీసుకు వచ్చి మనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఎరువులు, మందులు ద్వారా కృషి చేస్తాం. కాని దీనికి పరిమితులుంటాయని మనం గుర్తుంచుకోవాలి.

ఒక సంవత్సరం మా ప్రాంతంలో పెద్ద కరువు వచ్చింది. ఆ భయంకర కరువులో చెట్లను కాపాడుకోవటమే పెద్ద తతంగమైపోయింది. కరువు అంటే ఆ సంవత్సరం వాతావరణం పొడిగా వుంది. పెద్దగా మంచు లేదు, చినుకూ లేదు. పొడివానతో కూడా పురుగులు, రోగాలు ఎక్కువవుతాయి. నేను మా పెద్దతోపుకు పైరిత్రాయిడ్స్ బెడద తప్పించాలనే ప్రయాసతో ఖరీదైన ఎండో సల్ఫాన్ (ఒకసారి) ఎసిఫేట్ (ఒకసారి) వంటి మందులు కొట్టాను. చాలా ఖర్చు అయ్యింది.

రెండవ రెండున్నర ఎకరా తోపుకు 5 సంవత్సరాలుగా సేంద్రీయ మందులు కొడుతున్నాను. కాబట్టి ఈసారి కూడా కంపెనీ వారి అజార్ డిక్టెన్ రెండు సార్లు కొట్టాను. మూడవ రెండున్నర ఎకరం తోపులో కొబ్బరి చెట్లు ఎక్కువ. అక్కడ 80 మామిడి చెట్లున్నాయి. వాటికి ఏమీ కొట్టలేదు.

ఆశ్చర్యమేమంటే పంట తక్కువే అయినా మూడు తోపుల్లోనూ పంట దిగుబడి ఒకే రకంగా వుండింది! మూడు సంవత్సరాలుగా చూస్తున్నా, ఇదే తంతు! ఈసారి మాత్రం మా పెద్ద తోపు బ్రహ్మాండంగా కాసింది. రేటు కూడా బాగానే వుంది. కానీ చిన్న తోపులు, సేంద్రీయ మందులు పిచికారీ చేసినవి. ఏమి వేయనివి, వీటిల్లో పంట తక్కువగా వచ్చింది. కాబట్టి వచ్చే సంవత్సరం చూడాలి. బాగా ఎరువులు వేసి, నీరుకట్టి మన సిద్ధాంతం కరెక్టా ? కాదా ...?

మామిడి తోపులు అందరూ ప్రతి సంవత్సరం కనీసం ఒక్కసారైనా, వీలైతే రెండు సార్లు బాగా కలియదున్నుతారు. ఒక్క గడ్డి పరక కూడా కనబడకూడదు చెట్టుకింద. ఫుకొకా గారి సిద్ధాంతం ప్రకారం అడవి తల్లియే మనకు గురువు. అడవిలో ఎప్పుడైనా నేలను గమనించారా? (అడవి అంటే కనీసం ఒక మోస్తరుగా చెట్లుండే ప్రాంతం) ఆ నేలపై దట్టంగా ఎండు టాకులు పడి వుంటాయి. వాటిని ఒక కట్టె పుల్లతో తోడితే కొంతలోనే మీకు బాగా చీకిన, మగ్గిన ఆకు ఎరువుగా, తేమగా కనిపిస్తుంది. అన్ని రకాల చెట్లు, తీగలు, కంపలు ఒక దానికొకటి అల్లుకొని వుంటాయి. సూర్యరశ్మి కావలసినవి ఏపుగా ఎండ తగిలేటట్లు పెరుగుతాయి. అంత అవసరం లేనివి మట్టిలోనే బలంగా

వుంటాయి. మనం వేసే పంటకు కూడా దున్నకం అవసరం లేదంటారు ఫుకొకా గారు. ముఖ్యంగా తోటలోనైతే చెట్టు చెట్టుకు మధ్య గాలి, వెలుతురు వుండేటట్లు చూడటం, ఒకే రకం చెట్లు బదులు నాలుగైదు రకాల చెట్లు నాటడం. ఉదా : మామిడితో పాటు సీతాఫలం, రేగి, నేరేడు వంటివి నాటడం. మందు ఆకు చెట్టైన వేప, సీతాఫలం గట్లు పైన వేయడం, ఆకు చెట్టైన గ్లైరిసిడియా (వన్నారపు), కానుగ విరివిగా కల్లల్లో (కంచెలో) నాటడం చేయాలంటారు. వర్షం పడితే నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు నేల వాటం బట్టి కయ్యలుగా తీర్చి బలంగా గెనాలు వేసుకోవాలి. అక్కడక్కడ నీటి కుంటలు తవ్వుకోవాలి. తద్వారా వర్షం పడినపుడు ఆ నీటి కుంటల్లో నీరు నిండి ఆ క్రింది ప్రాంతమంతా నిమ్మగా ఒకటి రెండు నెలలుంటుంది. చెట్ల వేర్లు కూడా చెట్టు ఆకుల చివరి భాగంలోనే ఎక్కువగా వుంటాయి కాబట్టి చెట్టు చివరి భాగంలోనే నీరు ఎక్కువ అందించేందుకు ప్రయత్నించమంటారు.

భాస్కర్‌సావే అనే మరో మేధావి రైతు గుజరాత్‌లో వల్సాద్ గ్రామంలో వున్నారు. ఎన్నో దశాబ్దాలుగా చెట్లకి నీరు పెట్టకుండా కొబ్బరి చెట్లకు, సపోటాకు ఎటువంటి రసాయనిక ఎరువులుగానీ, మందులు గానీ వాడకుండా బ్రహ్మాండమైన దిగుబడి సాధిస్తున్నారు. వారిని చూసి పరిసర ప్రాంతంలో చాలా మంది రైతులు ఇదే బాటలో వున్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులతో ఎక్కువ దిగుబడి తాత్కాలికంగా సాధించవచ్చును. కానీ వాటికయ్యే ఖర్చుతో పోలిస్తే చివరికి వచ్చే లాభంతో పోలిస్తే ఏ మందులు వేయకుండా సేంద్రీయ ఎరువులు, అత్యవసరమైతే వేప పిండి కషాయం వంటి మందులు పిచికారీ చేయటం ద్వారా తక్కువ ఖర్చుతో ఇంకా ఎక్కువ లాభం రాబట్టవచ్చని వారి వాదన. అంతే కాదు, చెట్టు మొదలకు నీరందించటమంటే మనిషికి అన్నం కూర కలిపి నోట్లో పెట్టడం వంటిదే. ఆహారాన్ని సేకరించేందుకు చెట్టు కొంత కృషి చేయాలంటారు. చెట్టు మొదలుకు నీరును అందించి వాటిని మరీ బద్ధకస్తులుగా తయారు చేస్తే అలాంటి మనిషిలాగే తయారవుతుంది చెట్టుకూడా అంటారాయన! కాబట్టి చెట్టు చెట్టుకీ పాదు పెట్టి నీరందించేబదులు రెండు చెట్లు మధ్య కొంచెం లోతైన కాలువ (రెండు అడుగులు) తీసేస్తారు. దానిలో ఆకులు, కొమ్మలు, టెంకాయ పట్టలు కత్తిరించి వేసేస్తారు. దానికే వారానికొక్కసారి నీరు పెడతారు. నీరు దొరక్కుంటే అదీలేదు. టెంకాయ చెట్లు ఒక్కొక్కటి వంద నుండి రెండు వందల కాయలకు తక్కువ కాకుండా ప్రతి ఏటా కాస్తున్నాయి ఆయన తోటలో. సపోటా చెట్లకు కూడా ఆయన అలాగే చేశారు.

ఈ ప్రయత్నం కూడా నేను చేయదలచాను. కానీ ప్రాంతాలు వేరు. భాస్కర్‌సావే గారి ఊరు సముద్రానికి దగ్గరలో వుంది. అక్కడ ఎనిమిది అడుగుల్లోనే నీరు వుంటుంది. మన ప్రాంతంలో బోర్లు వేసి, చెట్లు నరికివేయటం వల్ల భూగర్భజలాలు అడుగంటి పోయాయి. ఇక్కడ ఎండలూ ఎక్కువే. అయినా ప్రయత్నం చేసి చూడాలి.

అలా అని గత 5 సంవత్సరాలుగా మాపెద్ద మామిడి తోపు (20 ఎకరాలది) కూడా దున్నలేదు. నన్ను అందరూ ఆడిపోసుకున్నారు. ఇదేం వ్యవసాయం అని. చిన్నతోపులూ దున్నలేదు. కానీ చెట్ల కింద టిల్లర్‌తో దున్నించి చెట్టు చివర గాడిలాగా ఒక రౌండు రింగు వేయించేవాడిని. ఆ రౌండులోనే నీరు పెట్టడం, ఎరువులు వేయడం. దీని ద్వారా దున్నే ఖర్చు ఇరవై వేలు నుండి మూడు - నాలుగు వేలకి పడిపోయింది. (టిల్లర్ రిపేరు ఖర్చులు పదివేలు అయ్యేవి - అది వేరే సంగతి).

కానీ దున్నకుండా పోవటం వల్ల చెట్ల మధ్యలో చెట్టు కింద పెరిగిన కంపలు, పిచ్చి చెట్లను ఎప్పటికప్పుడు అనగా నెలకొక్కసారైనా నరికి చెట్టు కింద గాడిలో వేసేసి, కంపలు కల్లల్లో వేసేస్తే తోపు శుభ్రంగా వుండేది. కానీ ఎదో కారణం చేత మావాళ్ళు (నా దగ్గర పనిచేసే ఇద్దరు) ఈ పని మాత్రం నిర్లక్ష్యం చేశారు. దానితో తోపంతా గబ్బు చెట్లు (పిచ్చి చెట్లు) ఎక్కువైపోయాయి. చూడటానికి, తిరగటానికి, కాయలు కోసినపుడు ఏరుకోటానికి ముందు సంవత్సరం చాలా ఇబ్బంది పడ్డాం. ఇంకో కార్మికుడి సలహాతో ఆడవారిని పెట్టి ఈసారి వర్షం పడినపుడు మొత్తం గబ్బు చెట్లను ఏర్పించి వాటిని చెట్ల కింద గాడిలో వేయించాను. కొంత ఖర్చు (2 వేలు) అయింది. ఆడవారు వేసిన కుప్పలు చెట్ల కింద గాడిలో మొదళ్లకు వేయించటం ఒక గగనమైంది. అంటే సిద్ధాంతం బాగానే ఉంటుంది. ఆచరణ చాలా కఠినం. అందుకే గాంధీ గారు ఎప్పుడూ ఆచరణ మీద ఎక్కువగా వత్తిడి చేసేవారు. అందుకే ఆయనంటే అందరికీ గౌరవం కూడా ఎక్కువ ఆ విషయంలోనే - తప్పైనా ఒప్పైనా అనుకున్నది వెంటనే ఆచరణలో పెట్టటమే ఆయన గొప్పతనం.

అయినా ప్రతి తోపుకి, మడికి, చేనుకి వాటి వ్యక్తిత్వం వాటికి వుంటుంది. అంతెందుకు; ప్రతి చెట్టూ వేరే! దేని ప్రత్యేకత దానికి వుంటుంది. పెద్దలు నాటిచ్చిన తోపులు వేరే. కొత్తగా నాటే తోపులు వేరే. పాత తోపులో మార్పులు చేయటానికి అవకాశం తక్కువ. అందులో మావి 100 సంవత్సరాలు దాటిన చెట్లు. కొందరేమో కోసేసి మళ్లీ నాటండన్నారు. ప్రాయం దాటిపోయింది. ఇంక ఎక్కువగా కాయవన్నారు. సరే ఈసారి చూద్దాం అనుకున్నా, కాయలేదు. సరే ఇంకో సంవత్సరం చూద్దాం అని మళ్ళీ వాయిదా వేశా. ఈ సంవత్సరం తుక్కు కింద కాసేశాయి ఆ పెద్ద వృద్ధ చెట్లు. ఇపుడేంచేయాలి? బాగా ఎరువు వేసి, ఎండిన కొమ్మలు, కింద నేలతాకే కొమ్మలు, ఆకులు కత్తిరించి, ఆ ఆకు అంతా చెట్టు కిందే కత్తిరించి వేసి, కొంత ఎరువు, వర్మి కంపోస్టు వేసి చూడాలి. మళ్ళీ మూడు నాలుగు సంవత్సరాలు కాయకపోతే - ఈసారి ఇంక కోసేయవలసి వస్తుంది. ఇలా ప్రతి చెట్టుకి ఆలోచించి దానికి తగిన వైద్యం చేయాలి.

*ఒక వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త ఒక రైతు పొలంలో వున్న మామిడి చెట్టుని చూసి అన్నాడట : "ఉదాహరణకి ఆ మామిడి చెట్టు చూడండి: పై ఎరువులు మందులు వాడనిదే అది ఒక తట్ట బంగినపల్లి కాయలు పైన కాసినా ఆశ్చర్యమే!"*

**అపుడా రైతు ఇలా అన్నాడట :**

*"ఔను సార్! నాకూ ఆశ్చర్యమే కలుగుతుంది. ఎందుకంటే అది తోతాపురి (బెంగుళూర) చెట్టు!"*

ఇక్కడ మరో విషయం చెప్పాలి. ప్రభుత్వ ఉద్యానవన శాఖ అధికారులు 70వ దశకంలో ఒక కొత్త ప్రతిపాదన చేశారు. రైతులు ఒకే తోటలో కొబ్బరి, మామిడి రెండూ పెంచి రెట్టింపు ఆదాయం పొందవచ్చని. కొబ్బరికి నిరంతరం నీరు పారుతుండాలి. మామిడికి వేసవిలో మూడుతడులు వేస్తే చాలు. మరి రెండు ఒకే తోటలో ఎలా ఇముడుతాయి? శాస్త్రవేత్తలని, అధికారులను గుడ్డిగా నమ్మిన వారంతా బోల్తాపడ్డారు. అందులో మా నాన్నగారు ఒకరు! 1970 దశకం మొదట్లోనే మా నాన్నగారు, వారి అన్నగారు ఆస్తులు పంచుకున్నారు. వెంటనే మా నాన్నగారే మా పెద్ద తోపులో 5 ఎకరాల్లో టెంకాయ చెట్ల మధ్య మామిడి చెట్లు, మామిడి చెట్ల మధ్య టెంకాయ చెట్లు నాటించేశారు. మరో రెండున్నర ఎకరాల తోపులో కొత్తగా మామిడి, టెంకాయ చెట్లు కలిపి నాటించారు. 30 సంవత్సరాల వరకు ఆయన హయాంలో నీరు కట్టించిన ఖర్చులు కూడా రాలేదు. కొబ్బరి చెట్లు ఏపుగా పెరిగి మామిడి చెట్లకి నీడైపోయాయి. ఎండకోసం మామిడి చెట్లు కూడా సన్నగా కొబ్బరి చెట్లకు పోటీగా పెరగాల్సి వచ్చింది. మామిడి పూత, కాయ వుండేటప్పుడు టెంకాయ మట్టలు వాటి మీద పడటం - పూత, పిందె రాలటం ఒక నష్టమైతే, ఎక్కువ భాగం కొబ్బరి చెట్లనీడలో వుండాల్సి రావడం వల్ల - ఎండ, వేడి ఎక్కువగా కోరే మామిడి తన సహజత్వం కోల్పోయి పంట సరిగా కాయకపోవటం, కాయలు నీడవల్ల పచ్చగా వుండిపోవడం జరుగుతోంది. కొబ్బరి కూడా అనుకున్న పంట రాలేదు సరికదా, గత 7 సంవత్సరాలుగా ఎరిఫైడ్‌మైట్ అనే కొత్త రకం నల్లిసోకడంతో కాయంతా పిందె దశలోనే పీచుగా ఎవరో గోకేసినట్లు చిన్న సైజులో అయిపోతున్నాయి. దిగుబడి తగ్గిపోతుంది, ఈ రోగం కాయలు అర్ధరూపాయి, రూపాయికి అమ్ముడుపోతాయి రోగ నివారణకు ఎన్నెన్నో వైద్యాలు అధికారులు చెప్పారు కాని ఏదీ కూడా పనిచేయడం లేదు.

ఈ మధ్య అధికారులు పైరిత్రాయిడ్స్ వాడకండి. చెట్లు దెబ్బతింటాయని ప్రచారం చేశారు. మరేది వాడాలి? ఎండో సల్ఫాన్, మోనోక్రోట్ ఫాస్, ఎసిఫేట్ వంటివని సలహాలిచ్చారు. అవి వాడుతుంటె పురుగు / రోగం తగ్గటం లేదు. మరి రైతు ఏం చేయాలి? మరో కొత్త వైద్యం చెప్పారు. దీని పేరు ఇమల్డొ ప్రైడ్. ఇదీ ఒక పైరిత్రాయిడ్ కానీ కొంచెం ఘాటు తక్కువ! ఖర్చు ఎక్కువ! ఇది ఎంత కాలం పనిచేస్తుందో? ఇప్పుడు మరో ప్రయోగం చెబుతున్నారు. దాని పేరు "ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంటు". అంటే ముందు సేంద్రీయ మందులు వాడండి. వాటికి తగ్గకపోతే అప్పుడు మెట్టు మెట్టుగా రసాయనిక క్రిమి సంహారక మందులు వాడండి అని ఈ ఉచిత సలహా. నేను ఒక్కసారి మా పెద్ద తోపులో కూడా ఈ ప్రయత్నం చేద్దామని అజార్ డిక్టెన్ (వేప మందు కషాయం) ఒక కంపెనీ నుండి తెప్పించాను. తీరా తెచ్చాక దాంట్లో కిరసనాయిలు ఎక్కువ కల్తీ చేసినట్లు నాకు అనుమానం. మొత్తానికి లీటరుకి 5 మిల్లీలీటరు కలిపి పిచాకారీ చేయమన్నారు. మా తోపుకి 15 నుండి 20 వేల లీటర్లు పడుతుంది. అనగా 75 నుండి 100 లీటర్ల మందు కావాలన్నమాట.

రూ. 120/- లెక్కన మందు ఖర్చే 9 వేల నుండి 12 వేల రూ.లు అవుతుంది. శాస్త్రవేత్తలు చెప్పినట్లు కనీసం రెండు సార్లు పిచికారీ చేసినా 18 నుండి 24 వేల రూ.లు మందు ఖర్చు అవుతుంది. మూడవ ట్రిప్పు మళ్ళీ రోగమొస్తే ఏ ఎండో సల్ఫానో, పైరిత్రాయడ్ (సైపర్ మెత్రిన్) వేయాల్సి వస్తుంది. ఎండో సల్ఫాన్ ఒక ట్రిప్పుకి 30 నుండి 40 లీటర్లు (ఒక వెయ్యి లీటర్లలో 15 నుండి 20 మిల్లీ లీటర్లు) అనగా 27 వేల నుండి 19 వేలు అవుతుంది. ఒక రోజు పిచికారీ చేసే దానికి ట్రాక్టరుకు, కూలీలకు కలిపి రూ. 1300 లెక్కన 5 రోజులకి 6,500 రూ.లు అవుతుంది. అంటే ఒక ట్రిప్పు వేప పిండి కొడితే కంపెనీదైతే పదహైదున్నర వేల రూపాయలు ఖర్చు అవుతుంది. సొంతంగా వేప గింజలు రుబ్బి అంత మోతాదులో అప్పటికప్పుడు పిచికారీ చేయటం 20 ఎకరాలకు కష్టం. ఎండోసల్ఫానైతే 13 నుండి 16 వేలు అవుతుంది. మోనోక్రోటోఫాస్ ఇంకొంచెం ఎక్కువ. సింథెటిక్ ఫైరిథ్రాయిడ్స్ (సైపర్ మైత్రిన్) ఇంకా శక్తివంతమైనా వాటి ఖర్చు తక్కువ! అందులో ఒకే ట్రిప్పుకు మొన్నటి వరకు సరిపోయేది. ఈ మధ్య రెండు ట్రిప్పులు కొట్టాల్సి వచ్చింది. గత సంవత్సరం పూర్తిగా పనే చేయలేదు. వేరే మందులు కొట్టాల్సి వచ్చింది. కొందరు రైతులు పంట కోసుకునే ఆత్రంలో 4 - 5 సార్లు ఇంకా ఎక్కువగా కూడా మందులు మార్చి మార్చి కొట్టారు. మేము మాత్రం 2 ట్రిప్పులే కొట్టాము. అయినా ఖర్చు 34 వేలు అయింది. అయినా మళ్ళీ చినుకు వాన రావడంతో జూన్ మాసంలో నీలం కాయ అంతా 'మంగు' రోగం వచ్చేసింది. దానికి మందు మరోసారి కొట్టి వుండాల్సింది!

కాయల కోతలో నిమగ్నమై అది గమనించను కూడా లేదు మేము! ఈసారి పంట బాగా రావడంతో, ధర కూడా మోస్తరుగా వుండడంతో మాకు అమ్మకాలు నూరు

టన్నులకు నాలుగు లక్షల రూపాయలు వచ్చాయి! ఎప్పుడూ రానంత. సాధారణంగా ఖర్చులు - జీతాలు, మందులు, కోతలు, కల్లా(కంచె)లు, కావిలివేయటం, రిపేర్లు, నీరు కట్టడానికి అంతా ఒక లక్ష దాటి పోయేది. దీనిపైన మిగిలితేనే మన ఆదాయం. ఒక సంవత్సరం కాస్తే రెండవ సంవత్సరం పంట దాదాపు శూన్యమే. నాలుగు సంవత్సరాలకు కరువు పెట్టడంతో చెట్లు బతికించుకునేదే గగనమై పోయింది. దిగుబడి కానీ, సైజులు కానీ బాగా తగ్గిపోయింది. బోరువేస్తే నీరు పడలేదు. అదృష్టం కొద్ది గత రెండు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడటంతో కొంత లాభం వచ్చింది.

మామిడి తోపుల వ్యాపారం ఎత్తితే స్వర్గానికి లేదంటే పాతాళానికి. అవి ఒక సాయిబులకే గిట్టు. లాభమొస్తే మూటగట్టుకుంటారు. నష్టమొస్తే రైతును కాళ్ళా వేళ్ళా బట్టుకుని బతిమాలుతారు. చాలా మంది చిన్న, సన్నకారు రైతులు తమ అవసరాల కోసం వారి చిన్న చిన్న తోపులు (1 ఎకరం నుండి 5 ఎకరాల వరకు) 2 సంవత్సరాల నుండి 4 సంవత్సరాలు (ఇంకా ఎక్కువ కూడా) వ్యాపారులకు అమ్మేస్తారు. పంట అమ్మడం రకరకాలుగా వుంటుంది. వ్యాపారే మొత్తం చూసుకోవడం, లేదా నీరు కట్టేది కల్ల? వేసేది రైతు వంతు కావడం, దున్నించేది వ్యాపారి - డబ్బు అంతకు ముందే ఇస్తే ఒక రేటు, సగం ఇచ్చి సగం పంట మందులు కొట్టేటప్పుడు. లేదా కొంత బేరం అయినపుడు, కొంత మందుకొట్టేటపుడు, కొంత కాయలు కోసే ముందు, కొంత కాయలు కోశాక ... ఈ విధంగా రకరకాలుగా ఒప్పందాలు వుంటాయి. వీటిని మధ్యవర్తులను పెట్టుకుని కొన్ని సార్లు రాసుకుంటారు. మామూలుగా నోటిమాటతోనే వుంటాయి. రాసుకున్నా, లేకపోయినా పరిస్థితి బట్టి మాటలు, చెల్లింపులు మారిపోతుంటాయి. గాలి వాన వచ్చి పంట పూర్తిగా పోతే లేదా ధరపడిపోతే రైతు కూడా కనికరిస్తాడు. మరో సంవత్సరం పొడిగించటమో, లేక డబ్బు తగ్గించుకోవటమో చేస్తాడు.

ధరలు పడిపోవటానికి ఎన్నోకారణాలుండవచ్చు. ముంబాయిలో భారీవర్షాలతో, లారీలు నిలిచిపోయి వుంటాయి. ఇరాక్‌లో గల్ఫ్ యుద్ధంతో డీజిలు దొరక్క లారీల ఇబ్బంది. లేదా లారీల దేశ వ్యాప్త సమ్మె! ఒకసారి రాజీవ్ గాంధీ మరణంతో దేశమంతా అల్లకల్లోలమైంది. వారం రోజులు వ్యాపారం నిలిచిపోయింది. ఈ విధంగా ఏవేవో కారణాలతో వ్యాపారం జరగకుండా పోవచ్చు. వ్యాపారస్తులు మండి వారి దగ్గర నమ్మకంతో కాయలు లారీలో తీసుకుని, అమ్మే చోట ధరపడిపోతే అలాగే ఉడాయించవచ్చు లేదా డబ్బు చెల్లింపులు వాయిదా వేయవచ్చు. మండీ వారు డబ్బుకు రైతుకు గ్యారంటీ. అందుకోసం 5 శాతం కమీషను తీసుకుంటారు. సాయిబు వ్యాపారస్థులతో పాటు రైతులు కూడా పోటా పోటీగా కొన్ని మండీలు పెట్టడంతో మా ఊరు దగ్గర దామల చెరువులో దాదాపు 150 మండీలకు పైగా ఏర్పడ్డాయి. దీని వల్ల రైతుకు కొంత మేలు.

మామిడి పంట గురించి ఇంత సుదీర్ఘంగా ఎందుకు రాయవలసిందంటే దానిలో వున్న కష్టాలు, మెలుకువలు మీకు తెలియచెప్పాలనే. ఈ విధంగా ప్రతి పంటకూ వుంటుంది. సేంద్రీయ మందుల వాడకం కూడా పెద్ద రైతులకు కష్టం. అంటే చిన్న రైతులకే అది శ్రేయస్కరం – అణుకువగా వుంటుంది. ఉదాహరణ: ఇందాక మనం అనుకున్నట్లు వేప కషాయం (అజర్‌డిక్టెన్) స్ప్రే చేయ దలిస్తే బస్తాలు, బస్తాలు గింజలు తెచ్చి 20 ఎకరాలకు ఎప్పుడు రుబ్బేది? ఎప్పుడు వడగట్టి పిచికారి చేసేది? ఇదంతా మనుషులతోపని. అలా అని కంపెనీలు అమ్మే అజార్ డిక్టెన్ కొన్నారంటే రైతుకు ఏమి లాభం? ఖర్చు అంతే అవుతుంది. రసాయనిక మందులకు మల్లె. కాకపోతే చెట్లకు సేంద్రీయ మందులు కొట్టామని ఒక తృప్తి. అదే ఏ రెండు ఎకరాలో – 5 ఎకరాల తోపో అయితే ఒకసారి గింజలు గ్రైండరులో రుబ్బుకుని అప్పటికప్పుడే అతి తక్కువ ఖర్చుతో పిచికారీ చేసేయవచ్చు. అలాగే రెండు మూడు బ్యారెల్లలో ఆవు మూత్రం పట్టిపెట్టుకొని నీటిలో (1:6 మోతాదులో) కలిపి పిచికారీ చేయవచ్చు. మన దేశంలో 80 శాతం 5 ఎకరాలలోపు రైతులే ఉన్నారు. వీరి భవిష్యత్ అందరికన్నా ప్రశ్నార్థకంగా మారింది కాబట్టి వారిని దృష్టిలో పెట్టుకుంటే సేంద్రీయ పద్ధతులు వీరికే అనుకూలంగా వుంటాయని వేరే చెప్పనవసరం లేదు.

## ఇతర పంటలతో మా తైతక్కలు

వరి : సంఘసేవకులు నగేష్‌గారి సలహాతో (ఆయనకు ఉగ్రమ్మగారే చెప్పారంట) "అన్నం బహు కుర్వీత" అనే పిలుపును కొంత సీరియస్‌గా తీసుకున్నాం. భూగర్భ జలాలను విస్తృతంగా వాడి మనమంతా చెరుకు పండించడం అన్యాయం అనిపించింది. చిత్తూరు జిల్లాలో చెరుకు అంతా 75 శాతం బెల్లం తయారీకి పోతుంది. దీనిలో అత్యధిక భాగం నల్ల బెల్లం. అంటే నేలసున్నారపు వరుస వుంటే తెల్లగా వస్తుంది. చూడటానికి ఆకర్షణీయంగా వుంటుంది. మిగతా సారవంతమైన నలుపు నేలల్లో బెల్లం నల్లగా తయారవుతుంది. ఈ నల్ల బెల్లమంతా నాటుసారా తయారీకే పోతుంది. ఎక్కువగా మహారాష్ట్ర, తమిళనాడు, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు. ఎన్నికలు ఎక్కడ జరుగుతా వుంటే నాటు సారాకోసం అక్కడికి ముందు! ఇటువంటి పాపపు పని మనం ఎందుకు చేయాలి? చెరుకు బదులు వరి వేస్తే, అదీ సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తే, నలుగురికి మంచి ఆరోగ్యమైన, రుచికరమైన తిండిగింజలు అందించ వచ్చుగదా అనిపించింది.

సరే అని మాకు పెద్ద చెరువు కింద వున్న రెండున్నర ఎకరా మడికట్టులో చెరుకు పంట నిలుపుదల చేశాను. వరి వేద్దామని నిశ్చయించాను. పేదవారికి కౌలుకివ్వటమేమిటి మనమే స్వంతంగా కూలీలను బెట్టి చేద్దామనుకున్నాం. అందరికీ ఇష్టమైన జీలకర్ర మసూర (బి.పి.టి 5204) వడ్లు నారు పోసి మొత్తం పొలందున్నాం.

ఒకొక్కసారి 3 మడకలు తెచ్చారు. అవి బక్కచిక్కిన ఎద్దులు లేదా ఆవులు! ఎన్నిసార్లు దున్నినా సరిగా దుక్కి అయ్యేది కాదు. కానీ ఒక పూట (పొద్దున్న 6 నుంచి మధ్యాహ్నం దాకా) దున్నారంటే వారికి రోజుకూలీ ఇచ్చేయాల్సిందే! ఈ ఎద్దులకు, ఆవులకు సరైన తిండి / విశ్రాంతి లేక అవి బాగా అలిసిపోతూ వుండేవి. అవి ఉన్నవి కూడా కొన్నే. కాబట్టి మడకలున్నవారు మరి నేలను పైపైనే దున్నేందుకు ఇష్టపడతారు. ఒకసారి ఒక జత లేత వయసు ఎద్దులు నా మడి దున్నుతున్నపుడు శక్తిలేక లాగలేక కూలబడిపోయాయి. పొలం మధ్యలో! ఆ బాధ చూడలేక, పని సక్రమంగా జరగక, మరోపక్క బిల్లు పెరిగిపోతూ చాలా వేదనకు గురయ్యాం. నేను వెంటనే “పవర్ టిల్లర్” (చేతితో తోసే మడకల యంత్రం) కొనుక్కోవాలని నిర్ణయించి ఆ అన్వేషణలో పడ్డాను. (దాని సాధక బాధకాలు దానికి వున్నాయి)

వ్యవసాయంలో యజమాని వంగితే పని కొంత చురుకుగా జరుగుతుంది. అలాకాక, యజమానులు కూలీలపై అజమాయిషీ చేస్తూ వుండిపోతే కొంత ఆలస్యం అవుతుంది. స్వంతంగా పని తెలియక పోయినా (మాలాంటి వాళ్ళు) లేదా అప్పుడపుడు వచ్చి అజమాయిషీ చేసేవారికైనా మరింత ఆలస్యంగా పని జరుగుతుంది పై ఎరువులు వేయటం లేదుకాబట్టి సంప్రదాయ గొర్ల ఎరువు ఒకొక్క ఎకరానికి ఆరు ట్రాక్టర్లు తెప్పించాము. అలాగే కానుగ, వేప, వన్నారపు (గ్లైరిసీడియా) వంటి చెట్ల ఆకు కొట్టించి, కత్తిరించి బాగా వత్తుగా వేపించాము ప్రతి కయ్యలోనూ. ఆ తరువాత బాగా కుళ్ళిన తరువాత మొత్తం కలియదున్ని, భూమిని లెవలింగు చేయించాం. ఆ పైన నాటాము.

కలుపు తీసేటపుడు ఒక ఎకరాకు 3 మూటలు వేరుశనగ పిండి వేశాం (యూరియా, 17+17+17 బదులు), రెండవ సారి కలుపు తీసేటపుడు కూడా వేప, కానుగ, ఆముద పిండి మిశ్రమాన్ని వేశాం. ఎన్ని వేసినా గుచ్చిన కర్ర అలాగే వుంది! పిలకలు పెట్టలేదు. కలుపు తీసేటపుడు యూరియా వేసిన పంటల్లో 20-30 పిలకలు వేస్తే మా పంటలో మాత్రం 5-10 పిలకలే వేశాయి! పంటకోయించటం, వర్షానికి ఆరబెట్టడం, చివరికి గోడౌను చేరేటప్పటికి పెద్ద తతంగం అయ్యింది. 16 వేలు ఖర్చు అయ్యింది. మా శ్రమకు లెక్కకట్టనే లేదు. రోగాల నివారణకు ఆవు మూత్రాన్ని నీటితో కలిపి పిచికారీ చేశాం, వేప కషాయం కొట్టాం. చెరువులో విరివిగా మొలిచే బాండ్(రబ్బరు) పూల చెట్ల ఆకుల కషాయం కొట్టాం. కానీ వాటికి రోగాలు పోయినట్లు అనిపించలేదు. మొత్తానికి ఎకరాకు 15 బస్తాలు (75 కిలోలవి) లెక్కన పంట దిగుబడి వచ్చింది! అంటే కిలో వడ్లకు 6 రూ.లు అయ్యింది ఖర్చు. బియ్యానికి కిలో 9 రూ.లు. ఈ బియ్యం అమ్మేసి మనం సొమ్ము చేసుకుందామా అంటే ఆ పని అంత వేగంగా జరగలేదు. కొంత మాఅన్నదమ్ములకు పంచాను. వారికి పాలిష్ చేసిన బియ్యమే కావాలన్నారు. పాలిష్ చేయనివి నచ్చలేదన్నారు. కొందరు మిత్రులకు బియ్యం అమ్మాం. ఏదో కొంత డబ్బు వచ్చింది.

మరుసటి సంవత్సరం అదే భూమిలో చెరుకు వేశాం. ఆ చెరుకు దున్నేటపుడు, విత్తనం తొలిచేటపుడు, నాటేటపుడు, చుట్టేటపుడు కూలి వాళ్ళకి అన్నం పెట్టాలి. అలాగే గానుగ ఆడేది పెద్ద సమస్య అయికూచుంది. ఎవరు ఆడేదీ? మామూలుగా రైతులు వారు స్వంతంగా కష్టపడతారు. ఇద్దరు, ముగ్గురు కూలీలను పెట్టుకుంటారు. మనకి ఆ విధమైన శరీర కష్టం అలవాటు లేదు! కాబట్టి మొత్తం కూలి వాళ్ళనే పెట్టాం. నేను వచ్చి చూసుకుని పోయేవాడిని! పనికూడా.అలాగే జరిగేది! మొత్తానికి మేము చెరుకు నాటించి, బెల్లం ఆడించే సరికి, మేం పండించిన వడ్లలో మూడువంతులు భాగం మాకూ, కూలీవాళ్ల కే సరిపోయింది.

స్వంత సేద్యంలో కష్ట నష్టాలు అనుభవించాక చిన్న చిన్న రైతులు కూడా (ఒక ఎకరం ఉన్న వాళ్ళు కూడా) కౌలుకు తమ భూమి ఇవ్వటానికి ఎందుకు ఇష్టపడతారో అర్థమయ్యింది అప్పుడు! వెంటనే కొందరికి కౌలుకిచ్చేశాం. అయితే వారికి షరతులు పెట్టాం. మా భూమిలో వ్యవసాయం చేస్తే రసాయనిక ఎరువులు, మందులు ఎట్టి పరిస్థితిలోనూ వాడకూడదు. పశువులు ఎరువు 50 శాతం మేమే ఇస్తాం. అలాగే పై ఎరువులైన యూరియా, కంప్లెక్సుల బదులు శనిగ పిండి వగైరాలు మేమే ఇస్తాం. చెరుకుతోటలో కూడా ఇదే షరతులు పెట్టాం. వాటికి వొప్పుకుని వచ్చిన వారికి 1/3 ఎకరా చొప్పున ఇచ్చాం. మా చిన్న మడి, కొబ్బరితోపు నీరు కట్టి అజమాయిషి చేసే అతనికి అదనంగా మరో 1/3 ఎకరా ఉచితంగా ఇచ్చాం జీతం లేకుండా. (కానీ అది కరువులో నడవలేదు. తిరిగి ఆతనికి జీతం ఏర్పాటు చేయవలసి వచ్చింది)

ఎన్ని రకాల వరి విత్తనాలతో ప్రయత్నాలు చేసినా, ఎంత సత్తువలు వేసినా పంట మాత్రం పిలకలు పెరగటమే తప్ప యూరియాలో వచ్చినట్లుగా చేయలేకపోయాం.

నిరాశగా వున్న సమయంలో 'శ్రీవరి' పద్ధతి వరంలాగా ముందుకు వచ్చింది. ఇది ఆఫ్రికా ఖండం దగ్గర మడగాస్కర్ దీవిలో ఒక ఫ్రెంచి దేశీయుడైన క్రైస్తవ మతాచారి ఫాదర్ హెన్నీదలాలోనీ స్థానికుల నుండి నేర్చుకుని అభివృద్ధి చేశారు. ఈ పద్ధతిలో కేవలం రెండు కిలోల విత్తనమే ఒక ఎకరాకు సరిపోతుంది! నారు పోసే ముందు నేలను బాగా సరిచేసుకోవాలి. బాగా దున్ని, పచ్చిరొట్ట ఎరువులు, గొడ్ల ఎరువు ముందుగా వేసి కలియదున్ని, నారు పెట్టి ఎక్కడ కూడా నీరు హెచ్చుతగ్గులుగా నిలవ వుండకుండా ఒకే లెవల్‌గా భూమి వుండేటట్లు జాగ్రత్త పడాలి. అన్నీ అయిపోయాక దగ్గరలో ఒక పక్క ఒకటిన్నర అడుగు ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు × 24 అడుగులు పొడవు ఇటువంటివి రెండు బెడ్లు, ఒక ఎకరానికి మట్టితో తయారు చేయాలి. ఆ మట్టి మంచి సారవంతమైనదిగా వుండాలి. అందులో బాగా మగ్గిన గొడ్ల ఎరువు లేదా కంపోస్టు వంటిది వేసి బాగా కలిపి పెట్టాలి. ఇలా రెండు - మూడు సార్లు చేసి వాటిలో మొలకేసిన వడ్లను పల్చగా చల్లాలి. ఎక్కువ ఎండకు దెబ్బతింటాయి కాబట్టి కొబ్బరి పట్టతో కప్పి పెట్టాలి. మొదట్లో రోజుకు మూడుసార్లే నీరు చల్లాలి. తేమ ఎక్కువ వుండకుండా

సరిపోయేటట్లుగా చూసుకోవాలి. రెండు ఆకులు లేదా మూడో ఆకు తొడిగేలోగా సరిగ్గా 8వ రోజు నుండి 12వ రోజులోపల నాటేయాలి.

నాటటం అంటే దారాలతోనో లేక "మార్కర్" తోనో పొలంలో కనీసం 25 సెంటీమీటర్లు నిలువుగా అడ్డంగా గీతలుగీసుకుని, లేదా గుర్తులు పెట్టుకుని, ప్లేటుల్లో నారు తీసుకుని జాగ్రత్తగా ఒకొక్క విత్తనమే పైనే నాటాలి. అంటే పొలంలో తేమ వుండాలి కాని నీరు వుండకూడదు. నారు నాటేటపుడు కూడా వేరు పక్కకువచ్చేటట్లు లైటుగా వత్తాలి. ప్రతి 15 అడుగులకు 'దారి' వదలాలి. తద్వారా అధిక నీరు తీసేయటానికి ఆస్కారం వుంటుంది. ఈ విధంగా జాగ్రత్తగా నాటిన నారుని మొదటి నాలుగు ఐదు రోజులు కొంగలు, పక్షుల నుండి కాపాడాలి. లేకపోతే అవి వాటిని తొక్కి ధ్వంసం చేసేస్తాయి  మడికి నీరు తేమ ఆరినపుడు లైటు(కొద్ది)గా నీరు పెట్టాలి. అంటే సాధ్యమైనంత వరకు మడిలో నీరు వుండకూడదు. తేమ మాత్రం వుండాలి. మడి నాటిన 10వ రోజుకే "కలుపు" తీయాలి. "కలుపు" పెద్దగా లేకపోయినా వరి వేర్లు అభివృద్ధి అయ్యేందుకు ఒక "రోటరీ వీడరు"తో వరి పైరు మధ్య సాళ్ళలో జాగ్రత్తగా నడపాలి. ఇరువైపులా (తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణంగాను). ఈ విధంగా మొదటి నెలలో మూడు సార్లు అయినా చేయాల్సి వుంటుంది. ఈ సమయంల్లో శనిగపిండిగాని, వర్మీ కంపోస్టుగానీ వేసి కలియదున్నితే మరింత వేగంగా వరి అభివృద్ధి చెందుతుంది.

సాధారణ నాటికలో 15 - 20 పిలకలు వస్తే శ్రీవరి పద్ధతిలో 30 నుండి 60 కొన్ని సందర్భాలలో 100 నుండి 140 పిలకలు కూడా వస్తాయి. పంట దిగుబడి ఎకరాకు 45 బస్తాల నుండి 60 - 90 కూడా వచ్చినట్లు రాష్ట్రంలో పలువురు రైతులు, శాస్త్రజ్ఞులు చెప్పారు. ఇదొక అద్భుతం. నీరు మూడింట ఒక భాగం తగ్గిపోతుందని, దిగుబడి మూడింట ఒక భాగమైనా ఎక్కువ అవుతుందని వరి పంటలో మరో విప్లవం అని అంతా సంబరపడ్డాం.

ఈ అద్భుతం వెనుక సిద్ధాంతం ఏమంటే వరికి నీరు అవసరమే కాని ఎల్లప్పుడూ నీటిలో వుంచటం దానికి శ్రేయస్కరం కాదు. దానికి అసలు కావలసింది  తేమ మాత్రమే. దూరం దూరంగా నాటటం వల్ల వరి మొక్కకు కావలసిన సూర్య రశ్మి అందుతుంది అప్పుడు మొక్క అభివృద్ధి చెంది అనేక పిల్లలు పెడుతుంది. కలుపు కూడా సత్తువైపోతుంది. వేర్లకు గాలి తగిలేటట్లు "రోటరు వాడకం"తో 3-4 సార్లు  కలుపు తీస్తే రసాయనిక ఎరువులు, మందులు అవసరం లేకుండా సేంద్రీయ పద్ధతిలో ఘనమైన ఉత్పత్తి సాధించవచ్చు

మేము ఎంతో ఉత్సాహంతో ఈ ప్రయోగాలు మూడు సార్లు చేశాం. మొదటిసారి నారులో ఆలస్యం చేసి పొరపాటు చేశాం. దిగుబడి ఎకరాకు లెక్క వేస్తే (1/3 ఎకరా మాత్రమే నాటాం) 20 మూటలు వచ్చింది.

రెండవసారి చేతికందే పంటకు కరువుకాటు వేసింది. మా బోరు ఎండిపోయింది. ఎంత వేడుకున్నా సాటి రైతులు సహకరించలేదు. పంట ఎండబెట్టేశాం.

మూడవ సారి చాలా జాగ్రత్తగా అన్నీ చేశాం. పంట దిగుబడి కూడా బాగా వచ్చేట్లు కనబడింది. వ్యవసాయ శాఖ అధికారులు కూడా మెచ్చుకున్నారు. కానీ చివరకు దిగుబడి మాత్రం అనుకున్నంత రాలేదు. ఎకరాకు 30 మూటలు లెక్కన పండింది. మామూలుగా పై ఎరువులతో ఇది ఫరవాలేని పంటే. బాగా పండితే 45 రావచ్చు "శ్రీవరి" ఫలించాలంటే 45 నుండి 60 మూటలు ఎకరా దిగుబడి చూపించగలగాలి. అప్పుడే పడిన శ్రమకు ఫలితం వుందని రైతు గ్రహిస్తాడు. ఏమైనా పొరపాటు చేశామా అని మా కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించాం. ఒక కొత్త పొరపాటు చేశాం! కలుపు తీయడం - ఆలస్యం చేశాం. ఎందుకంటే ఇంకా కలుపు రాలేదు కదా పెద్దగా అనుకున్నాం. అలా దాదాపు 20 రోజులు పైగానే మొదటి కలుపుతీయలేదు. దీనివల్ల వేర్లకు అవసరమైన సమయంలో తగినంత గాలి వెలుతురు సోకలేదు. ఈసారి దీన్ని సరిదిద్దాలి.

## చెరకు పంట గురించి మరోమాట

సాధారణంగా మా పక్క రైతులు వరి పంట తమ స్వంత వాడకానికి వేస్తారు (తూర్పు మండలాల్లో లాగ కాకుండా). ఒక పంట వరి పైరు వేస్తే రెండు సంవత్సరాలు చెరుకు పంట వుంటుంది అదే పొలంలో. చెరకు ఎక్కువ భాగం బెల్లం చేస్తారు. చిత్తూరు జిల్లా అంతా ముద్దలు పడతారు. అయితే చిత్తూరు దగ్గర అరగొండ నుంచి పడమటి మండలాలైన చౌడేపల్లి, సోమల కొంత మెట్ట ప్రాంతాలు చౌడు భూములు. ఇక్కడ సహజంగానే బెల్లం బంగారం రంగు వస్తుంది. మార్కెట్టులో తినడానికి ఇటువంటి బెల్లం పైకే ప్రజలు మక్కువ చూపుతారు. నల్లబెల్లం ఎవరూ తినడానికి కొనరు! అయితే మార్కెట్టు ప్రభావం ఒకవైపు, రసాయనాలు, పై ఎరువుల వాడకం మరోవైపుతో బెల్లం బంగారం రంగు రావాలని రకరకాల పొడర్లు వాటిలో కలపడం మొదలెట్టారు రైతులు పోటా పోటీగా. ముందు పెనంలో కాగుతున్న బెల్లం వంటలోనే సోడా వేయడం, ఆ తరువాత హైడ్రోస్ అనే పొడరు వేయడం. మరో ఎర్రరంగు పొడరు ఇంకేదో పొడరు కూడా ఈ మధ్య వేస్తున్నట్లు చెప్పారు. కొందరు రైతులు. వాటిపేర్లు వారికి తెలియలేదు. మిగతావి ఎలాగున్నా ఈ హైడ్రోస్ డబ్బాపైన "కేవలం బట్టలు బ్లీచింగుకే వాడవలయును, మనుషులకు హానికరము" అని ఇంగ్లీషులో పెద్ద అక్షరాలతోనే రాసి వుంది! ఆ విషయం రైతులకు తెలియక కాదు. "అయినా మనం తినటం లేదుగదా! ఈ బెల్లం వెంటనే బజారులో అమ్మివేయాలి. ఆరు నెలలు ఆలస్యం అయితే రంగు, రుచి మారిపోతుంది. చిన్న, చిన్న లడ్డు వుండలుగా చేసే ఈ బెల్లం చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. "మేడి పండు చూడ మేలిమై వుండు. పొట్ట విప్పి చూడ పురుగులుండు" అన్న చందంగా అసలు విషయం తెలిసిన వారెవరూ ఈ బజారులో దొరికే బంగారు రంగు

బెల్లం జోలికిపోరు. మరి బెల్లం తినాలనుకునేవారు ఏం చేయాలి. సేంద్రీయ ఎరువులతో తయారయ్యే బెల్లాన్ని వెతుక్కోవాలి. ఎక్కడ అమ్ముతారో కనుక్కొని అదే వాడాలి.

మా పొలంలో సేంద్రీయ ఎరువులతోనే సంప్రదాయ పద్ధతిలోనే చెరుకు పండిస్తున్నాం. మా చెరువు కింద మిగతా రైతులకంటే మాదే బలమైన పైరు. ఒక ఎకరా 45 టన్నుల పైనే అయ్యింది ఈసారి. మేము నల్లబెల్లాన్ని చెరుకు పాల నుండి బెల్లంపట్టే వరకు 4–5 సార్లు వడగట్టి, కొంత ఆముదం వేసి మురికిని తీసేసి ముద్దలు బదులు పౌడరు చేసి ప్యాకెట్లలో అమ్ముతున్నాం. మా భార్య ఉమాగారి చొరవతో కొంత కోయంబత్తూరు ఆయుర్వేద ఫార్మసీ వారికి, మధురైలో గాంధీ ఆశ్రమం వారికి, పాండిచ్చేరిలో అరబిందో ఆశ్రమం వారికి పంపాం. కానీ వారు చెల్లించే రేటు అంత ఆశాజనకంగా లేకపోయింది కిలో 9 – 10 రూపాయలు మా శ్రమకు ఖర్చుకు గిట్టుబాటు కాలేదు. ఇది ఆకర్షణీయం కాదు. చివరికి పుదుచ్చేరిలో అరబిందో ఆశ్రమం వారు కిలో 15 రూపాయలు లెక్కన చెల్లించేదానికి ఒప్పుకున్నారు. సారాయికి పోయే నల్ల బెల్లం కూడా ఆ మధ్య రేట్లు బాగానే పోయాయి. (2004–2005లో కిలో 15 రూ.లు కూడా అమ్మింది). కానీ ఈ మధ్య సంవత్సరం పంటలపై దేశ వ్యాప్తంగా రేట్లు పడిపోయాయి. ఇప్పుడు నల్లబెల్లం కిలో 7 రూపాయలు లెక్కన పోతున్నది. అదీ అతికష్టంపైన. ఇప్పుడు మా బెల్లం మంచి రేటు అమ్ముతోంది. "హరే రామ హరే కృష్ణ" సంస్థవారు (ఇస్కాన్) ఒక సేంద్రీయ రైతుల సమావేశంలో బెంగుళూరులో కలిశారు. "మీ దగ్గర ఎంత ఉన్నా తీసుకుంటాం" అన్నారు. ఆయన సహకారంతో బయట పడ్డాం. ఎందుకంటే ఒక్కసారి సాధారణ పంట బెల్లం ఒక్క ఎకరా వేసినా 4 టన్నుల దాకా వస్తుంది అంత బెల్లం ఎవరు తీసుకుంటారు? కాబట్టి చెరుకు సేద్యంలో చాలా తగ్గించేయాలనే నిర్ణయానికొచ్చాం. మా ఒక్కరికైతే ఇప్పుడుండే ఇస్కాన్ మార్కెట్ చాలు. కానీ మరో నలుగురు రైతులు మా బాటలో నడిస్తే ... అంత బెల్లం ఎక్కడ అమ్మేది? ప్రజలు చక్కెరకు అలవాటు పడి పోయారు. చక్కెర ఎంత హానికరమో ఆరోగ్యానికి ఎంత చెడో, బెల్లం ఎంత మేలో శాస్త్రజ్ఞులు గొంతు చించుకొని చెబుతున్నారు.

అయినా ప్రజలు (అంతెందుకు మనమే!) చక్కెర బదులు బెల్లం వాడరు? ఎందుకంటే బెల్లానికి ఒక రకమైన వాసన వుంటుంది. పైగా రంగు తెల్లగా రాదు. మరి రంగు కొంత తక్కువైనా ముందు వాసన తగ్గేట్టు చేయగలమా? కొంత ఆలోచిస్తే సాధ్యమేనని తెలిసింది. బెల్లం పాకాన్ని చాలా మెల్లగా యంత్రంతో 24 గంటలు తిప్పితే అది "క్రిస్టల్స్"గా తయారవుతుంది. తాటి బెల్లాన్ని చక్కెర చేసేది ఈ పద్ధతిలోనే. ఖండసారి, చక్కెరలో కూడా ఇదే పద్ధతి. ఈ యంత్రాలు చిన్న సైజులో తెచ్చి ప్రయత్నం చేయాలన్నా పెట్టుబడి ఒకటి, రెండు లక్షలు అవుతుంది.

చిత్తూరు జిల్లాలో చెరువులు, బావులకిందే నీటి వసతి వ్యవసాయం జరుగుతుందని ముందే చెప్పాం. (ఈ ప్రాంతానికి త్వరలో తెలుగు గంగ, భవిష్యత్తులో హంద్రీనీవా,

గాలేరు - నగరితో నీరు రానున్నయన్నకల!) ఈ వ్యవసాయంలో డబ్బు రావాలంటే రైతులకి వేరే దారిలేకే ఒక పైరు వరి చేయడం, రెండవ పైరు చెరుకు వేయడం. అలవాటు చేసుకున్నారు.

మనం చెరకు మానేసి అంతే ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలేవైనా వేయాలి - మామిడి వగైరా - లేదా చెరుకు వేయదలిస్తే శ్రీ సురేష్ దేశాయి కర్ణాటకలోని బెలగాం ప్రాంతంలో జొన్న పంట కయ్యే అంత నీరుతో చెరుకు పండించే పద్ధతిలోనైనా చేయాలి. అప్పుడు నీరు ఆదా అవుతుంది. ముందు పండిన చెరుకు నుండి తినే బెల్లాన్ని ఎలాగైనా తయారు చేయాలి. లేదంటే అంతా నల్లబెల్లంగా సారాయి కాచటానికి వెళ్తుంది!

నేను కొందరు రైతులను మా ప్రాంతం నుండి దేశాయిగారి తోటకి తీసుకు వెళ్దామనుకుంటున్నాను. అలాగే, బెల్లం పాకాన్ని ఖండసారి చక్కెర లాగా తయారు చేసే ప్రయత్నాలు చేయదలిచాను. ఇంకో పద్ధతి "లక్నో పద్ధతి" అంటారు. 4 అడుగులకి ఒక 3 అడుగుల గుంత గొట్టి అందులో 2 కన్నుల చెరకు విత్తనం 16 మొక్కలు పేర్చటం. గుంత, గుంతకు సత్తువ వేసి, డ్రిప్ ఇరిగేషను (బిందు సేద్యాన్ని) చేయడం. ఇలా చేస్తే ఎకరాకు 100 నుండి 130 టన్నులు దిగుబడి (సాధారణంగా ఎకరాకు 60 టన్నులు వస్తే గొప్ప) రాబట్ట వచ్చునని చక్కెర ఫ్యాక్టరీ శాస్త్రజ్ఞులు చెప్పారు - ఈ ప్రయత్నం కూడా కొంత చేసి చూద్దామని నాకు కోరికగా వున్నది.

అయితే ఇప్పటికే బెల్లానికి, చక్కెరకి గిట్టుబాటు ధర దొరక్క, కూలీలతో ఇబ్బంది పడలేక చాలా మంది రైతులు తమ చెరువు కింద భూమిని మామిడి తోటలుగా మార్చేస్తున్నారు. కొన్నాళ్లకు చిత్తూరు జిల్లాలో మొత్తం మామిడితోపులే కనబడతాయేమో!

## అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి :

ఏ వస్తువుకైనా మూడు రకాల ఖర్చులుంటాయి. ముడిసరుకుల ఖర్చులు, తయారి ఖర్చులు, రవాణా ఖర్చులు వ్యవసాయం విషయంలో ముడిసరుకుల ఖర్చులు అంటే విత్తనాలు, ఎరువులు, మందులు, నీటి సరఫరా (బోరుబావి వగైరా) ఖర్చులు. తయారీ, ఖర్చులు అంటే దున్నకాలు, కూలీలు, యాజమాన్యపు ఖర్చులు, పంట నూర్పిడి, బస్తాలలో నింపుట వగైరా. ఈ మధ్య రవాణా ఖర్చులు బాగా పెరిగిపోతున్నాయి. అదే సమయంలో వరి పంటకు ఉత్పత్తి విలువ ప్రతిఏడు స్థిరంగానైనా వుంటుంది, లేదా తగ్గుతోంది. అనుబంధం 1లో ముగ్గురు రైతుల ఖర్చులు చూడండి. అలాగే వేరుశనగ మెట్ట పంటగానూ నీటిపారుదల పంటగానూ అనుబంధం 2లో చూడండి. అలాగే చెరుకు పంట ఖర్చు మా ప్రాంతంలో ఇద్దరు రైతులది అనుబంధం 3లో ఇచ్చాం. ఇలా ఏ పంట వేసినా అన్ని ఖర్చులూ లెక్కవేస్తే రైతుకు అంతా నష్టమే నన్నది స్పష్టమౌతుంది. భారీ పంట నష్టాలపుడు ధరలు ఆకాశాన్నంటుతాయి. ఉత్పత్తి పుష్కలంగా వున్నపుడు ధరలు

పాతాళానికి పోతాయి. ఉదా బెల్లం రేటు పది – పదిహైదు సం।ల కింద ఉన్నరేటు ఈ మధ్య వరకు వుండింది. (150 కిలోలు 1050 రూ.లు) ఈ మధ్య ఎన్నికల హడావిడిలో అమాంతంగా పెరిగాయి. (నాటు సారా కోసం). వరి ధాన్యం మూట (75 కిలోలు) సాధారణ రకాలు బస్తా రూ. 450 నుండి 550 దాటలేదు. పది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. మరో పక్క లేబరు ఖర్చులు, డీజిలు ఖర్చులు అన్నీ రెట్టింపు అయ్యాయి. అమ్మకపు ధరలు పెరగకుండా ఉత్పత్తుల ధరలు, రవాణా ఖర్చులు పెరగడంతోటి రైతులు అప్పుల పాలౌతున్నారు. ఇదొక రకమైన దోపిడి. అందుకే అన్ని ఉత్పత్తి విలువల్లో వ్యవసాయోత్పత్తుల విలువ దేశ స్వాతంత్ర్యమప్పుడు సగానికి పైగా వుండేవి ఇప్పుడు అయిదో వంతుకి పడిపోయింది.

ఖర్చులు పెరగటం, గిట్టుబాటు ధరలు రాక పోవడంతో చాలా మంది రైతులు ఎక్కువ లాభాలు ఇవ్వగల కొన్ని వాణిజ్య పంటలు, ముఖ్యంగా కూరగాయలు, టమోటా, వంకాయ, మిరప వగైరా లేదా కొన్ని ప్రాంతాల్లో పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ ఈ పంటల్లో ధరలు స్థిరంగా వుండవు. ఒక సీజనులో ఆకాశాన్నంటితే ఆ లాభాలు చూసి పరిసర రైతులంతా గుడ్డిగా ఆ పంటలే వేస్తారు. మరుసటి సీజనులో అధిక ఉత్పత్తితో కోసే ఖర్చులు కూడా రాకుండా ధరలు పడిపోతాయి. దీనికి రెండు పరిష్కార మార్గాలున్నాయి. ఒకటి : ప్రభుత్వం ఇటువంటి పరిస్థితులకని ఒక ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం. ధరలు పడిపోయినపుడు మార్కెట్టులో గిట్టుబాటు ధరకు భారీగా కొనుగోలు చేయడం. రెండు : రైతులు తమ పంటను దూరపు మార్కెట్లలో అమ్ముకునేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం. రైతుల వైపు నుండి గ్రామ, మండల, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రతి పంట పండించే రైతులు సంఘంగా ఏర్పడి రాష్ట్ర, దేశ స్థాయిలో ధరలు ఎలా వున్నాయి, ఉత్పత్తి ఎలా ఉన్నదన్న సమాచారం బట్టి పంట ఉత్పత్తిని జిల్లాల వారీగా, మండలాల వారీగా స్థిరీకరించే ప్రయత్నం చేయవచ్చు.

ముఖ్యంగా ఒక సీజనులో మంచి ధర పలికితే (కిలో 10 నుండి 12 రూ.లు) టమోటా పంట ద్వారా ఒక ఎకరానికి రెండు – మూడు లక్షలు సంపాదించవచ్చు. (అనుబంధం నాలుగు చూడండి) ఆ తరువాత 3 – 4 సం।లు ధర రాక పోయి అప్పుల పాలైనా ఆశగా బాగా పండిన సీజను గురించే ఆలోచిస్తారు రైతులు.

ఏ పంట వేసినా గిట్టుబాటు ధర రాకపోవడం ఈ మధ్యన రైతులకు సర్వ సాధారణమైపోయింది. అంతే కాదు, పండించిన పంటను ఇతర రాష్ట్రాలకు పంపాలంటే ఎన్నో పర్మిట్లు కావాలి. కాబట్టి నాబోటి వారు బెల్లం బెంగుళూరు కాని, పాండిచ్చేరిగాని పంపదలచుకుంటే మందులకని వాడుతున్నారనో లేక దానం కింద ఇస్తున్నామనో, వ్యాపారానికి కాదని ఒక డిక్లరేషను రాసి ఇవ్వాలి. ఐదో, పదో దారి ఖర్చులకు వారి డ్రైవర్లకు ఇవ్వాలి. అప్పుడే ఇబ్బంది లేకుండా మన సరకు పొరుగు రాష్ట్రానికి చేరగలుగుతుంది.

బియ్యం రైతులు పంపాలంటే కూడా పర్మిట్టు వుండాలంటారు! రైతే పండించే పంటకు గిట్టుబాటు ధర వుండదు. వేరే ప్రదేశంలో అమ్ముకుందామంటే ఎన్నో ఆంక్షలు!

## లాభదాయకంగా అనువైన వ్యవసాయం :

సంప్రదాయ వ్యవసాయం కాకుండా ఆధునిక పద్ధతుల్లో (ఇందులో క్రిమి సంహారక మందుల వాడకం, రసాయనిక ఎరువుల వాడకం కూడా వుండవచ్చు) కూడా పండించవచ్చును (మార్కెట్టు బట్టి). కొత్త, కొత్త పంటలు వేసి మంచి లాభాలు గడించవచ్చని మదనపల్లి (చిత్తూరు జిల్లా)లో మా మిత్రులు యమ్.సి.వి. ప్రసాద్ గారు చేసి చూపిస్తున్నారు. ఆయన చదివింది ఇంజనీరింగు. కానీ వారి తండ్రి గారైన ఒకనాటి కమ్యూనిస్టు నాయకుడు పద్మనాభ రెడ్డిగారి స్ఫూర్తితో (మొదట ఆ ప్రాంతంలో టమోటా పంట వేసిన వారు) సుగంధ నూనెల ఉత్పత్తి మొదలెట్టారు. లెమన్ గ్రాస్, పల్మరోసా, వట్టివేరు వగైరాలు. ఈ పంటలు ఎలా పండించాలో బెంగుళూరులో ప్రభుత్వ పరిశోధనాలయంలో స్వంతంగా పరిశీలించి ఈ పంటలు తమ పొలంలోనే పండించటమే కాకుండా పరిసరాల్లో రైతులని ప్రోత్సహించి, వారు పండించిన పంట నుండి నూనె తీసేందుకు ఒక యంత్రాన్ని తానే ఏర్పాటు చేశారు.

బజారులో 12 లక్షల నుండి 18 లక్షలు చెప్పిన యంత్రాన్ని - ఒక పాత రైల్వే ఇంజను బాయిలర్ కొని అంతా ఆరు లక్షల రూపాయల్లోనే తయారు చేశారు! ఇప్పుడాయన అమ్ముతున్న సుగంధ నూనెలకు విదేశాలలో మంచి గిరాకి వుందట! మంచి లాభాలు వస్తున్నాయట. ఆయన చేసిన ప్రయత్నాలకు ముగ్ధులై వ్యవసాయ శాఖవారు ఈ మధ్యనే ప్రధాన మంత్రిగారి చేతుల మీదుగా ఢిల్లీలో బహుమానం కూడా ఇప్పించారు.

మేం చెప్పే సిద్ధాంతానికి కొంత భిన్నమైన ఏ దారిలోనైనా సరే రైతు బాగుపడితే మంచిదే. పది రూపాయలు సంపాదించి ఈ సమాజంలో తిరిగి గౌరవంగా బతికితే చాలు అదే పదివేలు! కానీ నాకు మాత్రం సందేహమే ఈ విషయంలో.

ఒక టమాటా సేద్యాన్నే తీసుకుందాం. మన అనుబంధం 4 ప్రకారం 2007లో టమోటా పంట వేసిన చిత్తూరు జిల్లా, సోమల మండలం, నెల్లిమందనివాసి శ్రీకరణం ధనుంజయులు నాయుడు ప్రకారం అతనికి ఎకరాకి ఖర్చు 52 వేలైతే సుమారు ఒకటిన్నర లక్షల రూ.లు (కిలో 6 రూ.ల లెక్కన 35 టన్నుల పంట ఆదిత్య హైబ్రిడ్ విత్తనంతో) నికర ఆదాయం వచ్చింది. రెండున్నర ఎకరాకు ఆయన లెక్క ప్రకారం (కొన్ని ఖర్చులు లెక్కచేయరు) 6 లక్షలు వచ్చింది.

ఈయన 5 బోర్లు వేశారు. ఒక్కో బోరుకు 35 వేలు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం ఒక్క బోరులోనే నీరు వస్తుంది. (కరువులో కూడా ఒక ఎకరం పారగలదు). 12 హార్సు పవరు మోటారుతో నీరు తోడుతున్నారు

ఒక్కసారి ఆరు నెలలు టమోటా పంట వేస్తే మళ్లీ 2 సంవత్సరాలు వరి మడికానీ వేరుశనగ కానీ వేయాలి భూమి పుంజుకోవటానికి. కొందరు చెరువు మట్టి తోలి మళ్లీ సంవత్సరానికే కూడా వేస్తారు.

ధనుంజయలు నాయుడు ప్రతి సంవత్సరం తన పొలంలో రెండు ఎకరాలు ఎక్కడో ఒక చోట టమోటా వేస్తూ వుంటారు. గత 5 సంవత్సరాలుగా వారికి దక్కిన రేట్లు కిలోకి ఈ విధంగా వున్నాయి. 2003లో రూ. 4-4.50, 2004లో 10/- 14/-, 2005లో 5-6/-, 2006లో 0.50 నుండి 3/- వరకు, 2007లో 6/- నుండి 10 /- వరకు.

కానీ అందరికీ ధనుంజయులు నాయుడిగారి అదృష్టం దక్కక పోవచ్చు వారి నెల్లిమంద గ్రామంలో సుమారు 750 ఇళ్లున్నాయి. ఇందులో సగం మందికి అనగా ఒక 400 మందికి బోర్లు, బావులు ఉండవచ్చు గత 30 సంవత్సరాలలో వారి అంచనా ప్రకారం వారంతా సుమారు 900 బోర్లు వేసి వుండవచ్చు. వీటిలో ఇప్పుడు కేవలం 200 బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. కరువు తీవ్రమైతే పనిచేసేబోర్ల సంఖ్య 100కి పడిపోవచ్చని వారు అంటున్నారు. ఇప్పుడు మనమే చిన్న లెక్క వేద్దాం. 900 బోర్లు అంటే వారి లెక్కనే ఒక్కో బోరుకు సగటున 35 వేలు చొప్పున ఇది రూ. 3.15 కోట్ల పెట్టుబడి! ఇందులో 700 బోర్లు (78 శాతం) ఎండిపోయాయి. అంటే రూ. 2.45 కోట్లు పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరే! ఆ రైతుల భవిష్యత్తు ఏమిటి? ఇక ధనుంజయులు నాయుడుగారి లాంటి మిగిలిన 200 బోర్లు వున్న రైతుల వ్యవసాయం ఎంత కాలం సాగుతుంది?

## ప్రపంచ వాణిజ్య సంస్థ - రైతుల భవిష్యత్తు

నేడు ప్రపంచ వాణిజ్య సంస్థ తలుపులు బార్లా తెరిచేశారు. స్వేచ్ఛగా మన దేశంలోకి ఏ వస్తువైనా దిగుమతి చేసుకోవచ్చు, ఎగుమతి చేయవచ్చు. ఒక సిద్ధాంతంగా చూస్తే వారి సూత్రం బాగానే వుందనిపిస్తుంది. ఏ దేశంలో కూడా ఎటువంటి వస్తువుకు కూడా సబ్సిడీలుగానీ ప్రోత్సాహకాలు గానీ ఇవ్వకూడదు. అప్పుడే పోటీ ప్రపంచంలో వస్తువు ధర న్యాయంగావుండి వినియోగదార్లకు ఎక్కడైనా సరే చవకగా దొరుకుతాయి. ఇది బజారు సంస్కృతిలో మొదటి సూత్రం. కానీ ఇది ప్రతిపాదించిన అభివృద్ధి చెందిన దేశాలే దీనిని ఉల్లంఘిస్తున్నాయి. వారి దేశాల్లో తయారయ్యే వస్తువులకి వివిధ రకాల సబ్సిడీలు, ప్రోత్సాహకాలు రకరకాల పేర్లతో అనుమతిస్తున్నారు. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇస్తున్న ప్రోత్సాహకాలను మాత్రం నిర్ణీత కాలంలో ఎత్తివేయాలని వత్తిడి చేశారు. ఈ మోసం ముందు తెలియకున్నా తరువాత గ్రహించి భారత దేశం, బ్రెజిల్ వంటి దేశాల నాయకత్వాన మూడవ ప్రపంచ దేశాలు అడ్డు తిరిగాయి. అయినా ఇప్పటికీ చాలా వస్తువులు స్వేచ్ఛా వాణిజ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల్లో నుండి భారీ సబ్సిడీలతో వస్తూనే వున్నాయి.

విదేశీ మార్కెట్లలో వీటి కారుచౌక అమ్మకాల వల్ల మన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, ధరలు బాగా దెబ్బతిన్నాయి.

ఉదాహరణకు : చక్కెర, పత్తి, గోధుమలు, వంట నూనెలను భారీగా దిగుమతి చేసుకునే స్థాయికి ఇవ్వాళ దిగజారాం. రెండు సంవత్సరాలుగా ధాన్యం స్టాకు కొరత ఏర్పడి భారీ దిగుమతులు చేసుకోవలసి వచ్చింది. అదీ మన రైతులకు చెల్లించే రేటుకన్నా రెట్టింపు చేసి! విదేశీ మార్కెట్లో చక్కెర ధరలు పడిపోయి ఒక సంవత్సరం స్టాకు మన దగ్గర నిలవ వుండిపోయి రైతులకు, చక్కెర ఫ్యాక్టరీలకు గిట్టుబాటు ధర లభించక గత రెండు సంవత్సరాలుగా (2006-07) అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పత్తి రేట్లు అంతర్జాతీయ మార్కెట్లో, భారీ సబ్సిడీలతో అమెరికా నొక్కి పెట్టి వుంచడంతో మన పత్తికి గిట్టుబాటు ధర దొరక్కుండా పోయింది. బోరు బావుల సేద్యం వల్ల, రసాయనిక మందులు, ఎరువుల వల్ల పంట ఖర్చు విపరీతంగా పెరగటంతో తేయాకు, పత్తి రైతులు అప్పుల్లో మునిగి పోయారు. దిక్కుతోచక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్ గారు ఆ మధ్య విదర్భ (మహారాష్ట్రలో) ప్రాంతంలో ఎక్కువగా పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అక్కడికి వెళ్ళారు. 8 వేల కోట్ల భారీ సహాయ ప్యాకేజీ రైతాంగానికి ప్రకటించారు. కానీ దాంట్లో రెండు కీలక విషయాలు లేవు. 1) పత్తి పంటకు గిట్టుబాటు ధర హామీ. 2) బ్యాంకుల్లో అప్పుల మాఫీ. "అదొక్కటి అడక్కు" అన్నట్లుగా వారి సహాయ ప్యాకేజీ వుంది.

ఇది కేవలం మన దేశంలోనే కాదు. అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా ఖండాలలోని అన్ని దేశాల పరిస్థితి ఇంచుమించు ఇలాగే వుంది. ఈ ఊబిలో చిక్కుకున్నాక మనం ఎలా బయట పడగలమన్నది నేడు ఒక పెద్ద సమస్య. ఇది పెద్ద సవాలు.

## నిర్వాసితుల పునరావాస సమస్యలు :

ఇందులో మరో చారిత్రక సత్యం దాగి వుంది. మనం (అన్ని దేశాలు) ఎంచుకున్న అభివృద్ధి పంథాలో ప్రకృతి సహజవనరులైన ఇనుము, బొగ్గు, పెట్రోల్, డీజిల్, గ్యాసు, ఇతర ఖనిజాలు విపరీతంగా వాడడం, పట్టణాలు, ఫ్యాక్టరీలు బాగా పెరగడం, వ్యవసాయ ఉత్పత్తుల రేట్లు, పరిశ్రమలు, సేవా రంగంలో పెరిగే విధంగా పెరగకపోవడం, వ్యవసాయ రంగం నుండి మనుషులు (అనగా రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు), సంపద ఇతర రంగాలకు తరలిపోవడం, పల్లెలు ఖాళీ కావడం, పట్టణాలు కిక్కిరిసిపోవడం జరుగుతోంది. ఇది ఒక చారిత్రక సత్యం. ప్రతి యొక్క దేశంలో ఇదే జరిగింది. జరుగుతోంది. దీనినే "అభివృద్ధి" అంటున్నారు. మన దేశంలో ఈనాటి పరిస్థితి ఏమిటంటే "దేశ సంపద"లో వ్యవసాయం వాట గణనీయంగా తగ్గిపోతున్నది.

గత 50 సంవత్సరాలలో ఇంచుమించు 50 శాతం నుండి 20 శాతం కంటే తక్కువగా అయిపోయింది కానీ వ్యవసాయంపై ఆధారపడ్డ జనాభా మాత్రం అంతగా తగ్గలేదు. ఇంకా 60 శాతంపైనే వున్నారు. "వీరంతా వెళ్ళిపోతారు! వెళ్ళిపోవాలి" అంటారు పాలక ఆర్థిక శాస్త్రవేత్తలు! వారి వ్యవసాయం, ఇతర చేతివృత్తులు అన్నీ వదులుకోని ఏ డ్రైవరు ఉద్యోగమో, వాచ్‌మెన్ ఉద్యోగమో లేదా వెల్డింగు మెకానిక్ షాపులోనో కొత్తగా పని నేర్చుకుని చేరాలి. లేదంటే ఇప్పటికే అంతా ఆటోమేటిక్ యంత్రాలతో జరుగుతున్న నిర్మాణ పనుల్లో, రోడ్డు పనుల్లో అవసరమైన కొద్ది మంది హమాలీలలో తామూ ఉన్నామని క్యూ కట్టాలి. లేదా టౌన్లలో ఫుట్‌పాత్‌లపై బిచ్చమెత్తుకోవాలి.

రానున్న 20 సంవత్సరాల్లో "అభివృద్ధి" చక్రాల కింద నలిగిపోతున్న, పల్లెల నుంచి తరిమివేయబడుతున్న "నిర్వాసితుల" సమస్య దేశంలోకెల్లా అతి ప్రధాన సమస్యగా మారనున్నది. ఎంతవేగంగా "అభివృద్ధి" జౌతుందో అంతేవేగంగా "నిర్వాసిత" భూతం మనల్ని అన్ని కోణాల నుండి వెంటాడుతుంది.

"డబ్బు ఇచ్చేస్తే పోతుంది కదా" లేక "భూమికి భూమి" ఇవ్వచ్చు గదా అని సులభంగా చెప్పేస్తారు "అభివృద్ధి" కాముకులు. కానీ నిర్వాసిత సమస్య చాలా సున్నితమైనది. 1982లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులను అధ్యయనం చేశాము

వ్యవసాయ విద్యాలయ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొ। కె.ఆర్. చౌదరి గారి నాయకత్వాన ఈ పరిశోధన జరిగింది అందులో వెలుగులోకి వచ్చిన విషయాలు. 3 సం।ల తరువాత మరోసారి వారి పరిస్థితిని మళ్ళీ వాళ్ళ తరపునే అధ్యయనం చేశాము. అప్పుడు వెలువడ్డ వివరాలునీ పట్టికలో చూడండి.

1) "శ్రీశైలం ప్రాజెక్టు" రూపకల్పనలోను, నిర్మాణంలోను అందులో ఇమిడి వున్న యావత్ సమస్యలను సరిగా పరిగణనలోకి తీసుకోకుండా ఎంతో మూర్ఖంగా ప్రవర్తించింది ప్రభుత్వం.

2) పునరావాసాన్ని, నష్టపరిహారాన్ని డబ్బుతో సరిపెట్టేందుకు ప్రయత్నించారు. ఆ లెక్కలు వేయటంలో కూడా నిర్వాసితులకు వ్యతిరేకంగా ఏక పక్షంగా చేశారు.

3) నష్టపరిహారం వంతుల వారిగా ఇవ్వటం (ఇళ్లకొకసారి, మాగాణి భూములకొకసారి; మెట్ట భూములకొకసారి) పునరావాసానికి అడ్డంకిగా మారింది.

4) నష్టపరిహారం ఇవ్వటం అంతా ముడుపుల మయంగా మారింది.

5) పెద్ద, ధనిక రైతులు వారు పోగొట్టుకున్న ఇళ్ళకు, భూములకు ఒక మోస్తరుగా నష్టపరిహారం రాబట్టుకోగలిగారు. పేదవాళ్ళు అంతగా నష్టపరిహారం రాబట్టుకోలేకపోయారు.

6) నిర్వాసిత సమస్యలు, పునరావాసం, నష్టపరిహారం అంచనాలకు రావటంలో ప్రజలను ఏ విధంగానూ భాగస్వాములు చేయలేదు.

7) ఎవరో కొద్దిమంది తప్పితే, అత్యధిక భాగం నిర్వాసిత ప్రజలకు (శ్యాంపిల్‌లో 95 శాతం) భూ సేకరణ చట్టం యొక్క వివిధ అంశాల గురించి ఎవ్వరికీ తెలియదు. ప్రజలకు చట్టం గురించి తెలపటానికి ప్రభుత్వం ఏ విధంగానూ ప్రయత్నించలేదు. తద్వారా నిర్వాసిత ప్రజలు "చట్టరీత్యా మోసం" చేయబడ్డారు కూడా!

8) చివరికి నిర్వాసితులను వారి ఇళ్ల నుండి వెళ్ళగొట్టడానికి ప్రభుత్వం పోలీసు జులుంను అత్యంత భయంకరంగా వాడవలసి వచ్చింది.

9) ప్రభుత్వం దగ్గర 27,871 నిర్వాసితుల కుటుంబాలకు సంబంధించి పునరావాస పథకమంటూ ఏదీ లేదు.

## మూడు సంవత్సరాల తరువాత నవంబరు 1984లో పరిస్థితి ముందే సర్వే చేసిన 15 గ్రామాల నుండి 9 గ్రామాల్లో 253 కుటుంబాల పరిస్థితి ఇలా వుంది.

1) 1981 మే-జూన్‌లో పోలీసుల సహాయంతో బలవంతంగా నెట్టివేయబడిన నిర్వాసితులు వారు ముందున్న గ్రామాలకు 2-3 కి.మీ. దూరంలోనే నివాసం ఏర్పరచుకున్నారు. ఈ స్థలాలు కూడా అప్పటికప్పుడు అత్యవసరంగా ఎంచుకున్న ప్రదేశాలు.

2) గ్రామాల్లోని ముఠాలు. గ్రూపులు బట్టి పలు గ్రామాలు 2-3 స్థావరాలుగా విడిపోయాయి.

3) నిర్వాసితుల ఆదాయం 8 సంవత్సరాల్లో 75 శాతం తగ్గిపోయింది. సాగు చేయగల భూమి తగ్గిపోవటమే దీనికి మూలకారణం. గతంలో సంవత్సరానికి 256 రోజులు పనిదొరికేది. ఇప్పుడు అది 59 రోజులకి పడిపోయింది.

4) నది ఒడ్డంతా ముంపుకి గురి కావటంతో పశువులకి మేత, వంటకి ఎండు కట్టెలు దొరకటం గగనమైపోయింది.

5) నిర్వాసితుల పాత ఇళ్లకు ఇచ్చిన నష్టపరిహారం మార్కెట్టు విలువలో 23 శాతం కూడా లేదు. పాత ఊళ్ళో 81 శాతం రాతికట్టడాలైతే కొత్త ప్రాంతంలో అవి 53 శాతానికి పడిపోయాయి. 70 శాతం మంది ఇళ్లను అప్పు చేసి కట్టుకున్నారు.

6) మాగాణి భూములు దాదాపు అంతా (84 శాతం) పోయాయి. కానీ మెట్ట భూముల్లో 40 శాతం దక్కాయి. మార్కెట్టు విలువలో 20 శాతం (అయిదో వంతు) కూడా నష్టపరిహారంగా ఇవ్వలేదు. పొరంబోకులు, పట్టాలు లేకుండా సాగు చేసుకుంటున్న వారికి ఎటువంటి నష్టపరిహారమూ దక్కలేదు.

7) ప్రభుత్వం వారు వంతుల వారీగా ఇచ్చిన నష్టపరిహారాన్ని (ఇంట్లకొక్కసారి, మాగాణికొక్కసారి, మెట్టకొకసారి) 26 శాతం పాత అప్పులు తీర్చటానికి వాడుకున్నారు. సగం మంది (50 శాతం) ఇంటిఖర్చులకి, పెళ్ళిళ్ళకు వాడేశారు. 20 శాతం మంది (అయిదో వంతు) ఇళ్లు కట్టుకోవడానికి వాడారు. కేవలం 4 శాతమే కొంత చేను నేలలు కొనేందుకు ఉపయోగించారు.

8) పెద్ద రైతుల అప్పులు మూడు రెట్లు పెరిగాయి. వ్యవసాయ కూలీల అప్పులు అయిదు రెట్లు పెరిగాయి.

9) స్థానిక లాయర్ల సహాయంతో దాదాపు నిర్వాసితులందరూ (ఇళ్ళ విషయంలో 85 శాతం, భూమి విషయంలో 90 శాతం) వారికిచ్చిన నష్టపరిహారాన్ని సవాలు చేస్తూ 20,137 కేసులు మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లా కోర్టుల్లో వేశారు. ఇప్పటి వరకు తీర్పు వచ్చిన 3,353 కేసుల్లో ప్రభుత్వం వారు ఒక్కటి కూడా నెగ్గలేదు! ఇప్పటి వరకు ఇచ్చిన తీర్పులను బట్టి ప్రభుత్వం వారు ఇంకా రూ. 35 నుండి 90 కోట్ల దాకా నిర్వాసితులకు నష్టపరిహారంగా అదనంగా చెల్లించవలసి వుంటుంది. కానీ ఇందులో 25 నుండి 30 శాతం లాయర్లు, ఇతర బ్రోకర్లు కాజేస్తున్నారు మిగిలినవి అప్పులు కట్టడానికి లేక ఇంటి అవసరాలకు వాడుతుంటారు. ఈ పెంచిన నష్ట పరిహారం వల్ల నిర్వాసితుల జీవన విధానంలో పెద్దగా మార్పు రాకపోవచ్చు.

నిర్వాసితుల సమస్య అన్నపుడు మనం సాధారణంగా వారికున్న ఆస్తులు లెక్క పెడతాం. ఆస్తులతో పాటు వారి దేవాలయాలు, పూర్వులను పూడ్చి పెట్టిన స్థలాలు, తరతరాలుగా తిరిగిన ప్రదేశాలు, అలవాటు పడిన వాతావరణం, నీరు, మనుషులు, జాతులు అన్నింటినీ పూర్తిగా కానీ పాక్షికంగా కానీ వదులుకోవాల్సి వస్తుంది. ఇది చాలా భయంకరమైన అనుభవం. అనుభవించే వారికే తెలుస్తుంది ఆ బాధ. ఆస్తి ఉన్నవారి పరిస్థితే ఎంత దిగజారిందో పై అధ్యయనాల్లో వివరించాం. ఆస్తి లేనివారి పరిస్థితి మరీ దారుణం. మూటాముల్లే సర్ధుకుని వలసపోవటమే దిక్కు. ఇందులో రకరకాల వారుంటారు. వ్యవసాయ కుటుంబాలపై తరతరాలుగా ఆధారపడి వున్న పెద్దగా భూమిలేని వ్యవసాయ కూలీలు, వివిధ రకాల చేతి వృత్తులవారు, చాకలీ, మంగలి, వడ్రంగి, కంసాలి, సాలెవారు, కుమ్మరివారు, చిన్న చిన్న అంగళ్ళు నడుపుకునేవారు. ఇటువంటి వారి గతేంగాను? నిజమే పశ్చిమ బెంగాలు పరిశ్రమల శాఖ మంత్రి అన్నట్లు "ఫ్యాక్టరీలు ఆకాశంలో కట్టలేము కదా!" కానీ "జన సాంద్రత తక్కువగా వున్న ప్రాంతాన్ని ఎంచుకోవచ్చుగదా, నీటి వసతి అంత ఎక్కువగా లేని ప్రాంతాలు చూసుకోవచ్చుగదా" అని మనం అంటాం. కానీ నీటి సౌకర్యం, రోడ్డు, రవాణా సౌకర్యం, లేబరు లభ్యత వంటి కారణాలు అన్ని ఎంచుకొనే కొత్త ఫ్యాక్టరీలు నిర్మిస్తారు. నీ ఫ్యాక్టరీలు వస్తే ఉద్యోగాలు స్థానికులకి వస్తాయనుకుంటే అది వట్టి భ్రమే! స్థానికులకి -,వారికున్న పలుకుబడి బట్టి, నైపుణ్యత బట్టి వాచ్‌మెన్, తోటమాలి, సెక్యూరిటీ గార్డు ... అటెండరు పోస్టుల కంటే ఉన్నతమైనవి ఏవీ వచ్చే అవకాశాలు అంతగా వుండవు. అవి కూడా ఫ్యాక్టరీ యజమాని ఊళ్ళోని మనుషులకే లేదా వారి కులస్థులకే దక్కుతాయి. స్థానికులకు ఉద్యోగాలు యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంటాయి.

ఫ్యాక్టరీ రావడంతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనీ, స్థానికులకు ఉద్యోగాలు దొరుకుతాయని మురిసిపోయి వాటిని ఆహ్వానించాక నిజాలు తెలుసుకున్న సంఘటనలు కోకొల్లలు. ఏ ఫ్యాక్టరీ చుట్టుపక్కల పల్లెల్లోనైనా విచారించండి. నిజం తెలుస్తుంది. అంతే కాదు ఇంకో చేదు నిజం వుంది. అదేమిటంటే ఈ ఫ్యాక్టరీలలోని వ్యర్థ పదార్థాలు, ముఖ్యంగా రసాయనిక పదార్థాలు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలైతే మరీ భయంకరం, చుట్టు పక్కల భూగర్భ జలాలను, చెరువు నీరుని కలుషితం చేసేస్తాయి. ఆ నీరు తాగటానికి కానీ, మరే విధంగా వాడటానికి కానీ పనికిరాదు! మీరు ఎపుడైనా హైదరాబాదు శివార్లలో శివరాంపల్లి - కాటేదాన్ ప్రాంతాలకు వెళ్ళి (రైలులో వస్తుంటే వాసనలు భరించలేం) చూడండి. మరో వైపు బాలానగర్ నుండి సంగారెడ్డి (మెదక్ జిల్లా) వరకు ఇంచు మించు ఇదే పరిస్థితి.

"మరి ఈ కాలుష్యం గురించి దానికొక నియంత్రణ మండలి వుంది కదా వారేం చేస్తున్నారు?" అని మీరు అడగొచ్చు. "దిక్కులేని వాడికి దేవుడే దిక్కు". అడిగిన వారి నోళ్లను నొక్కివేస్తారు, నాయకులను కొనేస్తారు లేదా తొక్కేస్తారు. కోర్టులకు వెళ్ళినా పెద్దగా

పరిస్థితిలో మార్పులేదు. కొన్ని పల్లెలకు కొంత తాగు నీటి సౌకర్యం కలిగించారు అంతే. "మరి ఫ్యాక్టరీలు పెట్టాం! అభివృద్ధి చేశాం!" అని గత 50 సంవత్సరాలుగా వలసలు వచ్చిన కోస్తా ఆంధ్ర వారుగానీ, రాయలసీమ నేతలుగానీ, ఇతర ప్రాంతాల వారు గానీ అంటే స్థానికులకు కోపం రాదా? "జైతెలంగాణా" అని ఎందుకు అనరు? (ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో కూడా పరిస్థితి దీనికి భిన్నంగా వుండదు. అది వేరే విషయం అనుకోండి).

భూగర్భజలాల కాలుష్యమే కాదు సిమెంటు ఫ్యాక్టరీలు వస్తే నల్గొండ జిల్లాలోలాగా వాటి నుండి వచ్చే ధూళి పంటలపై పడి దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. కాలుష్య నియంత్రణ సామాగ్రి వుంటుంది. కానీ దాన్ని సరిగా వాడరు. అడిగే వాడెవడు. బొగ్గుగనుల్లో, విద్యుత్ ఉత్పాదనల్లో పరిస్థితి మరీ భయంకరం. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇటువంటి విషయాల్లో ప్రజల్లో చైతన్యం ఎక్కువై అక్కడ కాలుష్యం వెదజల్లే ఫ్యాక్టరీలను పెట్టనివ్వరు. పెట్టినా అనేక నిబంధనలు, నియంత్రణలతో వుంటాయి. ఎందుకొచ్చిన అవస్థ అని అక్కడి పారిశ్రామిక వేత్తలు ఇటువంటి పరిశ్రమలన్నీ మన దేశానికి, చైనాకు తరిలించేస్తున్నారు. ఇక్కడైతే, ముఖ్యంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళలోనైతే, వారికి ఎవరూ అడ్డు వుండరు. పైగా లేబరు చాలా చవక. వారి దేశంలో అయ్యే ఖర్చులో 10 శాతం కూడా వుండదు. అందుకే ఈ రోజు శరవేగంతో మన దేశంలోనూ, ఇంకా స్పీడుగా చైనాలోనూ "అభివృద్ధి" జరిగిపోతోంది.

ఇపుడిప్పుడే (మన కంటే 20 సంవత్సరాలు ప్రగతిలో ముందుకు దూసుకు పోయిన) చైనాలో కాలుష్యం గురించి నొప్పులు మొదలయ్యాయి. దాదాపు మూడవ వంతు గ్రామాల్లో స్వచ్ఛమైన మంచినీరు దొరకటమేలేదు!

మరి మనకి, వారికి "అభివృద్దే" వద్దా? ఫ్యాక్టరీలు, ఆధునిక యంత్రాలు వద్దా?" ఈ ప్రశ్నకు ఇపుడు జవాబు చెప్పను. మరో రెండు సమస్యలు వివరించాలి. ఒకటి నీరు, రెండవది విద్యుత్.

## కరెంటుతో కన్నీరు

*"కొంత మందిని కొన్ని రోజులు ఏమార్చవచ్చును. అందరినీ కొన్ని రోజులు ఏమార్చవచ్చును. కానీ అందరినీ అన్ని రోజులూ ఏ మార్చలేము"*
*(అబ్రహాం లింకన్- అమెరికా దేశ అధ్యక్షులు)*

రైతు వ్యవసాయం చేసేటపుడు వర్షంకోసం ఎదురు చూస్తాడు. వర్షం పడిన ండుమూడు రోజుల్లోనే మడక గట్టి దున్నుతాడు. ఆ భూమిలో సరిపడా తేమ మూడు నాలుగు రోజులే వుంటుంది. తేమ ఎక్కువైనా ఇబ్బందే, తక్కువైనా ఇబ్బందే. మొదటి దున్నకంలో గడ్డి, పిచ్చి మొక్కలు ఎండిపోతాయి. తరువాత ఎరువు తోలుతాడు. మరల

మరోసారి వర్షం పడినపుడు ఎరువు వేసి బాగా కలియ దున్నేస్తాడు. వేయాలనుకున్న పంట వేస్తాడు. మరల కొద్ది రోజులకి వానపడితే మొలకేసిన మొక్క పుంజుకుంటుంది. అప్పుడు కలుపు తవ్వాలి, తీయాలి. ఆ తరువాత 15-20 రోజులకొక్కసారి వాన పడుతూ వుంటే (లేదా నెలకొకసారి అయినా) రెండు మూడు వానలు పడితే మంచి పంటే వస్తుంది. ఈ తతంగమంతా 4-5 నెలలు నడుస్తుంది. అంతా వరుణ దేవుని కటాక్షం. ఇందులో ఒక తడి తప్పిపోయినా చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి చేతికి రాదు!

అందుకే రైతు సాగునీటి కోసం అంత తాపత్రయం పడతాడు. ఏదో బావిలోనో, బోరులోనో, చెరువులోనో, కాలువలోనో అంత నీరు వుందంటే రైతుకు ఎక్కడ లేని విశ్వాసం వచ్చేస్తోంది. ఏవేవో పంటలు వేసేయాలనుకుంటాడు. అందరికంటే ఎక్కువగా ఒకేసారి సంపాదించాలనుకుంటాడు. తన కష్టాలన్నీ తీర్చేసుకోవాలని అనుకుంటాడు.

పెద్ద ప్రాజెక్టులు కట్టేటపుడు కాలువల కింద అంతా ఆరు తడిపంటలు వేస్తారని, లేదా అవసరమైన నీరే కాలువ ముందున్న వారు వాడుకుని మిగతాది వదిలేస్తారని అంచనాలు వేస్తారు ఇంజనీర్లు. కానీ వాస్తవంగా జరిగేదేమిటి? కాలువ తలభాగానున్న వారు అత్యధికంగా నీరు వాడేయటం, అవసరానికి మించి వాడటమే కాకుండా ప్లానులో లేని పొలాలకు కూడా నీరు అందించటం వల్ల, ఎక్కువ నీరు వాడే పంటలు చెరుకు, వరి అధికంగా వేయటం వలన, మురికి నీరు పోయే వసతి సరిగా లేకపోవడం వల్ల (డ్రైనేజి సమస్య) కాలువ చివరి భాగంలో వుండే వారికి సరిపడంత నీరు సమయానికి అందదు! పేరుకు ఫలానా ప్రాజెక్టు కింద కాలువ భూములని చెప్పుకోవల్సిందే తప్పితే నాలుగైదు సంవత్సరాలకు కానీ ఒక చుక్క నీరు రాని ప్రాంతాలు అనేకం! (నాగార్జున సాగర్ కుడి కాలువ కిచ్చినంత సౌకర్యం ఎడమ కాలువ కింద భూములకు ఇవ్వలేదనేది కూడా ప్రత్యేక తెలంగాణ వాదనలో ఒక ముఖ్య అంశం). ఈ విధంగా ప్రతి ప్రాజెక్టు కింద సాగుబడి అంచనాలకు వాస్తవ పరిస్థితికి విపరీతమైన వ్యత్యాసం వుంటుంది.

మన రాష్ట్రంలో ఒక సంవత్సరం వర్షాలు బాగా పడితే మరో రెండు సంవత్సరాలు ఒక మోస్తరుగాను, మరో రెండు సంవత్సరాలు కరువుగాను వుంటోంది. అంటే 5 సంవత్సరాల్లో, 2 సంవత్సరాలు కష్టకాలమే. ప్రాంతాన్ని బట్టి ఈ 2 సం ల కరువును ఎదుర్కోవలసి వస్తుంది.

మా చిత్తూరు జిల్లాలో నదులు లేవు. కాలువ కింద సేద్యం దాదాపు సున్నా, అంతా చెరువులకింద సాగు లేదా బావులు, బోర్ల కింద సాగు. ఇప్పుడైతే మొత్తం సాగు భూమిలో మూడవ వంతు నీటి ఆధారంతో నడుస్తోంది. మిగతా భూమిలో మెట్ట పంటలు - వేరుశనగ, టమోటా, జొన్నలు (పశువుల మేతగా), మామిడితోటలు పెడుతున్నారు. పూర్వం ఈ భూమిలో తినేందుకు జొన్నలు, సజ్జలు, కొర్రలు పండించేవారు. ఆదాయం తక్కువ, రిస్కు ఎక్కువ, శ్రమ ఎక్కువ అని వీటి నుండి పంటల మార్పిడి జరిగింది.

చిత్తూరు జిల్లా అంతా అడవులు, గుట్టలతో నిండి వుంటుంది. కొండల నుండి వర్షపు నీరు కిందికి వస్తుంది. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఒక చెరువు నిండాక దానికింద మరో చెరువు నిండేటట్లు పెద్దలు (ఎక్కువగా విజయనగరం రాజుల కాలంలో) తవ్వించారు. ఈ చెరువుల కిందే ప్రధానంగా నీటి ఆధారిత వ్యవసాయం జరుగుతుంది. 1987లో చిత్తూరు జిల్లాలోని చెరువుల వ్యవస్థపై ఉమా శంకరి అధ్యయనం చేసి ఈ విషయమై వ్యాసాన్ని కూడా ఆంగ్లంలో ప్రచురించారు. దాని సారాంశమే ఇక్కడ ఇస్తున్నాను.

పూర్వ కాలంలో ప్రతి చెరువుకి ఒక గ్రామ పెద్ద వుండేవారు. చెరువుకు అవసరమైన మరమ్మతుల గురించి ఒక దళితుడైన "నీరుగట్టి" వుండేవాడు. అతని సలహా మేరకు - గ్రామ పెద్ద చెరువును సందర్శించి కావలసిన మరమ్మతులు, ఒరవ కాలువలో పూడిక తీయటం, చెరువు కట్ట, తూము మరమ్మతులు, చెరువు కింద కాలువలు అన్ని పొలాలకు పారేటట్లు చూడటం వగైరా పనుల కోసం చెరువు కింద రైతుల నందరినీ సమావేశపరిచేవారు. మరమ్మతులకయ్యే ఖర్చుకు దశ వందం (10 శాతం) అని కొంత భూమిని కేటాయించేవారు. అందులోని పంటల ఆదాయం, చెరువు కింద రైతులతో శ్రమతో మరమ్మతులు జరిగేవి. అందరినీ పిలవడం, ఒకచోట చేర్చటం, ఇవన్నీ నీరుగట్టి పనులు. వర్షాలు బాగా కురిసినపుడు చెరువు తూములు అన్నీ మూయటం, తీయటం కూడా నీరుగట్టి పని. చెరువు నిండేటప్పుడు అర్ధరాత్రి వేళైనా సరే చెరువులో దిగి తూము మూసేవారు. చెరువు నిండాక నీరు పొలాలకు ఎలా పోవాలో నిర్ధారించే వ్యక్తి కూడా నిరుగట్టియే. ముందు చివర నున్న పొలాలకు నీరు వదుల్తారు. ఆ తరువాత మెల్లిమెల్లిగా కట్ట కింద వరకు వస్తారు. నీరు చాలనపుడు రైతులనందరినీ సమావేశపరచడం నీరుగట్టి డ్యూటీనే. చెరువు పినపెద్దగారి ఆధ్వర్యాన ఈ సమావేశం జరుగుతుంది. అందరూ కూడ బలుక్కుని ఎంత నీరుతో ఏ పంటలు కాపాడవచ్చో చర్చిస్తారు. పంటల సాగు ఇంకా మొదలెట్టకపోతే అందరూ నీరు తక్కువ అవసరమయ్యే పంటలు వేయాలో వద్దో చర్చిస్తారు. ఈ విధంగా ఒక నిర్ణయానికి వచ్చాక నీరుగట్టికి ఆ విషయం చెబుతారు. వారి నిర్ణయం ప్రకారం ఆ దమాషాలో అతను చెరువుకింద పొలాలకు నీరుకడుతాడు. నీరుగట్టి ఏ పొలానికి నీరు కడతాడో ఆ రోజు ఆ రైతే అతనికి భోజనం పెట్టాలి. పంటలో ఒక మోపు, రెండు మోపులు కయ్యబట్టి ధాన్యం, కసుపు అతనికివ్వాలి. చెరువు నిండినపుడు పంటలు బాగా పండాలని గంగమ్మకు పొట్టేలును బలిస్తారు. దాని తల నీరుగట్టికే చెందుతుంది ఆ రక్తాన్ని అతను పొలాలపై జల్లుతాడు.

చెరువు నీరు చాలనపుడు ముఖ్యంగా పంట చివరి దశలో స్వంత పొలంలో బావి తవ్వి అందులో ఊరే నీరుతో ఒకటి, రెండు తడులు 'అడ్జస్టు' చేసుకోవటం రివాజుగా మారింది రైతులకు. 1950 దశకంలో ఆయిలు మోటర్లు వచ్చాయి. ఆయిల్ వేసి నడిపే ఈ మోటార్లతో, ఎద్దుల అవసరం లేకుండా, కపిల అవసరం లేకుండా, కొద్ది గంటల్లోనే

అవసరమైన నీరంతా తోడేయవచ్చు! ఏమి హాయి! 1960 దశకంలో ధనిక, మధ్య తరగతి రైతులు ఈ పనికి పూనుకున్నారు. క్రమేపీ బావిలో ఊరే నీరు కన్నా తోడే నీరు ఎక్కువైపోయి బావుల్లో నీళ్లు అడుగంటి పోయాయి. అప్పుడు రిగ్గులు పెట్టి బావిలో అడుగుకున్న రాళ్ళు పగులగొట్టే సంస్కృతి వచ్చింది. తద్వారా ఊటలు మళ్లీ పెల్లుబుకి బావి నీటితో నిండేది. కొంత కాలానికి నీరు ఎక్కువగా తోడేయటంతో రిగ్గులు కూడా పనిచేయటం మానేశాయి.

అంతలోనే కరెంటు మోటార్లు వచ్చాయి. కరెంటు చార్జీ తక్కువగా వుండటం, బటన్ నొక్కితే నీరు వచ్చి దూకటంతో రైతులు, ముఖ్యంగా 1970 దశకంలో ఎక్కువగా కరెంటు మోటార్ల వెనకాల పడ్డారు. కరెంటు చార్జీలు కట్టలేక, పంటల ఖర్చు ఎక్కువైపోయి, గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల కరెంటు చార్జీ ఉచితం చేయాలని ఆందోళన చేశారు. (తమిళనాడు రైతు నాయకుడు నారాయణస్వామి నాయుడు మా ప్రాంతం వచ్చినపుడు అసలు కరెంటు చార్జీలే కట్టవద్దని సలహా ఇచ్చారు). అపుడపుడే రాజకీయాలలోకి వచ్చిన ఎన్.టి.ఆర్ రైతుల బాధలు విని, వారికోరిక మేరకు కరెంటు చార్జీని ఆమాంతంగా సంవత్సరానికి ఒక హార్సు పవరుకు రూపాయలు 50కి తగ్గించేశారు. అంటే ఒక రైతుకు ఒక బావికింద 3 హార్సు పవర్ మోటార్‌కు 3 వేల యూనిట్లు కరెంటు ఖర్చు అయితే అతడు 150 రూ.లు కడితే సరిపోతుందన్నమాట! అంటే 5 పైసలకే యూనిట్ కరెంటు! దీని ద్వారా చాలా వెసులుబాటు అయినందుకు రైతులు ఎంతో సంతోషించారు. దీని పర్యవసానంగా ఏమయ్యిందంటే విచ్చలవిడిగా బావుల్లో నీరు తోడి వాడడం వల్ల బావుల్లో నీరు శరవేగంగా ఇంకిపోయింది. అప్పుడు బావుల్లో బోర్లు వేసే టెక్నాలజీ వచ్చింది. విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టి రైతులు పోటా పోటీగా బావుల్లో బోర్లు వేశారు. నా బావిలో 50 అడుగులు వేస్తే, పక్క బావిలో నీరు కిందకు పోయేది. కాబట్టి అతను 100 అడుగులు వేయాల్సి వచ్చేంది. దానితో నేను 150 అడుగులు వేయించాల్సి వచ్చేది. అ విధంగా ఒక చెరువు కింద పోటా పోటీగా బోర్లు వేయడంతో నీరు మరింత పాతాళానికి పోయింది. మరింత పెద్ద మోటార్లు, మరింత కరెంటు వాడకంతోటి ఇంతవరకు జరిగింది.

1980 దశకం వచ్చేటప్పటికి మరో కొత్త టెక్నాలజీ వచ్చింది. ఇది నేరుగా నేలపై వేసే బోరు! బావులు అవసరం లేదు. రైతులు ఆరు అంగుళాలు ఎడమ ఉండేలా ఈ బోర్లు విచ్చలవిడిగా వేశారు. మెట్టనేలల్లో కూడా వేయడం మొదలెట్టారు. మొదట్లో పుష్కలంగా నీరు వస్తుంది. 4-5 సం।లు గడిచిన తరువాత అప్పు తీర్చేలోగా బోరు ఎండిపోయేది. మళ్ళీ మరింత లోతు మరోచోట (లేదా అదే చోట వేసేవారు). రెట్టింపు ఖర్చుతో మళ్ళీ ఇంకా శక్తివంతమైన బోరు మోటారు తేవాలి. దానికి ఉన్న కరెంటు చాలదు. అధికారులు మరో ట్రాన్సుఫార్మరు పెట్టాలి. ఈ విధంగా చిత్తూరు జిల్లా రైతులకు ప్రభుత్వం కరెంటు ఉచితంగా ఇచ్చినా కొన్ని వేల కోట్ల అప్పుల్లో మునిగి పోయారు. ఇప్పుడు కరువు వస్తే వారికి ఇంక తాగే నీరు కూడా కరెంటు లేనిదే దొరకదు. అందులో ఫ్లోరైడు కాలుష్యం

అయిన బావులు ఎన్నో? ఎవరు చూశారు? మా ఒక్క చిన్న పంచాయితీలో 9 కు।గ్రామాలు వున్నాయి. అన్ని కలిపి 250 కుటుంబాలకన్నా ఎక్కువ లేవు. ఈ చిన్న పంచాయితీలో సగం కుటుంబాల భూముల్లో బావులు, బోర్లు వున్నాయి. అయినా కూడా సంఘ సేవకులు నగేష్ గారు వేసిన అంచనా ప్రకారం బావులు, బోర్లు తవ్వకంలో మా పంచాయితీలో ముఖ్యంగా గత 30 సం। లలో సుమారు 2 కోట్లు పైబడి ఖర్చు చేశారు! ఎక్కడిది ఇంత డబ్బు? అంతా అప్పులే. ప్రైవేటు అప్పులు. ఎందుకంటే బోరులో నీరు పడితేనే బ్యాంకు వారు అప్పిచేందుకు ముందుకు వస్తారు. 2-3 రూపాయల వడ్డీకి కొంత, బంధు మిత్రుల వద్ద కొంత తీసుకుని బోరు వేస్తారు. ఈ రోజు ఒక్క బోరుకు 50 వేల రూపాయల దాకా అవుతుంది. ఆ తరువాత దానికి తగిన మోటార్లు 30 వేలు నుండి 50 వేలు దాకా అవుతాయి. మరీ సెకండ్ హాండ్ లేదా (నాణ్యత లేనిది) మట్టంగా మోటారు కొంటే, ఎంత లేదన్నా మోటారు, పైపుల ఖర్చు 20 వేలకు తగ్గదు. ఒక 3 సం।లు ఒక ఎకరా చెరకు పంట బాగా పండితే అప్పు తీర్చేయవచ్చుననే ఆశతో రైతు బోరు వేస్తాడు. ఆ తరువాత శాశ్వతంగా తన కష్టాలు పోతాయని ఆశిస్తాడు. కానీ ఈ ఆశ ఎండమావి లాంటిది. ఒక బోరు సాధారణంగా 4-5 సం।లకన్నా ఎక్కువ కాలం పనిచేయదు. (చేసిందంటే అదృష్టమే!) అంటే పాత అప్పుతీరేటప్పటికి కొత్త బోరు కోసం అప్పుడే టెండరు వస్తున్నదన్నమాట. ఈసారి మరింత లోతు, మరింత శక్తివంతమైన మోటరు కావాలి!

ఈ ప్రాంతంలో 40-50 సం।ల క్రితం 30-40 అడుగుల్లో వుండే నీరు మెల్లి మెల్లిగా 100 - 200 - 400 - 500 అడుగుల లోతుకు పోయింది. వినాశకాలం విపరీతబుద్ధి అంటే ఇదేనేమో!

రాష్ట్రంలోని రైతుల ఆత్మహత్యల్లో ప్రధాన నిందితుడు "బోరుబావి" అని వేరే చెప్పనక్కర్లేదు. రెండవ నిందితుడు మార్కెట్‌లోని "గిట్టుబాటుధర".

## "వాటర్ షెడ్ పథకం"

ఈ సమస్య నుంచి బయట పడటానికి చంద్రబాబు హయాంలో పూర్తిగా కేంద్ర నిధులతోనే భారీ ఎత్తున "వాటర్ షెడ్" కార్యక్రమాన్ని చేపట్టారు. అంటే ఒక నీటి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమన్నమాట. పైన గుట్టల్లోనే నీటిని ఎక్కడికక్కడ చిన్న చిన్న రాతి కట్టడాలతో అరికట్టి, నీటి ప్రవాహానికి అడ్డంగా కందకాలు తవ్వించి, గుట్టల నుండి నీరు, మట్టి కొట్టుకుపోకుండా అరికట్టి, చెట్లు నాటి, ఆ నీటిని మెల్ల మెల్లగా చెరువుల్లోకి, వంకల్లోకి, వాగుల్లోకి వచ్చేట్లు చేయడం. అవసరమైతే రైతుల పొలాల్లోనే అక్కడక్కడ చిన్న చిన్న కుంటలు తవ్వటం, మెట్ట ప్రాంతాల్లో ఇటువంటి కుంటలు వేయటం వంటి పనులకు ప్రాముఖ్యత ఇచ్చారు. ప్రధమంగా తన ఊరిలో అన్నాహజారే గారు ఈ విధంగా భూగర్భ జలాల అభివృద్ధితో అద్భుతాలు సృష్టించారు. ఒక్క మనిషి,

మొత్తం ఊరినే మార్చేశాడు. ఎప్పుడూ తాగుబోతుల అడ్డాగా వుంటూ, కరువు కాటకాల మధ్య నలిగిపోతున్న మహారాష్ట్రంలోని "రాలేగాం సిద్ధి" గ్రామానికి ప్రపంచమంతటా పేరు ప్రఖ్యాతులు తెచ్చారు చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు మూడుసార్లు ఆ ప్రాంతాన్ని చూసి వచ్చి, ముగ్దుడై నీటి పరివాహక అభివృద్ధి కేంద్రాలను పెద్ద ఎత్తున (ఆరు వేల కోట్ల రూపాయలతో) మన రాష్ట్రంలో చేపట్టారు.

ఉద్దేశం మంచిదే అయినా నాలుగు డబ్బులు కనబడే ప్రాంతంలో ముందు ఎవరుంటారు?

ఇదీ అలాగే జరిగింది స్థానిక చోటా, బడా రాజకీయ నాయకులు పోటాపోటీగా వారి వారి ప్రాంతాలకు ఇష్టమొచ్చినన్ని "వాటర్ షెడ్" ప్రోగ్రాములు కేటాయించుకుని వారే కాక వారి కుటుంబ సభ్యులపేరనో స్వచ్ఛంద సంస్థల పేరునో రిజిష్టరు చేసుకుని, వాటర్ షెడ్ ప్రాంతంగా వారి ప్రాంతాన్ని గుర్తించవచ్చో లేదో కూడా అధికారులు సరిగా పరిశీలన చేయకుండానే "వాటర్ షెడ్" వేసి హడావుడిగా డబ్బులు స్వాహా చేశారు. కొన్ని పనులు స్వచ్ఛంద సంస్థలకిచ్చారు. వారిలో కూడా కొందరు డబ్బును స్వాహా చేశారు. మరికొందరు మాత్రం బాగా చేశారు. చివరికి 10, 20 శాతం పనులు ఒక మోస్తరు నుండి బాగా జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. వీటిలో భూగర్భ జలాలు బాగా పెరిగినాయని తెలుస్తున్నది. (వాసన్ నివేదికలు). ఈ దిశలో మా ఊరి చెరువులో మేం కొంత కృషి చేశాం.

కానీ పెరిగిన జలాలను పెద్ద రైతులే బోర్లుపెట్టి ఎక్కువగా వాడేస్తున్నారనే విషయం వాసన్ సంస్థ అధ్యయనంలో బయటపడింది. మొత్తానికి అనుకున్న లక్ష్యానికి, సాధించినదానికి చాలా వ్యత్యాసం వుండిపోయింది. ఇదే విధంగా రిజర్వు ఫారెస్టులో బీడుగా వున్న ప్రాంతాల్లో స్థానికుల చేత తిరిగి అడవిని అభివృద్ధి చేయడమనే కార్యక్రమం చేపట్టారు. 1970 దశకంలో పశ్చిమ బెంగాల్‌లో బ్రహ్మాండంగా ఫలితాలిచ్చిన ఈ ప్రయోగాన్ని ప్రపంచ బ్యాంకు నిధులతో దేశ వ్యాప్తంగా చేపట్టారు. మన రాష్ట్రంలో కూడా సుమారు వెయ్యి కోట్ల రూపాయలను ఈ ప్రాజెక్టుల కింద ఖర్చు చేశారు. అవినీతిలో కూరుకుపోయిన, సరైన అవగాహన లేని, సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న అటవీ శాఖ ఈ కార్యక్రమాన్ని నీరుగార్చింది. అవగాహన లేని ప్రజలు అడవులను పరిరక్షించటం ద్వారా, భూగర్భ జలాలు పెరిగి తమ బావుల్లో, బోర్లలో నీరు పెరుగుతుందన్న గట్టి నమ్మకానికి రాలేకపోయారు. ఈ ప్రాజెక్టు డబ్బు కూడా సంబంధించిన అధికారుల, నాయకుల జేబులు నింపే కార్యక్రమంగానే సాగింది. అక్కడక్కడా మాత్రం కొంత బాగానే జరిగాయి. అవి ప్రపంచ బ్యాంకు అధికారులకు, పై అధికారులకు చూపించేందుకు పనికి వచ్చాయి. ఇందులో మా వూరి దగ్గర నగేష్‌గారు చేపట్టిన భగీరథ ప్రయత్నం ఒకటి. దీని గురించి రెండవ భాగంలో వివరిస్తాను.

## "జలయజ్ఞం"

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గారు అధికారంలో లేనపుడు రాయలసీమను కరువు నుండి బయట పడేసేందుకు ఎన్నో పథకాలను, ప్రతిపాదనలను పరిశీలించారు. తరువాత 2004లో 1500 కిలోమీటర్ల పాదయాత్ర ద్వారా రైతుల వాస్తవ పరిస్థితిపై మంచి అవగాహన తెచ్చుకున్నారు. అయన రైతుకి నీరు కీలకమని నిర్ధారణకు వచ్చి తన "జలయజ్ఞం" పథకాన్ని ప్రకటించారు. దీని ప్రకారం రాష్ట్రంలో కీలకమైన, ఎన్నో ఏళ్లుగా నానుతున్న 36 ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి 65 లక్షల ఎకరాల భూమికి సాగునీరు, 5 సంవత్సరాల్లోగా అందించాలని దీనికి 45 వేల కోట్ల రూపాయలు ఖర్చు కాగలవని అంచనా వేశారు. ఆధునిక భగీరధుడని రకరకాలుగా వారిని పొగడని వారులేరు. కానీ ఈ ప్రాజెక్టులు మొదలు పెట్టగానే తీవ్రమైన ప్రతిఘటనలు మొదలయ్యాయి. పులిచింతలకు ప్రత్యామ్నాయంగా చిన్న ప్రాజెక్టులు, అలాగే పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా మరికొన్ని చిన్న ప్రాజెక్టులు ప్రతిపాదించారు. కాబోయే నిర్వాసితులు ప్రతిఘటించారు. పులిచింతలకు అన్నీ అనుమతులు రావడంతో నిర్మాణం (కొన్ని విమర్శలతో) ముందుకు సాగింది. కానీ పోలవరం అటవీశాఖ, పర్యావరణ, పునరావాస అనుమతుల మధ్య, పొరుగు రాష్ట్రాల వొప్పుకోలు మధ్య సతమతమౌతోంది ఈ జలయజ్ఞం కొంత లోతుగా పరిశీలిస్తే తప్ప జరగబోయే పరిణామాలు అర్థం కావు నేటి వ్యవస్థలో ఎంత సదుద్దేశంతో తలపెట్టినా ప్రాజెక్టుల గతి ఒక్కటే.

1. మొదట్లో వేసే అంచనాలు చాలా ఆకర్షణీయంగా వుంటాయి.
2. ప్రాజెక్టు పూర్తి చేసే సమయానికి ఖర్చు ఐదు నుండి పది రెట్లు పెరగటం సాధారణం. ఆయకట్టు చెప్పినంతగా వుండదు (ఉదా॥ నాగార్జునసాగర్ ప్రాజెక్టు, శ్రీశైలం) ప్రధాన కాలువలు తవ్వినా పిల్ల కాలువలు ఏర్పాటు చేసి వుండరు.
3. డ్రైనేజి వసతి సరిగా వుండదు. (ఉదా ॥ నాగార్జునసాగర్)
4. నాణ్యత లోపంతో పలుచోట్ల పగుళ్ళు, నీరు కారటం గమనించవచ్చు. ముఖ్యంగా కాలువల్లో. (ఉదా : నాగార్జునసాగర్)
5. అడవులు శరవేగంగా నరికివేయడంతో ప్రాజెక్టు మెట్ట ప్రాంతాల్లో ఒండ్రు మట్టి వర్షాలతో శరవేగంగా కొట్టుకువచ్చి అనుకున్న అంచనాకన్నా ఎక్కువగా డ్యామును పూడ్చివేస్తుంది. దీనివల్ల ప్రాజెక్టు కెపాసిటీ చాలా తగ్గిపోయి, త్వరలోనే నిరుపయోగంగా మారిపోతుంది (ఉదా: నిజామ్ సాగర్ ప్రాజెక్టు)
6. అన్నిటికన్నా ముఖ్యమైనది నిర్వాసిత సమస్య – పునరావాసం చర్యలు ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రాజెక్టు కింద కూడా సంతృప్తికరంగా లేవు! నిర్వాసితులు "త్యాగం" చేయాల్సి వచ్చిందే తప్ప లాభపడిన వారులేరు! (మధ్యవర్తులు తప్పితే).

ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారి "జలయజ్ఞం" కూడా సరిగ్గా ఇదే బాటలో నడుస్తోంది. మూడు సంవత్సరాల "జలయజ్ఞం"లో ఖర్చు రెట్టింపు అయ్యింది. ఇప్పుడు లక్ష కోట్లు ఇవ్వండి కోటి ఎకరాలకు నీరు అందిస్తానంటున్నారు ఆయన.

ఒక్క దేవాదుల ప్రాజక్టులోనే 1500 అడుగులు ఎత్తుకు నీరు పంపింగు చెయ్యాలి.

కొంత జాగ్రత్తగా పరిశీలిస్తే తెలంగాణ ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులన్నీ లిఫ్టు ఇరిగేషను (నీరును మోటర్లతో పైకి తోడే) ప్రాజెక్టులే! వీటి ద్వారా అందించే నీరు ఎకరానికి ఎనిమిది వేల నుండి పన్నెండు వేలు ఖర్చవుతుంది. సంవత్సరానికి కేవలం కరెంటు బిల్లు ద్వారా. అంత డబ్బు ప్రతి ఏటా సర్కారు భరిస్తుందా? ప్రభుత్వమేమంటున్నదంటే ఇంత ఖర్చుతో కూడుకున్న నీరు కాబట్టి మొత్తం వ్యవసాయం ఈ సాగునీరు కింద చట్టబద్ధంగా కేవలం డ్రిప్ ఇరిగేషన్ (బిందుసేద్యం) ద్వారానే జరగాలని. ఇది ఆచరణ సాధ్యమేనా? బిందు సేద్యంలో ఉండే సమస్యలు దానికున్నాయి. (కంపెనీల ఏజెంట్ల కమీషన్లు, నాయకుల వాటాలు పోను).

రాయలసీమలో అత్యధిక ప్రాంతం పెన్నార్ నది పరీవాహక ప్రాంతం.

కొంత తుంగభద్ర, కొంత కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో వున్నాయి. మిగిలిన ప్రాంతం వీటిలోకి రావు.

మరి ఎటువంటి పెద్ద నదులు లేని చిత్తూరు, కడప, అనంతపురంలో అధిక భాగం ప్రాంతానికి సాగునీరు పారేదెలా?

రాయలసీమ నాయకులు ఈ పరీవాహక ప్రాంతం వాదనను పట్టించుకోవడం లేదు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి కృష్ణా నది పరీవాహక ప్రాంతం ప్రధానంగా తెలంగాణలో ఉంది. అంతర్జాతీయ నీటి పారుదల సూత్రాల ప్రకారం నీటి పరీవాహక ప్రాంతంలో ఉన్న భూమికి ముందు నీరు అందిన తరువాతే ఇతర ప్రాంతాలకు ఆ నీటిని వాడుకోవచ్చునని తెలంగాణ వాదులు అంటున్నారు.

కృష్ణా "మిగులు" జలాలను మళ్లించి రాయలసీమ జిల్లాలకు సాగునీరు ఇవ్వాలన్నది వారి ఆలోచన. తెలుగు గంగ ద్వారా కడప జిల్లాకు, నెల్లూరు జిల్లాలోని దుర్భిక్ష ప్రాంతాలకూ నీరు అందిచ్చే ప్రయత్నం దీనికి కార్యరూపం. రాయలసీమ రాజకీయ నాయకులు ఎక్కువగా కడప జిల్లా వాళ్లు కావడం వల్ల కృష్ణా జలాల మళ్లింపును పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యంతో ముడిపెడుతున్నారు. కానీ అది కడప జిల్లా, కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతాలకు నీళ్లియ్యగలదే తప్ప రాయలసీమలోని ఇతర ప్రాంతాలకు మేలు చేయలేదు.

అంతే కాక ఈ విధంగా మళ్ళించేవి 'మిగులు జలాలు" మాత్రమే. అంటే కృష్ణానది కింద పరీవాహక ప్రాంతాలైన మహారాష్ట్ర (565 టి.ఎం.సీ) కర్ణాటక (695 టి.ఎం.సీ),

ఆంధ్రప్రదేశ్ (800 టి.ఎం.సీ) విస్తరణలో కృష్ణా నది నీటిని పంచుకున్నాక నికర జలాల దామాషా పోను, అధిక వర్షాలు కురిసిన సంవత్సరం ప్రవహించే మిగులు జలాలన్నమాట. ఈ మిగులు జలాలపైన ఎవరూ ప్రాజెక్టులు మంజూరు చేయరు. కాబట్టి "తెలుగుగంగ" కూడా ఆరున్నర లక్షల ఎకరాలకు నీటిపారుదల మిగులు జలాలతో చేపట్టడం వలన దానికి కేంద్ర సహాయం లేకుండా పోయింది. కొన్ని వేలకోట్ల రూపాయలతో నిర్మిస్తున్న గాలేరు, నగరి, హంద్రీ-నీవాల గతి కూడా అంతే.

దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో కడుతున్న నెట్టెంపాడు, కల్వకుర్తి, శ్రీశైలం ఎడమ గట్టు కాలువలు కూడా మిగులు జలాలతో కడుతున్నవే కాబట్టి వాటి గతి కూడ అంతే.

మిగులు జలాలలపైన ప్రాజెక్టులు కట్టుకునే హక్కు ఎవరికీ లేకున్నా వాటిని వాడుకునే హక్కు ఆంధ్ర ప్రదేశ్‌కు ఉందని బచావత్ అవార్డు అనింది. బచావత్ అవార్డు కాలం, దానితో పాటు ఈ హక్కు 2000 సంవత్సరం నాటికి ముగింపుకొచ్చాయి.

ఆ తరువాత మూడు రాష్ట్రాలు కూడబలుక్కొని నిర్ణయించుకోవాలని మొదటి తీర్మానంలో బచావత్ కమిటీ తేల్చింది. 2000 పూర్తి అయ్యేలోగా తమ వాదన బలంగా వుండాలని మూడు రాష్ట్రాలు శరవేగంతో పలు నీటి ప్రాజెక్టులు వారి వారి రాష్ట్రాలలో నిర్మించుకొనటం ప్రారంభించారు. ఇవన్నీ పూర్తి అయితే ఇపుడు కృష్ణా నదిలో వున్న జలాలను రెట్టింపు చేయనిదే అన్నిటికీ సరిపోవు! పైన వున్న రాష్ట్రాలు నీరు నిలుపుదల చేస్తే కింది రాష్ట్రాలవారు చేసేదేముంది?

ఇపుడు రాజశేఖర్ రెడ్డిగారు అందలం ఎక్కి నాలుగు సంవత్సరాలు అయింది. ఆయన అదృష్టం కొద్దీ ఈ నాలుగు సంవత్సరాలు వర్షాలు బాగా పడ్డాయి. రాబోయే రెండు సంవత్సరాలు అలాగే పడతాయని ఊహించలేం. అప్పుడు వాస్తవ పరిస్థితి అందరికీ అర్థమౌతుంది.

దీనికి రాజశేఖర్ రెడ్డిగారు ఆలోచించిన ఒక మార్గం ఏమిటంటే గోదావరి నుండి పోలవరం ప్రాజెక్టు ద్వారా, దుమ్ముగూడెం ప్రాజెక్టు ద్వారా నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించి, కృష్ణా నది నీటిని ఈ 'మిగులు జలాల' ప్రాజెక్టులకు వాడుకోవడం. ఆ భరోసాతోనే బచావత్ కమీషన్‌కు వారసుడిగా వచ్చిన బ్రజేష్ మిశ్రా కమీషన్ ముందు ఈ మిగులు జలాల ప్రాజెక్టులకు ఏ హక్కులూ కోరబోవడం లేదని చెప్పేశాడు. అయితే ఈ తరలింపు చాలా సమస్యలతో కూడుకున్నది. గోదావరి బేసిన్ జిల్లాల నీటి అవసరాలు తీరకుండ నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించడాన్ని సహజంగానే ఆ ప్రాంతం వారు వ్యతిరేకిస్తున్నారు. కాగా పోలవరంతో పర్యావరణ సమస్యలు, నిర్మాణ సమస్యలు చాలా వస్తాయి. వాటి పరిష్కారం అంత సులభం కాదు.

ఇప్పటికే "జలయజ్ఞం" కింద 'నవరత్న', 'కాంట్రాక్టర్లకు' ఇచ్చిన అడ్వాన్సులు – అవి హైదరాబాదు "రియల్ ఎస్టేటు" వ్యాపారంలో పెట్టుబడులుగా మారటం, రాజకీయ నాయకుల ముడుపులు, పెద్ద కాంట్రాక్టు తీసుకున్న పెద్దమనిషి, పిల్ల కాంట్రాక్టర్లను ఏర్పాటు చేయడం, చివరికి నాలుగోవాడో, ఐదోవాడో అసలు కాంట్రాక్టరుగా పనిజరిపించటం, ఈ కమీషన్ల తంతుతో వాస్తవంగా పని ఎంత క్వాలిటీతో (నాణ్యతతో) జరుగుతున్నదన్నది పెద్ద ప్రశ్న. ఈ అవసరాలకు అనుకూలంగా ప్రాజెక్టుల ఎస్టిమేట్లు ఎప్పటికప్పుడు పెంచేయడం నాయకులకు అలవాటే. చివరికి ఈ అప్పుల భారం భరించాల్సింది ప్రజలే!

ఇక్కడ మరొక చేదు వాస్తవాన్ని మనం గుర్తుంచుకోవాలి. "జలయజ్ఞం" తరువాత మిగిలిన ప్రాజెక్టులు పూర్తిఅయినా కూడా ఇంకా మన రాష్ట్రంలో 40 శాతం సాగు భూమి అనగా కోటిన్నర ఎకరాల భూమి వర్షాధార భూమిగానే మిగిలిపోతోంది! దానిపైన కూడా చాలా మంది పేద ప్రజలు ఆధారపడి వున్నారు. మరి వీరిగతేంకాను? వర్షాధార పంటలు కూడా మనకు అవసరమే! (జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు వగైరాలు) కాబట్టి మన వ్యవసాయ విధానం, రాష్ట్రస్థాయిలోనూ, వ్యక్తిగతంగానూ ఏమి చేయాలనేది కొంచెం క్షుణ్ణంగా ఆలోచించాల్సి వుంటుంది.

## విద్యుత్ విధానం – రైతు జీవితాలతో చెలగాటం

1995లో చంద్రబాబు తన మామగారైన ఎన్టీఆర్‌ని దింపేసి ముఖ్యమంత్రి అయ్యారు. ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అప్పుడు 'రెండు రూపాయలకే కిలో బియ్యం!', '50 రూ.ల హార్స్‌పవర్ విద్యుత్' అంటూ తెలుగుదేశం నాయకులు చంద్రబాబు నాయకత్వంలో ఊరూ, ఊరూ, వీధి, వీధి తిరిగారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా బాగానే నెగ్గారు. ఆ తరువాత ఆరు నెలలు తిరగక ముందే మొత్తం సీను మారిపోయింది. రాష్ట్ర విద్యుత్ బోర్డు వారు ఒక శ్వేతపత్రం విడుదల చేశారు. అందులో వారిచ్చిన లెక్కల ప్రకారం వ్యవసాయానికి విద్యుత్ కేవలం యూనిట్ 3 పైసలు లెక్కన ఇస్తున్నామని సరఫరా ఖర్చు రెండు రూపాయలపైనే ఉన్నదని, 40 శాతం వున్న పరిశ్రమల వాడకం రాను రాను తగ్గిపోయి 28 శాతానికి వచ్చిందని, మరో పక్క ఎన్టీఆర్ వల్ల సాలీనా 50 రూపాయలు హెచ్.పి. రేటు వ్యవసాయ వినియోగం విపరీతంగా పెరిగి 45 శాతం చేరుకుందని, ఈ భారం ఇంక ఎంతో కాలం మోయలేమని, సంస్కరణలు చేపట్టి వ్యవసాయ చార్జీలు పెంచడం తప్ప మరో మార్గం లేదని వాదించారు.

ఆ వెంటనే విద్యుత్ సంస్కరణలు చేపడుతున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రాన్ని అంధకారం నుండి బయట పడేయాలంటే సంస్కరణలు అనివార్యమంటూ ఒక్కసారిగా వ్యవసాయ విద్యుత్ చార్జీలను 8 నుండి 10 రెట్లు పెంచేశారు. (మోటారు స్థోమత బట్టి).

దీనికి ఎలా స్పందించాలో మాకు అర్థం కాలేదు. కాని ఒక్క విషయం మాత్ర స్పష్టం అయ్యింది. పార్లమెంటు ఎన్నికల్లో - అనగా ఆరు నెలల ముందు 50 రూ.ల హార్సు పవర్ విద్యుత్ అన్న నినాదం అపుడే ఎలా మారిపోయింది?! మరీ ఇంత దగానా? ముమ్మాటికీ ఒప్పుకునేది లేదని రైతుల సమావేశంలో అంతా తీర్మానించాం. పెంచిన చార్జీలు తిరిగి పాత రేట్లకు కుదించే వరకు మేం కరెంటు చార్జీలు కట్టబోమని శపథం చేశాం. ఎవరైనా వత్తిడి చేస్తే ఘెరావ్ చేద్దామని నిర్ణయించాం. కానీ విద్యుత్ గురించి ఎప్పుడో చిన్నపుడు చదివాం. వోల్టు, వాట్స్, యాంప్స్ అంటే ఏమిటో కూడా సరిగా తెలియదు. అధికారులతో ఎలా వాదించాలి?

ఇంతలో కొత్త విద్యుత్తు చట్టం ప్రభుత్వం తెచ్చింది, ప్రతిపక్షాలు అసెంబ్లీని బహిష్కరించాక  కూడా. అందులో భాగంగా విద్యుత్ నియంత్రణ మండలిని ఏర్పాటు చేసింది. దీనికి ఒక రిటైర్డు ఐ.ఎ.ఎస్ అధికారిని చైర్మన్‌గా పెట్టారు. (శ్రీ జి.పి.రావుగారు).

మా ఊరి దగ్గర కొత్తకోటలో ప్రముఖ రైతు నాయకులు శ్రీ రాజేంద్రరెడ్డి గారి ఆధ్వర్యాన 'రాష్ట్రీయ రైతు సేవా సమితి" అని పేరు పెట్టి కమీషను వారి బహిరంగ విచారణకు ఒక పిటీషను తయారు చేశాం. వివిధ రైతు సంఘాలు ప్రభుత్వ లెక్కలను ప్రశ్నిస్తూ తయారు చేసిన వాదనలే మా పునాదులు. దొంగతనాన్ని అరికట్టడం చేతకాక నష్టాలు తక్కువగా చూపిస్తూ, రైతుల వాడకం ఎక్కువగా చూపిస్తున్నారనేదే మా ప్రథమ వాదన. ఒక రిటైర్డు ఇంజనీరు సహకారంతో సంవత్సరానికి 200 రోజులు, రోజుకు 6 గంటల కరెంటు వాడితే అపుడున్న విద్యుత్ మోటార్ల సగటు (5 హెచ్.పి మోటార్లు) వాడకం ఎంతవుతుందని లెక్కలు వేయించాం. అవి వారు చూపిస్తున్న లెక్కలో సగం కూడా లేదు!

మా తరపున శ్రీమతి ఉమాశంకరిగారు, రాజేంద్ర రెడ్డిగారు మా వాదన వినిపించేందుకు హైదరాబాద్ వెళ్ళారు. పాకాల నుండి మరో నాయకుడు సారంగపాణిగారు కూడావెళ్ళారు. "బహిరంగ విచారణ" కమీషను వారి కార్యాలయంలో జరిగింది. ఒక్క సంఘం నుండి ఇద్దరినే అనుమతిస్తామని అన్నారు. సారంగపాణిగారిని లోపలికి రానివ్వలేదు. అక్కడ ప్రపంచబ్యాంకు ప్రతినిధులు మాత్రం కూర్చుని వున్నారు! ప్రజలను బహిరంగ విచారణలోకి అనుమతించకుండా బ్యాంకు సిబ్బందిని మాత్రం ఎలా అనుమతిస్తారు? ఈ విషయాన్ని మేం రాత పూర్వకంగా కమీషను వారికితెలిపాం. ఉమాగారి ప్రసంగాన్ని కమీషను ఛైర్మన్ మెచ్చుకున్నారు. కానీ ఆ తరువాత వడ్డన మాత్రం తప్పలేదు!

చంద్రబాబు పెంచిన రేట్లకు తోడు కమిషను మరో 60 శాతం పెంచింది! అలాగే గృహ వినియోగదారులకు కూడా విపరీతంగా పెంచింది! దీనితో రాష్ట్రమంతటా నిరసన వెల్లువలు చెలరేగాయి.

పెంచిన విద్యుత్ చార్జీల వ్యతిరేక ఐక్య పోరాటకమిటీ ఒకటి తిరుపతిలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశాం. ఇందులో ప్రముఖ పాత్ర వహించిన సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శిగా వుండిన మాల్యాద్రిగారు అన్ని విధాల కమిటీకి సహకరించి 40 వేల రూపాయలు విరాళాలు సేకరించటంలో కీలకపాత్ర వహించారు. జిల్లా అంతా పర్యటించి సమస్యపై రైతులనందరినీ చైతన్యపరచాలని నిర్ణయించాం. దీనికి ఒక జీపు, టాటా సుమోను ఏర్పాటు చేసుకున్నాం. ఈ ఉద్యమంలో అప్పటికే చురుకుగా ముందుకు దూసుకుపోయిన అరగొండ ప్రాంత రైతాంగం, చిత్తూరు జిల్లా రైతు సమాఖ్య పేరున ఆ ప్రాంతమంతా మంచి పట్టు సాధించారు. కార్యక్రమానికి అరగొండ నుంచే నాంది పలికాం. కార్యక్రమంలో సి.పి.ఎం వారు పాల్గొనకపోగా మాల్యాద్రిగారిని కూడా పాల్గొననీయకుండా చేశారు. సి.పి.ఐ నాయకులు మాత్రం ఉత్సాహంగా పాల్గొన్నారు. (అప్పటికే సి.పి.ఎం., సి.పి.ఐ ఆధ్వర్యాన ఒక ఉమ్మడి రైతు ఉద్యమం వుండగా మరల ఈ కొత్త ఫ్రంటు ఎందుకు అని వారి వాదన. కానీ ఎర్రజెండా కింద కదలటానికి రైతులంతా సుముఖంగా లేరని మా వాదన). మొత్తానికి శ్రీ రెడ్డప్ప నాయుడు గారు, శ్రీ రాజేంద్ర రెడ్డి గారు, నేను టూర్ మొత్తం తిరిగాం. శ్రీ బాలప్పగారు మొదటి రెండు రోజులు వచ్చారు. సి.పి.ఐకి చెందిన మునిరత్నం చాలా ప్రాంతం టూరు ఆర్గనైజు చేశాడు. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా మాకు దారిలో సహకరించాయి.

మేం ఎంతో తిరిగాం, స్పీచ్‌లు ఇచ్చాం గానీ ప్రజలు అంతగాసహకరించి, ముందుకు పోవటానికి వచ్చే విధంగా కదలలేదు. అప్పటి నుంచి 'మీ పరిసర ప్రాంతాల్లోని పల్లెల్లో ఎవరినీ కరెంటు బిల్లులు కట్టవద్దని' ప్రచారం చేశాం. అధికారులువస్తే మేమంతా వెళ్ళి రైతులతో నినాదాలు ఇప్పించి, కొంత హంగామా చేసే వాళ్ళం. వాళ్ళు కూడా మాపై తీవ్ర చర్యలకు పాల్పడలేదు. "రైతులను ఎక్కువ ఇబ్బంది పెట్టవద్దు. ఇస్తే చార్జీలు తీసుకోండి' అని వారికి ఆర్డర్లు. ఈ విధంగా సుమారు రూ. 15 -20 మండలాల్లో (మొత్తం 65 మండలాలకు గాను) మా ప్రభావం నడిచింది. ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి వరకు అని చెప్పవచ్చు. మదన పల్లె ప్రాంతంలో మాకు అంత ప్రభావం లేకపోయింది. (అక్కడ లక్షలు సంపాదించే అవకాశమున్న టమాటో రైతులు ఎంత కరెంటు ఛార్జీలనైనా చెల్లించడానికి సిద్ధంగా వున్నారు!) ఈ విధంగా 9 సం॥రాలు, కాంగ్రెసు ప్రభుత్వం వచ్చేదాక మేము బావులకు ఎటువంటి విద్యుత్ చార్జీలు చెల్లించలేదు.

ఇదేదో గొప్ప పోరాటం అనుకుంటే పొరపాటే. విద్యుత్ చార్జీల బకాయిల జాబితా జిల్లాల వారీగా చూస్తే అత్యధిక మోటార్ల సంఖ్యలో రెండవ స్థానంలో వున్న చిత్తూరు జిల్లా విద్యుత్ బకాయిల్లో మాత్రం 5వ స్థానంలో వుండింది! మొదటి నాలుగు స్థానాలు తెలంగాణా జిల్లాలవి! అంటే మేము అరుస్తూ కట్టలేదు. వారంతా అరవకుండా కట్టలేదు!

రెగ్యులేటరీ కమీషను వారి బహిరంగ విచారణలో మేము యాక్టివ్‌గా రైతుల గొంతు వినిపించాం. హైదరాబాదులోని పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఫర్ ఎలక్ట్రిసిటీ (విద్యుత్‌పై

ప్రజల నియంత్రణ బృందం)కి చెందిన తిమ్మారెడ్డిగారు, రఘుగారు, కుమార్‌గారు వంటి నిపుణుల సహాయంతో విద్యుత్ రంగ సమస్యలపై కొత్తకోటలో, తిరుపతిలో శిక్షణా తరగుతులు ఏర్పాటు చేశాం. వారిద్వారా విద్యుత్ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకున్నాం. ఉత్పాదనలోనున్న సమస్యలు, జరిగిన - జరుగుతున్న అవకతవకలు, ఏటా ఏవిధంగా 400 నుండి 600 కోట్లు 4 ప్రైవేటు విద్యుత్ కంపెనీలకు అనవసరంగా ధారాదత్తం చేస్తున్నది, గ్యాసు లభ్యత లేకున్నా కొత్తగా 1490 మెగావాట్ల సామర్థ్యంతో మరో నాలుగు గ్యాసు ఆధారిత ప్రాజెక్టులకు అనుమతివ్వడం, ఏ విధంగా పైసా పెట్టుబడిలేకుండా విద్యుత్తు ప్రాజెక్టులు పెట్టవచ్చు వంటి వాస్తవాలు తెలిశాయి. ప్రతి సంవత్సరం ట్రాన్సుకో, డిస్కాము వారి లెక్కలపై జనవరిలో జరిగే బహిరంగ విచారణలో పాల్గొనేలా ప్రతి ఏటా 60 - 70 మంది రైతులకు శిక్షణా కార్యక్రమాలు క్రమం తప్పకుండా గత ఎనిమిది సంవత్సరాలుగా జరుపుతూ వచ్చాం. దానివల్ల ప్రతి సంవత్సరం విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణల్లో చిత్తూరు జిల్లా నుండి ఎక్కువగా పిటీషన్లు వచ్చేవి. అంతే కాకుండా నియంత్రణ మండలికి ఏర్పాటు చేసిన సలహా మండలిలో సభ్యులుగా వుండమని 2005 - 06లో మా సంఘాన్ని ఆహ్వానించారు కూడా! మా సంఘం తరపున ఒకటిన్నర సంవత్సరం ఆ పని నిర్వర్తించాను. కానీ ఎందుకో వారు నన్ను అకస్మాత్తుగా వదిలించుకున్నారు 2007 నుండి!

ఆ రోజుకి ఈ రోజుకి (10 సం॥ లుగా) విద్యుత్ సరఫరా చేసే సంస్థలది ఒకే వాదన. మీటర్లు లేని వ్యవసాయ బావుల కింద రైతులు అధికారికంగానూ, అనధికారికంగాను విచ్చలవిడిగా నీరు తోడేస్తున్నారు. అందువల్ల కరెంటు వాడకం ప్రతిఏటా అంచనాలకు మించి ఔతున్నదని. ఇక్కడే ఉన్నది చిదంబర రహస్యం. ఈ రోజుకు కూడా ఏ ట్రాన్సుఫార్మరు కింద ఎన్ని సర్వీసులు వున్నాయి, ఎంతలోడున్నది కచ్చితంగా అధికారులు చెప్పలేకపోతున్నారు! రాష్ట్రంలో నేడు వారు చెబుతున్నటువంటి 3.2 లక్షల అనధికార కనెక్షన్లు, అనధికార లోడు (ఉదాహరణకు 3 హార్సుపవరు సర్వీసు పెట్టుకొని 5 హార్సు పవరువాడటం వగైరా) విషయంలో ఒక ఉద్యమంగా హార్సు పవరుకు వెయ్యి రూపాయలు వసూలు చేసి (ప్రస్తుత చట్టం కిందనే) అన్నీ రెగ్యులరైజు ఎందుకు చేయకూడదు? ఇకపై కొత్త బోర్లను / కనెక్షన్లను కచ్చితంగా నియంత్రిస్తూ ఎందుకు నిర్ణయం తీసుకోకూడదు? ప్రతి ట్రాన్సుఫార్మరుకి మీటరు బిగించితే ఎంత లోడుకి ఎంత కరెంటు వాడుతున్నది తెలిసిపోతుంది. ఓవరులోడు అయిన ట్రాన్సుఫార్మర్ల కింద కరెంటు తక్కువ ఓల్టేజీతో వచ్చి మోటార్లు, ట్రాన్సుఫార్మర్లే కాలిపోవచ్చును. ఈ విధంగా ట్రాన్సుఫార్మర్ల వద్ద మీటర్లు బిగించి ప్రతి నెలా రీడింగ్ తీస్తే ఎంత కరెంటు వ్యవసాయ రంగంలో వాడుతున్నది కచ్చితంగా చెప్పవచ్చును. దొంగతనంగా చేస్తున్న కరెంటు వాడకాన్ని నియంత్రిచవచ్చును. కానీ అధికారులు ఇ[illegible] గట్టి చర్యలు తీసుకొనడానికి వెనుకాడుతున్నారు.

ACC No. 98487
హైదరాబాద్ - 500032.

ఒక వ్యవసాయ మోటారు కనెక్షను అనధికారికంగా వున్నా, తీసుకున్న సర్వీసుకన్నా ఎక్కువ లోడు హార్సు పవరుతో వున్న బోరుబావికి మోటారుకు ఎన్నో వేలు ఖర్చు పెట్టిన రైతుకు మరో రెండు మూడు వేలు లోడు సరి చేసుకునేందుకు అధికారులు, సిబ్బంది వత్తిడి చేయరు. ఎందుకంటే ఇతర వినియోగదారులు ఫ్యాక్టరీలు, ఇళ్ళకు, అంగళ్ళకు చేసే దొంగతనాన్నంతా మీటర్లు లేని వ్యవసాయ వాడకం కింద తోసేయవచ్చు! అలాగే సాంకేతిక నష్టాలు కూడా వ్యవసాయ వాడకం కింద తోసేసి వారి నష్టాలు ప్రతి సంవత్సరం ఎలా తగ్గిపోతున్నాయో తప్పుడు లెక్కలు చూపించుకోవచ్చు! అనధికార సర్వీసులు / లోడు అనుమతించినందుకు సిబ్బందికి రైతు అవసరమైనప్పుడల్లా ముడుపులు ఇస్తూనే వుంటాడు!

జవాబుదారితనం (పై నుండి కింది దాకా) లోపించటం వల్ల ఈ వ్యవస్థ ఇలాగే నష్టాలతో నడుస్తోంది.

చంద్రబాబు పుణ్యమా అంటూ ఆయన వత్తిడితో గ్యాసు లభ్యత గ్యారంటీ లేకుండా, ఒకవేళ సరఫరా చేయకపోతే నష్ట పరిహారం చెల్లించే క్లాజు పెట్టుకోకుండా గ్యాస్ అథారిటీ వారితో వొప్పందం చేసుకోవటంతో ఇప్పుడు 1490 మె.వా. నాలుగు కొత్త గ్యాసు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తికి రెడీగా వున్నాయి. 2005 నుండి వారితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం గ్యాస్ వారికి సరఫరా కాకపోతే వారు వేరే ఇంధనం (నాఫ్తా) వాడుకోవచ్చు. ఆ అధిక ధరకు ఉత్పత్తి చేసే విద్యుత్తును తప్పకుండా మన ట్రాన్సుకో / డిస్కాములే కోనాలి! లేదా స్థిర చార్జీలు చెల్లించాలి. అనగా కనీసం 1020 కోట్లు సంవత్సరానికి!

అధికారంలోకి వచ్చాక రిలయన్స్‌గ్యాసు అయినా మరో 2 సంవత్సరాల వరకు రాదని తెలుసుకుని రాజశేఖర్ రెడ్డి ఈ నాలుగు కంపెనీల వెనకాల పడ్డారు.

ఎన్నో విధాల వేడుకున్నారు. 15 సంవత్సరాల కరెంటు కొనుగోలు ఒప్పందాన్ని 30 సంవత్సరాలకు పెంచుతున్నామన్నారు. ఇంకా ఏవేవో వాగ్దానాలు చేశారు. ఓ.ఎన్.జి.సి వద్ద, ఆయిల్ మినిస్ట్రీ దగ్గర, జి.ఎ.ఐ.యల్ వారి దగ్గర ముఖ్యమంత్రిగారి పప్పులు ఉడకలేదు. రెండు కంపెనీలు కొంత వొప్పుకున్నా మరో రెండు కంపెనీలు కోర్టును ఆశ్రయించాయి. రెండు సంవత్సరాలు వారు స్థిర చార్జీలు అడగకపోయినా ఇప్పుడు అందబోయే రిలయన్సు గ్యాసు (రెట్టింపు ధరతో) 2009 - 10 నాటికిగాని వచ్చేట్లు లేదు!

ఇపుడు చంద్రబాబు తాను చేసిన సంస్కరణల వల్లే విద్యుత్ ఉచితంగా 7 గంటలు వ్యవసాయానికి ఇవ్వగలుగుతున్నారని అంటారు. ఇప్పుడు నాణ్యమైన విద్యుత్ తానే 9 గంటలు రోజుకి ఇస్తాననంటాడు గెలిపిస్తే! కె.సి.ఆర్ తన పార్టీని గెలిపిస్తే రోజుకు 12

గంటలు ఉచితంగా ఇప్పిస్తానంటాడు కరెంటు! అసలు రైతుల సమస్యలు ఉచిత కరెంటుతో తీరిపోతాయా?

మేము మొదట్లో ఎన్టీఆర్ ఇచ్చిన రూ. 50ల హార్సు పవర్ రేటునే డిమాండ్ చేశాం. ఆ తరువాత కాంగ్రెసు పార్టీవారు ఉచిత కరెంటు నినాదంతో ముందుకు వచ్చారు. వారిస్తామంటే ఎందుకు వద్దనాలని మేము వారితో శృతి కలిపాం. ఇంతకీ మా వాదనేమంటే రైతు పొలానికి నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిది. కాని గత 30 సంత్సరాలుగా కాలువల ద్వారా సాగు విస్తారం పెంచలేదు. సాగునీటి వ్యవసాయం పెరిగిందల్లా బావులు, ముఖ్యంగా బోరు బావుల నుండే. ఈ రోజు 45 శాతం సాగు నీటి వ్యవసాయం బోర్లు, బావులకిందే జరుగుతున్నది రాష్ట్రంలో. ఇవి ప్రభుత్వ గణాంకాలు. మరో అడుగు ముందుకేస్తే కాలువలకింద వ్యవసాయం ప్రభుత్వ ఖర్చుతో జరుగుతుంది. బావులకింద వ్యవసాయం రైతు స్వంత పెట్టుబడితో (వడ్డీతో, అప్పులతో) పెట్టినది. ఒక్కోదానికి (మోటారు, పైపులు వగైరా) లక్ష రూపాయలు సగటున ఖర్చుకు లెక్కేస్తే ఈ పెట్టుబడే కేవలం మన రాష్ట్రంలోనే 24 లక్షల సర్వీసులకు గాను 24 వేలకోట్ల రూపాయలు అన్నమాట! ఇది వాస్తవం. కాలువల కింద రైతుల నుండి సంవత్సరానికి ఎకరానికి 400 రూ.లు రెండు పంటలకు వసూలు చేస్తున్నపుడు స్వంత పెట్టుబడి పెడుతున్న బావులు - బోర్ల కింద సేద్యం చేస్తున్న రైతులకు ఉచితంగా కనీసం కరెంటైనా ఎందుకు ఇవ్వకూడదు? (ఎలాగు మార్కెట్లో పంటలకు ఒకేరేటు వుంటుంది కదా?)

ఈ వాదనను ఎవరూ కాదనలేరు. కానీ బోరు బావుల కింద సేద్యం భస్మాసుర హస్తం లాంటిది. మొదట్లో బోరు బావి జీవితం 10 సం॥లు వచ్చినా రాను రాను 5 సం॥లు - 3 సం॥లకు కుదించబడుతుంది. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పాతాళానికి అతిత్వరలోనే వెళ్ళిపోతాయి. రాను రాను రైతుకు ఖర్చు పెరుగుతుంది. కరెంటు వాడకం ఎక్కువ అవుతుంది. పంట గిట్టుబాటు కాదు! దీనికి ప్రత్యామ్నాయంగా వాటర్ షెడ్ పథకాలను అభివృద్ధి చేసుకోవాలి. కొత్తబోర్లు వేయకుండా నియంత్రించాలి (దీనికి డబ్ల్యూ.ఎల్.టి.ఎ చట్టం ఎప్పుడో చంద్రబాబు చేశారు) కనీసం ఇద్దరు - ముగ్గురు రైతులు ఒకే బోరు కింద సాగును పంచుకునేటట్లు దానికి బిందు సేద్యం వంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. తక్కువ నీరు అవసరమయ్యేపంటలకు మద్దతు ధరలు ప్రకటించాలి. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, చెరకు వంటి వాటిని "శ్రీవరి" పద్ధతిలో, ఇతర ఆధునిక పద్ధతుల్లో పండించేందుకు ప్రోత్సహించాలి. తద్వారా నీటి వినియోగం తగ్గుతుంది. రైతుల పొలాల్లోనే సాధ్యమైన మేరకు కుంటలు వేసే ప్రయత్నం చేయాలి. పొలాల చుట్టూ ఆకు చెట్లు విస్తృతంగా పెంచి ఆ ఆకును సేంద్రీయ ఎరువు తయారీకి వాడవచ్చు. తద్వారా నీటి వినియోగం తగ్గించవచ్చును. అన్నిటికీ మించి ఈ విషయాల్లో రైతులకు అవగాహన కల్పించటం అవశ్యం. ప్రాంతాన్ని బట్టి ఏ ఏ పంటలు ఏ విధంగా వేయటమో అక్కడ రైతులకు సూచించాలి ఒక్కరిద్దరు ఆదర్శ రైతులను ఎంపిక చేసుకుని

వారి ద్వారా సేంద్రీయ వ్యవసాయం బోరు లేని (లేదా అతి తక్కువ నీటితో) సేద్యం లాభసాటిగా ఎలా చేయవచ్చునో అందరికీ చూపించాలి.

మామిడి పంట కిందకు దిగినపుడు కొమ్మలు నేలవాలకుండా ఇంగ్లీషు అక్షరం అకారంలో తన్నులు (పంగ కర్రలు) పెడతారు. అన్ని తన్నులు ఎక్కడ దొరుకుతాయి? అంటే ఇంకా అంతో ఇంతో మిగిలి వున్న అడవిపైన పడతారు. దీనికే కాదు టొమాటో పంటకు కూడా. ఈ విధంగా వున్న అడవిని కూడా వ్యవసాయం ధ్వసం చేసేస్తే ఇంక ఏమి మిగులుతుంది? అడవిలో చెట్లుంటేనే భూగర్భ జలాలు ఆ ప్రాంతంలో సమృద్ధిగా వుంటాయనే సత్యాన్ని ఆ ప్రాంతపు రైతుల మనసులో నాటుకునేటట్లు అవగాహన కల్పించాలి. మామిడి చెట్లకు కింద కొమ్మలు కత్తిరించివేసి, తోపు చుట్టూ అకు చెట్లు పెంచటం ద్వారా వారే అడవికి "తన్నుల"కోసం పోవటం చాలా వరకు నివారించవచ్చును. గోబర్ గ్యాస్ ద్వారా వంటకు కట్టెల వాడకం చాలా వరకు తగ్గించవచ్చును. ఈ పద్ధతులు చేపట్టడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులేమిటో తెలుసుకుని వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాల్సి వుంది.

అలా కాకుండా పోటా పోటీగా ఓట్ల కోసం పార్టీలన్నీ ఉచిత కరెంటు నినాదం ఇవ్వడం, బోర్లను నియంత్రించకపోవడంతో రైతులు రోజు రోజుకీ సర్వనాశనం అయిపోతున్నారు.

రైతుకు కావలసింది. నీరు, కరెంటు కాదు. ఉపరితల నీరు ప్రభుత్వం వారే కాలువల ద్వారా సరఫరా చేయనందుకు, చెరువులు చాలా వరకు పూడిపోయి వాటిలో పెద్దగా నీరు నిలువనందుకు, ఆక్రమణకు గురైనందువల్ల, వాటిఒరవ కాలువలు సరిగా లేకపోవటంతోటి రైతులు రాను రాను కరెంటు మోటార్లు, బోరుబావులపై ఆధారపడటం మొదలెట్టారు. ఇవి ఉంటే నలుగురితో పనిలేదు. ఎవరి బోరు వారిది. ఈ కారణంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని, అందరితో పంచుకోవాలనే ఆలోచనలు కనుమరుగయ్యాయి.

ఇప్పటికే పలు ప్రదేశాలలో పాతాళానికి పోయిన భూగర్భ జలాలు త్వరలోనే కనుమరుగైపోతాయి. (రీచార్జికంటే వాడకం ఎక్కువగా వుండడంతో) కాబట్టి ఈ విషయంలో సమగ్రమైన చర్యలు అందరూ (రైతులు, అధికారులు, సంఘ సేవకులు) తీసుకోవాలి.

1) ముందు ప్రతి ట్రాన్సుఫార్మరు కింద వున్న సర్వీసులు, వాటిలోడు కచ్చితంగా నిర్ధారించి రెగ్యులరైజ్ చేయాలి.

2) ప్రతి ట్రాన్సుఫార్మరుకి మీటరు బిగించాలి.

3) ప్రతిమోటారు సర్వీసు పొదుపు చర్యలు అనగా ప్లాస్టిక్ ఫుట్‌వాల్వు, పైపులు,

కెపాసిటర్లు అమర్చేటట్లు చూడాలి. రైతులకు వీటి ఉపయోగంపై అవగాహన తరగతులు తీసుకోవాలి.

4) ప్రతి ట్రాన్సుఫార్మరు కింద వినియోగదారుల సంఘం ఏర్పాటు చేయాలి. విద్యుత్ పొదుపుగా వాడే వినియోగదారులకు, పొదుపు చర్యలు చేపట్టే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అలా చేయనివారికి, తగిన అపరాధాలు విధించాలి.

5) విచ్చలవిడిగా ప్రభుత్వ అనుమతిలేకుండా బోర్లు వేయటం నియంత్రించాలి. (వాల్టా చట్టం అమలు చేయాలి)

6) రైతులు భూ గర్భ జలాలను సహకారంతో వాడుకునేందుకు ఇద్దరు ముగ్గురు రైతులు ఒకేబోరు నీటిని పంచుకుని వాడుకునేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఉచితంగా లేక భారీ రాయితీలతో బిందు సేద్య పరికరాలు ఇవ్వాలి.

7) తక్కువ నీరే అవసరమయ్యే పంటలు, "శ్రీవరి" పద్ధతిలో వరి, చెరకు సాగు ప్రోత్సహించాలి. అలా పొదుపుగా నీటిని వాడుకుని మంచి దిగుబడులు సాధిస్తున్న రైతుల పొలాల వద్దకు రైతు బృందాలను తీసుకువెళ్ళాలి. వివరించి చెప్పాలి.

8) భూగర్భ జలాలను అభివృద్ధి చేసేందుకు వాటర్ షెడ్ (నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి) పథకాలు సరిగా పనిచేసేందుకు కృషి చేయాలి. ఇందులో భాగంగా చెరువుల పూడిక తీయటం, వాటికి వచ్చే సప్లై కాలువలు, తూములు, వరద కాలువలు ప్రతి ఏటా మరమ్మత్తులు సామూహికంగా ఆయకట్టు దార్లంతా కలిసి చేసుకునేటట్లు చేయాలి.

9) మన పరిసరాల్లో వున్న అడవిని రక్షించుకోవాలి. దానిలో బంజరు ప్రాంతంలో వన సంరక్షణ సమితుల ద్వారా పనికి ఆహారం చట్టం కింద అడవిలో వర్షంతో కోసుకుపోయిన గుట్టలకు రాళ్ళతో అడ్డు కట్టలు అక్కడక్కడ వేసి (గల్లీ బండింగు), గుట్టల వాలుకి అడ్డంగా కందకాలు తవ్వి అందులో చెట్లు నాటి, సాధ్యమైనన్ని చోట్ల వాన నీటి ప్రవాహం తగ్గించేందుకు ఎక్కడికక్కడ రాళ్ళతో చెక్‌డ్యాములు లాంటివి నిర్మించాలి. (వీటికి సిమెంటు వేయకూడదు. ఆ రాళ్ళ సందుల్లో నుండి నీరుమెల్లగా పోతుంది.) చెట్లను ఎవరూ విచక్షణా రహితంగా నరికివేయకుండా కాపలా పెట్టాలి. అడవి అభివృద్ధి అయితే భూగర్భ జలాలు వాటంతటవే అభివృద్ధి చెందుతాయి.

10) ముఖ్యంగా వాగులు, వంకల్లో ఎవరినీ ఇసుక ఎత్తనీయకూడదు. పడిన వర్షం నీటిని ఇసుక స్పాంజిలాగ భద్రపరుస్తుంది. పరిసరాలలోని బావులకు నీరు అందిస్తుంది. స్థానిక అవసరాలకు రైతులు వాడుకోవటాన్ని పంచాయితీ ద్వారా నియంత్రించవచ్చును.

## హరిత విప్లవం - ఆ తరువాత :

"మన దేశంలో ఆహార సంక్షోభం వున్నది. తగినన్ని పశువులు, చెట్లు లేవు కాబట్టి హైబ్రిడ్, హైఈల్డింగు రకాలు, ఇపుడు జన్యు మార్పిడి రకాలతో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులతో పంటలు అధికంగా పండించి శర వేగంతో పెరుగుతున్న జనాభాకు సరిపడ ఆహార ధాన్యాలు, నూనెలు పప్పు దినుసులు అందిస్తున్నాం" అని మన శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు ప్రకటిస్తారు. దీన్ని కొంత జాగ్రత్తగా పరిశీలించాలి.

దేశానికి హరిత విప్లవం రావటానికి మూల కారకుల్లో ఒకరైన డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ నేటికీ బతికే వున్నారు! హరిత విప్లవం ఏమి సాధించిందని డా॥ వందనా శివ గారు ఘాటుగా విమర్శనా పత్రం రాశారు. కానీ ఆనాటి పరిస్థితులు అటువంటివి. సి. సుబ్రమణ్యం, టి.ఎ. పాయ్, డా॥ ఎమ్. ఎస్. స్వామినాథన్ అప్పటి కీలక వ్యక్తులు. అమెరికా నుండి పి.యల్. 480 చట్టం కింద గోధుమల ఓడ ఎప్పుడు భారత తీరం చేరుతుందాని ఎదురు చూస్తున్న రోజులు. బీహార్‌లో భయంకర కరువు (1966-67). కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం. ఎన్నో రాష్ట్రాల్లో కాంగ్రెసు పార్టీ ఓడిపోయి ప్రతిపక్ష పార్టీల కూటములు అధికారంలోకి వచ్చాయి. (కానీ చాలాకాలం నిలబడలేకపోయాయి). ఆంధ్రప్రదేశ్ నుండి బియ్యం రైలు బోగి ఎప్పుడెప్పుడు దిగుతుందా అని కేరళ, తమిళనాడులో ఎదురు చూస్తున్న రోజులవి.

ఆ పరిస్థితుల్లో ఎక్కడైతే నీటి వనరులు బాగున్నాయో (ఉదా॥ పంజాబు, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా డెల్టా ప్రాంతం, తమిళనాడులో కావేరీ డెల్టా ప్రాంతం వగైరాలలో) కొత్త వంగడాల ద్వారా అతి త్వరగా అధికోత్పత్తి సాధించాలన్నదే ఆనాటి ప్రణాళిక. అమెరికా కబంధ హస్తాల నుండి ఎంత త్వరగా విముక్తి పొందితే అంత మంచిదని వారి ఆలోచన. మెక్సికోలో పొట్టి రకాల గోధుమ వంగడాలు రెట్టింపు దిగుబడినిస్తున్నాయని డా॥ బోర్‌లాగ్ గారి నాయకత్వాన వాటిని తెప్పించి విస్తారంగా పండించాలనుకున్నారు. కానీ ఎక్కువ పంటలు ఊరికే రావుగా. దానికీ ఏదో ఒక ఇబ్బంది వుంటుంది. ఈ కొత్త వంగడాలకు తోడుగా రసాయనిక ఎరువులు : యూరియా (నత్రజని), పొటాష్, ఫాస్‌పేట్స్ తగిన మోతాదులో, తగిన సమయంలో వేయకపోతే పంటరాదు. అంతే కాదు రోగాలొచ్చినపుడు తగిన ఫంగిసైడ్లు, పెస్టిసైడ్లు వాడాలి. ఇవన్నీ ఆ రోజుల్లో మొత్తం దిగుమతి చేయాల్సిందే! తద్వారా లాభపడిన విదేశీ బహుళజాతి కంపెనీలు, వాటి వ్యాపారస్తులు చాలా మంది వున్నారు. కొత్త వంగడాలు, వాటికి వాడాల్సిన ఎరువులు, పురుగుల మందుల గురించి రేడియోల ద్వారా, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు (అన్నట్టు ఇవన్నీ ఫోర్డు ఫౌండేషను వారి ఆర్థిక సాయంతో, సైద్ధాంతిక ప్రాతిపదికతో ఏర్పడ్డవి!) వ్యవసాయ శాఖలు విస్తృతంగా రేయింపగళ్ళు రైతులకు సూచనలిస్తూనే వున్నాయి (ఇప్పటికీను!). (ఈ మధ్య

2007లో బుష్ నాయకత్వాన వచ్చిన అమెరికా ప్రతినిధులతో మరోసారి ఇండో-అమెరికన్ నాలెడ్జి ఇనిషియేటివ్ అన్న పేరుతో జన్యు మార్పిడి వంటి విజ్ఞానం (అమెరికా కంపెనీల ద్వారా) కొన్ని భారతీయ వ్యవసాయ విద్యాలయాలకు, శాస్త్ర వేత్తలకు అందజేసే వొప్పందం కుదుర్చుకున్నారు.)

వీటి పర్యవసానంగా పంజాబ్, హర్యాన, ఉత్తర ప్రదేశ్‌లలోని పశ్చిమ భాగంలో గోధుమల పంట ఉత్పత్తి పెరిగింది. గోధుమల ఆహార కొరత రాను రాను తగ్గిపోయి స్వయం సమృద్ధి సంపాదించగలిగాం. కానీ వరి విషయంలో అంత సులభంగా జరగలేదు. ఫిలిప్పైన్స్‌లో అంతర్జాతీయ రైస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఉన్నది. వారి సహకారంతో కొన్ని ఎక్కువ దిగుబడి నిచ్చే కొత్త రకాలు ఐ.ఆర్ 8, తాయిచుంగ్, ఐఆర్ 64 వగైరా తీసుకొచ్చారు. వీటికి కూడా, హైబ్రిడ్ గోధుమల వలె రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు తప్పనిసరి. వీటి ద్వారా మొదట్లో కొందరు రైతులు ఎకరాకు 40 నుండి 60 బస్తాలు పండించగలిగారు. కాని కొద్ది సంవత్సరాల్లోనే దిగుబడి బాగ పడిపోవటం, రోగాలకు తట్టుకోలేక పోవటం జరిగేది. అంతలో వ్యవసాయ విశ్వవిద్యాలయాల పరిశోధనలు, ఐసిఎఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చి) వారి పరిశోధనల ద్వారా ప్రతి ఒకటి - రెండు సంవత్సరాలకు కొత్త వంగడాలను మార్కెట్టులో విడుదల చేసేవారు. ఇవి రెండు నుంచి 5 సంవత్సరాల వరకు ఓమోస్తరు దిగుబడి అందించేవి. అంతలో కొత్త వెరైటీలు కావాల్సి వచ్చేది. ఎరువులు సబ్సిడీలపై అందించటం వల్ల రసాయనిక ఎరువులు చవకగా, అసలు ఖర్చులో కేవలం ఆరో వంతుకే అనగా అసలు ఖరీదు రూపాయి అయితే 16 పైసలకే అమ్ముతున్నారన్నమాట! (ఇప్పటికీనూ). విస్తృతంగా వాడటానికి రైతులు అలవాటు పడ్డారు. అసలు చాలా మంది పశువుల ఎరువు వేయటం మానేశారు కూడా! 1970 దశకం రైతులకు మంచి లాభాలు పండించింది.

గోధుమల్లో వచ్చినంత దిగుబడి వరిలో రాకపోయినా ఉత్పత్తి బాగా పెరిగింది. కానీ ఈ కొత్త వంగడాల వాడుక వల్ల అనేక దుష్ఫలితాలు 1980 దశకం కల్లా పొడచూపాయి. ముఖ్యంగా పై ఎరువులు వేసిన ప్రాంతాల్లో నీటిలో చేపలు, పీతలు, కప్పలు వగైరా చచ్చిపోవటం, పొలంలో రసాయనాలతో కలుషితమైపోయి ఆ నీరు అలాగే కాలువలు, నదుల్లోకి ప్రవహించి అవి కూడా కలుషితమవుతూ వాటిలో చేపలకి, తాగు నీరుకి హానికలిగిస్తూ వచ్చాయి. ముఖ్యంగా రసాయనిక మందులు మరింత భయంకరంగా మారాయి.

ఒకప్పుడు భారత దేశంలోనే కేవలం ప్రస్తుత చత్తీస్‌ఘఢ్ ప్రాంతంలోనే పంతొమ్మిది వేల రకాల వరి విత్తనాలుండేవి! అక్కడ డా॥ రిచారియా అనే మహానుభావుడు ప్రభుత్వం తరఫున ఒక వరి పరిశోధనా కేంద్రాన్ని నడుపుతుండేవారు. అమెరికా వత్తిడికి తలొగ్గి అక్కడ భద్రపరిచిన అరువై ఐదు వేల వివిధ రకాలవరి జన్యు సంపదను బలవంతంగా

ఫిలిప్పైన్స్ వరి పరిశోధనా కేంద్రానికి తరలించేశారు. ఎవరో కాదు డా॥ స్వామినాథన్ గారే! ఇప్పుడు కొన్ని వంగడాలైతే దేశంలో మాయమైపోయాయి కూడా! తిరిగి వాటికోసం ఫిలిప్పైన్స్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం (అంటే అమెరికా పెత్తనంలో నడిచేది) మీద ఆధారపడాల్సిందే!

మరోవైపున ఇటు భూసారం తగ్గడం (విస్తృతంగా రసాయనిక ఎరువులు వాడటం అటు కొన్ని క్రిములు, రోగాలు) వల్ల క్రిమి సంహారక మందులకు తట్టుకునే శక్తి సంపాదించుకోవటం వల్ల - మరింత శక్తివంతమైన, ఖరీదైన మందులు వాడాల్సి వచ్చింది. కొత్త వంగడాలు అంతగా దిగుబడి ఇవ్వలేక పోవటంతో ఖర్చులు పెరగటం, లాభాలు తగ్గటం 1980 దశకంలో మొదలయ్యింది. దీనితో దేశ వ్యాప్తంగా రైతు ఉద్యమాలు, పార్టీలకు అతీతంగా మొదలయ్యాయి. అటు గోధుమలకు, ఇటు వరికి, చక్కెరకు అన్ని పంటలకు ఖర్చులు పెరిగిపోయాయి. ఇందులో బోరుబావుల సేద్యం కూడా కలిసి ఖర్చులు మరింత ఎక్కువయ్యాయి. మొదట్లో ఆకర్షణీయంగా లాభాలు వచ్చినా రాను రాను రాజుగారి గుర్రం గాడిదైనట్లు విపరీతమైన నష్టాలు చవిచూశారు రైతులు. సరళీకృత ఆర్థిక విధానాలతో అంతర్జాతీయ మార్కెటు పవనాలు కూడా దేశీయ మార్కెట్లపై పడటం ఆరంభించి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

21వ శతాబ్దంలో అడుగు పెట్టేక ప్రభుత్వం ఒక్కసారిగా కళ్ళు తెరిచింది. సరళీకృత ఉత్సాహంతో 1990 దశకంలో ముఖ్యంగా రెండవ భాగంలో వ్యవసాయ రంగాన్ని తాము మరిచామని, పెట్టుబడులు పెట్టనందువల్లే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందకపోగా మైనస్‌కి వెళ్ళిపోయిందని గుర్తించింది. ఇప్పుడు వ్యవసాయ రంగం సాలీన 3-4 శాతం అభివృద్ధి సాధిస్తే చాలు. మన "అభివృద్ధి"కి ఇక ఎటువంటి ఆటంకం వుండదు (!) అని మన నేతలు కలలు కంటున్నారు. కానీ వారు కాంక్షిస్తున్న వ్యవసాయ రంగ అభివృద్ధి పూర్తిగా అభివృద్ధి చెందిన దేశాల కంపెనీలకు అనుగుణంగా వుంది!

## మీకు తెలుసా?

**జాతీయ క్రైమ్ రికార్డ్సు బ్యూరో ప్రకారం 1997 నుంచి 2005 మధ్య దేశవ్యాప్తంగా 1,50,000కి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు! 1992-2001 మధ్య 78, 737 ఆత్మహత్యలు చేసుకుంటే (సగటున సంవత్సరానికి 15, 747) 2002-2008 మధ్యన ఈ ఆత్మహత్యలు మరింత పెరిగాయి. 70,507 లేదా సంవత్సరానికి 17,627 ఆత్మహత్యలు!**

*(మూలం పి. సాయినాథ్, హిందూ, 13.11.2007)*

వారి దృక్పథంలో మొత్తం వ్యవసాయోత్పత్తులు ఎగుమతులకు అనుకూలంగా వుండాలి. అందుకు దానికి అవసరమైన కోల్డుస్టోరేజ్‌లు, ప్యాకింగ్ పద్ధతులు, రోడ్లు, రైళ్లు, నౌకాశ్రమాలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేసి, ఎగుమతికి లాభదాయకంగా వుండే పూలు, పండ్లు, కూరగాయలు పండించాలి. ఆహారోత్పత్తులపై అంతగా వత్తిడిలేదు. ఎందుకంటే అవి ఎలాగూ చవకగా అమెరికా నుండీ, ఆస్ట్రేలియా నుండి, థాయిలాండ్ నుండి దిగుమతి చేసుకోవచ్చు. ఆ పంటలకు వాడే నీరుతో పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల పెంపకం, పండ్లు, కూరగాయల ఉత్పత్తి ద్వారా రెట్టింపు ఆదాయం పొందవచ్చునేదే వారి వాదన. ఇందులో కొంత నిజం లేకపోలేదు. కానీ దేశం మొత్తం అదేబాట పట్టిస్తే ఇక తిండిగింజలు పండించేదెవరు? 5 సం॥లు పేరుకు పోయిన ధాన్యాలతో ఏంచేయాలో తెలియని దిక్కులేని స్థితి ప్రభుత్వ అహార సంస్థది. (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా).

ఇప్పుడు ధాన్యం లేక దిగుమతులకు ఎదురు చూస్తున్నాం. ఎప్పుడైతే భారీ దిగుమతులకు పూనుకున్నామో అప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు రెక్కలొచ్చాయి. మన రైతులకు ప్రభుత్వం చెల్లించిన రేటుకన్నా రెట్టింపు రేటుతో 2007లో గోధుమలు దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కాబట్టి ఇకనైనా ఆహార భద్రత గురించి మన పాలకులు పునరాలోచనలో పడతారని ఆశిద్దాం. మరోపక్క శరవేగంతో దేశంలో విచ్చలవిడిగా విచక్షణా రహితంగా పెట్టుబడులు రావడంతో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో వేలకు వేల ఎకరాల వ్యవసాయ భూములు రైతుల నుండి సేకరిస్తున్నారు. చివరికి ఆహార ధాన్యాలు పండించే రైతులే దేశంలో కరువైపోతారేమో!

2004లో కాంగ్రెస్ నాయకత్వాన కొత్త ప్రభుత్వం వచ్చాక రైతుల సమస్యలపై జాతీయ స్థాయిలో వేసిన కమిషన్‌కు ఛైర్మన్‌గా ఎం.ఎస్. స్వామినాథన్ గారు 5 పెద్ద పెద్ద రిపోర్టులు తయారు చేశారు. వ్యవసాయ భూములను ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు మార్చవద్దని ప్రతి వ్యవసాయ పంట ఖర్చుకు సగం అదనంగా చేర్చి గిట్టుబాటు ధరను నిర్ణయించాలని, రైతులకు మేలైన అనేక సిఫార్సులు స్వామినాథన్ గారు చేశారు. కానీ అదే సమయంలో ప్రపంచ వాణిజ్య సంఘం నిబంధనల గురించి కానీ, మేధో హక్కుల (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) గురించి కానీ, జన్యు మార్పిడి విత్తనాలగురించి కానీ, పేటెంటు హక్కుల గురించి కానీ పల్లెత్తు మాట కూడా ఆయన మాట్లాడలేదు! సేంద్రీయ వ్యవసాయాన్ని ఎగుమతికి పనికి వచ్చే ఓ అంశంగా అభివృద్ధి చేయవచ్చున్న సిఫార్సు చేశారు! అందుకే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను (అనుబంధం చూడండి) తు.చ. తప్పక అమలు పరచాలని వామపక్ష పార్టీలు, వారి రైతు సంఘాలు డిమాండ్ చేస్తుంటే ఆశ్చర్యమేస్తుంది.

## భారత ప్రభుత్వం ఎమ్.ఎస్. స్వామినాథన్ నాయకత్వంలో నియమించిన జాతీయ కమీషనువారు చేసిన రైతులకు మేలు చేసే కొన్ని ముఖ్యమైన సిఫార్సులు - 2006

(రైతులకు అన్యాయం చేసే సిఫార్సులు కూడా వున్నాయి)

1. ధరల నియంత్రణ నిధి ఏర్పాటు చేయాలి. మార్కెట్టులో ఏ పంట ధరైనా గిట్టుబాటు కాకుండా పడిపోతే ఆదుకోవాలి.
2. గిట్టుబాటు ధర అనగా రైతు పంట ఖర్చుపోను ఖర్చుపైన 50 శాతం ఆదాయం వచ్చేటట్లుండాలి.
3. భూసంస్కరణలు సరిగా అమలు చేయాలి. ఆడవారికి కూడా మగవారితో సమానంగా ఉమ్మడి భూమి పట్టానివ్వాలి.
4. వ్యవసాయ భూములు వ్యవసాయేతర పనులకు వాడకుండా నియంత్రించాలి.
5. చిన్న కమతాల రైతులంతా, వెయ్యి - రెండు వేల ఎకరాల చొప్పున సహకార సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ పరికరాలు, ముడి సరుకుల కొనుగోలు, ఉత్పత్తుల అమ్మకాలు లాభసాటిగా చేసుకోవచ్చు.
6. చిన్న రైతులంతా షేర్ హోల్డర్లుగా కంపెనీ సేద్యం చేయవచ్చు.
7. రైతుల సమ్మతితో భారీ ఎత్తున 25 లక్షల ఎకరాలకు నీటి పారుదల కలిగించే ప్రాజెక్టులు పూర్తి చేయాలి.
8. చిన్న నీటి వనరుల పునరుద్ధరణకు, ప్రతి గ్రామంలోని నీటి వనరులను సక్రమంగా పంచుకొని వాడుకునేందుకు "పానీ (నీటి) పంచాయితీ"లు ఏర్పాటు చేసుకోవాలి.
9. రైతు స్థాయిలో సంప్రదాయ విత్తనాల సేకరణ, భద్రపరచటం జరగాలి.
10. రైతులకు 4 శాతం వడ్డీతో అప్పులు ఇవ్వాలి. కరువు ప్రాంతాల్లో ప్రతి ఏటా 4-5 సం॥లకు బాకీ తీర్చేట్లుగా వీలు కలిగించాలి.
11. గ్రామ స్థాయిలో బీమా పథకం అమలు చేస్తూ విత్తనం నుండి పంట అమ్మకం వరకు రైతుకు రక్షణ వుండేటట్లు బీమా పథకం, ఋణ సౌకర్యం వుండాలి.

## స్వామినాథన్ కమిషను నివేదికలో రైతు వ్యతిరేక ధోరణులు

1. ప్రపంచ వాణిజ్య సంఘం నియమాలు, దుష్ఫలితాల గురించి నోరు మెదపక పోవడం.

2. పేటెంటు చట్టం గురించి మాట్లాడక పోవడం.

3. జన్యుమార్పిడి పంటలు, టర్మినేటరు విత్తనాల విష పరిణామాల గురించి చెప్పకపోవడం.

4. సేంద్రియ వ్యవసాయ విధానం కేవలం కొద్ది ప్రాంతాలకే పరిమితం చేసి వాటి ఉత్పత్తులు ఎగుమతులకే ఉపయోగపడతాయని సలహా ఇవ్వటం.

నిజమే మనకు ఇప్పుడు వ్యవసాయ రంగంలో మరో విప్లవం కావాలి. కానీ ఆ విప్లవం మన పాలకులు అనుకున్నట్లుగా మరో హరిత విప్లవం, సాంకేతిక విప్లవంగా కాదు. సేంద్రీయ వ్యవసాయ విధానాలు, చెట్ల పెంపకం, అడువుల సంరక్షణ ద్వారానే రావాలి. ప్రతి రైతుకు కనీసం రెండు ఎకరాల సాగుభూమి వుండాలి. ప్రతి రైతు సేంద్రీయ వ్యవసాయ విధానాల్లో గౌరవంగా నిలబడాలి. హాయిగా బతకాలి. ఇదే మన ధ్యేయం కావాలి! ఈ పాశుపతాస్త్రంతోనే మనల్ని అనుక్షణం ఆడిస్తున్న బహుళజాతి వ్యవసాయ కంపెనీల ఆటలు కట్టించవచ్చు!

## రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన జయతి ఘోష్ కమిషన్ ముఖ్య సిఫార్సులు- 2004

1. కౌలుదార్లను అధికారికంగా గుర్తించేట్లు రిజిష్టరు చేయించాలి. ఒక రైతు కౌలుదారోకాదో భూస్వామియే రుజువు చేయాలి.

2. భూ సంస్కరణలు సరిగా అమలు చేయాలి. మహిళల పేరున పట్టాలివ్వాలి.

3. గిరిజనులకు ఏజెన్సీ ప్రాంతంలో వారి భూములు వారికి తిరిగి స్వాధీన పరచాలి.

4. సాగు నీటి వసతి విషయంలో రైతుల మధ్య, ప్రాంతాల మధ్య నున్న అసమానతలు తొలగించాలి. పునరుద్ధరించగల నీటి యజమాన్య వనరులు,

పద్ధతులు ఉదా ॥ పాత చెరువులు, కాలువల మరమ్మతులు కోసం ముందు కృషి చేయాలి.

5. కౌలుదారు రైతులతో సహా రైతులందరికీ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా అప్పులు ఇచ్చే సౌకర్యం కలుగ చేయాలి. వడ్డీ ఎప్పుడూ అసలు కన్నా ఎక్కువ కాకూడదు. పాత బకాయిలను నెమ్మదిగా తీర్చుకోవడానికి "రీషెడ్యూల్" చేసి కొత్త అప్పులను 6 శాతం వడ్డీకి ఇవ్వాలి.

6. వ్యవసాయ ప్రణాళిక, పద్ధతులు మెట్ట సేద్యంపై దృష్టి సారించాలి. ఆకర్షిత ధరలు, ఆధునిక పద్ధతులు, నైపుణ్యత ద్వారా మెట్ట పంటల సాగు (ఉదా॥ రాగులు, జొన్నలు, పప్పుదినుసులు) ప్రోత్సహించాలి.

7. వ్యవసాయానికి అవసరమయ్యే ముడి సరుకులు, విత్తనాలు, ఎరువులు వగైరా, చవకగా, ప్రకృతిలో పునరుద్ధరించే విధంగావుండేందుకు ప్రభుత్వ సంస్థల భాగస్వామ్య పరిశోధనల్లోనూ, ఫలితాల అమలులోనూ, రైతుకు చేరువగానూ, ఎక్కువగా వుండాలి. ప్రైవేటు సంస్థల సేవలను (ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, మందుల విషయంలో) నియంత్రించాలి.

8. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి.

9. పంటల ధరలు దారుణంగా పడిపోకుండా ప్రభుత్వం మార్కెట్టులో కొనుగోలు చేసేందుకు ఒక ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ధరలను స్థిరీకరించేందుకు ఆయా పంటల ఎగుమతులు / దిగుమతులపై నియంత్రణ వుండాలి.

10. ఒకే పంటపై రైతులు ఆధారపడకుండా, వివిధ రకాల పంటలు, వ్యవసాయోత్పత్తుల తయారి, వ్యవసాయేతర పనులపై రైతుల దృష్టి వుండేటట్లు కృషి చేయాలి. రాగులు, జొన్నలు వంటి మెట్ట ఆహార పంటలు కూడా రేషను దుకాణాలు ద్వారా సరఫరా చేయాలి.

జయతీఘోష్ కమిషన్‌ను మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని వీటిలో కూడా కీలకమైన సిఫార్సులను పక్కన పెట్టేశారు. ఉ॥ ధరలు పడిపోయినపుడు మార్కెట్టులో ప్రభుత్వం ఆ పంటను కొనుగోలు చేయటం, కౌలుదారీ రైతులను రిజిష్టరు చేయటం భూ సంస్కరణలు అమలు చేయటం.

## సేంద్రీయ వ్యవసాయం

కాని చిన్న రైతులు, సన్నకారు రైతులు సేంద్రీయ వ్యవసాయ విధానం వైపు ఎందుకు మక్కువ చూపడం లేదు? సేంద్రీయ వ్యవసాయం ద్వారా శ్రమ ఎక్కువ వుంది. పండించిన పంట ప్రస్తుతానికి దిగుబడిలో పెద్దగా తేడా లేదు. ధరలో భేదం లేదు. సేంద్రీయ పద్ధతి అంటూ ఒకటి లేదు. అన్నీ మూల సూత్రాలే. ఎవరికి తగినట్లు వారే వాటిని మరల్చుకోవాలి.

– కేవలం రసాయన ఎరువులు, మందులు వాడకుండా వుండడం కూడా సేంద్రీయ వ్యవసాయం అనవచ్చు.

– పంట వేసే విధానంలో, దూరం దూరంగా (గాలీ, వెలుతురు బాగా సోకేటట్లు) నాటి, నీరు స్వల్పంగా (తగిన మోతాదులో పెట్టడం), ఖాళీస్థలాల్లో పచ్చిరొట్ట లేక అంతర్ పంటల మిగులు చెత్త, ఎరువు వేయడం (మల్చింగు) ఈ విధంగా చెరకు, వరి (శ్రీవరి పద్ధతిలో) పండిస్తున్నారు. మంచి దిగుబడి కూడా చాలా మంది సాధిస్తున్నారు. ఇందులో ఏమాత్రం తడబడినా పంట సరిగా రాదు.

– ఆవు లేదా ఎద్దు కొమ్ములో ఆవు పేడ నింపి దాన్ని భూమిలో నిర్ణీత సమయంలో పూడ్చేసి మళ్ళీ ఆరు నెలల తరువాత తీసి ఆ కొమ్ములో వుండే ఎరువును స్వల్పంగా నీటితో కలిపి జల్లితే పంట బాగా వస్తుందంటారు. దీనిపేరే "బయోడైనమిక్ ఫార్మింగు". ఇందులో ఎద్దు కొమ్ములో పేడతో పాటు నేలకు అవసరమైన లవణాలు కూడా పొందుపరచవచ్చు. ఇది కొంచెం హోమియోపతిలాగా వుంటుంది. దీన్ని కనిపెట్టిన ఆయన కూడా రుడాల్ఫ్ స్టైనర్ అనే జర్మన్ దేశస్తుడే.

– ఫుకోకా గారైతే అసలు దున్నడమే అవసరం లేదంటారు. మనవాళ్ళు పూర్వం నుండి వరి పంట కోసే ముందే పెసలు, ఉద్దులు, మినుములు, వరి మడిలో వేసి పెసలు పంటను, ఉద్దులు రెండవ (కొన్ని ప్రాంతాల్లో మూడవ) పంటగా తీసుకునే అలవాటు కోస్తా, డెల్టా ప్రాంతాలలో వుంది. నేలను గమనించి ఆ విధంగా వరి మడిలో ఇంకా తేమ ఆరక ముందే తగిన అంతర పంట వేసుకోమంటారు ఫుకోకా గారు. పంటలో ధాన్యం తీసుకుని గడ్డిని అక్కడే వదిలి వేయమంటారు. అదే ఆ భూమికి తిరిగి సత్తువనిస్తుంది అంటారు. చెరుకు పంటలో కూడా చెరుకు పిప్పి నుండి రసం తీసుకోవటం వరకే మన పని. చెరుకు ఆకు, పిప్పి అంతా తిరిగి పొలంలోకి వెళ్ళిపోవాలి. చెరుకు ఆకు నీడ ఒక కర్రకు ఇంకో కర్రకు పడకుండా ఒకొక్క విత్తనం కన్ను రెండు అడుగుల ఎడంతో నాటి ఒకొక్క వరుసకు ఆరు అడుగులు తేడా పెట్టి ఒకొక్క కన్ను నారుపోసి నాటాలి. ఈ ఆరు అడుగులు మధ్య భాగంలో ఏవైనా మూడు నెలల్లో కాసే కూరగాయలు గానీ, వేరుశనగ, పప్పు ధాన్యాల వంటి పైర్లు వేసుకోవచ్చు. ఇందులో కూడా పంట తీసుకోవటం వరకే, ఆ మిగిలిన ఆకు, వేర్లు, కొమ్మలన్నీ తిరిగి ఆ నేలలోనే వేయాలి. ఈ విధంగా సురేష్ దేశాయి

అనే రైతు కర్ణాటకలో బెల్గాం దగ్గర తన స్వగ్రామంలో 7 – 10 మర్ధాములు చెరుకు పంట పండిస్తూ ఎకరాకు 60 నుండి 80 టన్నులు దిగుబడి సాధిస్తున్నారు. ఆయన్ని చూసి చుట్టుపక్కల నుంచి 5 వేల ఎకరాల్లో ఇదే పద్ధతిలో సాగు చేస్తున్నారు. జొన్న పంట కన్నా తక్కువ నీటితో చెరుకు పండించవచ్చని దేశాయి గారంటున్నారు. దీన్ని నేను ప్రయోగం చేసే లోపల కరువు వచ్చేసింది.

– బిల్ మాలిసన్‌గారు 'పర్మాకల్చర్' పేరుతో పెద్ద గ్రంధమే రాశారు. ఇందులో ముఖ్యంగా నేలను వృద్ధి చేసుకోవటానికి విరివిగా రకరకాల చెట్లు పెంచడం. ఆ చెట్ల ఆకులను కత్తిరించి లేదా అవి చీకి నేల అభివృద్ధి చెందడం. దానికి అనుకూలమైన పంటలు వేసుకోవడం వంటి అంశాలున్నాయి.

– చెట్టు, మొక్క లేదా మొదటికి నీరు వాడే బదులు కొంచెం దూరంగా పెట్టమంటారు గుజరాత్ ఆదర్శ రైతు భాస్కర్ సావె గారు. (వల్సాద్ అనే గ్రామంలో వున్నారు.)

– చెట్టు, మొక్కకు గాలి, వెలుతురు బాగా సోకేటట్లు చూడమంటారు పూణె నుండి దబోల్కర్‌గారు. దీనికి తగిన ఎరువు వేసి, కుళ్ళిన ఆకుల వలన మంచి కంపోస్టు ఎరువు ద్వారా సత్తువ అందిస్తే 1/4 ఎకరాలో రైతు కుటుంబానికి అవసరమైన అన్ని పంటలూ పండించుకొని ఒక మధ్య తరగతి కుటుంబం స్థాయిలో రైతు బతకవచ్చంటారు దివంగత దబోల్కర్ గారు.

– రెండు ఎకరాల్లో ఒక రైతు కుటుంబం తనకు కావాల్సిన ధాన్యం, కూరగాయలు పండించుకుని సంతృప్తిగా బతక వచ్చని 20 సంవత్సరాలుగా నిరూపిస్తున్నారు మాజీ పాలిటెక్నిక్ లెక్చరర్లు, ఇంజనీర్లు అయిన భార్యాభర్తలు ధీరేంద్రసోనేజీ ఆయన సహచరి స్మితాగారు. వారి పిల్లలను కూడా వారే స్వంతంగానే ఇంట్లోనే చదివించుతారు! ఈ విధంగా దేశ వ్యాప్తంగా అనేక మంది చదువుకున్నవారు ఫుకోకా, పర్మాకల్చర్ పితామహుడు ఆస్ట్రేలియాకి చెందిన 'బిల్ మాలిసన్' గారి బయోడైనమిక్ ఫార్మింగు, మన సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై ఆకర్షించబడిన వారు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. భారతీయకిసాన్ సంఘం (ఇది ఆర్.యస్.యస్ అనుకూల సంస్థ) వారైతే గత 5 సం॥లుగా దేశ వ్యాప్తంగా 10 వేల గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయం చేపట్టారు.

– సేంద్రీయ వ్యవసాయంలో అందరూ చెప్పేదేమిటంటే పంట బాగా రావాలంటే ముందుగా చేయవలసినది నేలను వృద్ధి పరచటమని. మన వ్యవసాయంలో, ముఖ్యంగా ఆధునిక వ్యవసాయంతో నేల బాగా పాడైపోయింది. పై మన్ను కొట్టుకుపోవటమే కాకుండా రసాయనిక ఎరువులు వాడటం వల్ల తాత్కాలికంగా పంట దిగుబడి పెరిగినా ఈ రసాయనాలు ఎక్కువగా నేలలో అలాగే వుండిపోయి వాటి కారంతో నేలబెట్టబడటం, వర్షాకాలంలో నీటిలో కరిగి ఈ రసాయనాలు చెరువులు, వంకలు, నదులను కాలుష్యం

చేయడం వల్ల వాటిలో చేపలు చచ్చిపోవడం, ఆ నీరు రాను రాను తాగటానికి పనికి రాకుండా పోవడం జరుగుతుందని శాస్త్రవేత్తలు ఎప్పుడో నిర్ధారించారు.

అంటే మన భూమిని సారవంతం చేయడానికి ఆవుపేడ, ఆకు కావాలి. పూర్వంలాగా ప్రతి రైతు దగ్గర 10 - 20 ఆవులు వుండటం లెదు. వున్నా దాన్ని సద్దికో, సంగటికో మేపే దళితులు లేరు. పొలంలో ఆకు వేయడానికి ఆకు చెట్లు అడవిలో లేవు. అడవి దాదాపు అంతరించిపోయింది. పొలం చుట్టూ వున్న చెట్లను, ముఖ్యంగా వేప, చింత చెట్లను "ఎంబ" వేడి అంటూ, ఇంటి కలపకోసం అంతా ఎప్పుడో అమ్మేశారు. మిగిలిన అరకొరా కూడా అదేబాటలో వున్నాయి. అయినా ఈ కాలంలో ఎవరండీ చెట్టెక్కి ఆకు కత్తిరించి మడికి పోసేది? ఒక మూట 17+17+17నో లేక యూరియానో వేసేస్తే సింపుల్‌గా అయిపోదా. ఖర్చు ఎంత? శ్రమ ఎంత? సేంద్రీయ వ్యవసాయ విధానంలో ఇదే కీలక సమస్య.

భూసారం పెంచాలి. భూసారం పెంచాలంటే పశువుల పేడ కీలకం. కానీ ఇప్పుడు అన్ని పశువులు లేవు. మరి ఒకటి - రెండు ఆవుల పేడను రెండు ఎకరాలకు సరిపోయేటట్లుగా ఎలా మార్చడం? ఇదే చిన్న రైతు సమస్య. దానికే కంపోస్టు విధానాలు కనిపెట్టారు: నాడెప్ కంపోస్టు, ఎయిరోబిక్, నాన్ ఎయిరోబిక్ (గాలి తగలకుండా), "ఇండోర్" పద్ధతి ఇలా రకరకాల పేర్లతోని, పద్ధతులతోని ఆకు - ఎరువు - మట్టి పొరలు పొరలుగా వేసి కుప్ప చేసి వాటిపై నీరు, ఆవు పంచతం (మూత్రం) జల్లి అప్పుడప్పుడు దాన్నంతా తిరకొట్టడం, లేదా అలాగే కుళ్ళనియ్యటం - అందులో రంధ్రాలు చేసి గాలి దూరనివ్వటం (ఎయిరోబిక్), లేదా అలాగే కప్పేసి కుళ్ళనివ్వడం (నాన్ ఎయిరోబిక్).

కంపోస్టు కన్నా ఇంకా శక్తివంతమైనది సారావంతమైనది "వర్మి కంపోస్టు" (వానపాములతో చేసే ఎరువు). ఇందులో ఆరు పుస్తకాలు చదివితే ఆరు రకాలుగా చెప్పారు. దాని సారం ఏమంటే ఒకటిన్నర అడుగు లేదా రెండు అడుగులు ఎత్తు 15 అడుగుల పొడవు, 3 అడుగుల ఎడంగా వున్న తొట్టిని ఏర్పాటు చేయడం. అందులో కంపోస్టును తయారు చేసి వాడటం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చునని.

అయినా కూడా మన వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖవారు గుడ్డిగా పాతవిధానాలే (40 సం॥ల క్రిందటివి) చెబుతుంటారు. గట్టిగా వాదిస్తే "ఔను అంత ఎరువు, ఆకు ఇప్పుడు మనకి ఎక్కడుంది" అని తిరిగి మనల్నే ప్రశ్నిస్తారు.

ప్రకృతిలో ఎప్పుడూ ఒక "సమతుల్యత"వుంటుంది. తక్కువ కాలంలో అధిక దిగుబడులు ఇచ్చే పంటలను పెంచే ప్రయత్నంలో దానికి మూల్యాన్ని చెల్లించాలి. వీటికి రోగాలు, తెగుళ్ళు తట్టుకునే శక్తి తక్కువ. తొందరగా ఎదగాలంటే అవి త్వరగా రసాయన ఎరువులను, క్రిమికీటకాలు తట్టుకునే మందులను పీల్చుకోగలగాలి. ప్రతి ఆదాయానికి

ఎక్కడో ఒక చోట ఖర్చు దాగి ఉంటుంది. ఒకరు లాభ పడ్డారు అంటే మరొకరు నష్టపోయారనే అర్థం! ప్రకృతిలోని సమ్మేళనం, సమన్వయం అంతా శాంతిమయం కాదు. అది చూసేవారి కన్నులలో ఉంటుంది! ఆ సుకుమారత వేరు వేరు స్థాయిలలో ఉండవచ్చు. హింస, బలవంతుడు బలహీనుడిపై ఆధికారం చలాయించటం కూడా ప్రకృతిలో భాగమే! వివిధ జాతులు కలిసి జీవించడం మొక్కలు, జంతువులు, కీటకాలు, పక్షులు, ఋతువులు, సూర్యుడు, చంద్రుడు...భూకంపాలు, తుఫానులు, బ్రద్దలయ్యే అగ్నిపర్వతాలు (వాటికి మాత్రం మానవుడు కారణం కాదు) ఇవి అన్నీ కూడా ప్రకృతి సమ్మేళనం, సమన్వయంలో భాగమేనని మనం గుర్తుంచుకోవాలి!

## అల్ప జీవులం :

వాస్తవం చాలాలోతైనది. మనకు ఒక విషయం గురించి ఎంత తెలుసునంటే ఇంకా తెలుసుకోవలసినది చాలా ఉన్నదని గ్రహిస్తాం. అలాగని ఏ విషయం గురించైనా తెలుసుకొనటం ఆపంకదా? చివరికి నేనేవరిని ? నాకేం కావాలి? అని అడగటమే సులభమనిపిస్తుంది (రమణ మహర్షి చెప్పినట్లు) యుగాల తరబడి ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది ఋషులు, పండితులు, జ్ఞానులు, గిరిజనులనుంగి పట్టణ నాగరికతల వరకు, ఈ ప్రశ్నల సమాధానాలకై వెతుకుతూ ఉన్నారు. ఒక రకంగా చూస్తే వారంతా ఇంచుమించు ఒకటే చెబుతున్నారు. ప్రతి ప్రాణి, జీవి సుఖం కోసం, నిండుతనం కోసం పరితపిస్తూ ఉంటుంది. ఎంత సుఖం తీర్చుకుంటే మరింత సుఖానికి మనసు పరితపిస్తూంది! ఇతరులకు ఎంత ఇస్తే మనలో అంతనిండుతనం పొంగుతుంది. "నిన్ను నీవు ప్రేమించుకున్నట్లు నీ పొరుగువారిని ప్రేమించు". అని ఏసు ప్రభువన్నాడు. జీవితంలో సుఖ దుఃఖాలు ఎప్పుడూ వుంటూనే వుంటాయి. ఒకసారి మంచి జరిగితే మరొకసారి చెడు జరుగుతుంది. అన్నీ తాత్కాలికమే. కాబట్టి నీ ధర్మం నీవు నెరవేర్చు. ఎటువంటి ఆశలు, కోరికలు లేకుండా చేపట్టిన ప్రతి విషయంలోనూ, పనిలోనూ నిమగ్నమై ఉండాలి. అదే సమయంలో దానికి చెందకుండా, అంతపట్టింపు లేకుండా బయట ఉండాలి అంటుంది భగవద్గీత. రైతులకిది బాగా తెలుసు. ప్రతి సంవత్సరం, ప్రతి ఋతువు, ప్రతిపంట ఈ సమస్యను రైతులు ఎదుర్కొంటూనే ఉంటారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఒక వాన లేదా ఒక తుఫానులోనో కొట్టుకుపోతుంది....

వ్యవసాయం మనకు పెద్ద గుణపాఠాన్ని నేర్పిస్తుంది ప్రకృతి ముందు మనమెంత నిస్సహాయులమో, ఒకరికి ఒకరి సాయం ఎంత అవసరమో కూడా నొక్కి చెబుతుంది. జనం లేనిదే వ్యవసాయం జరగదు. వ్యవసాయంలో మనుషుల సంఖ్య ఎంత తగ్గితే యంత్రాలపైన బయటి సాంకేతిక విజ్ఞానంపైన ఆధారం అంత పెరుగుతుంది. మనం ఏ పంట వేస్తామో దానిమీద కూడా ఇది ఆధారపడి వుంటుంది. వేసే పంటలలోనూ, వాడే సాంకేతిక పరిజ్ఞానంలోనూ ఇతరులపైన ఆధారపడటం తగ్గించేందుకు, శ్రమశక్తి,

కూలీపని తగ్గించేందుకు కృషి చేస్తారు. కానీ ఈ ప్రయాసలో పునరుత్పత్తి చేయలేని ఇంధనాలు, శక్తిపైన ఆధారపడటం ఎక్కువ చేస్తోంది. ఉదాహరణకు డీజిలు, బొగ్గు గ్యాస్, లేక మరీ ప్రమాదకరమైన అణుశక్తి నుండి ఉత్పత్తి చేసే విద్యుత్ వాడకం, వాటిపై ఆధారపడటం ఎక్కువైపోతోంది. మరి ఎలా? క్రియాత్మకంగా ఈ సమస్యలకు పరిష్కారం త్వరగా ఆలోచించాలి. సేంద్రీయ వ్యవసాయం చేయడం, అవసరాలు, కోరికలు మితం చేసుకోవడమే దీనికి పరిష్కార మార్గంలో మొదటి మెట్టనిపిస్తోంది.

## బొద్దెంకల్గా ఆపిల్ పండ్లా?

పశ్చిమ దేశాల్లో వ్యవసాయంలో ప్రత్యక్షంగా పాల్గొనే ప్రజల సంఖ్య గణనీయంగా తగ్గించేయటంలో విజయం సాధించారు. ఈ దేశాలలో మూడు నుంచి పదిశాతం ప్రజలు మిగిలిన జనాభాకేకాక విదేశాలకు కూడా ఎగుమతి చేయగల ఆహార ధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తులు ఇతర వ్యవసాయోత్పత్తులు పండిస్తున్నారు. ఈ అధికోత్పత్తిని దేశ విదేశీ మార్కెట్లలో అమ్మాలి లేదా సముద్రం పాలు చేయాలి లేదా దానధర్మం చేయాలి లేదా బలవంతంగానైన కొన్ని దేశాలకు అమ్మాలి. ఆ దేశాలు చెప్పినట్లు నడుచుకోకపోతే వారికి ఆహార ధాన్యాల ఎగుమతులు అనుకున్నపుడు ఆపేయవచ్చు. బజారులో ధరలు పడిపోతే పంట పండించకుండా రైతులకు సరిపడా డబ్బు ఇవ్వవచ్చు. మొత్తం ప్రపంచాన్నంతా ఒక పెద్దబజారుగా తీర్చిదిద్దటం, (అభివృద్ధి చెందుతున్న) ఇతర దేశాలు ఆహారేతర పంటలు (పూలు, ఔషధ మొక్కలు, పండ్లు వగైరాలు) పండించి ఎగుమతిచేస్తే వారికి వీరు ఆహార పంటలు అమ్ముతారు. ఇది వారి పథకం. సరికొత్త సాంకేతిక విజ్ఞానంతో నేడు జన్యుమార్పిడి చేసిన ఆహార ధాన్యాలు మార్కెట్టులో అమ్ముతున్నారు. వీటిలో కొన్ని రకాల క్రిమికీటకాలను తట్టుకునే శక్తిగల జన్యువులను ఇతర జీవుల నుండి తీసి వీటి జీవకణాలలో చేర్చబడుతుంటాయి. దీనిని జెనెటిక్ ఇంజనీరింగు అంటారు. అనగా బొద్దింకలలో కొన్నిరోగాలు తట్టుకునే శక్తి వుంటే ఆ జన్యువులను ఆపిల్ చెట్ల జీవకణాలలో చేరుస్తారు. అలాగే మనుషుల నుండి అవసరమనుకున్నవి జంతువుల్లోకి, జంతువుల్లోనుండి మొక్కల్లోకి మళ్ళీ మొక్కల్లో నిరోధకశక్తి ఉన్న జన్యువులను జంతువులు, మనుషుల్లోకి ... ఇలా చివరికి ఒక ఆపిల్ పండు తింటున్నప్పుడు దాంట్లో ఎంత భాగం ఆపిల్‌పండు, ఎంత భాగం బొద్దెంక, లేక మనుషుల జన్యువులో మనకు తెలియదు.

చివరికి ప్రకృతిలోకి ఇటువంటి జన్యుమార్పిడి చేసిన విత్తనాలు చొచ్చుకుపోయాక ఎటువంటి పరిణామాలు దాపురిస్తాయో? ఇలాంటిదే మరో భయంకర ప్రయత్నం "టర్మినేటర్ సీడ్". ఒక కంపెనీ తయారు చేసిన విత్తనం మంచిపంట ఇస్తుంది. కాని అది ఒకే ఒక్కసారి. మళ్ళీ విత్తనం కావాలంటే తిరిగి కంపెనీ దగ్గరకు పోవాలి. ఈ విధంగా వివిధ వ్యవసాయ పంటలపై బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యం పెంచటానికి ప్రయత్నిస్తున్నారు.. దీనికి అవసరమైన పేటెంటు హక్కుల చట్టాలు చేస్తున్నారు.

మానవ సమాజానికి ఆధునిక పశ్చిమ దేశాలు చూపిస్తున్న దారి మన ఆత్మాహుతికి దారని చెప్పటంలో నాకెటువంటి సందేహం లేదు. మరి వేరే దారి (లు) ఏవి? ఖచ్చితంగా చెప్పలేకున్నాను. బజారు చట్రంలో ఇరుక్కున్నాం ... అందరికీ డబ్బు అవసరం. దాదాపు వ్యవసాయమంతా కూడా డబ్బు సంపాదన పైన కేంద్రీకరించి వున్నది. ఈ చట్రం నుండి ఎలా బయట పడాలో నాకు తెలియటం లేదు. "మీ కోరికలను మితం చేసుకోండి" అని చెప్పటం తేలిక. అలా చేయటంలో "ఖర్చు" ఏమీ కాకపోయినా ఈ సాధన చాలా కష్టమనిపిస్తోంది. భావాలను, కోరికలను అణుచుకోవటం ఎక్కడ అంతమవుతుంది? ... కోరికల నుండి ఆనందంగా విముక్తి పొందడం ఎక్కడ మొదలౌతుంది?

# II

# పాడి పరిశ్రమ : ఎవరు ఎవరిని పిండుతున్నారు?

జపాన్‌లోని ఫుకోకా గారి సేద్యంలో కాకుండా మన వ్యవసాయానికి పశువులతో వేల సంవత్సరాలుగా అవినాభావ సంబంధం వున్నది. మేము పాల ఆవుల పెంపకం పై కూడా దృష్టి పెట్టాం. మా ఆవులను కాయడానికి మేం నెలకి ఆరువందల రూపాయల జీతంపై ఒక మనిషిని పెట్టుకున్నాం. (రోజు 3 సార్లు మా ఇంట్లో తృప్తిగా భోజనం చేయడంతో ఈ 600 రూ.లు అతనికి (12 సం॥ల క్రితం) సరిపోయేది. మేము పశు గ్రాసాలు పెంచి, ప్రతి నెల వేరుశనగ పిండి, తవుడు కొనేవాళ్ళం. తరచుగా ఎండుగడ్డి అయిపోయేది. అలాంటప్పుడు మేం చాలా ధరకు దానిని కొనాల్సి వచ్చేది. మొదట్లో స్థానిక జాతి అయిన పుంగనూరు ఆవులను పెంచాలనుకున్నాం. కాని ఇప్పుడు ఇంజెక్షన్ (సూది) ద్వారా సంపర్కం (ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్) ఎక్కువ అవ్వడం వలన అవి అసలు కనపడడం లేదు. అందుకని మేం సంకర జాతి ఆవులతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. అయితే వీటిలో స్థానిక జాతుల శాతం ఎక్కువ వుండేలా చూసుకున్నాం. గడ్డి పెంచుతూ, కొన్ని పాలు ఇంటి వాడకానికి వుంచుకుని మిగిలినవి అమ్మడం వలన మొదట్లో మాకు ఏమీ నష్టం రాలేదు. కాని క్రమంగా వేరుశనగపిండి ధర పెరుగుతూ వచ్చింది. మొదట్లో అది పాలధరతో సమానంగా వుండేది (ఏడేళ్ళ క్రితం). కాని ఇప్పుడు పాలు రూ. 10.00 ఒక లీటరు అయితే వేరుశనగ పిండి దాదాపు రెండు రెట్లు అంటే రూ. 16 రూ.ల వరకు వుంది. ప్రతి రోజు ఆవుకి రోజుకి రెండు సార్లు దాదాపు 1 కేజీ పిండి చొప్పున తినిపించాలి. కాబట్టి చాలా మంది రైతులు ఈ నిబంధనల ప్రకారం పోలేరు. వారి ఆవులకు పొలాల నుండి గడ్డి తినిపించడమో లేక వారు పెంచే పశుగ్రాసాలను తినిపించటమో చేస్తారు. జనవరి నుండి 4 నెలలు చెరకు ఆకులు, తరువాత నెలల్లో వేరుశనగ ఎండు ఆకు (పండుటాకు), ఉలవల పిండి, తవుడు తినిపిస్తారు. ఇలా వేరు శనగ పిండి, తవుడు కొనడం బాగా తగ్గించి, వాటిని పాలిచ్చే ఆవులకి మాత్రమే పెట్టేవారు. ఆ తరువాత మాకు నష్టాలు మొదలయ్యాయి. 1997 నుండి మూడేళ్ళుగా మేం సం॥రానికి రూ॥లు 10,000 అదనంగా ఖర్చు పెడుతున్నాం! ఇలా ఎంతకాలం సాగించగలం? పాల ధరలో రైతుకు గిట్టుబాటు అయ్యేట్లుంటే ఎపుడో పెద్ద, పెద్ద డైరీలు అవతరించేవి. అలా వచ్చినవన్నీ గిట్టుబాటుకాక మూతపడ్డాయి. రైతులు స్వంత కష్టం లెక్క చేయక, పొలం గట్లు, చేలు, పొరంబోకుల్లో మేపడం, పంటల్లో

వచ్చిన వరి కసువు, వేరుశనగ పైనే మేపుతారు. ఈ విధంగా అతి తక్కువ ఖర్చు చేస్తేనే అంతో ఇంతో గిట్టుబాటు అవుతుంది. పాల డబ్బు ఇంటి ఖర్చుకి సరిపోతే, ఏదైనా లేగదూడ పుడితే (పెద్దదైతేపారిస్తుంది కాబట్టి), దాన్ని ఒకటి, రెండు సం॥లు పెంచితే అదే పాలల్లో వచ్చే లాభం! కరువు కాలంలో మూటా ముల్లే సర్దుకోకుండా రైతులను, కూలీలను ఆదుకున్నది పాల ఆవులే!

మా గోవులు కాసే ఆయన పేర బ్యాంక్‌లో పదివేల ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి అతనికి మా పనిలో నుండి రిటైర్‌మెంటు ఇచ్చేశాం. ఆవులు మేపడం తాత్కాలికంగా అతనికి ఇచ్చిన పని. మా ఆవులకు మరో పథకం వేశాం. వాటిని మా తోటలో పనిచేస్తున్న మరొకరికి ఒప్పజెప్పాం. పాల అమ్మకంలో 2/3 వంతు అతనికి 1/3 వంతు మాకు. ఈ 2/3 వంతులో శనగపిండి, తవుడు అన్నీ ఖర్చులు అతనే భరించాలి మరి. మేం ఆవు వైద్యం వరకు ఖర్చులు పెడతాం. మా వరి పొలాల నుండి కసువు ఉచితంగా సరఫరా చేస్తాం. అంతేకాక ఏ పంటలు వేసినా వాటి నుండి మిగిలినది ఏది వున్నా (ఎండుటాకులు వగైరా) ఆవులకు మేతగా ఇస్తాం. అతను దీనికి బదులుగా ఎంత పశువుల ఎరువు తయారైతే, అంతా మాకే ఇచ్చేయాలి. కాని ఇది కూడా సరిగా నడవలేదు.

దురదృష్టకరమైన విషయమేమంటే ప్రభుత్వం మొదట ప్రోత్సహించిన పాల సహకార ఉద్యమాన్ని తనే నాశనం చేయడం. ఈ ఉద్యమం బాగా నడిచిన రోజులలో పాల అమ్మకాలు చాలా అధికంగా వుండేవి. అందువల్ల రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. గ్రామీణ జీవితంపై ఆధునిక పాడి పరిశ్రమ ప్రభావం గురించి క్లాడు అల్వారిస్‌గారు ఎన్నో అర్థవంతమైన విమర్శలు చేశారు. (ప్రజలు పాలు, మజ్జిగ సేవించటం తగ్గించేసి డబ్బు కోసం మొత్తం పాలు అమ్మివేయటం వగైరా). కానీ మా ప్రాంతంలో మాత్రం పాలు సేవించటం ప్రజల నిత్య ఆహారపు అలవాట్లలో భాగం కాదు. పాలని పిల్లలకు, మజ్జిగకు మాత్రమే వాడేవారు. ఒక రైతు కుటుంబం చిన్న చిన్న రోజువారీ ఖర్చులకు పాలు అమ్మితే వచ్చే డబ్బు సరిపోయేది. సహకార సంస్థలకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే ఎలక్షన్లు పెద్ద రాజకీయ అంశాలయ్యాయి. గ్రామ స్థాయి సహకార సంస్థ కార్యదర్శికి కూడా బాగా ఆదాయం వచ్చేది. అధికారికంగా పరీక్ష కోసం కొంత ఎక్కువ పాలు తీసుకోవడం, అయినా పరీక్ష చేయకపోవడం, లీటరు పాలు కొలతను మించి పొర్లిపోయేలా పోయించుకోవటం వంటివి చేసి చాలా డబ్బు సమకూర్చుకునేవాడు. త్వరలోనే ఈ సొసైటీ డెయిరీ పై నుంచి కింది దాకా అవినీతి కూపం అయిపోయింది. వారు రైతులకు పాలు సరఫరా చేసినందుకు బిల్లులు సంవత్సరానికి పైగా బకాయి పడ్డారు. చాలా అందోళన తర్వాత ఆ బిల్లులు కట్టినప్పటికీ, తిరిగి అదే క్రమం మొదలైంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం ప్రైవేటు డెయిరీలు నడపడానికి అనుమతి ఇచ్చింది. మన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు (అప్పుడు ప్రతిపక్షంలో వున్నారు) ఇందులో ముందడుగు వేశారు. ఒక పెద్ద డెయిరీ (హెరిటేజ్ ఫుడ్స్) స్థాపించారు. ఈ ప్రైవేటు

డెయిరీలు ఒక అనధికార సంఘంగా అయ్యి, వారికి ఎంత మంది కొనుగోలు దారులున్నా కూడా పాల ధరలు మాత్రం పెంచేవారు కాదు. ప్రపంచ బ్యాంకు ప్రతిపాదించే ప్రైవేటీకరణలోని మూల సూత్రం ప్రకారం అనేక మంది ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలు పోటీ పడి రైతు వద్ద పాలు కొనేటప్పుడు రైతుకిచ్చే ధర పెరగాలి. ఇప్పుడు మా ప్రాంతంలో పాల ఉత్పత్తిదారుల పెద్ద ప్రైవేటు డెయిరీలు ఎక్కడా కనిపించవు. ఎందుకంటే ఆర్థికంగా అవి నిలవలేవు కాబట్టి. మధ్యవ్యక్తుల్లా రైతుల నుండి పాలుకొని టౌన్లలో పాలు అమ్మడం లాభదాయకం! కాబట్టి రైతులు తమ ఆవులను వారే మేపుకుని, ఎంత తక్కువ వీలైతే అంత తక్కువ వేరుశనగపిండి, తవుడు వాటికి తినిపించేవారు. దీనివల్ల పాల ఉత్పత్తి తగ్గుతుంది. కానీ గిట్టుబాటు అవుతుంది. తరచూ పాలలో కొంత నీరు కూడా కలుపుతుంటారు! (మరీ పలుచనైతే మీటరు బెట్టి చూసి కొలిచే వ్యక్తి తీసుకోడు).

ఇప్పుడు కలెక్షను ఏజెంట్లు ఎక్కువైపోవడంతో, వారే కొంత మంది రైతులకు ఆవులను అప్పులిచ్చి అవి రాబట్టుకోలేక రైతులు ఎన్ని నీళ్లు కలిపినా అలాగే పాలు పోయించుకుంటున్నారు. దీనితో పాల రేటు ఒక్కోసారి వారికి లీటరుకు 7 రూ.లు కూడా దక్కేది కాదు! కానీ పాలు పోసే వారికి 8 రూ.ల లెక్కన చెల్లించేవారు. ఈ దారుణాన్నుండి బయటపడటానికి ముందు ఎన్.డి.బి.బి వారి బాలాజీ డైరీ, ఆ తరువాత చంద్రబాబు హెరిటేజ్ డైరీ నాలుగు ఐదు ఊళ్లకి ఒక మెయిన్ సెంటర్ పెట్టి అక్కడే అందరిపాలు శాంపిల్ తీసి ఏ రోజుకారోజు టెస్టింగ్ చేసి వారి పాలు ఎంత చిక్కగా వుంటే అంత రేటు ఇవ్వడం మొదలెట్టారు. దాంతో అందరూ నీరు కలిపేయడం మానేసి చిక్కగా పోయటం మొదలెట్టారు. ఇప్పుడు సరాసరిన లీటరుకు 10 రూ.లు చెల్లించడం మొదలెట్టారు.

అయినా కూడా మన సూత్రం ప్రకారం ఇది ఇంకా తక్కువే. వేరుశనగ పిండి రేటు కిలో 16 రూ.లున్నది. పాల రేటు ఇంకా 10 రూ.లే! వీరి ఊబినుండి బయట పడేందుకు మూత బడిపోయిన చిత్తూరు విజయ డైరీని తెరిచే బదులు (దాని బకాయిలు చెల్లించలేక, సిబ్బందిని తీసుకోలేక) ప్రభుత్వమే మరో ప్రయోగం చేసింది. డ్వాక్రా మహిళా గ్రూపులు పాలు సేకరించి వారి ద్వారా శీతలీకరణ కేంద్రాలు నడిపించడం. ఇవి బాగా లాభాలు గడించాయని పేపర్లలో వచ్చింది. ఎలా చేస్తున్నారో చూడాలి. కానీ ఒకటి మాత్రం సత్యం. రైతు కష్టానికి పాల ధర న్యాయం చేయడం లేదు. దాన్ని వాదనలో ఎలా పెట్టాలో ఇంకా అర్థం కావటం లేదు. డైరీ వారిని అడిగితే ఎన్.డి.డి.బి (బాలాజీ) డైరీ వారే "ఇంతకు మించి మేం ఇవ్వలేం. ఇవ్వాలంటే అమ్మకం రేటు పెంచాలి." అని అంటారు. పెంచాలి అంటే ఇతర డైరీలతో పోటీ పడాలి. అందరూ పెంచితేనే ఇది సాధ్యమవుతుంది.

రోగాలకి సంబంధించినంత వరకూ ప్రజలు తమ పశువులకు సంప్రదాయ చికిత్సలతోనే నయం చేసుకునేవారు. ఎప్పుడైనా వారి ప్రయత్నాలు ఫలించకపోతే వారు

పశువులను ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రులకు తీసుకెళ్తారు. అది అల్లోపతి చికిత్స మాదిరే చాలా ఖర్చుతో కూడుకున్నది. అయినప్పటికీ కొన్ని ప్రమాదకరమైన జబ్బులు - ఆంత్రాక్స్ లేదా నోటిలో పుండ్లు, కాళ్ళ పగుళ్ళు, ఫుట్‌మౌత్ రోగం వంటివి అప్పుడప్పుడు ప్రబలమౌతుంటాయి. వెటర్నరీ ఆసుపత్రి ప్రకటనలలో ఇవే కన్పిస్తాయి. కాని, ఎవరూ ఇంగ్లాడులో లాగా, పశ్చిమ దేశాలలో లాగా కంగారు పడటం కనిపించలేదు. అయితే శాఖాహార ఆవులకి పౌష్టిక ఆహారమని వారిలాగా ఎముకల పొడి, పుర్రె పొడులు ఇచ్చి ఎటువంటి దుష్ఫలితాలు వుండవని ఊహించగలమా?

ఆవు మన సంప్రదాయంలో చాలా పవిత్రమైన జీవి. హిందువులు ఎన్నో ఏండ్లుగా దాన్ని గోమాతగా పూజిస్తూ వస్తున్నారు. ఈ రోజు వొట్టిపోయిన ఆవులకు, మగ దూడలకు (ముఖ్యంగా సంకరజాతి జెర్సీ, హోల్‌స్టీన్ రకాలు) సరిగా తిండి పెట్టరు. అవి త్వరలోనే కసాయి వాళ్ళకు దళారుల ద్వారా పోతాయి. లేదా చనిపోతాయి. రైతులని అడిగితే "అమ్మేశాం, ఎక్కడపోతయో" అని తెలియనట్లు మాట్లాడతారు.

కరెంటు మోటర్లు, ట్రాక్టర్లు రావటంతో ఎడ్లకు విలువ లేకుండా పోయింది. పొలంలో సాలు తోలడానికి విత్తనాలు వేసేటప్పుడు తప్పితే పెద్దగా ఎవరు వాడటం లేదు. ఈ కొద్ది పనులకే సంవత్సరం మొత్తం వాటిని మేపాలి. కాబట్టి ఊరికి ఒకటో, రెండో జతలు తప్పితే ఎక్కడా ఉండటంలేదు. మా ఊళ్ళో అయితే ఆవుల్నే (కొంత నాటు రకంగా వుండేవి) దున్నటానికి వాడేస్తున్నారు.

సేంద్రీయ వ్యవసాయం ద్వారా పశువులకు కేవలం వాటి పాలే కాకుండా వాటి ఎరువు, మూత్రం గోపంచతం విలువైన ఎరువుగాను, గోబర్‌గ్యాసుకును తిరిగి గుర్తించడమౌతోంది. తద్వారా పాలు ఇవ్వకపోయినా అవి చనిపోయేవరకు విలువైన జీవులుగా వుంటాయి. రోగాలను పెద్దగా తట్టుకోలేని విదేశీ జెర్సీ, హోలస్టీన్ జాతులతో సంకర జాతి ఆవులను గుడ్డిగా ప్రబలం చేసే బదులు, దేశీయ ఆవులను అభివృద్ధి చేయటమే ఎంతో శ్రేయస్కరం. సుభాష్ పాలేకర్ గారైతే మన దేశపు ఆవు పేడ, మూత్రంలో వుండే ప్రత్యేక గుణాలు సంకరజాతి ఆవుల్లో వుండవంటారు. ఆయన కేవలం దేశీయ ఆవుల - పశువుల పేడనే ఎరువుగా వాడమంటారు.

## సాంప్రదాయేతర ఇంధనాల ఆవశ్యకత :

మా ఆవులతో పాటు మేము ఒక పేడ గ్యాస్ తొట్టిని కూడా ఏర్పాటు చేసుకున్నాం. అది 3 ఆవుల పేడతో ఒక పూట భోజనం వండటానికి సరిపడే గ్యాస్‌ని ఇచ్చేది. అంటే అంత గొప్పగా పని చేయలేదని చెప్పొచ్చు. సిమెంటుతో అర్థకోడిగుడ్డు ఆకారం కప్పుతో (చైనీయుల మోడెల్) ఒక చిన్న బావిలా వుండేది. మాకు అది 10 సంవత్సరాలలో పాడవుతుందని తెలియదు. ఆ పైకప్పుకి 10 సం॥లకే పగుళ్ళు మొదలయ్యాయి. మేము

ఎంత ప్రయత్నం చేసినా అవి పూడుకోలేదు. దానితో ఇప్పుడు మేం వంట గ్యాస్ సిలిండరు దగ్గరలో వున్న టౌను నుండి తెచ్చుకుంటున్నాం. అయితే క్రొత్తగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్న "జనతా" మోడల్ పేడ గ్యాస్ చక్కగాను పనిచేస్తోంది. ఒక చిన్న కుటుంబం రెండు ఆవులతో తన మొత్తం వంటను పేడ గ్యాసుపై పూర్తి చేసుకోగలదు. నలుగురికి భోజనం తృప్తిగా దొరికేది. అందరికీ కనీసం ఒక ఆవు అయినా వున్నా మా గ్రామంలో కేవలం రెండు కుటుంబాలే ఈ పేడ గ్యాస్ కనెక్షన్ కలిగి వున్నారు. ఇతరులకి అంత స్థలం లేకపోవడం ఒక కారణం కావచ్చు. లేదా ప్రోత్సాహం లేకుండా అయినా వుండవచ్చు. ఎందుకు పేడ గ్యాస్ ప్లాంట్లు ఎక్కువ మంది రైతులు పెట్టుకోవడం లేదన్నది నా ప్రశ్న. గ్రామాలలో ప్రజలు కూడా ఎందుకు గ్యాస్ సిలిండర్లు కావాలని అనుకుంటున్నారు? ఇప్పుడు ప్రతి గ్రామంలోను ఖాళీ సిలిండర్లను దగ్గరగ్యాస్ ఏజంటుకి ఇచ్చి పై ఖర్చులకు 20 రూపాయలకి తిరిగి మరో సిలిండర్ ఇచ్చేటట్లుగా ఒక విస్తృతమైన వ్యవస్థ తయారైంది రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులోని స్త్రీలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చే పథకం తీసుకుని వచ్చింది. గ్యాస్ డబ్బుతో కూడుకున్నది కాబట్టి తరచుగా ఇది కాస్త ఆర్థికంగా నిలదొక్కుకున్న రైతు కుటుంబాలలోనే ప్రబలంగా వుంది.

దేశ వ్యాప్తంగా చూస్తే ఈ రోజు సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల డీజిలు, పెట్రోలు, కిరోసిన్ వగైరా ఇంధనాలు ఏటా దిగుమతి చేసుకుంటున్నాం. ఇవి మన అవసరాల్లో 75 శాతంగా వున్నది. కొత్తగా కృష్ణా - గోదావరి బేసిన్‌లో కనుగొన్న రిలయన్స్ గ్యాస్ నిక్షేపాల వల్ల మన రాష్ట్రంలో (దేశంలోనూ) పలు టౌన్లలో, పల్లెల్లో వచ్చే రెండు సంవత్సరాల్లో గ్యాస్ పైపుల ద్వారా సరఫరా చేసే అవకాశం వున్నది (2010 కల్లా). గ్యాసు పైపులైను ఉత్తర ప్రదేశ్‌కి పోయే దారిలోని టౌన్లకే ఇది పరిమితమౌతుంది. (విశాఖ, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వగైరా) ఈ గ్యాసు ఎన్ని సంవత్సరాల వరకు వస్తుందో తెలియదు. కానీ 20-30 సం॥ల వరకు కొదవ లేదని నిపుణులు ధైర్యంగా చెబుతున్నారు. ఈ గ్యాసు ఆధారితంగానే మన రాష్ట్రంలోని ఏడు ప్రైవేటు గ్యాసు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు భవిష్యత్తులో నడువనున్నాయి (2009 నుండి).

పెట్రోల్ - డీజిల్ కొరత తగ్గించేందుకు ప్రభుత్వం వారు బయో డీజిలు అనగా కానుగ, అడవి ఆముదం గింజల నుండి నూనె తీసి డీజిలు బదులు లేదా కలయికతో వాడకానికి వీటి తోటల పెంపకం విస్తారంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఇవి అడవి బంజర్లలోనూ. సేద్యానికి అందగా అనుకూలంగాలేని పోరంబోకు భూముల్లోనూ చేపట్టాలని పెద్ద పెద్ద ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, మన ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్ ముందంజలో వున్నారు. అనుత్పాదకంగా వున్న బంజరు భూముల్లో విస్తారంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ప్రజలకు ఉపాధి కలుగుతుంది. పర్యావరణ రక్షణ - అడవుల అభివృద్ధి జరిగే అవకాశం వుంది.

ముఖ్యంగా డీజిలు - పెట్రోలు ఇంధనాల వాడకంలో ఇతర దేశాలపై ఆధారపడటం కొంత తగ్గుతుంది.

కానీ ఆచరణలో, రైతులను కూడా ప్రోత్సహించటంతో పలు చోట్ల సారవంతమైన భూముల్లో కూడా ఆహార పంటలు, పండ్లతోటలకు బదులు కానుగ, అడవి ఆముదం చెట్లు విస్తారంగా నాటారు. ప్రభుత్వం వారు ఉచితంగా బిందుసేద్యం పరికరాలు అందచేశారు. మా ఊరిలో ఒక రైతు ఈ పథకం అమలు చేశారు. మూడు సం।లు జెట్రోఫా (అడవి ఆముదం) చెట్లు కాపాడితే ఆ తరువాత పథకం అయిపోతుంది. అప్పుడు తాను అదే భూమిలో మామిడి చెట్లు నాటుకోవచ్చు అని ఆయన ఆలోచన. అలాగే జెట్రోఫా చెట్ల సందుల్లో 36 అడుగులకు ఒక మామిడి చెట్టు లెక్కన నాటాడు కూడా. ఆ నేల కొంత సుద్దగా వుంది. అంత సారవంతమైన భూమి కాదు. ఇప్పుడు 3 సం।।లు అవుతున్నది అతను నాటి. అడవి ఆముదం చెట్లు (జెట్రోఫా) సరిగా రాలేదు. ఎందుకంటే భూమి సారవంతంగా లేదంటాడు. కానీ మామిడి చెట్లు అదే భూమిలో ఎలా పెరుగుతున్నాయి? జవాబు లేదు.

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ పథకాన్ని కొన్ని వేల, లక్షల ఎకరాల్లో అమలు చేశారు. ముఖ్యంగా మన దేశంతో పాటు దక్షిణ అమెరికాలోని బ్రెజిల్, అర్జెంటీనా మరియు ఆఫ్రికా ఖండంలోనూ. కానీ ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల బీడు బంజర్లలో బదులు ఎక్కువగా వీటిని ఆహార పంటలు పండే పొలాల్లో నాటటం వల్ల ఆహారోత్పత్తుల పంటలు తగ్గాయి. బయో డీజులుకు అనగా కార్లు- వాహనాలు తిరగటానికి ఇంధన వాడకం పెరగటం జరుగుతోంది.

## ఆరోగ్యమే మహాభాగ్యం

ఆరోగ్యం, అనారోగ్యం, చికిత్స వంటి అంశాలు కూడా ఇక్కడ ప్రస్తావించాలి. చౌకగా వుండే స్థానిక చికిత్స సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న మా అభిలాష మమ్మల్ని ఆయుర్వేదాన్ని ప్రోత్సహించేలా చేసింది. కాని మేం మొదలు పెట్టాలనుకోకముందే మా మూల ధనం నాలుగు లక్షలకు తగ్గిపోయింది. మేం ఆయుర్వేదిక్ డాక్టరుకి ఇవ్వాలనుకున్న నెలకి 2000 రూపాయల జీతం ఏ ఆయుర్వేదం డాక్టరుకి, ఆఖరుకి అప్పుడే పట్టా పుచ్చుకున్న వారికి కూడా ఆకర్షణీయంగా అనిపించలేదు. మా గ్రామానికి దగ్గరలో వున్న మెయిన్ రోడ్డులోని పెద్ద గ్రామంలో ముగ్గురు ఆర్.ఎం.పి.లు వున్నారు. ఎం.బి.బి.యస్ డాక్టరు 10 కి.మీ.ల దూరంలో వున్నారు. అల్లోపతి చదివిన మా స్నేహితుడు ఆనందరావుగారు వారానికి ఒకసారి తిరుపతి నుండి మా గ్రామానికి వచ్చేవారు. అతను మందులు గాని ఇంజక్షన్లు గాని అనవసరంగా ఇచ్చేవారు కాదు. ముందుగా ప్రజలు అతనిని అంతగా ఆమోదించలేదు. కాని మెల్లిగా అతని స్నేహశీలతను సమస్యను

వివరించి చెప్పడం, రోగి బాధలు వినడానికి ఇష్టపడటం ఇవన్నీ వారు అతనిని ఒప్పుకునేలా చేశాయి. ఇప్పుడు కొంత మంది రోగులు అతని దగ్గరకి కూడా వెళ్తుంటారు. పేషెంట్ల కోరికపై ఆయుర్వేద, అల్లోపతి, హోమియోపతి వంటి మందులు కూడా యిస్తున్నాం. (వారి ఇష్టానికే వదిలేశాం). అయితే చాలా మంది తొందరగా ఫలితాన్ని ఇస్తాయన్న నమ్మకంతో అల్లోపతికే ప్రాధాన్యత చూపేవారు. ఇదే ఆర్.ఎం.పిలు మాకు చెప్పిన విషయం. ఏ రకమైన మందు ఇచ్చినా అది వెంటనే రోగికి బాధ తగ్గించేలా వుండాలి. తరువాత అసలైన చికిత్స మొదలు పెట్టవచ్చు. మేము ఆర్.ఎం.పి.లకు మా డాక్టరు స్నేహితుని ద్వారా ఒక అల్లోపతీ చికిత్సా విధానం, జాగ్రత్తలు పైన ట్రైనింగు (రిఫ్రెషర్ కోర్సు) నిర్వహించాలనుకున్నాం. కాని మొదటి రెండు క్లాసుల తరువాత అది అంత అవసరమైన ప్రయత్నం కాదని వారు భావించారు. ఏదో కుంటి సాకుతో రావడం మానేశారు. తమ రోజు కూలీని నష్టపోవడానికి ఇష్టపడరు కాబట్టి వ్యవసాయ కూలీలు తొందరగా నయమయ్యే చికిత్సకే ప్రాధాన్యతనిస్తారు. ఆ ఆర్.ఎం.పిలు ఇంకా బలమైన, అనవసరమైన మందులు ప్రజలకు ఇస్తూనే వున్నారు.

ఒకవేళ అంతగా అవసరమైతే రోగం వున్నవారు దగ్గర పట్టణానికో లేక తిరుపతికో వెళ్తారు. కొన్ని వ్యక్తిగత కారణాల వలన మా డాక్టరు స్నేహితుడు రావడం మానేశారు. కాని ఫోను ద్వారా వైద్య సలహాలు అందిస్తూ, మేం పంపే పేషెంట్లను ఉచితంగా చూస్తున్నారు. నిజానికి అనవసరమైన మందులు, పరీక్షలు వ్రాయకుండా మనకు నమ్మకం వున్న డాక్టరు అందుబాటులో వుండడం ఒక గొప్ప అవకాశం. రోగులతో సానుభూతిగా మాట్లాడుతూ, రోగుల జబ్బులు, అజ్ఞానంపై డబ్బు సంపాదించకుండా వుండే, స్నేహితుడి లాంటి డాక్టరు వుండటం చాలా అవసరం. అయినా నేటి పరిస్థితులు ఇటువంటి ప్రయత్నాలను వెక్కిరిస్తున్నాయి. డాక్టరు చేత పరీక్ష చేయించుకోవడం సగం కథ మాత్రమే! అనారోగ్యం అంటే ఎవరూ అడ్డు చెప్పరు. ఆ పేరుతో టౌనుకెళ్ళడం, సినిమా చూడటం. కొన్ని వస్తువులు కొనుక్కోవడం జరుగుతుంటాయి.

## పాలిష్ చెయ్యని బియ్యం మొరటు

వ్యవసాయ కూలీల కుటుంబాలు చాలా వరకూ టీ, కాఫీ వంటి వాటితో ఇంకా కలుషితం కాలేదు. అయితే చాలా మంది రైతుల కుటుంబాలలో ఇవి తప్పనిసరి అవటమే కాక వారి స్థాయిని బట్టి వాటి పైన ఖర్చు పెట్టడం జరుగుతుంటుంది. అలాగే పాలిష్ చేసిన బియ్యమే కావాలని ప్రజలు పట్టుపడతారు. వారిచే పాలిష్ చేయని బియ్యం తినిపించాలని చేసిన మా ప్రయత్నాలన్నీ వృథా అయిపోయాయి. ఒక్కోసారి మాకు అతిధులు వచ్చినప్పుడు మేము కూడా పాలిష్ చేసిన బియ్యాన్నే వండాల్సిన పరిస్థితి వచ్చేది! కొన్నిసార్లు పనివాళ్ళు కూడా మా పాలిష్ చేయని బియ్యాన్ని తినడానికి ఇష్టపడక

తిరస్కరించినప్పుడు కూడా మేం వారికి వేరేగా వండాల్సి వచ్చేది. అలాగే గ్రామంలో బస్సు గురించి కూడా గుర్తు చేసుకోవాలి. ప్రజలు గంటల తరబడి బస్సు కోసం నిలబడతారే కాని (కొంచెం దూరం) ఒక కిలోమీటరు నడిచి ప్రక్క ఊరికి వెళ్ళరు.

## గాంధీ గారి చట్రంలో అపర్ణా - నగేష్‌లు

వ్యవసాయంలోని ఈ సందిగ్ధాలను ముగించే ముందు నేను నాగేష్, అపర్ణల గురించి చెప్పాలి. వీరిద్దరూ అమెరికాలో ఉద్యోగాలు చేసి తిరిగి వచ్చిన కంప్యూటర్ ఇంజనీర్లు. గాంధీగారి బాటలో ఆదర్శమైన వ్యవసాయం ద్వారా స్వయం సుస్థిరత / సమృద్ధి సాధించాలన్న కోరికతో మా దగ్గర్లో దళిత వాడలో నివసిస్తున్నారు. వాళ్ళు కొంత స్థలాన్ని కొనుక్కొని అందులో స్వయంగా వ్యవసాయం చేయాలని తలపెట్టారు. మా భూమిలో కొంత లీజుకి తీసుకోమని అడిగినా ఒప్పుకోలేదు. ఎప్పుడైతే మూడు సంవత్సరాల క్రితం స్థలం కొన్నారో అప్పట్నించి వారు వ్యవసాయం తప్ప మిగిలినదంతా చేయాల్సి వచ్చింది! రెవెన్యూ అధికారుల దగ్గరికి, కోర్టుకి, పోలీసుల వద్దకి, గ్రామ పెద్దల దగ్గరకి పరిగెత్తడంతో సరిపోయింది. రెండు సార్లు వారు కొందామనుకున్న స్థలం విషయంలో మోసపోయారు. (వాటిలో ఒక దానికి నేను కూడా కొంత వరకు కారణమే). చివరిసారిగా వారు ఒప్పందం చేసుకున్న వ్యక్తి తన పొలంలో కొంత తన పొరుగున వున్న బంధువైన వ్యక్తికి ఇస్తానని వాగ్దానం చేసి దానిని నగేష్‌కి అమ్మాడు. అలా ఆ యుద్ధం (ఘర్షణ) నెలలు, సంవత్సరాలు సాగింది. చివరికి ఆ పొరుగు వ్యక్తి తన భాగాన్ని మరొకరికి అమ్మేయడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది! భూమి కొనడం, వ్యవసాయం చేయడం వేరని అతికష్టంగా అనుభవంలో తెలుసుకున్నారు. (మేము కూడా).

నగేష్ చిరకాల స్వప్నం అడవుల రక్షణ. అందులో చెట్లు పెట్టించి ప్రజలే కాపాడి వాటిని అభివృద్ధి చేయాలని, తద్వారా భూగర్భ జలాలు పైకి వచ్చి రైతుల నీటి సమస్య తీర్చాలని భావించేవాడు. అదృష్టం కొద్ది ఆయన మిత్రుడు సదానంద్‌కు శ్రోతి గారు మా డివిజనులో ఫారెస్టు ఆఫీసరుగా వచ్చారు. ఆయన నగేష్‌ను శతవిధాలా ప్రోత్సహించారు. అప్పటికప్పుడే ఒక వన సంరక్షణ సమితిని స్థానిక యానాదులు (8 కుటుంబాలు, 80 దళిత కుటుంబాలు)తో ఏర్పాటు చేసి ఇందులో మాబోటి రైతులను చేర్పించి సరిగా నడిచేందుకు కృషి చేశారు.

నగేష్ అనేక మీటింగులు యానాది శేషాపురంలోను, దళిత వాడలోనూ పెట్టాడు. ఆ తరువాత ప్రభుత్వ బుల్‌డోజరువచ్చి 7-8 కుంటలు వేసింది. ఒక 40-50 ఎకరాలు చదరంగా తీర్చి దిద్దారు. మంచిమన్ను, ఇందులో ఎక్కడికక్కడ కాంటూరు కందకాలు. ఇందులో అటవీ శాఖ ప్రయోగాల కోసం మల్టీక్లోనింగ్ ట్రయల్ ప్లాట్ 30

ఎకరాల్లో అనేక రకాల హైబ్రిడ్ సీతాఫలం, ఉసిరి, అల్లనేరేడు, వేప, చింత, గుమ్మడిటేకు వంటివి వేయి మొక్కలు ట్రయల్ ప్లాట్లుగా వేశారు. ప్రతి చెట్టుకి నెంబరు వేశారు. వీటిలో ఏఏ మొక్కలు మన అడివి వాతావరణంలో బాగా పెరుగుతాయో చూడాలన్నది డిపార్టు మెంటు వారి ఆశ. కానీ వాటిని సహజసిద్ధంగా అడవిలో పెంచే బదులు ఆధునిక పద్ధతుల్లో కెమికల్ ఎరువులు, రసాయనిక ఎరువులు వేశారు. రోగాలొస్తే మందులు పిచికారీ చేశారు. రెండు బోర్లు వేసి నీటి వసతి ఏర్పాటు చేశారు. చుట్టూతా, దారిపక్కనా కొన్ని వేల గుమ్మడిటేకు మొక్కలు నాటించారు. ఒక పది ఎకరాలు వన సంరక్షణ సమితికి వదిలారు. అందులో కొన్ని వేల ఉసిరి, వేపమొక్కలు నాటారు.

చూడటానికి ఎంతో సుందరంగా వుండే ఈ వనానికి ప్రభుత్వం 15 లక్షల దాకా ఖర్చు పెట్టింది. దీని వెనక మా తమ్ముడు కృష్ణమూర్తి (మా పెదనాయన గారి కుమారుడు, ఆర్థిక శాస్త్రంలో ఎం.ఫిల్ చేశాడు) శ్రమ కూడా వుంది. దళిత వాడ నుండి హరిబాబు, యానాదుల నుండి వెంకటేశ్ ఈ పనుల్లో కార్మికులకు నాయకత్వం వహించారు. మా వన సంరక్షణ సమితి (వియస్.యస్) జిల్లాలోనే ప్రధమ స్థానంలోకి వచ్చేసింది!

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మొదలుకుని రాష్ట్ర మొత్తం నుంచి ఫారెస్టు అధికారులు, ట్రైనింగులో వున్నవారు, ఇతర వన సంరక్షణ సమితుల వారు అంతా మా వి.యస్.యస్‌కి వచ్చేవారు. కాలుమోపారు. ఈ వాలటం ఎక్కువైపోయి మేం డ్యూటీలుపెట్టుకోవాల్సి వచ్చింది! అందరూ మెచ్చుకునేవారు. ఇప్పుడు పంట రావడం మొదలైంది. ఇపుడు నగేష్ గారు, అపర్ణగారు, కృష్ణమూర్తి గారు ఆయన భార్య లత, హరి అంతా ఉసిరి నుండి జ్యాములు, పచ్చళ్ళు తయారు చేయడం, వగైరాలలో నిమగ్నులయ్యారు. ఈ శ్రమ ద్వారా కూడా వారికి మంచి పేరు వచ్చింది.

కానీ ఈ "అడవి మనది", "దీన్నిమనం కాపాడాలి" అనే భావన ఎక్కువ మందిలో రాలేదు. డబ్బు ఇస్తే పని చేస్తారు! ఇద్దరు, ముగ్గురు నాయకులు తప్ప మిగతావారి నుండి అటువంటి స్పృహ రాబట్టడం కష్టమై పోయింది. వారికి గడ్డి నాటుకొమ్మని, వర్మి కంపోస్టు తయారు చేసుకొమ్మని, కూరగాయలు పండించుకొమ్మని ఆ ఫలసాయమంతా వారే అనుభవించుకొమ్మని నర్సరీలు పెట్టుకొమ్మని ఎంత ప్రోత్సహించినా ఫలితం కనిపించలేదు.

పక్క ఊరి రైతులు తమ ఆవులు, ఎద్దులు మా వన సంరక్షణ అడవిలోకి తోలటం అలవాటు చేసుకున్నారు. వారికి మూడు సార్లు నచ్చచెప్పాం. ఫారెస్టు అధికారులను కూడా తీసుకువెళ్లాం. కానీ వారు చెప్పిందేమంటే అయ్యా చుట్టుపక్కల మేత లేదు, నీరు లేదు. కాబట్టి మేం తోలవలసిందే! ఈ ఆవులు అడవి మేస్తాయి. ఎంత

వాదించినా అది ఉచితమే గదా! అలాగే ఎద్దులు మేసి పెద్దవైతే జత 15 వేలు పైగానే అమ్ముడు పోతాయి. ఎవరో ఒకరిద్దరు ఊరిలో నుండి గొడ్లు మేపుకొని వస్తే సరిపోతుంది. ఇటువంటి ఆదాయం ఎందుకు పోగొట్టుకోవాలి?" చివరికి వారితో రాజీ పడాల్సి వచ్చింది. మా వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలోని సగం గుట్టలను వెనుకవైపు భాగాన్ని వారికి వదిలివేశాం. ఫారెస్టు వారు కింద వంకకు చెక్ డ్యాం కట్టి నీటి వసతి వారి పశువులకి ఏర్పాటు చేస్తామన్నారు.

మరో ఇబ్బంది ఇసుక దొంగలతో వచ్చింది. ఇప్పటి వరకు వన సంరక్షణ పరిధిలో చాలా మందిని పట్టి, ఫైన్లు వసూలు చేసి అరికట్టగలిగారు. అంటే దాని అర్థం మిగతా అడవిలో అంతా, అంతో ఇంతో ఫారెస్టు సిబ్బందికిచ్చి తీసుకోవచ్చన్నమాట!

# III

# వ్యవసాయ కార్మిక లోకం - అంతరానితనం

వ్యవసాయ కూలీ తన లోకంలోనే జీవిస్తాడు. అది ఇతరులతో కన్నా ఒక రైతుతో ఎక్కువగా పంచుకునే ప్రపంచం. అయినా అది ఎక్కువగా అతని స్వంత ప్రపంచమే. రైతు కంటే రైతు కూలీ రోజువారి బ్రతికే ఆలోచనకు అలవాటుపడతాడు. పొదుపు చేయడం కాని, ఆస్థిని సంపాదించుకోవడం గురించి గాని అతనికి అంతగా ఆలోచన వుండదు. (అయితే అరుదుగా వారిలో కొద్దిమంది అలా చేస్తారు). డబ్బులు వున్నప్పుడు విలాసంగా ఖర్చు పెడతారు. లేనప్పుడు ఒకపూట లేదా రెండు పూటలు తిండి లేకున్నా వున్న కొంతలోనే సర్దుకోగలరు. వారు వ్యవసాయ రంగంలోనే జీవిస్తున్నప్పటికీ వారికి కావలసిన బియ్యం, నూనె, కూరగాయలు, సబ్బులు, బట్టలు, చెప్పులు, మందులు, ఇప్పుడు వారు వాడుకునే చిన్న బల్బుకి విద్యుత్ శక్తి, ఇలా ప్రతి చిన్నది వారు కొనుక్కోవలసి వస్తుంది. కొద్ది మంది రిజర్వేషన్లు, చదువు, రైల్వేలో ఉద్యోగాలు, టౌన్లలో పని, ఉద్యోగాలు పుణ్యమా అని కొంత బాగుపడ్డారు. కాని ఇలాంటి వారు అతికొద్ది శాతమే.

## అప్పుడు - ఇప్పుడు

40 - 50 ఏళ్ళ క్రితంతో పోలిస్తే చాలా అంశాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. వాటిని అన్నీ కలిపి సూత్రీకరించడం కనీసం స్థానికంగా కూడా చాలా కష్టసాధ్యమైన పని. ఎప్పుడూ రైతు కూలీని అతని వర్గంతోపాటు కులం, ప్రాంతం వగైరాలతో వర్ణించాల్సి వస్తుంది. కాని ఆలోచనలోనూ, ప్రవర్తనలోనూ రైతు నుండి కూలీలను వేరు చేసే ప్రత్యేకత ఏదో వుంది. మా ప్రాంతంలో దాదాపు అందరు కూలీలకు కొంత భూమి, అంటే 1/2 ఎకరం దాకా ఎక్కువ భాగం మెట్ట పొలం వుంది. దానిలో వారు వేరుశనగ లేదా జొన్నలు, ఉలవలు వేస్తారు. వారిలో కొంత వ్యాపార దృష్టి వున్నవారు వర్షాకాలంలో టమాట కూడా పండిస్తారు. మా గ్రామంలోని దాదాపు అన్ని ఎస్సీ కుటుంబాల వారు ఒకరికి కాకపోతే మరొక రైతుకి కౌలుదారులుగా వున్నారు. కుటుంబంలో వయస్సులో పెద్ద అయిన మగవారు కౌలుదారుడిగా వుంటే, అతని భార్య రోజు కూలిగాను, కొడుకు ఇతర యువకులతో చేరి గుత్తగా పనిచేస్తారు. ఎక్కువ డబ్బు సంపాదన చేస్తుంటాడు. (అలాగే ఖర్చు పెడతాడు). ఆడపిల్లలు ప్రత్యేకించి ఇంటిపనులకే పరిమితమౌతారు. 10 నుండి

12 సంవత్సరాల లేత వయస్సులోనే వ్యవసాయ కూలీలుగా తయారవుతారు. 14 - 16 సంవత్సరాలు వచ్చేసరికి, పెద్దపిల్లలు అవ్వగానే వారిలో చాలా మందికి పెళ్ళిళ్ళు కూడా అయిపోతాయి. ప్రజలకు పెళ్ళికి ముందర వివాహేతర సంబంధాలంటే చాలా భయం వుంది. అయితే పెళ్ళి ఒక లైసెన్సుగా చూడటం చాలా ఆశ్చర్యకరమైన విషయం. వివాహేతర సంబంధాలు. వేరొకరితో వెళ్ళిపోవడం సాధారణమైన విషయాలు. ఎవరూ వాటి గురించి అంతగా పట్టించుకోరు. ఇది తరచుగా రైతు కూలీల కుటుంబాలలో ఎక్కువగా వున్నప్పటికీ వ్యవసాయ దారుల కుటుంబాలలో కూడా కన్పిస్తుంది. సాధారణంగా ఈ ప్రవర్తన వారి కులంపై ఆధారపడి వుంటుంది.

నాలుగైదు దశాబ్దాల క్రితం మా తాతగారికి, తరువాత మా పెదనాన్న గారి వద్ద సుమారు 10 మంది పాలేర్లు (జీతగాళ్ళు) సంవత్సరమంతా పని చేసేవారు. ఒకరు 100కి పైగా వున్న గొర్రెలను కాయడానికి, ఇంకొకరు 20–40 గేదెల కొరకు, ఒకరు 40–60 ఆవులకు, 4 జతల ఎడ్లను చూడడానికి ఇద్దరు, వంట ఇంట్లో ఇద్దరు, ఆ రోజులలో కౌలు అనే ప్రశ్నేలేదు. వ్యవసాయ పనులన్నీ పాలేర్లతోను, రైతు కూలీలను నియమించుకుని పూర్తి చేసేవారు. ఒకవేళ తీవ్రమైన కరువు ఏదైనా వస్తే (10–15 సంవత్సరాలకి ఒకసారి) తప్ప ఎప్పుడూ పని, ఆహారం వుండేవి. ఎవరికీ ఆకలితో వుండే పరిస్థితి లేదు రాగిపిండి, బియ్యం కలిపిన సంగటి ముద్దలు, పచ్చడి లేక వేడి కూర, మింగడానికి వీలుగా కొంత మజ్జిగా – ముఖ్యంగా వేసవిలో ఇదీ వారి ఆహారం. జొన్న, కొర్ర, సజ్జలు, సామలు వంటి ఇతర ధాన్యాలు కూడా వుండేవి. కాని వాటిని వండడానికి ఎక్కువ సమయం పట్టేది. చిన్న రైతులకి కూడా సంవత్సరానికి కొంత జీతంపై పనిచేసే కూలీలు వుండేవారు పిల్లలు పశువులు మేపడంతో మొదలుపెట్టి చివరకు పెద్ద ఎద్దుల సహాయంతో పొలం దున్నడం, వరి పొలాల్ని తయారు చేయడం వంటి కష్టమైన పనులను నేర్చుకునేవారు. అడవి చాలా విస్తృతంగా వుండి చాలా వస్తువులు, వంట చెరకు, వెదురు, ఇంటి కోసం కలప మొదలైనవి సులభంగా "ఉచితంగా" దొరికేవి. అడవి ఎప్పుడూ ఎవరికి కావలసినంత వారు తీసుకోగలిగే నిధిగా, తల్లిగా వుండేది.

మా ప్రాంతంలోని 70–80 శాతం వ్యవసాయ కూలీలు షెడ్యూలు కులాల వారు. ప్రధానంగా 'మాల' కులానికి చెందినవారు. వడ్డెర కులస్థులు రాళ్ళు, మట్టిపనిలో ప్రావీణ్యం వున్నవారు (వేరు వేరుగా వుండేవారు) వీరు కూలీ పనిచేస్తారు కానీ ఎక్కువగా కాంట్రాక్టు పద్ధతిలో పని తీసుకుని చేస్తారు. బావులు తవ్వడానికి వారికి చాలా డిమాండు వుండేది. అయితే ఇప్పుడు బోరుబావులు రావడంతో వారు ప్రభుత్వ పనులు అంటే రోడ్లువేయడం, బ్రిడ్జీలు, కాలువలు, చెరువులు, ఇళ్ళు కట్టడం, పెద్ద పెద్ద వ్యవసాయ పనులకే పరిమితం అయ్యారు. వీళ్ళు ఎస్సీ కూలీల కంటే ఎక్కువ కూలీ తీసుకుంటారు. వీరు పనికి ముందే డబ్బు తీసుకుని, తరువాత ఇంకా ఎక్కువ కావాలని డిమాండ్ చేస్తుంటారు. పని అయ్యే సమయానికి (అప్పటికే వేరొక చోట కాంట్రాక్టు పట్టుకుంటారు)

మొదట వొప్పుకున్న దానికన్నా దాదాపు 25 నుండి 50 శాతం ఎక్కువగా డబ్బు గుంజేస్తి వుంటారు. 'మించినోడిని వడ్డోనికి పట్టియ్యాలి' అనే నానుడి కూడా వుంది! ఇతర కులాల వారికన్నా వీరిలోనే అధికంగా త్రాగడం ఇతర చెడు ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఈ మధ్య కాలంలో రోడ్డు పనులకి, మట్టి పనులకు ప్రొక్లెయిన్‌లు రావడంతో వీరు చాలా ఒత్తిడికి లోనవుతున్నారు.

ఎస్సీ కూలీలను చూస్తే, వారు వేసుకునే బట్టలు మెరుగయ్యాయి. అలాగే వారి శుభ్రత కూడా. ఇప్పుడు వారు శరీరం పూర్తిగా కప్పేట్లు బట్టలు వేసుకుంటున్నారు. స్త్రీలు ధర తక్కువగా వుండి ఎక్కువ రోజులు మన్నే పాలిస్టర్ చీరలకు అలవాటుపడ్డారు. మగవారు ఇంకా నూలు బట్టలే వేసుకుంటున్నారు కాని పిల్లలంతా పాలిస్టర్‌కు మారారు. అలాగే యువతరం తమ స్నానాలకు ఖరీదైన సబ్బులు వాడుతున్నారు.

ప్రతి ఇంట్లో కరెంటు వుంది. ఒక కుగ్రామంలో 80కి పైగా దళితుల ఇళ్ళు వుంటే 5 టీవీలు, 10 ఫ్యాన్లు అంతే సంఖ్యలో టేప్ రికార్డర్లు / రేడియోలు వున్నాయి. వారిలో చాలా మంది ఇండ్లకు ఒకే ఒక బల్బు వుంది. ప్రభుత్వ సహాయంతో (ముందు రూ. 15,000 /- ఇప్పుడు రూ. 22 వేలు అంటే 50 శాతం ఖర్చుతో) పక్కా ఇళ్ళు వస్తున్నాయి. వాటర్ టాంక్‌ని కూడా పెట్టారు. (ఒక ఊరిలో వుంది, ఇంకో ఊరులో లేదు). కొన్ని కుటుంబాలు తిరుపతికి వలసపోయి అక్కడ ఆసుపత్రులలో వార్డు బాయ్‌లుగా, రెస్టారెంట్లలో వెయిటర్లుగా, మేస్త్రీలుగా పనికి కుదిరారు. ఒక అమ్మాయి ప్రభుత్వ డాక్టరు కాగలిగింది.ఇద్దరు పోలీసు డిపార్టుమెంటులో పనిచేస్తున్నారు. ఒకరు యూనివర్శిటీలో లైబ్రేరియన్‌గా వుండి తన గ్రామంలో తల్లిదండ్రులుండే చోట టెలిఫోన్ పెట్టించాడు.

ఇప్పటి రోజులలో (గత 20కి పైగా సంవత్సరాలలో) అందరు దళిత అబ్బాయిలు, అమ్మాయిలు బడికి వెళ్తున్నారు. కాని అది ఒక బడేనా? టీచర్లకి మంచి జీతాలు (రూ. 4000 /- నుండి 10,000 /- రూ.ల దాకా) ఇచ్చినా వాళ్ళు బాధ్యతతో బోధించడానికి ఇష్టపడరు. పిల్లల్లో చాలా మంది బట్టీపట్టి రాయడం చేస్తారు. కాని అంకెలు చదవడం అక్షరాలు గుర్తుపట్టడం సరిగా రాదు. ఏ రకంగానూ వీరు డాక్టర్లు, ఇంజనీర్లు కాదుగదా కనీసం అటెండర్లుగా కూడా అవ్వలేరు. దళితులు లేని పల్లెల్లో ఇతర ప్రాథమిక బడుల పరిస్థితి కూడా ఇంతకంటే మెరుగ్గా ఏమీ లేదు.

40-50 సం॥రాల క్రితం కూలీలకు ధాన్యాల ద్వారా జీతాలిచ్చేవారు. డబ్బు రూపేణా చెల్లించడం చాలా అరుదు. మగవారికి రోజుకు 5 పడుల వడ్లు (1 1/2 కె.జి), స్త్రీలకు 4 పడుల వడ్లు (1 1/4 కిలో) చిన్న పిల్లలు పశువుల మేపుకుని వచ్చినందుకు వారికి ఎక్కువ జీతం వుండేది కాదు: భోజనంతో పాటు సంవత్సరానికి 5 లేక 6 రూ.లు మాత్రమే. పెద్ద పాలేరు సంవత్సరానికి 50 రూ.ల నుండి 60 రూపాయలతో పాటు రోజుకి మూడు పూటలా భోజనం వుండేది. ప్రస్తుతం స్త్రీల కూలీ 50 రూపాయలు

రోజుకి, మధ్యాహ్నం ఒక పూట భోజనం పెట్టాలి. ఇంకా అధికారికమైన కూలీ 80 రూపాయల కంటే ఇది చాలా తక్కువే. అయితే 1996 నుండి 2006 వరకు ఈ కూలీ 20 రూపాయల నుండి 30 రూపాయలకి ఒకపూట భోజనంగా ఉండేది. పనికి హామీ పథకం రావటంతో అందులో అన్నం లేకుండా 80 రూపాయల నుండి 120 రూపాయలు సంపాదిస్తున్నారు. మగవారికి 80 రూపాయల వరకు భోజనం లేకుండా అయితే అదే భోజనంతో అయితే 5 నుండి 10 రూపాయలు తక్కువగా ఇస్తారు. కంచె వేయడం, చెట్లు కొట్టడం వంటి కష్టమైన పనులకు వారి కూలిరేటు 80 రూపాయల నుండి 100 రూపాయల వరకు వుంటుంది. ఈ రోజుల్లో టౌనుకి ఎంత దగ్గరగా వుంటే అంత రేటు ఎక్కువ. అలాగే కూలీలు దొరకటం కూడా కష్టం అవుతుంది. ఈ పని వేళలు ప్రాంతం ప్రాంతానికి, కొన్ని కిలోమీటర్లు దూరానికే మారిపోతూ వుంటాయి. కొన్ని చోట్ల వారు తెల్లవారు ఝామునే వచ్చి మధ్యాహ్నానికి ముగించుకుంటారు. మరికొన్ని ప్రదేశాలలో ఉదాహరణకి మా గ్రామంలో వారు పొద్దున 9-9.30 నుండి సాయంత్రం 4.30-5 గంటల వరకూ పనిచేస్తారు. మధ్యలో మధ్యాహ్నం ఒక గంట భోజనాలకి వుంటుంది. అన్నిటికన్నా ముఖ్యంగా పనికి హామీ పథకం ద్వారా కూలీకి రేట్లు కుటుంబానికి సరిపడేంత కాకున్నా కొంత వరకు పెరిగాయి. పనికి హామీ పథకం ద్వారా ఉదయం 7-8 గంటలకి పనికి పోయి మధ్యాహ్నం పన్నెండున్నర కి ఇంటికి తిరిగి రావటానికి అలవాటు పడ్డారు ఈ అర్థ దినంలో పూర్తి కూలీ ఇస్తూ ఏంపని జరుగుతుందని రైతులంతా విస్తుపోతున్నారు. మాట్లాడితే గుత్త పని అంటారు. ఇక వ్యవసాయం లాభంలేదు. తోపులు పెట్టుకోవాల్సిందే అన్నది పదే పదే అంటున్నారు. చిన్న రైతులనుండి కూడా ఇదే విన వస్తున్నది.

అయితే చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోనూ, ప్రక్కనే వున్న అనంతపూరు జిల్లాల్లోనూ మాగాణి భూములకు మెట్ట ప్రాంతాలకు కూలి దొరకడం, కూలి రేటు గిట్టడంలో చాలా తేడాను గమనించవచ్చు. అలాగే ఋతువులకు అనుగుణంగా కూలీలు వలసపోవడం ముఖ్యంగా, మాగాణి భూములకు కూలి కోసం వెళ్ళడం కూడా గమనించాలి. యూనియన్లు లేకున్నా ఒకసారి కూలి రేటు పెరిగిందంటే, ఇది ఇంక తగ్గడానికి దాదాపు అవకాశమే లేదని అనుకోవాలి. ఇక్కడ ఒక రకమైన సోదర భావం వుంటుంది. ఇతర కులాల నుండి కూడా వ్యవసాయ కూలీలు వున్నారు. ప్రత్యేకించి మా పక్క ఊరిలో రెడ్లు, బలిజలు. వీరిలో చాలా మంది రోజు కూలీకి వెళ్ళేవారు. కానీ ఈ రోజు ఆ ఊరిలోనూ చాలా మార్పులు వచ్చాయి. అబ్బాయిలలో చాలా మంది ఇంటర్ వరకూ చదివారు. కొంత మంది పోస్టు గ్రాడ్యుయేషన్ కూడా చేశారు. ఆరుగురు అబ్బాయిలు సైన్యంలోను, అనుబంధ సర్వీసులలోను (రిక్రూట్‌మెంట్ కోసం ఎక్కువ మొత్తంలో లంచం ఇచ్చి) చేరారు. కొంత మంది రైల్వే ఉద్యోగులు, ఇద్దరు టీచర్లు, మొత్తం మీద గ్రామంలో పూరి ఇళ్ళు ఇక లేవనే చెప్పాలి. ప్రతి ఒక్క ఇంట్లో టీవీలు (అంతా చిన్న,

సన్నకారు రైతులే) వున్నాయి. చాలా కొద్ది మంది మాత్రమే పనికి కూలీలుగా వెళ్తారు. చిన్న, సన్నకారు రైతులలో చాలా మందికి, మాగాణి భూములున్న అందరికీ బియ్యం, రేషన్ కార్డులున్నాయి. కానీ కేవలం దళితులకే సబ్సిడి మీద రేషన్ బియ్యం దొరుకుతున్నట్లు, అందువల్ల ముందులాగ పనికోసం వారు రావటం లేనట్లు రైతులంతా మాట్లాడుతుంటారు.

## ఉన్నవారు - లేనివారు :

వర్గ విశ్లేషణ చేసినట్లైతే 40 ఏళ్ళ క్రిందటి పరిస్థితితో (1960లలో) నేటి పరిస్థితిని పోలిస్తే, అప్పట్లో పెద్ద భూస్వాములు కొందరు వుండేవారు. మా పెద్దనాన్నగారు (నాన్నగారితో కలిపి) 90 ఎకరాలు సాగు చేశారు. మా ప్రక్క గ్రామంలోని రెడ్డి కుటుంబానికి 400 ఎకరాలపై అజమాయిషీ వుండేది. మూడవ రెడ్డి భూస్వామి మరోపక్క గ్రామంలో 200 ఎకరాలు అధీనంలో వుంచుకున్నాడు. మరోపక్క గ్రామంలో ఇంకొక రెడ్డికి 1000 ఎకరాలు, ఆ పక్క ఊరిలో షావుకారు కోమటిశెట్టి కుటుంబానికి కూడా 1000 ఎకరాలు వుండేది. వీరు వడ్డీ వ్యాపారం చేసి పాలెగార్లకు – అప్పటి జమిందార్లకు కూడా అప్పు ఇచ్చి వడ్డీ క్రింద చాలా భూమిని ఆక్రమించుకున్నారు. ఈ ప్రాంతం పాలెగార్లు – జమిందార్లు త్వరగా అంతరించిపోయారు. 1950లో జమిందారి వ్యవస్థ రద్దయినప్పుడే వారి విలాసవంతమైన జీవితం, మద్యం సేవించే అలవాటు, స్త్రీలపై వ్యామోహం, పెద్దగా చదువు లేకపోవడం పుణ్యమా అని వీరంతా చితికిపోయారు. ఒక గ్రామంలోని రెడ్డి, పాలెగాళ్ల కింద పద్దులు రాసేవాడు. అతను అధికారాలను దుర్వినియోగం చేసి చాలా బీడు భూమిని (మొత్తం సుమారు 600 ఎకరాలు) ఆక్రమించుకున్నాడు. అతని సంతతి ఆస్తి చాలా భాగం అమ్మేసుకుని చాలా మంది సభ్యులు గ్రామం వదలి వెళ్ళిపోయారు. ఒకరైతే చదువుకుని అమెరికా వెళ్ళారు.

భూగరిష్ట పరిమితి చట్టం పుణ్యమా అని, అలాగే స్వాతంత్ర్యం తరువాత పెరిగిన రెడ్ల రాజకీయ పలుకుబడి, షావుకార్లను వారి భూములను అమ్మేసి, ఆ డబ్బుతో పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళేలా ప్రోత్సహించింది. వెయ్యి ఎకరాల వ్యవసాయ భూమికి సొంత దారులైన మరో రెడ్డి గారి కుటుంబం గతంలో చేనేత వ్యాపారం ద్వారా బాగా సంపాదించి ఆ ప్రాంతంలో చాలా స్థలాన్ని స్వంతం చేసుకొని స్థిరపడ్డారు. వారికి కొబ్బరి, మామిడి తోటలు విస్తారంగా వున్నాయి. వారి ఊరిలో ఒక చిన్న వేరుశనగ నూనె ఫ్యాక్టరీని చాలా కాలం బాగా నడిపారు. వారి యువతరం చిత్తూరులో ఒక మిఠాయిల ఫ్యాక్టరీ (న్యూట్రీన్) ప్రారంభించి బాగా నడిపించారు. భూగరిష్ట పరిమితి చట్టం పుణ్యమా అని వారు కూడా వారి భూములను చిన్న చిన్న భాగాలుగా విభజించారు. దాదాపు వంద ఎకరాల మెట్ట భూములపై ప్రభుత్వానికి పూర్తి హక్కులను ధారాదత్తం చేశారు. దానిని ప్రభుత్వం తిరిగి పేదలకు పంచి పెట్టింది. అక్కడ వున్న పేదవారికి అవి ప్రభుత్వం తమకు పంచి ఇచ్చిన

భూములే అని తెలిసినప్పటికీ భూమిపై హక్కుల పత్రాలు మాత్రం భూస్వాముల వద్దే వున్నాయి. అయితే ఈ విషయాన్ని ప్రశ్నించే సాహసం ఎవరికీ లేకపోయింది. మా పొరుగున వుండే భూస్వామి ఇప్పటికీ వంద ఎకరాలను తన అజమాయిషీలో వుంచుకున్నాడు. (ఎక్కువ భాగం బ్రిటీష్ వారి హయాంలో మద్యం వ్యాపారం ద్వారా సంపాదించినది). తన నాలుగు వందల ఎకరాలపై చిలుకు భూములని తన పేర, తన ఆరుగురు పిల్లల (ఆడ, మగ) పేర్లపై వీలయినంత ఎక్కువగా వుంచుకోవడానికి పంచుకున్నాక తప్పనిసరై ఐదు ఎకరాల (!) భూమిని ప్రభుత్వానికి స్వాధీనపరచాడు. దానికి తన కింద పనిచేసే కొంత మంది దళిత కులాలకి చెందిన వ్యవసాయ కూలీల పేరున పంచి ఇచ్చాడు. అయితే ఆ భూములు కూడా అతని స్వాధీనంలోనే వుండి, వాటిని అతనే అనుభవిస్తున్నాడు. (ఆ భూమి చుట్టు వున్న భూములు రెడ్డి భూస్వామివే!). ఒకవేళ ఏదైనా అధికారిక విచారణ జరిగితే, పట్టాదారులు ఆ భూములకు తామే యజమానులమని వాటిని తామే అనుభవిస్తున్నామని సమాధానం చెప్తారు! ఈ కుటుంబానికి కొంత రాజకీయ పలుకుబడి వుండడం వలన వారు కొంత దురుసుగా ప్రవర్తిస్తూ వుంటారు. చాలా రోజుల క్రితమే ఆ భూస్వామి ఇద్దరు కుమారులలో ఒకరు బెంగుళూరుకు, ఇంకొకరు చెన్నైకు వెళ్ళిపోయారు. వారికి చెన్నైతో పాటు సింగపూర్, బెంగుళూరులో కూడా వ్యాపారాలున్నాయి. ఆ గ్రామంలో వారు మామిడిపళ్ళ నుండి రసం తీసే ఒక ఫ్యాక్టరీని కూడా స్థాపించారు. పెద్ద భూస్వామి యొక్క ఒక మనుమడు పట్టణం నుంచి తిరిగివచ్చి ఆ బాధ్యతను తీసుకుని, సజావుగానే నడుపుతున్నట్లు కనపడుతుంది.

తెలుగుదేశం పార్టీ ప్రభావం పెరగడం వలన ప్రత్యేకించి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వలన, ఈ కుటుంబ రాజకీయ పలుకుబడి క్షీణించింది. ఇప్పటికీ చిన్న తరహా "దర్బారులను" నిర్వహిస్తూ చుట్టుపక్కల వున్న పదిహేను గ్రామాల ప్రజలకు సంబంధించి వివాదాలు పరిష్కారం చేస్తున్నారు. సంప్రదాయంగా వస్తున్నటువంటి కమ్మ మరియు రెడ్ల మధ్యన శతృత్వం పుణ్యమాని (రెండూ శూద్ర రైతుల కులాలే) పక్కన గ్రామాల్లో ఉన్నటువంటి కమ్మవారు రెడ్డి భూస్వాముల ఆధిపత్యాన్ని అంగీకరించక స్వతంత్రంగా వ్యవహరిస్తుంటారు. మా పొరుగు గ్రామంలోని రెడ్లు మా పెదనాన్నగారి ఆధిపత్యాన్ని నిరసిస్తూ అ పక్క గ్రామంలోని రెడ్డి భూస్వామికి తమ విధేయతను ప్రకటిస్తుంటారు! మా కుటుంబంలో మా తాతగారు భూములను విస్తృతంగా కొని మామిడి తోటలుగా మార్చి మామిడికాయల వ్యాపారం (ఆ ప్రాంతంలో మొదట విస్తరించింది ఆయనే) చేయడం ద్వారా ఆస్తులను పెంచారు. అటువంటి ధోరణి మా పెద్దనాన్నగారికి లేకపోవడంతో అతి కష్టం మీద ఇంకొక ఇరవై ఎకరాలు మాత్రమే కలుపుకోగలిగారు. మా నాన్నగారు హైదరాబాదులో ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండడం వలన వారిద్దరికి ఆస్తి పంచే సమయంలో మా పెదనాన్న గారికి కొంచం ఎక్కువ ఆస్తి వచ్చింది.

మా పెదనాన్నగారి పిల్లలలో ఒకరు చదువులో వుండిపోవడంతో మిగిలిన ముగ్గురిలో ఒకరు తప్ప తక్కిన ఇద్దరికి అంత చతురత లేకపోయేసరికి వారికి ఒక్కొక్కరికి వచ్చిన పన్నెండు ఎకరాలు భూమిని పోగొట్టుకోకుండా సాగుచేసుకుంటున్నారు. ఆ ఒక్కరు (ఆర్థిక శాస్త్రంలో ఎమ్.ఫిల్ చేశారు) దగ్గరలో వున్న మార్కెట్‌లో మామిడి కాయల వ్యాపారం బాగా నిర్వహించగలిగినప్పటికీ ఏ మాత్రం భూమిని కొనలేకపోయారు. మా కుటుంబానికి సంబంధించినంత వరకు నాకు చేతనైన అరకొరా నిర్వహణకు వచ్చే ఆదాయంలో సంవత్సరానికి ముప్పయి ఆరు వేల రూపాయలు నాకు చెల్లిస్తూ మిగిలిన లాభనష్టాలను ముగ్గురం సమంగా పంచుకుంటున్నాం. నా ఇద్దరు సోదరులలో ఒకరు సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పదవీ విరమణ చేశారు. మరొకరు లాయరు. ఇద్దరూ హైదరాబాదులో స్థిరపడ్డారు.

## కొత్త సంపన్నుల కథ :

మా పొరుగున వున్న గ్రామంలో మాకు దగ్గరి బంధువులయిన ఒక కమ్మ కుల భూస్వాములున్నారు. రాజకీయ నాయకులుగా మారిన కొత్త తరగతికి వారు నాంది పలికారు. మా తాతగారి హయాంలో వారికున్న ఆస్తి మా ఆస్తిలో సగం (సుమారు యాభై ఎకరాలు) వుండేది. వారిలో పెద్దతను కష్టజీవి. దృఢ సంకల్పి. వ్యాపార చతురత కలిగినవారు. వారు రేకులతో కట్టిన ఒక చిన్న సినిమాహాలును, అక్కడ రైసుమిల్లులలో మా పెదనాన్నగారితో భాగస్వామ్యాన్ని, మా పెద్దనాన్నగారితో పాటుగా ఒక ట్రాక్టరు కలిగియుండి పరిసర ప్రాంతాల్లోని చాలా మెట్ట భూములను తక్కువ ధరకు కొని వాటిని మామిడి తోటలుగా మారుస్తుండేవారు. తన సోదరులతో విడిపోయిన తర్వాత కూడా అతనికి తన నలుగురు కొడుకులకు ఇవ్వటానికి ఇంకా వంద ఎకరాల మామిడితోట మిగిలి వుంది. అతని పెద్దకొడుకు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక రాజకీయాలలో పనిచేస్తూ, భవిష్యత్‌లో ఎమ్మెల్యే అవ్వాలనే ఆశతో వున్నాడు. అతను రోడ్డు పనులకు చాలా కాంట్రాక్టులు చేపట్టి, రెండు సంవత్సరాల క్రితం ఒక కాంట్రాక్టు ద్వారా పది లక్షల రూపాయల లాభాన్ని పొంది ఇంక వెనక్కి తిరిగి చూడలేదు. గత ఎన్నికలలో తెలుగుదేశం ఎమ్మెల్యేగా పోటీ చేసి, చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి రంగంలో దిగడంతో ఓడిపోయి కొంత ఆర్థిక ఇబ్బందుల్లో వున్నారు. కాంగ్రెసు అధికారంలో వుండటంతో కాంట్రాక్టులకు సాహసించలేదు.

ఆ ఉమ్మడి కుటుంబానికి ప్రస్తుతం ఒక ప్రొక్లెయిను, మూడు ట్రాక్టర్లు వున్నాయి. ఈ ప్రాంతంలోని చాలా మంది రాజకీయ నాయకులు కాంట్రాక్టర్లు, మద్యం షాపు డీలర్లు. అంతేకాక పెద్ద మామిడి తోటల (కొన్ని సందర్భాల్లో వంద నుంచి రెండు వందల ఎకరాల వరకు) యజమానులు కూడా. వారిలో పెద్ద వారికి పట్టణాలలో వ్యాపారాలు కూడా వున్నాయి. వారంతా కలిసి మద్యం, ధనం కుమ్మరించటం ద్వారా ఎన్నికలను చాలా

ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మార్చేశారు. ఎం.ఎల్.ఎ.గా గెలవాలంటే ఒక్కొక్క అభ్యర్థి ముప్పయి లక్షల నుంచి రెండు కోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టవలసి వుంటుంది.

ఈ ప్రాంతంలోని చాలా మంది రైతులకు చిన్న చిన్న కమతాలున్నాయి. ఒక రైతుకు వంద గుంటల (ఏడు ఎకరాల) నీటి సౌకర్యం గల భూమి వుంటే, అతను ధనవంతుడి కింద లెక్క. అయితే ప్రస్తుతం దిగజారుతున్న వ్యవసాయ పరిస్థితుల వలన దాదాపు ప్రతి ఒక్కరూ వ్యవసాయం నుండి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు! ప్రతి ఒక్కరూ వారి పిల్లలను పట్టణాలలో చదివించాలని, మంచి ఉద్యోగం గాని, వ్యాపారం గాని చేయాలని కోరుకుంటున్నారు.

వర్గ, కుల సంబంధాలలో ఎన్నికలు అనేవి ఒక మంచి మార్పుని తీసుకొచ్చాయని చెప్పవచ్చు. గతంలో, ఈ ప్రాంత భూస్వాముల మాటే చట్టంగా వుండేది. ఇందిరాగాంధీ వచ్చిన తర్వాత దళితుల్లో నాటకీయమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. దళితులకు ప్రత్యేకించి ప్రభుత్వ భూముల పంపకం, వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు, మిగిలిన వారిని కుల ప్రాతిపదికపై భూస్వాములకు వ్యతిరేకంగా ఒకటి చేయడానికి ఆమె చేసిన ప్రయత్నం, దళితులని రక్షించండని, 'గరీబీ హరావో' (దారిద్ర్యాన్ని తరమండి) అని ఆమె పదే పదే పాడిన పాట, దళితులకు గృహ నిర్మాణ పథకాలు ఆమెను వారికి దగ్గర చేశాయి. భూస్వాములు ఆమెను దూషించే కొద్దీ ఆమె దళితులకు మరింత చేరువై వారిలో "అమ్మ"గా గుర్తింపు తెచ్చుకుంది. చాలా ప్రాంతాలలో దళితులు తమ ఓటు స్వేచ్ఛగా కాంగ్రెస్ పార్టీకి వేసే ప్రయత్నంలో స్థానిక పెత్తందార్లు, భూస్వాముల మనుషులతో భయంకరమైన ఘర్షణలు చోటు చేసుకున్నాయి. భూస్వామ్య పెద్ద మనుషులైన రెడ్లు మరియు కమ్మ కులస్తులు (చాలా వరకు ఈ ప్రాంతంలో) వారిని కటువుగా అడ్డుకున్నారు (తర్వాత వారు దాదాపు అంతా జనతా పార్టీకి మద్దతు ప్రకటించారు). ఎన్.టి.ఆర్. తెలుగుదేశం ఆవిర్భావంతో (వెనుకబడిన కులాల మద్దతుతో కమ్మకులస్థులు) చంద్రబాబు నాయుడి నాయకత్వంలోకి వచ్చారు. కాంగ్రెసు తన పాత పాత్రను రెడ్డి కులస్తులకు చెందిన పార్టీగా మిగుల్చుకుంది. (ముందుకన్నా ఎక్కువగా). కాని ఇక్కడ మనం వేసుకోవలసిన ప్రశ్న ఏమిటంటే జనాభాలో అధిక శాతం వున్న దళితులు, ఇతర వెనుకబడిన కులాలకు, వర్గాలకు చెందినవారు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎక్కడున్నారు?

ఇక్కడ, ఈ పరిస్థితికి అద్దంపట్టే టాల్‌స్టాయిగారు చెప్పినటువంటి మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి. – "పాలించే ప్రభువులు పేద, అణగారిన వర్గాల కోసం ఏదైనా చేయడానికి సిద్ధపడతారు, వారి వీపులపై చేస్తున్న స్వారీ నుండి దిగడం తప్ప".

## అంటరానితనానికి అంతమెప్పుడు?

నేను, నా భార్య ఉమాశంకరి ఢిల్లీ విశ్వ విద్యాలయంలో సామాజిక శాస్త్రం చదివాం. కులాంతర వివాహం చేసుకున్నాం. ఆమె తమిళ్ అయ్యర్ బ్రాహ్మణులు. నేను కమ్మ. అయినా కూడా 1987లో పల్లెకు వచ్చాక మా గ్రామాలలో ఆచరించే అంటరానితనం మమ్ములను నిర్ఘాంతపరిచింది. షెడ్యూల్డ్ కులాల వారిని ఇతర ప్రజలు వాళ్ళ ఇళ్ళలోకి అనుమతించేవారు కాదని నాకు ముందే తెలుసు. ఊరిలో షెడ్యూల్డ్ కులాలకి చెందిన నా స్నేహితులు, పరిచయస్థులను మా పెదనాన్నగారి ఇంట్లోకి అనుమతించకపోవడం మాకు బాధగాను, అవమానంగాను తోచింది. ఈ భావన నన్ను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, నా కుటుంబం కోసం సొంత ఇల్లు నిర్మించుకోవటానికి పురికొల్పింది. (అలా అనుకోవడానికి గల కారణాలలో ఇతర సదుపాయాల కల్పన కూడా ఒకటి). నేను గ్రామంలో నివసించడం మొదలు పెట్టిన తర్వాత అంటరానితనం ఎంతగా వేళ్ళూనుకుని వున్నదో తెలుసుకొని నిర్ఘాంతపోయాను. మెయిన్ రోడ్డులు, కూడలులో వున్న గ్రామాల టీ దుకాణాలలో షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేకంగా గ్లాసులు వుంచడమే కాక, వాటిని వారికి తెలిసేలా ఒక వైరు చుట్టు ద్వారా వేళ్లాడదీయడం లేదా ఒక పక్కగా పెట్టడం జరుగుతుంది. ఇదే కాక ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి టీ / కాఫీ కావాలంటే, తనే ఆ ప్రత్యేకంగా పెట్టిన గ్లాసు తీసుకుని వెళ్ళి పట్టుకుని నిలబడితే, టీ దుకాణపు యజమాని చాలా పై నుంచి టీ పోసేవాడు. ఆ షెడ్యూల్డ్ కులం పెద్ద మనిషి టీ తాగిన తర్వాత మళ్ళీ గ్లాసును పట్టుకుంటే హోటలు యజమాని దాంట్లో నీళ్ళు పోస్తే, అప్పుడు అతను గ్లాసు కడిగి నిర్దేశించిన స్థలంలో బోర్లిస్తాడు. ఇది అంతా కూడా పంతొమ్మిది వందల తొంభై దశకంలో జరుగుతోంది!

దేశ స్వాతంత్ర్యం వచ్చి అరవై సంవత్సరాలు దాటుతున్నా కూడా షెడ్యూల్డ్ కులాల వారిని చిన్న పల్లెటూళ్ళ హోటళ్ళలోకి అనుమతించేవారు కాదు. వారు బయట నుంచోవడమో, కూర్చోవడమో చేయాలి. లేక లోపల వారికోసం కేటాయించిన ప్రత్యేకమైన బెంచీలలో కూర్చోవాలి. వారికి పళ్ళాలలో కాకుండా ఆకులలో వడ్డించేవారు. తిన్న తర్వాత వారు వాటిని ఎత్తి బయట పడేయాలి. ప్రతి గ్రామంలో ఉన్న రచ్చబండ మీద లేదా చెట్టు కింద కట్టిన ఎత్తైన తిన్నెల మీద ప్రజలంతా కలిసి పిచ్చాపాటి మాట్లాడుకోవటం, వార్తా విశేషాలు చదవటం, పంచాయితీలు మొదలైనవి చేసేవారు. కాని షెడ్యూల్డ్ కులాల వారు మాత్రం వాటి మీద కూర్చునే ధైర్యము చేయకూడదు. ప్రత్యేకించి గ్రామం వద్ద బస్సు ఆగే స్థలాల్లో కూడా. ఇవి అన్నీ కూడాచట్టంలో రాయని నిబంధనలు. గ్రామంలో ఇతర కులాల వారు వుండేచోట, ప్రహరీ గోడ కట్టి వున్న గుళ్ళలోకి షెడ్యూల్డ్ కులాల వారికి ప్రవేశం లేదు. ఇప్పటికీ అక్కడక్కడ కొన్ని గ్రామాలలో ఇతర కులస్తులు నివసించే వీధులు ఎక్కడైతే వున్నాయో, అక్కడ షెడ్యూల్డ్ కులాల వారు చెప్పులతో నడవకూడదు. షెడ్యూల్డ్ కులాల వ్యక్తి సైకిల్ మీద వెళ్తుంటే, అనుకోకుండా

ఇతర కులస్తుడు రోడ్డు మీద ఎటువైపు నించైనా నడుచుకుంటూ వస్తే, ఆ షెడ్యూల్డ్ కులస్తుడు వెంటనే సైకిలు మీద నుంచి దిగి పక్కగా నించోవాలి. లేదా సైకిలు తోసుకుని పోవాలి. ఆ పెద్ద మనిషి రోడ్డు దాటే వరకూ ఆగి, అతనికి నమస్కరించి, అతనిని రోడ్డు దాటటానికి అనుమతి కోరాలి. మరల తిరిగి సైకిల్ తొక్కవచ్చు. ఇది అంతా ఒక గౌరవ-సూచకమైన పని. ఒకవేళ సైకిల్ తొక్కేవాడు తన రాకను సూచిస్తూ గంట కొడితే, అతను గర్విష్ఠిగా ముద్ర పొందుతాడు. ఒకవేళ ఇతర కులాల నుండి వయస్సులో చిన్నవాడైనప్పటికీ, షెడ్యూల్డ్ కులాల వారుండే వీధి గుండా వెళ్ళేటప్పుడు, షెడ్యూల్డ్ కులాల వారందరూ వయసుతో నిమిత్తం లేకుండా మర్యాద సూచకంగా లేచి నిలబడాలి. (షెడ్యూల్డ్ కులాల ఆడవారు అదే కులం మగవారి ఎదుట కూడా అలాగే చేస్తారు). ఆ గ్రామ చాకలిగాని, మంగలి కాని తమకంటే తక్కువ కులాల వారికి తమ సేవలు అందించరు. అలా చేస్తే ఇతర కులాల వారు అతని సేవలు వినియోగించుకోరు. కాబట్టి చాకలి పనికి షెడ్యూల్డ్ కులాల నుంచే ఒకరిని వారి కోసం పెట్టుకుంటారు. అయితే వారు కూడా దళితులే అయినప్పటికీ ఆ దళిత చాకలి కుటుంబాన్ని తక్కువగా భావించి, వారితో వివాహ సంబంధాలు లేక సహపంక్తి భోజనాలు మిగతా దళిత కుటుంబాలు చేయరు!

ఈ రోజులలో చాలా గ్రామాలలోని ఎస్సీ బాలురు ఒకరికొకరు జుట్టు కత్తిరించుకోవటం తెలిసినదే. ప్రతి కుటుంబంలోని మహిళలు వారి కుటుంబం బట్టలు వారే ఉతుక్కుంటారు. అంటే స్త్రీలు ఆ పనులు చేస్తున్నారన్నమాట! యువకులు తరచుగా పెద్ద గ్రామంలోని చాకలి వారితో అవసరమైనప్పుడు తమ బట్టలను ఇస్త్రీ చేయించుకుంటారు. ఇప్పటికీ ఇంకా కొన్ని గ్రామాలలో ఇది వీలుకావడం లేదు. దళితులు విద్యార్థులలాగా పాంటు, షర్టు వంటివి వేసుకుంటే టీషాపులు, మంగలిషాపులు మొదలైన వాటి యజమానులు కూడా అభ్యంతరం చెప్పరు. అయితే మా జిల్లాలో చాలా గ్రామాలలో ఇతర హిందూ కులస్తుల ఇళ్ళలోనికి షెడ్యూల్డు కులాల వారు వెళ్ళడానికి ధైర్యం చేసే ప్రశ్నేలేదు. దేశంలోని అనేక ప్రాంతాలలో కూడా ఇంతకంటే భిన్నమైన పరిస్థితి వుండదని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఇంకా కొన్ని గ్రామాలలో షెడ్యూల్డు కులాల వారు ఓటు వేయకపోవడమో లేదా ఆ ప్రాంతంలోని పెద్దల ఇష్టానికి అనుగుణంగా ఓటు వేయడమో జరుగుతుంది. ఎందుకంటే వారు తమ దినసరి జీవన భృతి కోసం ఆ పెద్దలపై, పెత్తందారులపై ఆధారపడి వున్నారు! చాలా గ్రామాలలో షెడ్యూల్డు కులాల వారు నివసించే ప్రాంతాలకు దారి ఇతర కులస్థుల గ్రామం నుండే వుంటుంది. అందుకని "తప్పు" చేసిన షెడ్యూల్డు కులాల వారిని ఆ దారి గుండా వెళ్ళనివ్వకుండా నిరోధించడం కూడా జరుగుతుంది. షెడ్యూల్డు కులాల వారు నివసించే ఇండ్ల స్థలాలు, స్మశాన వాటికలు ఆస్తిపరంగా ఇతర కులస్థులవై వుండటం వలన వారు వారి చెప్పు చేతలలో వుండాల్సి వస్తోంది.

షెడ్యూల్డు కులాల వారికి ఇతర కులస్థులకు మధ్య ఇలాంటి ఉద్రేకపూరితమైన వాతావరణం, ఘర్షణలు జరిగే సందర్భాలు కొన్ని వున్నాయి. తినే చోట్ల, టీ షాపులలో, బెంచిపైన కూర్చుని వుండటం, లేచి నిలబడి గౌరవాన్ని ప్రకటించకపోవడం, వారు స్వతంత్రంగా ఓటు హక్కుని వినియోగించుకోవాలనుకోవడం లేక కులాంతర వివాహాల వలన తరచుగా గొడవలు జరుగుతుంటాయి. ఇటువంటి ఘర్షణలకు నాయకత్వం వహించేవారు దళితుల వైపు నుండి చాలా మటుకు కాలేజీలకు వెళ్ళి చదువుకునేవారు, సొంత భూమి వున్నవారు, ఉద్యోగం (ప్రభుత్వ, రైల్వే, మిలటరీ వంటి) చేస్తున్నవారు లేదా కొంత స్థిరమైన ఆస్థి, అనగా ఏదో విధంగా గ్రామంలోని ఇతర కులస్థులపై ఆధారపడకుండా స్వతంత్రంగా బతకగలిగే ఆదాయం వున్న దళితులై వుంటారు.

ఒక్కోసారి ఇతర కులాల మధ్య లేక ఒకే కులంలోని రెండు గ్రూపుల మధ్య జరిగే ఘర్షణలు షెడ్యూల్డు కులాల వారు తమ హక్కులపై అధిపత్యాన్ని సంపాదించుకోవటానికి సహాయం చేస్తాయి. ఒక్కోసారి షెడ్యూల్డు కులాల వారి పేరు మీద వున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి లేదా పోరంబోకులోని చింతచెట్ల మీద ఆధిపత్యం (చట్టపరంగా వారికే ఇవ్వాల్సినవి) సాధించుకోవడానికి ఘర్షణలు జరిగినప్పుడు కూడా చాలా అశాంతి సృష్టించబడుతుంది.

ఇతర కులాల వారికి, షెడ్యూల్డు కులాల వారికి తగాదా వచ్చినప్పుడు ఇతర కులాల వారి మధ్య ఎన్ని కలహాలున్నప్పటికీ వారంతా ఒకటైపోతారు. చిత్తూరు జిల్లాలోని దళితులకు, ఆ మధ్యనే ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వంటి దళిత ఉద్యమమూ, దళితులతో పనిచేసే విదేశీ డబ్బులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేము (పౌర హక్కుల సంఘం తరపున) కలిసి అంటరానితనం నిర్మూలనకు 1991లో అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఒక కమిటీగా ఏర్పడి విస్తృతంగా ప్రచారం చేశాం. నాలుగు నెలల్లో నెలకొక వారం చొప్పున పాదయాత్రలు నిర్వహించాం. ఒక్కొక్క పాదయాత్రలో 60 పల్లెలపైన, రోజు 20–25 కి.మీ చొప్పున, 4 పాదయాత్రలలో జిల్లాలో ఇంచుమించు 630 కి.మీ. తిరిగి 249 పల్లెల్లో విస్తృతంగా ప్రచారం చేశాం. ప్రతి పల్లెలోనూ వివిధ రూపాల్లో ప్రబలమై వున్న అంటరానితనం, పేర్లతో సహా వివరించిన ఒక సమగ్ర నివేదిక తయారు చేసి జిల్లాలో అధికారులకు సమర్పించాం. సంక్షిప్త నివేదికను దేశమంతా ప్రచారం చేశాం.

## ఇందులో కొన్ని ముఖ్యమైన విశేషాలు ఈ విధంగా వున్నాయి :

1. "రెండు గ్లాసుల పద్ధతి" పాటిస్తున్న టీ అంగళ్ళు, హోటళ్లు – 22
2. దేవాలయ ప్రవేశం లేని దేవాలయాలు 80 (అందులో 33 శ్రీరాముల వారి దేవాలయాలు)

3. మంగలివారు దళితులకు పనిచేయుటకు నిరాకరించిన ఊళ్ళు - 24
4. ఇతర కులస్తులు నివసించే వీధుల్లో దళితులు చెప్పులేసుకుని తిరగకూడదనే నిబంధన ఉన్న గ్రామాలు - 16.
5. స్వేచ్ఛగా ఓటు వేయనీయని గ్రామాలు 18.

జిల్లా కలెక్టరు నాగార్జున గారి (పేదల పెన్నిధిగా వుండిన ఈ ఐ.ఎ.యస్. అధికారిని మృత్యువు క్యాన్సర్ రూపంలో కాలంలో కలిపేసింది) సహకారంతో స్థానిక అధికారుల సానుకూలతతో మేం పనిచేస్తున్న చాలా పల్లెల్లో పూర్తి గాను, మరికొన్నిట్లో పాక్షికంగానూ హోటళ్ళలో, టీ అంగళ్ళలో దళితులకు టీ గ్లాసులు వేరుగా పెట్టడాన్ని నివారించగలిగాం. కానీ ఈ రోజుకు కూడా అంటరానితనం పలు రకాలుగా మేం పనిచేస్తున్న గ్రామాల్లో కూడా ప్రబలంగానే వున్నది. దేవాలయాల్లో ప్రవేశం నిరాకరించడం, ఊరిలో బస్టాప్‌లో తిన్నెలపై కూర్చోనివ్వకపోవడం, ఇతర కులస్తుల ఇండ్లలోకి రానీయకపోవడం, చాకలి, మంగలి వంటివారి సేవలు దళితులకు నిరాకరించటం పలు పల్లెల్లో ఇంకా కొనసాగుతూనే వుంది. ప్లాస్టిక్ గ్లాసులు రావడంతో రెండు గ్లాసుల పద్ధతి దాదాపు మాయమయ్యిందనే చెప్పాలి! కానీ ఆ మనస్తత్వం పోలేదు!

ఎక్కడైతే షెడ్యూల్డ్ కులాల వారు ఏదో ఒక విధంగా సంఘటితమైనప్పుడు (స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో చాలా వరకు) అక్కడ ఇతర కులాల వారితో సమానంగా ఎంతో కొంత స్వేచ్ఛగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోగలుగుతున్నారు. ఇటువంటి తగాదాలు ఈ రోజులలో జరిగినప్పుడు ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధం) చట్టం క్రింద ముద్దాయికి బెయిలు లభించనటువంటి కేసులు బనాయించటం జరుగుతుంది. ఇందులో ముద్దాయి తనే నిర్దోషి అని నిరూపించుకోవలసి వుంటుంది. అంతేకాక కేసు నమోదు చేసిన వ్యక్తికి సాంఘిక సంక్షేమ శాఖవారు కొంత నగదు చెల్లిస్తారు. రుజువైతే నాలుగింతలుగా నష్టపరిహారం ఇస్తారు. కానీ ప్రాథమికంగా ఋజువు కాదు. ఈ కేసులలో అరెస్టయిన వారికి సులభంగా బెయిలు ఇవ్వరు. కనీసం వారం, రెండు వారాలు జైలులో వుండాలి. అందువలన ఇతర కులాల వారు మునుపటిలాగ షెడ్యూల్ కులాల వారిని తిట్టడం, కొట్టడం అంత సులభంగా చేయటం లేదు. ఈ చట్టాన్ని ఎదుర్కొనటానికి ఇతర కులాల వారికి ఒక ఆయుధం కూడా వుంది. ఒక షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి ఒక మహిళపై అత్యాచార యత్నం చేశాడు అనే కేసు నమోదు చేసినట్లయితే, పై దానితో సమానమైన శక్తివంతమైన చట్టం ఇది. ముద్దాయి తన అమాయకత్వాన్ని తనే నిరూపించుకోవలసి వుంటుంది. మరియు కేసు నమోదు అయినప్పుడు బెయిల్ లభించదు. అయితే ఇది అంతా కూడా ఘర్షణ పడిన వర్గాలు ఎంత దృఢంగా లేక, పటిష్ఠంగా సంఘటితమై వున్నారన్న అంశంపైన, వారికున్న ఆర్థిక, రాజకీయ సంబంధాలపైన ఆధారపడి వుంటుంది. ఎంతో బేరసారాలు, సాగిన మీదట సాధారణంగా

ఏదో ఒక అంగీకారానికి రావటం జరుగుతుంది. (క్షమాపణ లేదా డబ్బు రూపంలో నష్టపరిహారాన్నివ్వడం).

## మార్పుతో సహవాసం :

ప్రజలు మార్పుకి ఎంత త్వరగా అలవాటు పడ్డారో చూస్తే ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎక్కడైతే అంటరానితనం బాగా ఆచరణలో వుంటుందో, అటువంటి గ్రామాలలో కూడా, వారు ప్రభుత్వ అధికారిగా వుంటే, ప్రత్యేకంగా అతను పోలీస్ అధికారి అయితే వారికి ప్రత్యేకమైన గౌరవం ఇస్తారు. షెడ్యూల్డ్ కులాల వారు ఉపాధ్యాయ వృత్తిలో వుంటే అంత గౌరవం వుండదు. వారికి ఇతర కులస్తులు, నివసించే ప్రాంతంలో ఇల్లు దొరకదు. కాబట్టి గౌరవం అనేది వారి సత్తాబట్టి వుంటుంది! అంటరానితనాన్ని నిర్మూలించటానికి ఏ ప్రజలు అయితే గట్టిగా వ్యతిరేకిస్తున్నారో లేక మార్పుకి ఇష్టపడటం లేదో వారే షెడ్యూల్డ్ కులాల వారితో పిచ్చాపాటి మాట్లాడటం కనిపిస్తుంది.

మా ఇంట్లో మా వంట మనిషి మా ఊరి పక్కనున్న దళితవాడ నుండి వచ్చినదే. ఏ విధంగా ఇతర కులాల వారు ఇంత త్వరగా రెండు నుండి మూడు సంవత్సరాలలోపునే కొత్త పరిస్థితికి అలవాటు పడ్డారన్న విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వారు ఇప్పుడు మా ఇంట్లో ఆమె చేతి వంట తినటమే కాక అప్పుడప్పుడు ఆమె వారిలో కొందరి ఇళ్ళకు కూడా వెళ్ళి వస్తుంటుంది. కాని ఇంకా కూడా చాలా మంది షెడ్యూల్డ్ కులాల వారు ఇతర కులాల వారి ఇళ్ళలోనికి ప్రవేశించే ప్రయత్నం చేయరు. ఇతర కులాల వారు కూడా వారిని పనికి ఇంట్లోకి ఆహ్వానించరు. ఇటువంటి సంఘటనలు అంటరానితనం పట్ల చూసిచూడనట్లు వ్యవహరించటానికి గుర్తుగా చెప్పవచ్చు. అంటరానితనం పూర్తిగా పోవాలంటే అనేక శక్తివంతమైన సామాజిక, రాజకీయ ఆర్థిక ఉద్యమాలు చేపట్టవలసి వుంది.

## కుల వ్యవస్థ – సంఖ్యా బల రాజకీయాలు :

మా జిల్లాలోని జనాభాలో దళిత కులాలకు చెందినవారు పద్దెనిమిది శాతం (తెలుగుదేశం పార్టీ వారి ఓటరు సర్వే ప్రకారం) వుంటారు. ఆ దళితులలో అరవై నుంచి డెబ్బయి శాతం మంది ప్రాథమికంగా వ్యవసాయ కూలీలు. మిగిలినవారు పాక్షికంగా రైతులుగాను పట్టణాలలో (ముఖ్యంగా తిరుపతి, తిరుమలలోని) ఏదో ఒక పని అనగా భవన నిర్మాణాలు, హోటళ్ళు, పరిశ్రమల్లో కూలీ పనులు లేక ప్రభుత్వ ఉద్యోగాలు (చాలా వరకు ఉపాధ్యాయులుగా) చేస్తున్నారు. మా ప్రాంతంలోని ఇతర కులాల వారిలో రెడ్లదీ (పన్నెండు శాతం) కమ్మ నాయుళ్ళదే (6.4 శాతం) ఆధిపత్యం. మా ప్రాంతంలోని సాగు భూమిలో కూడా చాలా వరకు వారికి చెందినదే. కుల వ్యవస్థ ప్రకారం ఇద్దరూ కూడా శూద్ర వర్ణ కులాలకు చెందిన వారు. ఫ్యూడల్ వ్యవస్థ ద్వారా సంప్రదాయకంగా పై

చేయిగా ఉన్న రెడ్ల ఏకఛత్రాధిపత్యం పునాదులు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కదిలాయి. అప్పటి నుంచి కమ్మ నాయుళ్ళు గుర్తింపు పొందారు. జనాభాలో 9.2 శాతం వున్నటువంటి బలిజ కులస్తులు వారిని అనుసరించినప్పటికీ ఆర్థికంగా బలహీనులై వుండటం వలన వెనుకబడిన తరగతులుగా గుర్తింపు పొందటానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తూనే వున్నారు. జిల్లాలోని చిన్న పట్టణాలలో కేంద్రీకృతమై ముస్లిములు (7.6 శాతం) తరువాత చెప్పుకోతగిన సంఖ్యలోనే వున్నారు. వారు సాధారణంగా బీదవారు చిన్న వ్యాపారస్తులు. వారిలో కొంత మంది పండ్ల వ్యాపారం, ఇంకా అటువంటి ఇతర వ్యాపారాల ద్వారా సంపన్నులైన ముస్లిములు జిల్లా అంతటా కనిపిస్తారు. వారిని ఇతర కులాల వారు సాధారణంగా వెనుకబడిన కులానికి చెందిన వారుగా చూస్తారు. షెడ్యూల్డ్ కులాల వారి పట్ల ముస్లిముల ప్రవర్తన మిగిలిన ఇతర కులాల వారిలాగానే వుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అంటరానితనం నిర్మూలన కొరకు మేము ప్రచారం చేసేటప్పుడు టీ దుకాణాల యాజమానులైన ముస్లిములతో షెడ్యూల్డ్ కులాల వారికి విడిగా గ్లాసులను పెట్టడం పట్ల తరచుగా గొడవ పడాల్సి వచ్చేది.

బస్సు రవాణా, హోటళ్ళు, పాఠశాలలు, కళాశాలలు, సినిమాలు ముఖ్యంగా ఎన్నికల ద్వారా జరుగుతున్న ప్రజాస్వామీకరణ, రాష్ట్రీకరణతో అన్నీ మారుతున్నాయి. కొంచెం నెమ్మదిగానైనా కులాంతర సంబంధాల విషయంలో మరింత సమానత్వ దిశగా పరిణామం చెందుతున్నాయి. గడచిన అనుభవాల వలన ఒక విషయం స్పష్టంగా చెప్పవచ్చు. అభివృద్ధి వలన అంటరానితనం, జాతి వివక్షత (అపార్థైడు) వంటివి వాటంతటవే మాయమైపోయేవి కావు. అమెరికాలో దక్షిణ ప్రాంతంలో నల్లవారిని బస్సుల్లో వెనుక సీట్లలో మాత్రమే కూర్చోవటానికి అనుమతించేవారు. దీనినే వారు 'బస్సింగ్' అని పిలిచేవారు. 1959వ సంవత్సరములో మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వాన 'బస్సింగ్'కు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని లేవదీసేంత వరకు అది అలాగే కొనసాగింది. అంటరానితనం నిర్మూలన ఉద్యమంలో మా అనుభవం కూడా అదే. ఇటువంటి జాఢ్యాలు వాటంతటవే పోవు. అంటరానితనం నిర్మూలన ఉద్యమంలోనూ – మా పల్లె జీవిత అనుభవం ద్వారానూ ఒక విషయం స్పష్టమైంది. అదేమంటే అంటరానితనం నిర్మూలించవచ్చుగానీ కులం మాత్రం మాయమైపోదు.

భారతీయ సమాజంలో కులం ఒక సాంఘిక వాస్తవం. గ్రామాలలో ప్రధాన సామాజిక గుర్తింపు ఇదే. ఇది ఒక సామాజిక భద్రత భావాన్ని కలిగిస్తుంది. బంధువులు, అయినవాళ్ళు అవసరమైనప్పుడు ఉద్యోగం కోసం, జబ్బు పడినప్పుడు, చావు, పెళ్ళి వగైరా సందర్భాలలో, వేడుకలలో అందరు ఒకచోట కలిసినప్పుడు వారికి బలాన్ని ఇస్తుంది. కులాంతర వివాహాలకు ఇతర కులస్తులు సర్దుకుపోతారు (షెడ్యూల్ కులాలు మరియు ముస్లిములతో తప్ప). పురుషాధిక్య సమాజంలో కులాంతర వివాహాల్లో పురుషుల

కులాన్నే గుర్తిస్తారు. కులం అనేది ఐదు వేల సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఎలా మనగలిగిందో నాకు ఇప్పుడు అర్థమైంది.

కుల వ్యవస్థ నిచ్చెన మెట్లలా కేటాయించిన సాంఘిక స్థాయిలో ప్రతి కులానికి, ఉపకులానికి, జాతికి / ఉపజాతికి ఉన్న ప్రత్యేక నమ్మకాలు, ఆచార పద్ధతులు, అలవాట్లు పాటించుకునే పూర్తి స్వేచ్ఛ వుంటుంది. ఒక జాతికి ఆ కుల నిచ్చెనలో స్థాయి ఎక్కడుంటుందన్న విషయం వారి సంఖ్యాబలం, ఆర్థిక, సాంఘిక, ఇతర వనరులపై ఆధిపత్యం మీద ఆధారపడి వుంటుంది. కులం పోదు. ఆ కోరిక మనలో ఎంత బలంగా వున్నా కూడా! అది ఒక గుర్తింపు. అనుకూలమైన గుర్తింపు. దళితులు ఇతర కులస్తులతో వ్యవహరించేటప్పుడు, తమ కులం తెలిస్తే ఆ ఇతరులు దూరమవుతారనో లేక తమని అవమానపరుస్తారనో భయం కలిగేటప్పుడు కులం అనుకూలంగా కాకుండా ప్రతికూల గుర్తింపుగా వుంటుంది. కానీ ఇప్పుడు మాదిగ కులస్తుల పురోగమనంతో, చైతన్యవంతులైన వారు తమ పేరు చివర ఇతర కులస్తుల వలె వారి కులం పేరు సూచిస్తున్నారు. ఉదా : కృష్ణ మాదిగ, గిరిధర మాదిగ – తమ కులాన్ని గర్వంగా చాటి చెబుతున్నారు. కుల బానిసత్వాన్నుండి విముక్తి పొందే ప్రయత్నంలో తొలిమెట్టు ఇదే.

అయితే దురదృష్ట వశాత్తు 1990 దశకంలో ఉప్పెనలా లేసిన దళిత ఉద్యమం – దళిత మహాసభ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన దళిత వాడల్లో ఏర్పడిన సంఘాలు ఇతర కులస్తుల ఆధిపత్యాన్ని ఎదిరించే శక్తిగా ఎక్కువ కాలం నిలువలేకపోయాయి. ఉత్తర ప్రదేశ్‌లో కాన్షీరామ్ గారి బహుజన సమాజ్ పార్టీతో మరోసారి ఆ ఉత్సాహం, ఆశలు రేకెత్తించాయి. కానీ అది కూడా కలగానే మారిపోయింది. మాల కులస్తులచే ప్రత్యేకించి రిజర్వేషన్లలో అన్యాయానికి గురైనట్లు (ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు). మాదిగ పోరాట సమితి (ఎం.ఆర్.పి.ఎస్) లేవనెత్తిన ప్రత్యేక మాదిగ ఉద్యమం, వివిధ రాజకీయ పార్టీలు దళిత నాయకులను, సంఘాలను ప్రలోభపెట్టి, తమవైపు లాక్కునే ప్రయత్నాల ద్వారా దళితులను అనేక ముక్క చెక్కలు చేయగలిగారు. నాయకులచే మోసపోయినట్లు భావిస్తూ దళితులంతా నిర్వీర్యమైపోతున్నారు. నేటి దళితోద్యమంలో విదేశీ డబ్బులతో నడిచే స్వచ్ఛంద సంస్థలు పోషించి ప్రోత్సహించే దళిత సంఘాలదే పై చేయి అయిపోయింది. తద్వారా ఉద్యమ పోరాట పటిమ బాగా కుంటుపడింది.

ఇన్ని సంవత్సరాలుగా ఈ అంటరానితనం ఇరవై ఒకటవ శతాబ్దం వరకూ సుస్థిరంగా వుండటానికి కారణం ఇతర కులస్థుల వారి పెత్తనాన్ని, వారిపై ఆధారపడి జీవించాల్సిన సంబంధాలను ఆచరణలలో బలపరచటమే! అందుకే అంటరానితనం పోవాలంటే ముందు అసమానత, దోపిడీ సంబంధాలను తెంచాలి. పరస్పరంగా ఒకరిపై ఒకరు ఆధారపడి వున్న కులాల సంబంధాలు మరింత స్వేచ్ఛగానూ, సమానత్వంతో కూడిన సంబంధాలుగానూ మార్చాలి. వారు ఒకరిపై ఒకరు ఆధారపడే బదులు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదిగేందుకు దోహదపడాలి. ఆర్థిక సంస్కరణలు దళిత విముక్తికి చాలా

అవసరం. కానీ కేవలం అవే సరిపోవు. కేవలం ఆర్థిక సంస్కరణల ద్వారా సంప్రదాయ కుల సంస్కృతిలో ఇమిడి వున్న సంబంధాలను మార్చలేం. వీటితో పాటు సాంస్కృతిక సంస్కరణలు కూడా చాలా అవసరం. ఒక పక్క తమ హక్కుల కోసం దళితులు అంబేద్కర్ అన్నట్లు, చేసినట్లు, లేచి నిలబడాలి పోరాడాలి. అలాగే మరోపక్కన ఇతర కులస్తుల మధ్య పశ్చాత్తాపం పెంచేందుకు గాంధీజీ లాంటి వారి ప్రచారం చాలా ముఖ్యం. గాంధేయవాదులు, అంబేద్కర్ వాదులు పరస్పరం, ఒకరినొకరు ఎంత తిట్టుకున్నా ఈ రెండు దృక్పధాలు మనకు అవసరమని, ఈ రెండు సిద్ధాంతాలు పరస్పరం విరుద్ధంగా కాకుండా నిజానికి తోడు నీడగా వున్నాయన్నది గ్రహించాలి. అంబేద్కర్ గారు హిందూమతం నుండి క్రైస్తవ మతం లేదా ఇస్లాం మతం బదులు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. తద్వారా ఈ రెండు ప్రయత్నాల సైద్ధాంతిక కలయిక పులకరించి అంటరానితనాన్ని చరిత్ర పుటల్లోకి పంపించి వేస్తుందని ఆశిద్దాం.

ఈ రోజున అంటరానితనానికి వ్యతిరేకంగా ఏకరీతిగా పల్లెలలో ఎటువంటి ప్రచారం జరగటం లేదు. కనీసం ఆర్థిక వనరులలో ముఖ్యంగా దళితులకు భూమి పంపకం చేయడానికి అడగటం లేక ఆందోళన చెయ్యటం జరుగుతున్న దాఖలాలు పెద్దగా కనిపించటం లేదు. దళితుల మానవ హక్కుల కోసం జాతీయ స్థాయిలో ప్రధానంగా స్వచ్ఛంద సంస్థల ద్వారా జరిగిన ప్రచారం ఐక్య రాజ్యసమితిలో దళితుల వాదనను వినిపించడంలో విజయవంతమైంది. జాతీయ స్థాయిలో అంటరానితనం జాతి వివక్షతకు మరో పేరు అన్న వాదన కూడా ముందుకు తెచ్చారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో చెప్పుకోదగ్గ ప్రచారాన్ని సాగించినవారు, స్థానికంగా మన పల్లెల్లో, పట్టణాల్లో అంటరానితనంపై వ్యతిరేక పోరాటాలు పెద్దగా కొనసాగించినట్లు కనబడకపోవటం నిజంగా చాలా బాధాకరం. ఈ విషయంలో సి.పి.ఎం కొంత ఆలస్యంగా నిద్ర లేచినా (గుడ్డి కన్నా మెల్ల మేలు) అది ఆహ్వానించదగిన పరిణామమే. అంటరానితనం అనే దురాచారానికి వ్యతిరేకంగా గడిచిన ఏడు సంవత్సరాలుగా కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటి (కులం పేరుతో అణచివేయటానికి వ్యతిరేక పోరాట ఉద్యమం) నడుపుతోంది. ఇక్కడ గుర్తించదగిన అంశమేమంటే సి.పి.ఎం వారి ప్రచారం కుల నిర్మూలన కోసం కాక కేవలం కుల వివక్ష చేత జరిగే అణచివేతకు వ్యతిరేకంగా మాత్రమే. అంటే కుల వ్యతిరేక పోరాటం, కుల వివక్ష వల్ల జరిగే అణచివేతకు వ్యతిరేకంగా పోరాడటం, ఈ రెండు భిన్నమైనవని వారు గుర్తించినట్లు కనబడుతోంది.

శరత్‌జోషి, మహారాష్ట్రకు చెందిన ఒక పేరు పొందిన రైతు నాయకుడు. ఆయన ఇతర కులాల వారి దృష్టి కోణంతో పరిశీలించి ఒక ముఖ్యమైన సూత్రీకరణ చేశాడు. ఆయన అభిప్రాయంలో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంటే, అంటరానితనం, కుల వారసత్వం మొదలైన విషయాలు అంతగా ఇతర కులాల రైతులు పట్టించుకోరు. కానీ రైతుల పరిస్థితి ఎప్పుడైతే అభివృద్ధి చెందడం లేదో లేక దిగజారుతుందో, అదే

సమయంలో దళితులలోని కొన్ని తెగలు / కుటుంబాలు, భూములు మరియు ఉద్యోగాలు మొదలైనవి పొంది అభివృద్ధి చెందుతూ, సమానత్వం కోసం ఎడతెగని ప్రయత్నం చేస్తారో అప్పుడు ఇతర ప్రజలు (రైతులు) వారి సాంఘిక హోదా అయిన కులస్థాయిని రక్షించుకోవడానికి ఆరాటపడతారు. ఆర్థికాభివృద్ధి ఏ మాత్రం లేకపోగా అప్పుల ఊబిలో మరీ కూరుకుపోయినా వారికి చివరికి మిగిలింది వారి పుట్టుకతో వచ్చిన సాంఘిక హోదా మాత్రమే. అందువలన కలిగిన బాధ, కోపం వలన వారు అంటరానితనం, కుల వివక్ష వంటి ఆచరణల పట్ల గట్టిగా ఉంటుంటారు. కుల వారసత్వంలో షెడ్యూల్డ్ కులాల వారి కంటే ఒక మెట్టుపైన ఉండే వెనుకబడిన తరగతులు వారు అంటే వడ్డెరలు (రాళ్ళు కొట్టే పనివారు) యాదవులు, ఏకిర దొరలు, బలిజలు లాంటి వారు బీద, మధ్యతరగతి కమ్మ, రెడ్ల రైతులు షెడ్యూల్డు కులాల వారితో వ్యవహరించే తీరులో ఈ పరిస్థితి గమనించవచ్చు. తమిళనాడులోని వన్నియార్ తెగ వారు షెడ్యూల్డ్ కులాల వారితో ఇదే విధంగా వ్యవహరించటం కనబడుతుంది. ఇక్కడ వింతగా కనిపించే విషయమేమంటే పెద్ద భూస్వాములు, పట్టణ సంపన్నులు కులవివక్ష పట్ల మెతక వైఖరినే వల్లె వేస్తుంటే, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంటే, ఇతర కులాలకు చెందిన గ్రామీణ రైతు మాత్రం అంటరానితనం వంటి ఆచారాలను వదులుకోవటానికి ఇష్టపడటం లేదు. ఎందుకంటే ఆర్థికంగా క్షీణిస్తున్న ఇతర కులాలకు చెందిన రైతులకు అన్ని రంగాలలో దళితులపై రోజు రోజుకీ తగ్గిపోతున్న పెత్తనాన్ని తమ హోదాను ఇంకా కొనసాగించేందుకు అంటరానితనం దోహదపడుతుంది.

కాబట్టి ఆసక్తికరంగా అంటరానితనం నిర్మూలన దళితులకు ఒక ముఖ్యమైన కోర్కె అయినప్పటికి దళిత రాజకీయ పార్టీల అజెండాలో అది మొదటి స్థానంలో లేదు. వారి ఆసక్తి అంతా అన్ని వెనుకబడిన కులాల కూటమి ఏర్పాటు చేసి మధ్య మరియు అగ్రకులాల వారిని అధికారం నుంచి తొలగించటం మాత్రమే. ఇదే బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతం. వారి సంఖ్యా బలంపై ఆధారపడి రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత వారి సిద్ధాంతం ప్రకారం సామాజిక ఆర్థిక న్యాయం సాధించవచ్చని వారి అంచనా. దళితుల స్వేచ్ఛ కోసం ప్రత్యేకమైన ఆర్థిక అజెండా వారేమి చెప్పటం లేదు. కానీ ఈ మధ్య మాయావతి బ్రాహ్మణులను కలుపుకుని ఉత్తర ప్రదేశ్‌లో సాధించిన ఘన విజయం అన్ని పార్టీలకు ఒక గుణపాఠం అయ్యింది! కానీ వామపక్షాల వారు ప్రాథమికంగా దళితులకు కావలసినది ఆర్థిక స్వేచ్ఛ అనే చెపుతారు.

## దళితుల కోసం భూ సంస్కరణలు :

గ్రామీణ ప్రాంతాల్లోని ఇంచుమించు 75 శాతం మంది దళితులు వ్యవసాయ కూలీలుగా వుంటున్నారు. వారికనీస అవసరాలు తీర్చుకోవడానికి, కొంత నీటి వసతి ఉన్న భూమి వారి సాంఘిక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవటానికి పునాదిగా

ఉపయోగపడుతుంది. తద్వారా వారి జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పు, అభివృద్ధి కనిపిస్తుందన్న విషయం వారి పరిస్థితిని గమనించిన ఎవరికైనా స్పష్టమౌతుంది. ఒక అర ఎకరం మాగాణి భూమి వుంటే ఆ దళిత కుటుంబానికి వచ్చే స్వేచ్ఛ, హోదా చూస్తేనే అర్థమవుతుంది. సాగు భూమి చిన్న చిన్న కమతాలుగా వుండడం వల్ల జరిగే అనుత్పాదక పరిణామాలు, భూసమీకరణ గురించి అనేక సిద్ధాంతాలు ఎలా ఉన్నప్పటికీ (వీటిలో కొంత నిజం లేకపోలేదు) ప్రతి దళిత కుటుంబానికి అర ఎకరం నీటి పారుదల సౌకర్యం గల భూమి వుండేట్లు చేస్తే, వారు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అన్ని విధాలా లబ్ధి పొందుతారు. ప్రముఖ పరిపాలనదక్షులైన రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ అధికారి పి.యస్ అప్పుగారు కేరళలో ప్రతి దళిత కుటుంబానికి కేవలం పదిసెంట్ల భూమిని పంచినప్పుడు, అలాగే బీహారులో భూ పంపిణీ, ఇతర వనరులు వారికి సమకూర్చినప్పుడు వారి జీవితాల్లో చెప్పుకోదగ్గ పరిణామాలు చోటు చేసుకున్నాయని అనుభవపూర్వకంగా చెప్పారు. మన రాష్ట్రంలో కూడా దళితుల ఆధీనంలో నీటి వసతి గల సాగుభూమి వున్న ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి గమనించవచ్చు.

ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న ఏమంటే వీరికి పంచడానికి అవసరమైన సాగు భూమి వుందా? ఒక చిన్న లెక్క మనం ఇప్పుడు వేద్దాం. రాష్ట్రంలో కోటి మంది దళితులు ఉన్నారంటే సుమారు ఇరవై లక్షల కుటుంబాలు వున్నట్లు, అందులో పధ్నాలుగు లక్షల మంది (డెబ్బై శాతం) గ్రామాలలో నివసిస్తున్నారు. అందులోడెబ్బై ఐదు శాతం మంది కూలీలుగా వ్యవసాయంపై ఆధారపడిన వారు అనగా 10.5 లక్షల కుటుంబాలు. అంటే, రాష్ట్రం మొత్తంలో వున్న దళిత కుటుంబాలకు పంపకం చెయ్యడానికి ప్రభుత్వం ఆరు లక్షల ఎకరాల నీటి వసతి గల సాగుభూమిని సేకరించవలసి వుంటుంది. కోటి ఎకరాల నీటి వసతి గల సాగు భూమిలో ఆరు శాతం అడగటం. అదేమైనా మరీ పెద్ద మొత్తమా? తరువాత ఇదే పథకాన్ని మిగిలిన ఇతర కులాలకు చెందిన వ్యవసాయ కార్మిక కుటుంబాలకు విస్తరించినట్లయితే అధికారంలో వున్న ప్రభుత్వం ఏ సబ్సిడీ బియ్యం పథకం కోసమయితే సంవత్సరానికి రెండువేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందో అటువంటి పథకాలకు చాలా వరకు స్వస్తి చెప్పవచ్చు. అధికారంలో వున్న ఏ రాజకీయ పార్టీకైనా ఇది మంచి లబ్ధిని చేకూరుస్తుంది. కేవలం వర్గ దృక్పథం వల్ల, అవగాహన, చిత్తశుద్ధి లోపించటం వల్ల అధికారంలోని రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని పట్టించుకొవటం లేదు.

రాజకీయ పార్టీల చిత్తశుద్ధి గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు భూసంస్కరణలు సరిగ్గా అమలు చేసి వుంటే బడుగు వర్గాల జీవితాలలో అనంతమైన మార్పుని తీసుకువచ్చి మన దేశాన్ని శక్తివంతమైన రాజకీయ, ఆర్థిక శక్తిగా మార్చటం ఎప్పుడో జరిగి వుండేది. కమ్యూనిస్టు చైనాలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నలభై రెండు శాతం వ్యవసాయ భూమిని పంచి పెట్టారు. పెట్టుబడిదారీ దేశమైన జపానులో ముప్పయి శాతం, దక్షిణ

కొరియాలో ముప్పయి మూడు శాతం, తైవాన్‌లో ముప్పయి ఎనిమిది శాంతం భూమి పంచగా, మన దేశంలో అతికష్టం మీద ఒకటిన్నర శాతం సాగుభూమి పంపకమయింది! అన్ని ప్రధాన పార్టీలు భూసంస్కరణలు మరచిపోయాయి. వామపక్ష పార్టీలు ఇప్పుడు (2007 నుండి) ముఖ్యంగా ఇండ్ల జాగాలకై భూ పోరాటాలు చేయడం అహ్వానించ దగ్గ విషయం. మిగిలిన పార్టీల ముసాయిదాలో ఇది కనిపించకుండానే పోయింది. వారే ఇపుడు భూ పరిమితి చట్టాలను రద్దు చెయ్యాలి అని ఆలోచిస్తున్నారు. ఇక్కడ చర్చించవలసిన ప్రశ్న ఏమంటే ఇక్కడ పంచటానికి, చాలినంత భూమి అందుబాటులో వుందా లేదా అన్న విషయం.

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్.ఐ.అర్.డి) జిల్లా అధికార యంత్రాంగం విడివిడిగా చిత్తూరు జిల్లాలో సర్వేలు నిర్వహించి తెలుసుకున్నదేమంటే సుమారు నలభై శాతం ప్రభుత్వం పేదలకని పంపిణీ చేసిన భూమి అనర్హుల చేతిలోకి చేరిందని. ఇది జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలు వుంటుందని అంచనా. అలాగే భూ పరిమితికి మించిన పదివేల ఎకరాల భూమి చాలా వరకు అదే భూస్వాముల చేతిలో కొనసాగటమో లేదా వేరే వారికి అమ్మివేయబడటమో జరిగింది. మరో ఐదు వేల ఎకరాలు ఎనభై తొమ్మిది కేసులలో చిక్కి కోర్టు, ట్రిబ్యునల్‌ల మధ్య గత పాతిక సంవత్సరాలుగా నలుగుతూ వున్నది. దేవాలయాలకు, మఠాలకు చెందిన పదహారు వేల ఎకరాల భూమి జిల్లా అంతటా విస్తరించివుంది. అత్యధిక భాగం "పెద్ద మనుషుల" ఆక్రమణలో వుంది. కొన్ని దేవాలయాలు ఎప్పుడో శిథిలమయిపోయాయి కూడా.

ప్రభుత్వం ఆ భూములను వాటిని సాగు చేస్తున్న అనధికార నిజమైన పేద కౌలుదార్లకు లేక పరిసర ప్రాంతాల్లోని భూమిలేని దళితులకు, ఇతర వ్యవసాయ కార్మికులకు లీజుకో, కంతుల ప్రకారం అమ్మకానికో ఇవ్వవచ్చు.

జమిందారీ ఎస్టేట్లు రద్దు చేస్తూ ప్రభుత్వం వారు 1948లోనే చట్టం చేశారు. దీనిలో సెక్షను 11-ఎ ప్రకారం 1945 జులై నుంచి తమ అనుభవంలో వున్నట్లు రుజువు చేసిన రైతులకు పట్టా ఇవ్వవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకుని, పలు భూబకాసురులు లంచగొండు అధికారులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులు సృష్టించి వేలాది ఎకరాల జమిందారీ భూములు కాజేశారు. ఎస్టేటు భూములు తమ ఆధీనంలోనే ఉన్నాయని, వారికే చెందాలని 1980 దశకంలో కూడా సెటిల్‌మెంటు ఆఫీసర్లకు అర్జీలు ఇవ్వడం వాటిని వారు స్వీకరించటం జరిగింది. ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకోకుండా వివిధ కోర్టుల్లో కేసులు వేసి 'స్టే'లు తెచ్చుకొని వాటిని ఏళ్ళతరబడి అనుభవించటం, అమ్ముకోవడం జరుగుతోంది. భూదాన భూములకు, గిరిజనేతరుల చేతుల్లోకి జారిపోయిన లక్షలాది ఎకరాల గిరిజనుల భూములకు ఇదే గతి పట్టింది. అలాగే చిత్తూరు జిల్లాలో 5 లక్షల ఎకరాలు రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలు బీడుగా వున్న అటవీ రిజర్వుడు భూములున్నాయి. వీటిని స్థానిక పేదలకిచ్చి వన సంరక్షణ సమితుల ద్వారా చెట్లు పెంచే

కార్యక్రమం, అడవిని సంరక్షించే కార్యక్రమాలు చేపట్టవచ్చు. తద్వారా లక్షలాది మందికి ఉపాధి దొరకటమే కాకుండా పర్యావరణ సంరక్షణ కూడా జరుగుతుంది. వాస్తవంలో ఈ మంచి పథకాన్ని నీరుగార్చేసి చివరకు కొందరు అటవీశాఖ అధికారులు, స్థానిక దళారుల జేబులు నింపుకునే కార్యక్రమంగా ప్రస్తుతం ఈ పథకం తయారయ్యింది. గాంధీగారు అన్నట్లు "ప్రకృతిలో ప్రతి మనిషి అవసరానికి కావలసినంత వున్నది. కానీ అది ఏ ఒక్కరి దురాశకు సరిపోదు".

భూసంస్కరణల యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు చిత్తూరు జిల్లాలో దళితుల స్వాధికారం కోసం పనిచేస్తున్నవారు, అలాగే వామపక్షాల, ప్రజాసంఘాలు మరియు ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వారు కలిసి పనిచేయడానికి పన్నెండు సంవత్సరాలు క్రిందట (1996లో) నిర్ణయించారు. చట్టపరంగా పేదల అధీనంలో వుండవలసిన భూములను వారి అధీనంలోకి తీసుకురావటం అనే ఒక్క సూత్రం ప్రధాన కార్యక్రమంగా భూ సంస్కరణల కార్యాచరణోద్యమం ప్రారంభించాం. ఇందులో ఎవరైనా సమూహంగా / వ్యక్తిగతంగా భాగమై వారి మిగిలిన కార్యక్రమంలో సంబంధం లేకుండా ఈ విషయమై కృషి చేయవచ్చు. ఒకే ఒక్క నియమ మేమంటే రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా ఇందులో పాల్గొనరాదు. కాని వారి అనుబంధ సంస్థల ద్వారా పాల్గొనవచ్చును. లేకపోతే మొత్తం వ్యవహారమంతా ఆ పార్టీ పేరు కింద ముద్రపడి, ఈ పోరాటమంతా ఆ పార్టీ జెండా కిందకు పోవచ్చు. దానికి బలాన్ని చేకూర్చే ప్రదర్శనగా మారిపోయే అవకాశముంటుంది. అది ఇతర సంస్థలకు నచ్చకపోవచ్చు. అప్పుడు ఉద్యమం ముందుకు నడవదు.

ఈ ఉద్యమానికి సమన్వయ కర్తగా నన్ను నియమించిన తరువాత ఐదు సంవత్సరాలలో (1996-2001) ఆరువేల ఎకరాల భూమిని పేదల ఆధీనంలోకి తీసుకురావటంలో విజయం సాధించాం. పేదలకు చెందిన స్థానిక సంఘం వుండడం, జిల్లా స్థాయి వివిధ ప్రజా సంఘాల సమాఖ్య వెన్నుదన్నుగా ఉన్నదన్న విశ్వాసంతో ఇది సాధ్యపడింది. కొంత మంది అభ్యుదయభావాలు గల కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లు మరియు అసిస్టెంట్ కలెక్టర్‌లు (ఐఎఎస్ అధికారులు) భూ వివాదాలకు సంబంధించిన ఎంతో సమాచారాన్ని అందజేసి మాకు సహాయం చేశారు. ప్రజా ప్రదర్శనల ద్వారా అధికారుల ముందుకు తెచ్చే భూ సమస్యలపై అధికారులతో కూర్చొని సమీక్షించేవాళ్ళం. ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకొనటంతో స్థానిక మండల అధికారుల నుండి గ్రామ కరణాల వరకు కొంత కదిలారు. పై అధికారులు వచ్చారంటే కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది తమ వలస సంస్కృతి బయటపెడతారు. ఎగిరి గంతేసి "ఔను సార్!, లేదుసార్!, కాదు సార్!" అంటూ పరుగులు తీస్తారు. అన్ని సమస్యల తీర్మానానికి తేదీలు, గడువులు నిర్ణయిస్తారు. మళ్ళీ మూడు నెలల తరువాత సమీక్షిస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! ఏదో ఒక సాకు చెబుతారు. ఆ మధ్య వారిని ఎపుడు కదలించినా గౌరవనీయులైన అప్పటి ముఖ్యమంత్రి

శ్రీ చంద్రబాబునాయుడు గారు ప్రవేశ పెట్టిన అనేక ఉద్యమ కార్యక్రమాలు "నీరు - మీరు" లేక "జన్మభూమి" లేక "పచ్చదనం - పరిశుభ్రత" అదో ఇదో ఏదో ఒక కార్యక్రమంలో బిజీగా వుంటారు. ప్రజా సమస్యలు - ముఖ్యంగా భూ సమస్యల గురించి పని చేయడానికి వారికి తీరికేలేదు పాపం! కొత్త కాంగ్రెసు ప్రభుత్వం వచ్చాక కూడా అదే ధోరణి! కానీ పలు చోట్ల కాంగ్రెసు పార్టీ హయాంలో కనీసం సాగు చేసుకుంటూ ఏండ్ల తరబడి పట్టాల కోసం తిరుగుతున్న వారికి ఆ భూములపై పలుచోట్ల పట్టాలిచ్చారు (రాష్ట్ర వ్యాప్తంగా ఐదు - ఆరు లక్షల ఎకరాల). ఈ విధంగా కనీసం భూ సమస్య ఒక ప్రధాన సమస్యగా ప్రభుత్వం గుర్తించింది. కొత్త ప్రభుత్వం ఈ నేపథ్యంలో రంగారావు కమిటీని వేయగా, వారి నిర్ధారణలో రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 60 లక్షల నుండి కోటి ఎకరాల వరకు. (సాగు భూమిలో 25 శాతం) పేదలకు స్వాధీన పరచటమో లేక సాగు చేస్తున్న భూమికి చట్టబద్ధత కల్పించవలసి ఉన్నదని నిర్ధారించారు.

పైస్థాయి రెవెన్యూ అధికారులు తరచుగా మారిపోతుండటం వలన మళ్ళీ కథ మొదటికి వస్తుంది. క్రింది స్థాయి రెవెన్యూ అధికారులకు ఈ ఆట బాగా తెలుసు. రెవెన్యూ విభాగంలో అతి శక్తివంతమైన అధికారి ఎవరు అంటే జిల్లా కలెక్టర్ కాదు గ్రామకరణమే. ముఖ్యంగా అతడే అవకతవకలకు పాల్పడే వ్యక్తి. అతడు ఒక శక్తివంతమైన మనిషి. అతను ఏ రికార్డు అయినా ఇట్టే ఇవ్వగలడు. మార్చగలడు, లేదనగలడు. అతను ఇచ్చే తప్పుడు రికార్డులు చూపించి కోర్టుకు పోవచ్చు. అడిగిన వెంటనే 'స్టే ఆర్డరులను' మంజూరు చేయటానికి మన కోర్టులు తయారుగా వుంటాయి. కేసులు ఒక కోర్టు నుంచి మరొక కోర్టుకి అనంతంగా సాగిపోతూ తరాలు గడిచిపోతాయి. ఏ చట్టమూ అమలులోకి రాదు. ఏ న్యాయము జరుగదు. నిజాయితీగా చట్టంపై ఆధారపడిన పేదలు భూ సంస్కరణల చట్టాల అమలు ద్వారా భూమిని పొందటానికై లక్షల రూపాయలు ఖర్చు పెడుతూ (వేలల్లో కాదు) నల్ల కోట్లు తొడుక్కున్న న్యాయవాదుల వెనుక, కోర్టు వెనుక ఏళ్ళ తరబడి పరిగెడుతూనే వుంటారు. న్యాయం పొందడానికి సంపాయించటానికి ఇది దారికాదు.

మా ఉద్యమంలో భాగస్తులైన వివిధ ప్రజాసంఘాలు పేదలకు స్వాధీనపరచగలిగిన పట్టాలు ఇవ్వగల నలభై నాలుగు వేల ఎకరాలకు సంబంధించిన పట్టికను మేం ప్రభుత్వానికి అందజేశాం. కొన్ని వివాదాలలో ఎక్కడయితే బలమయిన ప్రత్యర్థులు లేరో వాటిని అధికారులు త్వరగా తీర్చారు. మిగిలిన అనేకం పరిష్కారానికి నోచుకోక అలాగే మిగిలిపోయాయి. శక్తివంతమైన ప్రజా ఉద్యమాల ద్వారా కదలికను తీసుకురావటమే దీనికి పరిష్కారం. కాని ఎవరైతే దానిని నిర్వహించాలో వారు వారి బాధ్యతలకు దూరంగా పోతున్నట్లు కనిపిస్తోంది. వర్గ విభేదాలు, వైరుధ్యాలు లేని సమస్యలు, కార్యక్రమాలు చేపట్టటం దీనికన్నా సులువైన పని. ముఖ్యంగా విదేశాల నుండి లేక ప్రభుత్వం నుండి ధన సహాయం పొందుతున్న స్వచ్ఛంద సంస్థలకు ఇదొక పెద్ద సమస్య. వామపక్ష పార్టీలైన

సి.పి.ఐ., సి.పి.ఎం లాంటివారికి కార్యకర్తలు తక్కువగా వుండటం, కార్యక్రమాలు ఎక్కువ వుండటంతో వారి మద్దతుతో నడుస్తున్న వివిధ ప్రజా సంఘాలకు, పార్టీ కార్యక్రమాలకు ఆ కొద్ది మంది వ్యక్తులే పని చేయాల్సి రావటంతో విపరీతమైన వత్తిడికి గురై చేపట్టిన సమస్యకు అవసరమైన సమయం కేటాయించలేక, న్యాయం చేయలేకపోతున్నారు. ఎన్నికలు, ప్రజాస్వామ్య వ్యవస్థలోకి రాని నక్సలైటు పార్టీలు - మా ప్రాంతంలో దాదాపు లేరనే చెప్పాలి. వారు ప్రవేశించినా (ముఖ్యంగా మావోయిస్టుపార్టీవారు), గతంలో తూర్పు తాలూకాల్లో లాగ, వారి హత్యా రాజకీయాల వల్ల అసలు సమస్యను ప్రక్కదోవ పట్టించడం జరుగుతుంది. మొత్తం 'లా అండ్ ఆర్డర్' అనగా శాంతిభద్రతల సమస్యగా మారిపోయి చివరకు పోలీసు జులుంకి దారితీస్తుంది. అతి చిన్న కార్యక్రమాలు చేపట్టినా నిర్దాక్షిణ్యంగా పోలీసులు అణచివేస్తారు. కాబట్టి మరి మన దారి ఎటు? నేరుగా పేదలకు దక్కవలసిన భూములు, పేదలకు స్వాధీనపరచటానికి, సాగు చేయటానికి ఇది దారికాదు.

పేదలకు న్యాయం కోసం పోరాటాలు చేయడంలో హింస, అహింసా పద్ధతులు, పరిస్థితులను బట్టి, కొంత మేరకే సఫలమయ్యాయి. కాబట్టి అహింసా మార్గమే సరియని లేదా హింసా మార్గమే చివరికి పాటించాల్సి వస్తుందని సూత్రప్రాయంగా చెప్పలేము. ఏ సమయంలో, ఏ పద్ధతి పాటించాలో, ఆ ఉద్యమంలోని పరిస్థితులను బట్టి, పోరాటంలో భాగస్తులైన వారు ఏ పద్ధతులపై మొగ్గు చూపుతారో దాన్ని బట్టి ఉంటుంది. ఉద్యమ నాయకులు ఇవన్నీ గమనిస్తూ ఉండాలి. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా, (పోరాటంలో పాల్గొన్న వారికి, ప్రత్యర్థులకు, సంబంధం లేని వారికి) సాధ్యమైనంత మేరకు క్రియాత్మకంగా మెలగాలి, నిర్ణయాలు తీసుకోవాలి. గాంధీగారి ప్రతిభ (అలాగే అమెరికాలో నల్లజాతి వారి హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ నైపుణ్యత) ఇందులోనే ఉంది. పేదల నిస్సహాయ స్థితినే "అహింస" పద్ధతిలో బలమైన ఆయుధంగా మార్చగలిగారు. ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టగలిగారు. అహింసను ఒక దైవ సంకల్ప, పరమార్థిక (Spiritual) ఆయుధంగా వారి ప్రత్యర్థులపై ఎక్కుపెట్టారు.

అన్యాయం జరుగుతున్నపుడు శాంతి పేరుతో అన్యాయాన్ని సహించటం కూడా ఆ హింసలో పరోక్షంగా పాలుపంచుకోవటమేనని విశ్లేషించారు. మన సంస్కృతిలో కూడా "సామ, దాన, బేధ, దండోపాయం" అని సూచించారు. (ఉ॥ 'మహాభారతం') కానీ ఆచరణలో ముఖ్యంగా జనబలం మన వైపు ఉన్నపుడు దౌర్జన్యానికి, హింసా పద్ధతుల్లో అడుగులు వేసేందుకు జనం ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. ప్రత్యర్థుల పరిస్థితిపై కూడా కరుణతో ఆలోచించి నాయకులు సరైన నిర్ణయాలు తీసుకోవాలి.

# IV

# క్షీణిస్తున్న చేతి వృత్తులు

## చేనేతపని

వ్యవసాయ కూలీల తరువాత దేశంలో అత్యధికంగా వున్న పనివారు చేనేత కార్మికులు. వారు మా జిల్లాలోని పుత్తూరు దగ్గర శ్రీకాళహస్తి, నగరి మరియు నారాయణ వనం మండలాల్లో కేంద్రీకృతమై వున్నారు. వారి ముఖ్య సమస్య నాణ్యమైన నూలు న్యాయమైన ధరకి లభించటం, వారు ఉత్పత్తి చేసే వస్త్రాలకు గిట్టుబాటు ధర పలకటం. ఈ విధమైన సిఫార్సులు గతంలో నిపుణుల కమిటీలు, కమీషన్లు పదే పదే చేయటం, వాటికి అనుగుణంగా ఎన్నో చట్టాలు చేయటం జరిగిపోయాయి. వీటిద్వారా చేనేతకు వాడే హాంక్ నూలు (కోన్ నూలు బదులు) అవసరమయ్యేంత ఉత్పత్తి మిల్లుల్లో తయారు చేసి చేనేత కార్మికులకు సరఫరా చేయటం, కొన్ని రకాల వస్తువుల ఉత్పత్తి చేనేత రంగానికే రిజర్వు చేయటం వంటివి జరిగాయి. కానీ ఆచరణలో అవన్నీ దాదాపు పూర్తిగా విఫలమయ్యాయనే చెప్పాలి. ఇపుడు విద్యుత్‌తో నడిచే పవర్‌లూములు అంతటా వచ్చేశాయి. కారుచౌకగా, అంత నాణ్యత లేకుండా చేనేత ముద్దరతో అటువంటి వస్తువులనే ఉత్పత్తి చేసేస్తున్నారు. ఈ పవర్‌లూమ్ యజమానుల్లో చాలా తక్కువ మంది నిజమైన చేనేత కార్మికులు. ప్రస్తుత వాతావరణంలో "సత్యం కమిటీ" అనే ఒక కమిటీ చేనేత రంగాన్ని పరిశీలించి కష్టాల ఊబిలో నుండి ఒడ్డుకు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్నిరంగాల్లోలాగా మన చేనేత రంగంలో కూడా పోటీతత్వం పెరగాలని ప్రభుత్వం ఇచ్చే సహాయం – అనగా కొన్ని రకాల వస్తువుల ఉత్పత్తి కేవలం చేనేత రంగానికే పరిమితం చేయడం, ఉత్పత్తులకు రిజర్వేషన్, ముఖ్యంగా ఆర్డర్లు తీసుకుని నూలు వగైరా కార్మికులకి సరఫరా చేసి సరుకు అంగళ్ళకు అమ్మే చేనేత పెద్దలైన మాస్టరు వీవర్లుపై పరిమితులు విధించడం వగైరా సిఫార్సులు చేసింది. అంటే ఇపుడున్న నామమాత్రపు ఆంక్షలు కూడా ఎత్తివేయమంటున్నారు!

అలాగే చేనేత సహకార సంఘాలలో అనేకం బోగస్‌వి వున్నాయి. వాటి ద్వారా చేనేతపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ భోంచేస్తూ ఒక్క మీటరు కూడా చేనేత బట్ట ఉత్పత్తి చేయకుండానే (బిల్లులోనూ కాగితాలమీదే) కొందరు బతికిపోతున్నారు. శ్రమజీవులు అత్యధిక భాగం పాలిస్టరు బట్టల వైపు మొగ్గు చూపటం మొదలు పెట్టినప్పటి నుండి

చేనేత కార్మికుల బాధలు ఎక్కువయ్యాయి. పట్టు వస్త్రాలు తయారు చేసే చేనేతవారి పరిస్థితి కొంత మెరుగ్గా వుంది. వారు (నాణ్యమైన చైనా పట్టు నూలుపై మొగ్గు చూపుతుంటారు). మా ప్రాంతంలో చాలా మంది చేనేత కార్మికులు వారి సంప్రదాయ వృత్తిని వదులుకున్నారు. కొన్ని చోట్ల ఆకలితో, అప్పులతో ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. మొదటి పంచవర్ష ప్రణాళిక మొదలుకుని వివిధ కమిటీల సిఫార్సులు – ఇప్పుడు సరళీకరణ ఆర్థిక విధానం అన్నీ కలిపి చేనేత కార్మికుల్ని ఉద్ధరించింది ఈ విధంగానన్నమాట! పత్తి రైతులు, దూదిఏకేవారు, పత్తి నుండి గింజలు వేరుచేసేవారు, నూలు వడికేవారు, నేసేవారు – వ్యాపారస్థుల మధ్యనున్న అవినాభావ సంబంధాలు ఎపుడో తెగిపోయాయి. ముఖ్యంగా, ఇంగ్లీషు వారి పరిపాలనా కాలంలో. ఆశ్చర్యకరమైన విషయమేమంటే గాంధేయ ప్రచారం ఇంత జరిగాక కూడా నేరుగా రైతు నుండి చేనేత కార్మికునికి నాణ్యమైన పత్తి నూలు అందించే యంత్రాన్ని తయారు చేయలేకపోయారు. పత్తి రైతులు ఈ రోజుల్లో అప్పులు, క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు, భారీ చావుల జూదంలో మునిగి తేలుతున్నారు. ఇట్టి పరిస్థితుల్లో చెన్నైలో "దేశభక్తితో ప్రజల కొరకు విజ్ఞానం" అన్న అంశంపై పనిచేస్తున్న పి.పి.యస్.టి. సంస్థకు చెందిన కణ్ణన్, మరియు శ్రీ రామకృష్ణ వంటివారు చేనేతకు నాణ్యమైన నూలు సరసమైన ధరకు అందేలా చూసేందుకు అవసరమైన యంత్రాన్ని తయారు చేశారు. ఉగ్రమ్మగారి చొరవతో దేశంలో నాలుగు ప్రాంతాల్లో ఈ యంత్రాలు పనిచేస్తున్నాయి. చేనేత కార్మికులు కేవలం జిల్లా స్థాయిలోనైనా ఒక బలమైన సంఘటిత శక్తిగా ఎదగలేకపోయారు. వీరి పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన గాంధీగారు చేనేత కార్మికుల పరిస్థితులలో మార్పు రావాలంటే అది వినియోగదారుల చైతన్యంతో ముడిపడి వున్నదని గ్రహించారు. ఒక పక్క చేనేత కార్మికులను కాపాడేందుకు మానవత్వం – జాతీయతత్వంతో కూడిన ఉత్సాహం అవసరం. మరోపక్క వినియోగదారుల్లో మారుతున్న అభిరుచులకు అనుగుణంగా పాలిస్టరు బట్టతో పోటీ పడుతూ బట్టలు తయారు కావాలి. ఈరెండు లక్షణాల మధ్య అందరికీ ఆమోదయోగ్యమైన దారి వెతకాలి.

## కుమ్మరి పని

కుమ్మరి పనికి ఎప్పుడో కాలం చెల్లింది. అల్యూమినియం రాకతో, ఆ తరువాత స్టీలు, ఆ పైన ప్లాస్టిక్‌తో కుమ్మరి పని అయిపోయింది. కానీ కుమ్మరిపని పూర్తిగా ఎన్నటికీ అంతరించిపోదు. మంచినీటి కుండలు, వస్తువులు భద్రపరచేందుకు పాత్రలు, (ముఖ్యంగా వడ్లు, చింతపండు, మిరపకాయలు) వివిధ ఉత్సవాలు, మతపరమైన కార్యక్రమాలకు, పూలతొట్లకు వగైరా వస్తువులకు ఎల్లప్పుడూ గిరాకీ వుండనే వుంటుంది. వీరు కూడా కేవలం మట్టి పాత్రలపైనే బతుకులీడ్చడం లేదు. వీరిలో చాలా మంది వ్యవసాయం చేస్తూ వుంటారు. వున్న కొద్దో గొప్పో భూమిపైన, లేదా కౌలుకి తీసుకుని లేదా వేరే పనుల్లోకి

వెళ్ళిపోతుంటారు. మాఊరి దగ్గర ఒక కుమ్మరిపల్లె వుంది. ఏదో విధంగా వారంతా బతికి పోతున్నారు. మదనపల్లి దగ్గర ఋషివ్యాలీ స్కూలు (జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ వారిది) ఉన్నది. అక్కడ పనిచేస్తూవుండే ఒక కళాకారుడు సృజనాత్మకత వల్ల మట్టితో ఎన్నోరకాల అలంకారప్రాయమైన వస్తువులను తయారు చేసి అక్కడ కుమ్మరులతొ చేయించాడు. ఈ వస్తువులకు పట్టణాల్లో మంచి గిరాకీ వచ్చింది. తద్వారా మదనపల్లి డివిజనులో ముఖ్యంగా మెయిన్ రోడ్డు, బెంగుళూరు – మద్రాసు రోడ్లపక్కన పలుచోట్ల ఈయన స్థాపించిన ఉచిత శిక్షణా సంస్థ ద్వారా ఆ కళ నేర్చుకుని చాలా మంది ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. అలాగే ఇండ్ల నిర్మాణానికి, ఇటుకల గిరాకీతో చాలా మంది కమ్మరులు సీజనులో (జనవరి నుండి – ఏప్రిల్ వరకు) ఈ పనిలో నిమగ్నమై వుంటారు.

## మేదరి పని

వెదురు పనిచేసే మేదరి వారికి గడ్డు రోజులొచ్చేశాయి. మా ప్రాంతంలో మామిడి పండ్ల వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతుంది. మామిడి పండ్ల బుట్టలకు, ద్రాక్ష బుట్టలకు డిమాండు బాగుండేది. దీనివల్ల పేదవారికి మంచి ఆదాయం వచ్చేది. ఒక వెదురు బుట్ట 5 – 6 1/2 రూపాయల ఖరీదైతే 7 కిలోల పండ్లు అందులో పెట్టవచ్చును. అట్టపెట్టి ఖరీదు 10 నుంచి 20 రూపాయలు. 10 కిలోలు ప్యాకింగు చేయవచ్చును. అయితే అట్టపెట్టి ప్యాకింగులో శ్రమతక్కువ, చూసేందుకు శుభ్రంగా వుంటుంది. గత రెండు సంవత్సరాల్లో మామిడి బుట్టల కోసం డిమాండు పడిపోయిందని, సంవత్సరానికి ఒక లక్ష బుట్టలు అమ్మేటివి ఇప్పుడు 30 వేలు కూడా అమ్ముడు పోవటం లేదని కొందరు మేదర్లు నా దగ్గర వాపోయారు. కొంత కాలం క్రితం వారిలో ముందుకు వచ్చిన కొందరు నాయకుల సహకారంతో, మా ప్రోత్సాహంతోనూ అతికష్టం మీద ఒక సహకార సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. కష్టం ఎందుకంటే అది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా తేలింది.

ఒక సొసైటీగా వారు రిజిష్టరు చేసుకోవాలంటే 15 నుండి 20 వేలు ఖర్చు అవుతుందని వారు నాతో మొదట అన్నారు. నేను నమ్మలేదు. సొసైటీ ఏర్పాటుకై మేము తిరిగితిరిగి అలిసిపోయేటప్పటికి వారు చెప్పిందే సరైనదని అర్థమయ్యింది! ప్రభుత్వంలో వున్న అవినీతి వల్ల వారి ఆఫీసుల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వచ్చేది. రెండు మూడు సార్లు హైదరాబాదుకు కూడా పోవాల్సి వచ్చింది. ప్రతి చోట అధికారులు తమ 'వాటా' మరిచిపోలేదు. సగం ఖర్చు సభ్యుల సభ్యత్వ రుసుం కింద ఖర్చు అయితే మిగతాదంతా లంచాలకు, తిరుగుడుకు భోజనాలకు అవుతుంది. సహకార సంఘం లేకపోతే కనీసం నెలకొకసారి అటవీ శాఖ వారు మేదర్లను వేధిస్తారు. మేదర్లు తయారు చేసిన వెదురు బుట్టలను ఎత్తుకెళ్ళిపోయేవారు, ఫైన్లు విధించేవారు. ఏమంటే వెదురు అడవి నుంచి తెచ్చినా, రైతుల నుండి కొన్నా లైసెన్సు (పర్మిట్) వుండాలంటారు. ఈ అవమానాలకు

తట్టుకోలేక వారు సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వేధింపులు బాగా తగ్గిపోయాయి. వారివద్దనున్న సహకార లైసెన్సుతో కనీసం 300 కి.మీ దూరంలో నున్న గిద్దలూరు అడవి ప్రాంతం నుండి వెదుర్లు తెచ్చుకుంటున్నారు.

కానీ రాను రాను అది కూడా ఖరీదైపోతోంది. అక్కడ కూడా అటవీ అధికారులకు మామూళ్ళు తప్పటం లేదు. కొంత పచ్చి వెదురు, ముఖ్యంగా చిట్టి వెదురు స్థానిక అడవుల నుండి గిరిజనులు తెచ్చి అమ్ముతుంటారు. కొంత రైతుల నుండి కూడా కొంటూ వుంటారు. మేదర పని చేసేవారిలోనే కొందరు ఔత్సాహిక నాయకత్వపు లక్షణాలుండే వారు నలుగురు - ఐదుగురు పెత్తనం చెలాయిస్తారు. చేనేత కార్మికుల్లో మాస్టరు వీవరులాగ వీరిదే మొత్తం అజమాయిషీ. వెదుర్లు కొనడానికి పెట్టుబడి వీరిదే. అడవి నుండి తెచ్చి మేదర్లకందరికీ వెదుర్లు పంచి తిరిగి అల్లిన బుట్టలు వారి నుండి తీసుకుని, వారికొచ్చిన ఆర్డర్ల ప్రకారం మార్కెట్టులో అమ్ముతారు. వచ్చే లాభం, నష్టం వారిదే. ఈ విధంగా అందులో అంతో ఇంతో సంపాదించి ఈ కొద్ది మంది మిద్దెలు, మేడలు కట్టుకున్నారు. వీరే మాతో సొసైటీ ఆఫీసులన్నీ తిరిగారు. మిగతా మేదరులంతా కుటుంబ సభ్యులతో సహా రాత్రింబవళ్ళు కష్టపడి బుట్టలు అల్లుతుంటారు. అయినా వారి బతుకులు అంతంత మాత్రంగానే వున్నాయి. సరైన ఇల్లులేదు. తిండి లేదు. బట్టలేదు. మగవారంతా ఎక్కువ భాగం తాగుడుకు బానిసలైపోయారు. ఎక్కడ చూసినా ఇదే స్థితి కనబడుతోంది. తెలివైన వారు, ఔత్సాహికులు, బలమైనవారు మిగతావారిపై పెత్తనం చెలాయించటం, దోపిడీ చేయటం, ఆ మిగతావారు దానికి తలవంచి వొప్పుకోవడం నిత్యం అనేక సందర్భాల్లో జరుగుతూనే వున్నది. ఇలా ఎందుకు జరుగుతోంది?

## కమ్మరిపని, వడ్రంగి పని

లోహపు పనికి సంబంధించిన ఆచార్యులు (విశ్వకర్మ బ్రాహ్మణులు), వడ్రంగి పనిచేసే ఆచార్యులు, నిర్మాణ పనిలో అనగా ఇండ్లు వగైరా కట్టడాల్లో పనిచేసేవారు. ముఖ్యంగా అందులో కొంత నైపుణ్యత వున్నవారు, మేస్త్రీలు, సెంటరింగు పని, కమ్మికట్టేపనివారు కొంత బాగుపడ్డారనే చెప్పాలి. ఆచార్లు స్థానికంగా వున్న పెద్ద గ్రామాలు , మెయిన్ రోడ్ కూడళ్ళ వద్ద తమ అంగళ్ళను పెట్టుకున్నారు. పక్కా సిమెంటు ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం వల్ల మేస్త్రీలు వగైరా బాగుపడ్డారు. ప్రత్యామ్నాయ నిర్మాణాలు, 20 - 30 శాతం ఖర్చు తగ్గిచ్చే ప్రయోజనాల వైపు ప్రజలు అంతగా మొగ్గు చూపటం లేదు. జీవితంలో ఒక్కసారి ఇంత పెట్టుబడి పెట్టి ఇల్లు కట్టుకుంటున్నాం, అందులో అనవసరంగా ఎందుకంత రిస్కు తీసుకోవాలి అని ఆలోచిస్తూ వుంటారు. ఇనుము / కొయ్యతో పనిచేసే ఆచారులకు ఎప్పుడూ గిరాకీ వుంటుంది. ఇండ్ల పనులకు - (గ్రిల్ పనికి, తలుపులకు, గేట్లకు వగైరాలు) వ్యవసాయ పనిముట్లకు. అలాగే ఈ మధ్య కాలంలో కరెంటు మోటారు మెకానిక్కులకు కూడా అత్యధిక డిమాండు వుంటోంది.

అసలు చెప్పాలంటే రైతులంతా సగం మెకానిక్కులు, సగం ఎలక్ట్రీషియన్లుగా తయారైపోయారు!

## ఇతరుల పని

పల్లెల్లో వివిధ సేవలందించే చాకలివారు, మంగలివారు కూడా చాలా మంది టౌన్లకు లేదా స్థానికంగా వున్న (మెయిన్ రోడ్డు దగ్గరున్న) పెద్ద గ్రామాలకు వలస పోయారు (పోతున్నారు). పాతకాలంలో వీరు ఇల్లు ఇల్లూ తిరిగి సేవలు అందించేవారు. పూటలవారిగా ఒక్కొక్క ఇంట్లో వారికి భోజనం పెట్టేవారు. పంట పండినపుడు పంటలో కొంత వాటా వారికి ముట్టజెప్పేవారు. ఇప్పుడు ప్రతీది డబ్బు రూపంలోకి వచ్చేసింది. అంతా కేంద్రీకృతమైపోతోంది. సంబంధాలు కూడా తిరగదోడబడుతున్నాయి. వివిధ సేవలందించే చాకలి, మంగలి వగైరాలవారు గ్రామస్తుల ఇండ్లు తిరిగే బదులు, వారే స్థానికంగా వున్న పెద్ద గ్రామాల్లో గానీ, (లేక అదే గ్రామంలో కూడా) అంగడి పెట్టుకుంటున్నారు. అక్కడికి వారి సేవలు అవసరమున్నవారే వస్తారు. డబ్బు చెల్లించి పనిచేసుకుపోతారు. ఇప్పటికీ అక్కడక్కడ కొందరు పాతతరం వారు తిరుగుతూ వుంటారు. వారి సేవలు గ్రామస్తులకందిస్తూ వుంటారు. రైతుకు పంట పండినప్పుడు, చేత డబ్బు వున్నప్పుడు ఇస్తారు. కానీ వీరి సంఖ్య తగ్గిపోతూ వుంది. వారే రావడం కూడా ఒక క్రమం ప్రకారం వుండదు. వస్తే వచ్చే లేకుంటే లేదు.

# V

# అంతర్జాతీయ పరిస్థితిలో నేటి వ్యవసాయం

## బొమ్మైతే నీ ఓటమి, బొరుసైతే నా గెలుపు

### ప్రపంచ దారిద్ర్యం

*రోజుకొక డాలర్ (45 రూ/-) కన్నా తక్కువ ఆదాయంతో బతికే ప్రజలు వంద కోట్లకు పైగా వున్నారు (ప్రతి ఆరో మనిషి). వీరు చెత్తకుండీలలో తిండిని వెతుక్కుంటూ, నగర వీధుల్లో అడుక్కుంటూ, మురికివాడల్లో, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తూ వుంటారు. ప్రతి రోజూ ప్రపంచవ్యాప్తంగా ఇరవై నాలుగు వేల మంది ఆకలితో చనిపోతున్నారు.*

*2007 సం॥ ఐక్యరాజ్య సమితి సమాచారం మేరకు*

అందరికీ సరిపడేంత కూడు, గూడు, వినోదం పంచగలిగే స్తోమత ఉన్నపుడు, కొంత సమన్వయంతో వనరులపై పెత్తనాన్ని అందరికీ అందుబాటులో వుండేలా పంపిణీ చేయటం ఎంతో హేతువైన పనిగా అనిపిస్తున్నది. అతి తక్కువ ఖర్చు, శ్రమతో ఇదంతా సాధ్యమని తెలిసి కూడా ఉన్నవారిని ఏదో భయం వెంటాడుతోంది. ఈ భయం వల్ల సంపద, దాని రక్షణకు ఆయుధాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమై వున్నాయి. నవసమాజం కల అయిన సోవియట్ సమాఖ్య కుప్పకూలిపోయాక పెట్టుబడిదారి శక్తులు రెట్టింపైన ఉత్సాహంతో ప్రపంచాన్నే కబళించడానికి పూనుకున్నాయి. ఇప్పుడు ఎటువంటి అడ్డంకులు, అవరోధాలు లేకుండా, దేశ సరిహద్దుల లాంటివి పాత చరిత్రగా మిగిలిపోయి, అంతా 'స్వేచ్ఛా వాణిజ్యం' పేర ప్రపంచ వాణిజ్య సంఘం కింద, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి వారి ప్రోత్సాహం, సలహాల మేరకు పెట్టుబడిదారి విధానం విజృంభిస్తోంది. పేదదేశాల పునరుద్ధరణకు, అభివృద్ధికి ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ వాణిజ్య సంఘం, అంతర్జాతీయ ద్రవ్యనిధి వారు ఇచ్చే సలహాలు, పెట్టే

షరతులు చివరకు పశ్చిమ దేశాలకు చెందిన బహుళజాతి సంస్థలకు మేలు చేసేవిగా వుంటున్నాయి.

అభివృద్ధి చెందిన దేశాలు - వారిని శాసిస్తున్న బహుళజాతి కంపెనీలు వారి ప్రపంచ ఆధిపత్యంలో - చివరి ఘట్టానికి చేరువయ్యాయి. వారి దేశాల్లో ప్రస్తుతం వున్న 20 శాతం ప్రపంచ జనాభా ప్రపంచంలోని 80 శాతం వనరులపై ఆధిపత్యం చెలాయిస్తూ వారు మిగిలిన వనరులపైన కూడా సరళీకృత విధానాలు, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వంటి పేర్లతో పెత్తనం చేయటానికి ప్రయత్నిస్తున్నారు. పెట్టుబడిదారి స్వభావమే అది. వేరే విధంగా ఆ వ్యవస్థ ప్రవర్తించలేదు. ఇటువంటి ప్రపంచ వ్యాప్తమైన అమెరికా సామ్రాజ్యవాద పెత్తనంలో భాగంగానే మన సమాజంలోని వైరుధ్యాలు, తణుకు బెణుకులను అర్థం చేసుకోవాలి. మన ప్రణాళికా కర్తలు, రాజకీయ వాదులు, అన్ని ప్రధాన పార్టీలకు చెందిన వారు ఏవో సరికొత్త విధానాలు, సంస్కరణలు కనిపెట్టినట్లు నటిస్తూ, వారిపై రంగులు ఏవైనా, అంతా సరళీకృతం, ప్రైవేటీకరణ, పెట్టుబడిదారీ ప్రపంచీకరణ పాటే పాడుతున్నారు. వివిధ పార్టీల మధ్య బహుశా రాగం, తాళంలో కొంత బేధం వుండవచ్చు!

వ్యవసాయ రంగాన్ని బడా ప్రైవేటు కంపెనీలకు హస్తగతం చేసే ప్రయత్నాలు, ప్రపంచ వాణిజ్య సంఘం యొక్క అసమాన ఏకపక్ష నిబంధనలు (మన కార్మికులు కూడా స్వేచ్ఛగా ఏ దేశంలో నైనా పనిచేసేందుకు ఎందుకు అనుమతించరు?), ప్రపంచ బ్యాంకు అప్పులు, బంగారు కరచాలనాలు పేరుతో ఉద్యోగులకు డబ్బులిచ్చి ఇంటికి పంపివేయటం, లాభదాయకమైన ప్రభుత్వ రంగ ఉత్పాదక సంస్థలను కూడా అమ్మి వేయాలన్న పట్టుదలతో నున్న ప్రభుత్వ విధానాలు - అంతా ఈ సామ్రాజ్యవాద పటంలో అంతర్భాగమే. దీని నుండి విముక్తి లేదా?

ఒక్కసారి అమెరికాను చూడండి - ప్రపంచంలోకెల్లా అతిశక్తివంతమైన దేశం అది. 70 వేలకు పైగా అణుబాంబులు వారి వద్ద వున్నాయి. అంటే ప్రపంచాన్ని 27 సార్లు బూడిద చేయగల శక్తి వారికుంది. ప్రపంచ ఆయుధాల వర్తకంలో 43 శాతం వాటా అమెరికాదే. అయినా సెప్టెంబర్ 11వ తేదీ 2001 తరువాత దాని దుస్థితి చూడండి ఎలా వణికి పోతున్నదో! ఏ నిమిషం, ఏ క్షణం ఏ ఉన్మాది ఎక్కడ బాంబు పెడతాడో, ఎవరు చచ్చిపోతారో అన్న భయమే వారిని నిరంతరం వెంటాడుతోంది! మనశ్శాంతి లేని సంపద ఏమి చేసుకోను? తన నీడను చూసి తనే భయపడే పరిస్థితి అమెరికాది ఈ రోజు! ముస్లిములను శత్రువులుగా చూస్తూ వారి దేశాల్లో చమురు నిక్షేపాలపై ఆధిపత్యం చెలాయించాలని కుట్రలు పన్నుతూ ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో మరింత ఊబిలోకి కూరుకుపోతూ ఉంది.

సరళీకృత ఆర్థిక విధానాల వల్ల, అభివృద్ధివల్ల ఇప్పుడు అమెరికాలో ఏ వస్తువు తయారు చేయాలన్నా కుదరటం లేదు! అక్కడ లేబరు అత్యంత ఖరీదు! అందులో

పదోవంతు లేదా ఇంకా తక్కువకే ఏ చైనాలోనో భారత దేశంలోనో అదే వస్తువు తయారు చేయగలుగుతున్నారు.

బహుళజాతి సంస్థలకు దేశాభిమానం లేదు. ఎక్కడ లాభం వస్తే అక్కడకు పోతాయి. నేడు అమెరికా నుండి ఎన్నో పరిశ్రమలు కంప్యూటర్ల నుండి పిన్నుల తయారీ వరకు తరలివెళ్ళిపోయాయి. ఇంకా పోతూనే వున్నాయి. ఏ దేశానికైనా తన ఎగుమతులకంటే దిగుమతులు ఎక్కువైతే ఏమౌతుంది? ఇపుడు అమెరికా కొన్ని లక్షల కోట్లు అప్పు పడిపోయింది. అన్ని దేశాల్లో డాలర్‌పై గట్టి నమ్మకం వుండటంతో, పెట్టుబడులు వారి బ్యాంకుల్లో వుండటంతో కథ ఇంకా నడుస్తోంది.

ఇరాక్ లాగ మరో ఘటన జరిగితే అమెరికాకు అది కోలుకోలేని దెబ్బ అవుతుంది. (ఉదా॥ ఇరాన్). ఆర్థికంగా, మానసికంగా పతనమైపోతుంది ఆ దేశం. ఈ పద్ధతులకు వ్యతిరేకంగా ఆ దేశంలో బలమైన ఉద్యమాలు, సంఘాలు ఉన్నాయి. వాతావరణానికి కాలుష్యం ముప్పు తెచ్చిన దేశాల్లో అమెరికానే అగ్రగామి (33 శాతం). అయినా కూడా అందరినీ కాదని నియంత్రణ చర్యలకు రౌడీబుష్ వొప్పుకోలేదు! తద్వారా మరో 50–100 సంవత్సరాల్లో భయంకర దుష్ఫలితాలు రానున్నాయి. అటు ఉత్తర, దక్షిణ ధృవాల్లోనూ, మన హిమాలయాల్లోనూ మంచు కరిగి సముద్ర తీర ప్రాంతాలను ముంచనున్నాయి. గంగానది వంటి నదులు ఎండాకాలంలో ఎండిపోయే పరిస్థితి ఏర్పడనున్నది. అకాల తుఫానులు, మరింత తీవ్రం కానున్నాయి. మన వాతావరణాన్ని రోజురోజుకూ వేడెక్కిస్తున్న బొగ్గు పులుసు వాయువు, ఇతర వాయువులను గాలిలోకి విరజిమ్ముతున్న ఆధునిక ఉత్పత్తి విధానాలు (బొగ్గు కాల్చటం, పెట్రోలు, డీజిలు కాల్చడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం) ఇవన్నీ వీటికి మూల కారణాలు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో అత్యంత ఎక్కువ స్థాయికి చేరిపోయాం. ఇంక తగ్గటమే కానీ పెరగటం ఉండదు. (ఎన్ని కొత్త నిక్షేపాలు కనుగొన్నా). ఎందుకంటే డిమాండ్ ముఖ్యంగా శరవేగంతో "అభివృద్ధి" చెందుతున్న చైనా, దాని వెనుకనే భారతదేశం వుండితీరాలంటే అధిక ధరలకైనా వీటిని సరఫరా చేయాల్సిందే! అన్ని ఖనిజాల నిక్షేపాలు తగ్గిపోతున్నాయి. ప్రపంచ భవిష్యత్తు అంధకారమైపోతోంది. వాతావరణం వేడెక్కిపోతోంది.

అమెరికా వెనుక "అభివృద్ధి" పంథాలో శరవేగంతో పరుగెడుతున్న చైనా, మన దేశం (ఇతర దేశాలు) ముప్పును మరింత చేరువగా చేస్తున్నాయి. ఒకపక్క అడవులను నరికేస్తున్నాం. గాలి, నీరు, భూమిని కలుషితం చేసేస్తున్నాము. "అభివృద్ధి" పేరిట రసాయనాల విడుదల, క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు, డీజిలు, బొగ్గు ఉత్పత్తుల ద్వారా కాలుష్యం విపరీతంగా పెంచేస్తున్నాం. మన రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకుని లాభం లేదు. వారు అభివృద్ధికి ఇదే దారి అని అనుకుంటున్నారు. అయినా వారికి నిర్ణయించే సత్తా ఎప్పుడో పోయింది. నిర్ణయించేది

వాషింగ్టన్ అమెరికా రాజధాని, అక్కడ వున్న బహుళజాతి కంపెనీలు, వారికి వత్తాసు పలికే ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు.

ఈ అభివృద్ధి పంథాలో అమెరికా చివరి రోజులు దగ్గరపడ్డాయి. అమెరికా పెత్తనం మరో 20-30 సంవత్సరాలకన్నా ఎక్కువ సాగదు. (ఎంతకాలం అప్పులపై బతుకుతారు! ఎంత కాలం పెత్తనం నడుస్తూ వుంటుంది!). ఐరోపా ఖండంలో కూడా పరిస్థితి మరింత దారుణంగా మారింది! అమెరికాలో లాగ అక్కడ నుంచి కూడా అన్ని పరిశ్రమలు మూడవ ప్రపంచ దేశాలకు (ముఖ్యంగా ఆసియా ఖండానికి) తరలి పోతున్నాయి. కార్మికుల్లో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. అంతకు ముందు ఎంత మంది బయటి దేశాల నుండి వచ్చినా (టర్కీ, ఆసియా, ఆఫ్రికా వారు) అవసరం ఉంది కాబట్టి స్వీకరించేవారు. ఇప్పుడు వారి మధ్య ఘర్షణలు మొదలైనాయి. వామపక్ష ప్రభుత్వాలు పోయి తిరోగమన పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి.

అంతర్జాతీయంగా మరో తీవ్రమైన సమస్య జనాభా పెరుగుదల. అభివృద్ధి చెందిన దేశాలలో గత 20 సంవత్సరాలుగా జనాభా పెరగటం లేదు. దీనితో వృద్ధాప్యంలో వున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. యువత సంఖ్య విపరీతంగా తగ్గిపోతోంది. అనగా ముసలి వారి భారం రోజు రోజుకు ఎక్కువైపోతుందన్నమాట! మరో పక్క భారత దేశం తీసుకుంటే, తప్పుగానీ, వొప్పుగానీ మన కుటుంబ నియంత్రణ పధకాలు సరిగా ఫలించక మన దేశంలో యువత అత్యధిక సంఖ్యలో వున్నారు! అదే ఏక సంతాన కుటుంబ నియంత్రణ చేసిన చైనా కూడా అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరనుంది! ఆఫ్రికా ఖండంలో యువత చాలా వరకు ఎయిడ్స్ రోగానికి బలైపోయింది. దక్షిణ అమెరికాలో ఆ సమస్యలేదు. కానీ జనాభా తక్కువ.

తాము దోపిడీకి గురౌతున్నామని రైతులకు తెలుసు. అయినా కూడా అంతా కలిసి ఐకమత్యంగా గిట్టుబాటు ధరలకై పోరాడలేకపోతున్నారు. సాంఘిక దురాచారాలు (తాగుడు, లంచగొండితనం, వ్యభిచారం), చావులు, పెళ్ళిళ్ళకు ఖర్చులు రోజు రోజుకు మితిమీరుతున్నాయి. గిట్టుబాటుకాని వ్యవసాయం ఇక లాభం లేదని పట్నంలో పిల్లలను ఇంగ్లీషు చదువులు చదివించి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడిపోవటం (కొందరు విదేశాలలో కూడా), తక్కువ చదువున్నవారు కూడా అరబ్బు దేశాలకు పోవటం, ఊళ్ళకు ఊళ్ళే ఖాళీ అయిపోవడం నేడు జరుగుతోంది.

వ్యవసాయ కార్మికులు కూడ అదే బాట పడుతున్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు, ముంబాయి లేక పక్కన టౌన్లలో ఏదో ఒక ఉద్యోగం / పని వెతుక్కుంటున్నారు. ముఖ్యంగా కరువు కాలంలో ఈ వలసలు ఎక్కువయ్యాయి. వెళ్ళిన వారిలో చాలా మంది తిరిగి రావటం లేదు. దళితులు ముందుకన్నా ఎక్కువగా విడిపోయి ఉన్నారు. విచ్చల విడిగా పల్లెల్లో బహిరంగంగానూ, పట్టణాల్లో ముసుగులోను, పాటిస్తున్న దళితుల సాంఘిక బహిష్కరణ, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు పట్టుగా

ప్రయత్నించటం లేదు. భూ సంస్కరణల కోసం వ్యవసాయ కార్మికులను సంఘటిత పరచి తీవ్ర పోరాటాలు చేయలేక పోతున్నాము.

ఎవరిని ఎవరు పిండుతున్నారో, దీనికి మూల్యం ఎవరు చెల్లిస్తున్నారో అన్న విషయాలపై ఎటువంటి సందిగ్ధమూలేదు. సందిగ్ధాలన్నీ మనకు సంబంధించినవే. మన పాలకవర్గాలు, వారి విదేశీ దొరలకు దాసోహమవ్వటమే కాకుండా చెప్పినదానికన్నా రెండాకులు ఎక్కువే చేసి తమ విధేయతను నిరూపించుకుంటున్నారు. కానీ, మనలాంటి వారే, ఎవరికైతే ఇదంతా తప్పనిపిస్తుందో, వ్యక్తులు, సంఘాలు, పార్టీలు **మనమెందుకు మన పోరాటాలను ముందుకు తీసుకెళ్ళ లేకపోతున్నాము?** సరళీకరణ, ప్రైవేటీకరణ, పెట్టుబడిదారి ప్రపంచీకరణ రథం ముందుకు సాగిపోతూ వుంటే మన మెందుకు సులువుగా సాధ్యమయ్యే ప్రత్యామ్నాయపద్ధతులను, పథకాలను, వ్యవస్థలను ప్రతిపాదించలేకపోతున్నాము? కేవలం నినాదాలు ఇచ్చే బృందంగా మనం మిగిలి పోవలసిందేనా? ప్రజలెందుకు మన పిలుపులకు స్పందించటం లేదు? స్పందించినా, పాక్షికంగానో లేక తాత్కాలికంగానో (అగ్ని ప్రమాదాల్లో మంటలు చల్లార్చినట్లుగా) స్పందిస్తున్నారు? మనలో లోపం ఎక్కడున్నది?

# VI

# వాషింగ్టన్ గుండెల్లో వెంకట్రామాపురం బాణం

*దేవుడు ఉన్నాడో లేదో నా అభిప్రాయంలో ... అది అంత ముఖ్యమైన విషయం కాదు. కానీ దేవుడు అనే భావన అన్ని సమాజాలలో, అన్ని కాలాల్లో బలంగా వస్తూనే ఉన్నది. దేవుడిని స్మరించి చేసిన ఈ క్రైస్తవ ప్రార్థన మన పరిస్థితికి తగినదిగా ఉంది.*

"ఓ ప్రభువా!

నేను మార్చలేని పరిస్థితులను గుర్తించి అంగీకరించటానికి అవసరమైన నిశ్చలత్వాన్ని నాకు ప్రసాదించుము.

నేను మార్చగల పరిస్థితులను సాధించుటకు అవసరమైన ధైర్యము నాకు కలుగ చేయుము.

మరియు ఆ రెండు పరిస్థితులలోని భిన్నత్వాన్ని గుర్తించే జ్ఞానము నాలో కలిగించుము"

ఇది చాలా సున్నితమైన విషయం. ప్రతి వ్యక్తి, తనకు తాను, నిరంతరం వేసుకోవలసిన ప్రశ్న. మనం ఎంత కాలం బతుకుతామో మనకు తెలియదు. మనకున్న సమయం, బాధ్యతలు, ఆర్థిక స్తోమత, ఇబ్బందులు, శక్తి, సామర్థ్యాలు ఎవరికి వారే ఆలోచించుకుని, మారుతున్న పరిస్థితులను మేళవించుకొని అడుగు ముందుకు వేయాలి.

"అభివృద్ధి" రథ చక్రాలు ముందుకు దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రజలు వాటికింద నలిగిపోతున్నారు. మరోపక్క పర్యావరణ సంక్షోభం రోజురోజుకీ తీవ్రమౌతున్నది. చెట్లు నాటాలి, అడవులను రక్షించాలి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు సులభతరంగా, లాభంగా ఉండేటట్లు అభివృద్ధి చేయాలి. స్థానిక ఉత్పత్తులనే అధికంగా

వాడాలి. సబ్బుల నుండి, కంప్యూటర్లు, టీవీల వరకు పల్లెల్లో తయారు కావాలి. ఆర్థిక, సాంఘిక, రాజకీయ వికేంద్రీకరణ జరగాలి. "పెట్టుబడిదారీ అభివృద్ధి"కి ప్రత్యామ్నాయాలు అన్ని రంగాల్లో అన్వేషించాలి. భావి తరాలకు ఒక ఆకలి లేని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించే బాధ్యత మనపైనున్నది. ఈ ప్రజా వ్యతిరేక అభివృద్ధికి అడ్డు చెప్పకపోతే, ప్రత్యామ్నాయాలు అన్వేషించకపోతే భావితరాలు మనలను క్షమించవు. అంతెందుకు, రాబోయే 20-30 సంవత్సరాలలోనే అంతా అల్లకల్లోలాల మయ్యే పరిస్థితి మనముందున్నది. మనకు వేరే మార్గం లేదు.

నడుం బిగిద్దాం ! గురజాడ గారు అన్నట్లు :

వొట్టిమాటలు కట్టి బెట్టి గట్టి మేల్ తలపెడదాం.

"దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే మనుషులోయ్!!" అని వారు ఆనాడు పిలుపునిచ్చారు. కానీ ఈ రోజు పేదల దారిద్ర్యం, అన్యాయంతో బాటు పర్యావరణ సంక్షోభంతో దేశమంటే మనుషులతో పాటు మట్టికూడానోయ్! అని గుర్తు పెట్టుకోవలసి వస్తోంది.

నేటి పరిస్థితుల్లో, నా అవసరాలను సాధ్యమైన మేరకు మితం చేసుకుంటూ, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న వస్తువులనే ఎక్కువగా వాడుతూ, నా వరకు నేను మూడు ముఖ్య కార్యక్రమాలను నిర్ణయించుకున్నాను.

## 1. చలో వెంకట్రామాపురం :

మా వూరిలో వివిధ రకాల సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయ ప్రయోగాలు చేసి, చేయించి రైతులనంతా సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్ళించడం. రైతులను సంఘటిత పరిచి గిట్టుబాటు ధరలకోసం పోరాటం, అడవుల సంరక్షణ, నీటి సంరక్షణ, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పరిసర ప్రజలను ప్రోత్సహించటం.

## 2. భూ సంస్కరణల అమలు కోసం కృషి చేయడం :

మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ కూలీలుగా ఉన్న పేదలందరూ సాగు భూములు సాధించుకోవటానికి కృషి చేయడం.

## 3. న్యాయం కోసం పోరాటం :

మానవ హక్కుల వేదిక నుండి, ఇతర హక్కుల సంఘాలతో కలిసి నేడు ప్రధాన సమస్యగా మారిన నిర్వాసిత సమస్య కింద నలిగిపోతున్న గ్రామీణ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడటం.

సమాజాన్ని మార్చాలనుకునే కమ్యూనిస్టులు, సోషలిస్టులు శత్రువును బయట చూస్తారు. దోపిడీ వ్యవస్థను మార్చాలంటారు. కానీ దాన్ని మార్చేందుకు పూనుకునే ముందు మనం మారాలి. అందుకనే నిరంతర యుద్ధం. బయటి శత్రువు కన్నా మనలో దాగి ఉన్న శత్రువే మరింత భయంకరం. ఆత్మ విమర్శ అనేది గొప్ప ఆయుధం. దాన్ని ఎన్నటికీ మరువరాదు. ఎంత పెద్ద వారైనా సరే. ఎంత గొప్ప వారైనా సరే.

బహుళజాతి కంపెనీలు కూడా ఆత్మ విమర్శలు తరచూ చేసుకుంటుంటాయి! వారు విస్తరించేందుకు, లాభాల బాటలో మరింతగా పయనించేందుకు, ఉద్యోగుల సంఖ్య తగ్గించుకునేందుకు నిరంతరం ఆలోచిస్తూ ఉంటారు.

కోట్లకు పడగలెత్తి, ప్రపంచ మంతటా విస్తరించి దోపిడీ చేస్తున్న మోన్‌సాంటో (విత్తనాలు, పంటలపై పెత్తనం), కోకాకోలా- పెప్సీకోలాలు, వివిధ మందుల కంపెనీలు, రసాయనాలు, ఎరువుల కంపెనీలు, పెట్రోలియం గ్యాస్ కంపెనీలు అనేక విధాలుగా పేదలు, రైతులు ఒకరేమి అన్ని వర్గాలకు నష్టం చేస్తున్నాయి. వారిని ఎదుర్కోవటం ఎలా? వారి ఉత్పత్తులను బహిష్కరించటమే మన చేతిలో వున్న ఆయుధం, వజ్రాయుధం! దీనికై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులైన వినియోగదారులుగా ముందుకు నడపాలి. (స్వదేశీ ఉద్యమంలో లాగ). అంతెందుకు, ఒక చిన్న మలేరియా పరాన్నజీవి దోమల ద్వారా మనకు ఎలా వణుకు పుట్టించి, చెమటలు పట్టి, మోకరిల్లేటట్లు చేయగలదో అదే విధంగా కాగితపు పులులైన ఈ బడా బహుళజాతి కంపెనీలను మనం తరిమి కొట్టవచ్చు.

కరుణతో అడుగు ముందుకు వేస్తే, న్యాయం, సత్యం మనకు తోడుగా ఉంటే సమస్యలు వాటంతటవే కరిగిపోతాయి. వీటిని పాటించటమే మన ధర్మమని నేననుకుంటున్నాను. పొరపాట్లు జీవితంలో ఎప్పుడూ జరుగుతుంటాయి. వాటి గురించి భయపడాల్సిన అవసరం లేదు. నిరాశ పడవద్దు. ఎటొచ్చి పొరపాటు నుండి నేర్చుకోవటం ముఖ్యం. వ్యవసాయం నిరంతరం నేర్పే గుణపాఠం ఇదే. ప్రకృతి తల్లి మళ్ళీ, మళ్ళీ అవకాశం ఇస్తూనే ఉంటుంది.

# అనుబంధాలు

అనుబంధం : 1

# వరిపైరు

| | | | ఒక ఎకరా ఖర్చు ఆదాయం | సేంద్రియ వ్యవసాయం | 2007 |
|---|---|---|---|---|---|
| | | మామూలు సేద్యం | మామూలు సేద్యం | (శ్రీ వరి కాదు) | మామూలు సేద్యం |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| | | (అ) | (ఆ) | (ఇ) | (ఈ) |
| పని | ఏ రైతుకు ఎంత ఖర్చు అయ్యింది అ, ఆ, ఇ, ఈ | జి మురళీధర్ నాయుడు వెంకట్రామాపురం పాకాల మండలం చిత్తూరు జిల్లా | వి జయరామనాయుడు వెంకట్రామాపురం పాకాల మండలం చిత్తూరు జిల్లా | ఎస్ రాము (కౌలు రైతు) ఇ. పాలగుట్టపల్లి పాకాల మండలం చిత్తూరు జిల్లా | చెలికం కృష్ణా రెడ్డి చైర్మన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, శ్రీకాళహస్తీ |
| 1. విత్తన వంగడం | | బి పి టి 5204 (జీలకర్ర మసూర) | బి.పి టి 5204 (జీలకర్ర మసూర) | ఎడిటి 37 (బుడ్డొడ్లు) | |
| 2. దున్నకం ట్రాక్టరు | అ) 8 గంటలు×400+ బత్తా<br>ఆ) 6 గంటలు×400<br>ఇ) 4 1/2 గంటలు×400 + 6 గంటలు టిల్లరు ఆకు తొక్కడానికి×250 (సేంద్రీయ వ్యవసాయానికి మాత్రమే)<br><br>ఎద్దుల మడక 3 రోజులు × 200 (సేంద్రీయ వ్యవసాయం మాత్రమే) | 3300 | 2400 | 3300<br>+ 600 | 1300 |
| 3. మాను తోలింది (లెవలింగుకి) | అ) రెండు మడకలు × 200<br>ఆ) రెండు మడకలు × 200<br>ఇ) ఒక మడకలు × 200<br>ఈ) ఒక మడకలు × 200 | 400<br>20 | 420 | 200 | 200 |
| 4 అండలు చెక్కేది మరియు గినాలు పెట్టేది | అ) 15 మంది × 70 + సారాయి<br>ఆ) 4 × 100<br>ఇ) 4 × 100<br>ఈ) 4 × 100 | 1150 | 400 | 400 | 400 |

| | | (అ) | (ఆ) | (ఇ) | (ఈ) |
|---|---|---|---|---|---|
| 5 నారు ఖర్చు | అ) దున్నకం, మన్నుతోలింది + ఎరువు<br>ఆ) నారు పోసేది ఒక మడక + ఇద్దరు కూలీలు + ఎరువు<br>ఇ) నారు పోసేది ఒక మడక + ఇద్దరు కూలీలు + ఎరువు<br>ఈ) . . . | 500 | 500 | 500 | 500 |
| 6. విత్తనం | అ) బి.పి.టి 5204.<br>ఆ) బి.పి.టి 5204.<br>ఇ) ఎడి.టి-37<br>ఈ) .... | 400 | 400 | 300 | 600 |
| 7. పశువుల ఎరువు | అ) వేయలేదు<br>ఆ) 4 ట్రాక్టర్లు × 500 + బాడుగ (రవాణా) + లోడింగు + చల్లడం<br>ఇ) 3 3/4 ట్రాక్టరు<br>ఈ) ... | 0 | 3500 | 3000 | 0 |
| 8. ఆకు కొట్టింది, వేసింది | అ) 20 సెంట్లు కు మాత్రమే ఇద్దరు మగ + ఇద్దరు ఆడ<br>ఆ) 100 మోపులు కొట్టి వేసింది × 10 మోపు లెక్కన<br>ఇ) కొట్టి + కత్తిరించింది = 10 మంది× 70 లెక్కన<br>ఈ) .. | 260 | 1000 | 700 | |
| 9 నారు పెరికేది, నాటేది | అ) 27 ఆడ × 50 + ఒక మగ × 80<br>ఆ) 32 ఆడ × 50<br>ఇ) 27 ఆడ × 50 + ఒక మగ × 80<br>ఈ) 20 మంది × 50 | 1430 | 1600 | 1430 | 1000 |
| 10 కలుపు తీసింది మొదటిసారి | అ) 9 ఆడ × 50<br>ఆ) 10 ఆడ × 50<br>ఇ) 9 ఆడ × 50<br>ఈ) 8 ఆడ × 50 | 450 | 500 | 450 | 400 |
| 11 కలుపు తీసింది రెండవ సారి | అ) లేదు<br>ఆ) 8 ఆడ × 50<br>ఇ) లేదు<br>ఈ) 8 ఆడ × 50 | 0 | 400 | 0 | 400 |

| | | (అ) | (ఆ) | (ఇ) | (ఈ) |
|---|---|---|---|---|---|
| 12. పైఎరువులు | అ) 2 మూటలు యూరియా (265×2 550)<br>+ ఒక మూట సూపర్ × 190+10 = 200<br>ఆ) కాంప్లెక్స్ ఒకమూట 17×17×17<br>ఇ) వర్మి కంపోస్టు 10 కిలోలు × 40 (3/2 కిలో లెక్కన)<br>+ దున్నినపుడు + కలుపు తీసినపుడు<br>ఈ) దుక్కిలో కాంప్లెక్స్ 50 కిలోలు (౦00)<br>+ కలుపు తీసేటపుడు ఒక మూట యూరియా / 20 20 (265)<br>+ వెన్నుపోయేటపుడు సల్ఫేట్ అర మూట (315)<br>+ నాటేటపుడు ఫాస్ఫేట్ ఒక మూట (200) | 750 | 500 | 1200 | 1300 |
| 13 మందులు | అ) క్లోరోపైరిపాస్ + సైఫర్ మెత్రిన్ 150<br>+ ఇద్దరు మగ × 80=160<br>ఆ) ఎం-45 ఒక కిలో × 200<br>+ ఎండో సల్ఫాన్ ఒక లీటరు × 230<br>+ పిచికారి ముగ్గురు × 70 = 210 = 640<br>ఇ) ఒక ట్రిప్పు ఆవు పంచకం (మూత్రం)<br>1 6 : 800 లీటర్లు పిచికారి = 300+160+40 = 500<br>ఈ) పై మందులు (వివరాలు తెలుపలేదు) (1500) | 310 | 640 | 500 | 1500 |
| 14. వరి కోత | అ) 20 ఆడ × 50<br>ఆ) 15 ఆడ × 50<br>ఇ) 12 ఆడ × 50<br>ఈ) 10 ఆడ × 50 (మిషన్‌తో అయితే 1000 రూ లు ఎకరాకు) | 1000 | 750 | 600 | 500 నుండి 1000 |
| 15 మోపులు కట్టేది<br>+ బండకు మోసేది<br>(తడిగా వుంటే) | అ) ఇద్దరు మగ × 80 + 8 ఆడ × 50 = 560<br>ఆ) 5 మగ × 80 + 10 ఆడ × 50 = 900<br>ఇ) 2 మగ × 80 + 6 ఆడ × 50 = 460<br>ఈ) ..... | 560 | 900 | 460 | .... |
| 16. వారి కొట్టేది | అ) 10 మగ × 80 + 2 ఆడ × 50 = 900<br>ఆ) 10 మగ × 80 = 800<br>ఇ) 10 మగ × 80 + 3 ఆడ × 50 = 950+50<br>ఈ) 6 మగ × 80 = 500 | 900 | 800 | 1000 | 500 |

| | | (అ) | (ఆ) | (ఇ) | (ఈ) |
|---|---|---|---|---|---|
| 17 తూర్పార బట్టేది | అ) 3 ఆడ × 50 = 150<br>ఆ) 3 ఆడ × 50 = 150<br>ఇ) 3 ఆడ × 50 = 150<br>ఈ) 3 ఆడ × 50 = 150 | 150 | 150 | 150 | 150 |
| 18. కసువు కట్టేది | అ) 10 మగ × 80 + ఒక మదక తొక్కేదానికి 200<br>ఆ) 10 మగ × 80 + ఒక మదక తొక్కేదానికి 200<br>ఇ) 10 మగ × 80 + ఒక మదక తొక్కేదానికి 200<br>ఈ) .... | 1000 | 1000 | 1000 | 1000 |
| 19 నీరు కట్టేది | అ) 3 నెలలకు × 1500 = 4500<br>ఆ) 3 నెలలకు × 1500 = 4500<br>ఇ) 3 నెలలకు × 1500 = 4500<br>ఈ) 3 నెలలకు × 1500 = 4500 | 4500 | 4500 | 4500 | 4500 |
| 20. గోతాలు × 20 | అ) 20 × 20 = 400<br>ఆ) 30 × 20 = 600<br>ఇ) 20 × 20 = 400<br>ఈ) 30 × 20 = 600 | 400 | 600 | 400 | 600 |
| 21 మొత్తం ఖర్చు | | 17,480 | 20,960 | 20,690 | 14,850 నుండి 15,350 |
| **ఆదాయం** | | | | | |
| 22 కసువు | అ) 8 కట్టలు బిగువు × 5 =40<br>+ మొత్తం బిగువులు 50 (ఒక ట్రాక్టరు) = 2000<br>ఆ) 6–7 కట్టలు బిగువు 50 నుండి 60 బిగువులు × 40<br>ఇ) 40 50 బిగువులు × 40=1600 నుండి 2000<br>ఈ) 50 బిగువులు × 30 = 1500 | 2,000 | 2,000 నుండి 2,500 | 2000 | 1500 |

| | | (అ) | (ఆ) | (ఇ) | (ఈ) |
|---|---|---|---|---|---|
| 23 పంట దిగుబడి | అ) 20 బస్తాలు (75 కిలోల లెక్కన × 550 = 11,000)<br>ఆ) 25 బస్తాలు × 75 కిలోలు లెక్కన × 600 = 15,000<br>ఇ) 20 నుండి 30 బస్తాలు × 75 కిలోలు × 450<br>= 9000 నుండి 13,500<br>ఈ) 30 బస్తాలు × 75 కిలోల లెక్కన = 430 (రకాన్ని బట్టి)<br>= 12,900 | 11,000 | 15,000 | 9,000 నుండి 13,500 | 12,900 |
| 24. మొత్తం ఆదాయం (22+23) | అ) 2000 + 11,000 = 13,000<br>ఆ) 2000 నుండి 2,500 + 15,000<br>= 17000 నుండి 17,500<br>ఇ) 1600 నుండి 2000 + 9000 నుండి 13,500<br>10,600 నుండి 15,500<br>ఈ) 1500+12,900 = 14,400 | 13,000 | 17,000 నుండి 17,500 | 10,600 నుండి 15,500 | 14,400 |
| 25. నికర లాభం (24 21) | అ) 13,000 17,480 4,480<br>ఆ) 17,000 నుండి 17,500 20,960<br>= 3960 నుండి 3460<br>ఇ) 10,600 నుండి 15,500 20,690<br>= 10,090 నుండి 5,190<br>ఈ) 14,400 14,850 నుండి 15,350<br>= 450 నుండి 950 | (అ) 4,480 | (ఆ) 3960 నుండి 3460 | (ఇ)- 10,090 నుండి 5,100 | (ఈ) 450 నుండి -950 |
| 26 నష్టం రాకుండా వుండాలంటే | అ) 30 బస్తాలు పండించాలి (ఉత్పత్తి 33% పెంచాలి)<br>ఆ) 31 నుండి 32 బస్తాలు పండించాలి (ఉత్పత్తి 28% పెంచాలి)<br>ఇ) 42 బస్తాలు ఎడిటి 37 పండించాలి<br>లేదా బి.పి.టి 5204 37నుండి 39 బస్తాలు పండించాలి<br>లేదా సేంద్రీయ పంట అని రేటు పెంచాలి<br>(రకాన్ని బట్టి ఉత్పత్తి 40% నుండి 100%పెంచాలి)<br>ఈ) 1 నుండి 2బస్తాలు అదనంగా పండించాలి<br>(ఉత్పత్తి 3% నుండి 6% పెంచాలి) | 18,000 | 18,000 | 18,000 | 18,000 |

అనుబంధం - 2

# వేరుశనగ పంట

| 1 | 2 | | 3 | |
|---|---|---|---|---|
| పని | రైతు<br>వి జయరాం నాయుడు<br>వెంకట్రామాపురం<br>పాకాల మండలం<br>చిత్తూరు జిల్లా<br><br>వర్షాధారంగా (ఖరీఫ్ పంట)<br>రూ॥ లు | | రైతు<br>చెలికం కృష్ణా రెడ్డి<br>ఛైర్మన్<br>వ్యవసాయ మార్కెట్ కమిటీ<br>శ్రీకాళహస్తి<br><br>నీటి పారుదలతో (రబీ పంట)<br>రూ॥ లు | |
| 1. దున్నకం-ట్రాక్టరు 3 గంటలు | | 900 | భూమిని బట్టి (రెండు గంటలు) | 600 |
| 2 గొర్ల ఎరువు -3ట్రాక్టర్లు<br>500+70లోడింగు + బాడుగ 150<br>+ చల్లడానికి 2 = 160=880×3= | | 2640 | ఉంటే వేస్తారు<br>ట్రాక్టరు | 900 |
| 3 విత్తనాలు 30 కిలోలు | | 1000 | 75 కిలోలు 28/- కిలో | 2100 |
| 4 గింజలు వేయడం<br>ఎ) 1 మడక . 300<br>బి) 4 ఆడ 50 . 200 | | 500 | ఒక మడక+4 ఆడ×50 | 550 |
| 5. ఒకటవ తవ్వకం 10 × 50 | | 500 | 20 మంది × 50 | 1000 |
| 6. 2వ తవ్వకం . . 10 మంది × 50 | | 500 | 20 మంది × 50 | 1000 |
| 7. చెట్లు పెరికేది 1 ఎకరా గుత్త | | 400 | 20 మంది × 50 | 1000 |
| 8. కాయలు వలిచేదిదబ్బా<br>10/- లెక్కన - 10 మూటలు<br>(7 డబ్బాలు 1 బస్తా) | | 700 | డబ్బా 10 లెక్కన 30మూటలు | 2100 |
| 9 గోతాలు 10×20 | | 200 | 30×20 | 600 |
| 10. బాడుగ | | 200 | | 200 |
| 11. పై ఎరువులు దుక్కిలో<br>సూపర్ 2 మూటలు (100 కిలోలు × 2 = 200)<br>+ పొటాష్ 1/2 మూటలు (25 కిలోలు)= 200) | | | | 600 |
| 12 మందుల ఖర్చు | | | | 600 |
| 13 నీరు కట్టేది (మూడు నెలలు × 1500) | | 0 | | 4500 |
| 14. మొత్తం ఖర్చు | | 7,540 | | 15 750 |
| 15. దిగుబడి | | | | |
| ఎ) 10 మూటలు (40 కిలోల మూట) ×700<br>15 మూటలు × 700 = 10,500 | | 7000 నుండి 10500 | 30 మూటలు × 700 | 21000 |
| బి) శనిగ తుందు (ఆకు) - ఒక ట్రాక్టరు | | 500 | | 500 |
| 16. మొత్తం ఆదాయం | | 7,500 నుండి 11 000 | | 21500 |
| 17 నికర ఆదాయం<br>(14) - (12)<br>అ) 7,500 - 7540 = -40<br>11 000 - 7 540 = 3460<br>ఆ) 21 500-15,750 = 5750 | | - 40 నుండి +3 460 | | +5750 |

# చెరకు

అనుబంధం - 3

| 1 | 2 | 3 |
|---|---|---|
| ఒక ఎకరా సం 2007 | చంద్ర (మాజీ సర్పంచ్) పాలగుట్టపల్లి గోపాల నాయుడు వెంకట్రామపురం రూ॥ లు | ముని కృష్ణా రెడ్డి వరదప్ప నాయుడుపేట రూ॥ లు |
| 1. ట్రాక్టరు దున్నకం | | |
| ఎ) 7 గంటలు × 300+డ్రైవరు బత్తా (80) | 2180 | 2325 |
| బి) 7 1/2 గంటలు × 300 + డ్రైవరు బత్తా (75) | | |
| 2. అండ తీసేదానికి | | |
| ఎ) ముగ్గురు మనుషులు (70+ భోజనం 10) | 240 | 0 |
| బి) లేదు | | |
| 3. సాలుతోలేదానికి | | |
| ఎ) 1 మడక పగలు + సాయంత్రం | 320 | |
| బి) 4 రోజులు (పగలు + సాయంత్రం) × 200 | | 800 |
| 4 విత్తనం . | | |
| ఎ) 4 టన్నులు × 1200 = 4800<br>కొట్టడానికి = 8 మంది × 80=640<br>లోడింగు బాడుగ 150×4=600 | 6040 | 6040 |
| 5 విత్తనం వొలిచేది | | |
| ఎ) 7 మంది (అడ) ×50 | 350 | |
| బి) 8 మంది (అడ)×50 | | 400 |
| 6 విత్తనం కత్తిరించేది | | |
| ఎ) 4 మగ × 80 | 320 | |
| బి) 6 మగ × 80 | | 480 |
| 7. విత్తనం కయ్యలో పోసేది, పేర్చేది | | |
| ఎ) 3 అడ + 3 మగ = 3×50+ 3×80 = 390+10 | 400 | |
| బి) 4 అడ + 2 మగ = 4×50 + 2×80 = 200+160+10 | | 370 |
| 8. నాటేది | | |
| ఎ) 12 మగ × 80 | 960 | |
| బి) 8 అడ × 50 + 2 మగ × 80 = 400+160 | | 560 |
| 9. ఒకటవ తవ్వకం | | |
| ఎ) 20×50 | 1000 | |
| బి) 14×50 | | 700 |

| | | |
|---|---|---|
| 10. రెండవ తవ్వకం | | |
| ఎ) 15 అడ × 50 | 750 | |
| బి) లేదు | | 0 |
| 11. పై ఎరువులు | | |
| ఎ) 17×17×17 = 4 మూటలు (50 కిలోలు లెక్కన) × 500 (బాడుగ కలిపి) + వేసే దానికి 2×70 | 2000<br>140 | |
| బి) 17×17×17 × 6 మూటలు × 450 | | 2700 |
| ఇద్దరు వేసేదానికి × 80 | | 160 |
| 12. సాలు మడకలు | | |
| ఎ) 3 (2 దున్నే దానికి + సాలు తోలేది) 200+60 ఖర్చులు | 660 | |
| బి) 2×200+50 | | 450 |
| 13. ఎగేసే దానికి | | |
| ఎ) 6 మగ + సారా వక్కాకు = 80+20 | 600 | |
| బి) 6 మగ ×80+ ఇతర | | 600 |
| 14. తొలి చుట్టకం | | |
| ఎ) గుంట 100/- గుత్త | 1500 | |
| బి) 14 మంది × 80 + 20 (సారాయి) | | 1400 |
| 15. రెండవ చుట్టకం | | |
| ఎ) 80×20 (కూలీలు) లేదా గుంట 80×15 (గుత్త) | 1200 | |
| బి) లేదు | | 0 |
| 16. గుత్తులు కట్టదానికి | | |
| ఎ) 4×80+20 | 400 | |
| బి) 6×80+20 | | 600 |
| 17. ఎంటేసేదానికి | | |
| ఎ) 6 మంది ×80+20 | 600 | |
| బి) 8 మంది × 80+20 | | 800 |
| 18. నీరు కట్టే దానికి | | |
| ఎ) మనిషికి 10 నెలలు × 1500 | 15000 | |
| బి) 10×1500 | | 15000 |
| 19. గొడ్ల ఎరువు | | |
| ఎ) ముందు వరి మడి కోసం అదే పొలంలోకి తోలి ఉంటది కాబట్టి ధర లేదు | 0 | |
| బి) 8లోడ్లు × 500 + 100 బాడుగ + 70 లోడింగు + చల్లదానికి 140 = 810×8= | | 6480 |

20. గానుగ

ఎ) బెల్లం దిగుబడి సుమారు 30 గోన్లు (ఒ గోను = 6 వంటలు)
(ఒక గోను = 150 కిలోలు) 30×6=180 వంటలు
ఒకరోజుకు అవసరమైన కూలీలు మగ 4×80 = 320+ఆడ 3×50
= 150+320+30=500
ఒక రోజుకు 8 వంటలు దించుతారు= 180/8= 23+2=25 రోజులు
25×500 — 12,500

బి) బెల్లం దిగుబడి 35 గోన్లు × 6 = 210 వంటలు
4 ఆడ × 40 + 2 మగ × 70 +20 + భోజనం వగైరా
= 240 + 180 = 420
రోజుకు 10 వంటలు దించుతారు
210/10 = 21 రోజులు + వర్షాలు వగైరా 5=26 రోజులు
26×420 — 10,920

21. గానుగ బాడుగ

ఎ) 30 గోనెలకు × 120 (150 కిలోలు = 1 గోనెకి) ... — 3600
బి) 35×120 / గోనె — 4200

మొత్తం ఖర్చు — 50,760 — 54,985

22. బెల్లం ఆదాయం

ఎ) 30 గోన్లు × 1200 — 36000
మిగిలేది — - 14760

బి) 35 గోన్లు × 1350 — 47250
మిగిలేది — -7735

కాని

అ) సొంత గానుగ వుంటే గానుగ బాడుగ మిగులుతుంది
1) 3600, 2) 4200

ఆ) సొంతంగా నీరు కడితే నీరుకట్టే కూలీ మిగులుతుంది
1) 15,000, బి) 15000

ఇ) సొంతంగా బెల్లం ఆడితే 2-3 కూలోళ్లను జతకు పెట్టుకొని
2 మగ + ఒక ఆడ రోజుకు 200 మిగులుతుంది
1) 5000, 2) 5200
సొంత కష్టంతో ఆదా అయ్యే ఖర్చు 1) 23600, 2) 24,400

ఈ) తద్వారా నికర మిగులు ....
1) 8820, 2) +16665

ఉ) మర్గాం తోట అయితే విత్తనం ఖర్చు, నాటే ఖర్చు, కత్తిరించే ఖర్చు కలిసి వస్తాయి (4,5,6,7,8) అనగా
1) 8070, 2) 7850

ఊ) మర్గాం ద్వారా నికర లాభం — 1) 8820 + 8070 = 16890
+ సొంత కష్టం + సొంత గానుగ — 2) 16665+7850 = 24515
+ సొంతగా నీరుగడితే వచ్చే లాభం

# చెరుకు

- ముని కృష్ణా రెడ్డి ఎక్కువ వడ్డీకి రూ. 24, 36 శాతం అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టటంతో ఆయనకేమీ మిగలలేదు.
- ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యేది అంతా నల్లబెల్లమే. (చౌడు భూముల్లో తెల్లగా వస్తుంది). నల్లబెల్లం అంతా నాటుసారాకాయడానికి పోతుంది.
- ఈ మధ్య మహారాష్ట్రలో మన బెల్లం దిగుమతిపై ఆంక్షలు విధించటం వల్ల ధరలు బాగా పడిపోయాయి. (కిలో 7 రూ.లు వచ్చేసింది - గోనె 1050 రూ.లు)
- సేంద్రియ వ్యవసాయంలో చేసే బెల్లం తయారీలో రోజువారి కూలీల్లో 1 మనిషి అదనంగా పడతారు (పొడి చేయడానికి). 5 సార్లు శుద్ధి చేయటం కొంత శ్రమతోపని. గానుగ ప్రదేశమంతా శుద్ధిగా వుంచాలి.
- పొడి చేశాక చెత్త ఏరివేయటానికి (జల్లెడ పట్టడానికి) శుద్ధి చేసి గోతాల్లో నింపటానికి కిలో ఒక రూ. చొప్పున ఖర్చవుతుంది.అయితే మార్కెట్టు విలువ రూ. 18 కిలో వున్నది. ఈ సంవత్సరం. ఇప్పుడు అమ్ముతున్న నల్లబెల్లం రేటుతో పోలిస్తే రూ. 8లకు కిలో, రూ. 9లకు కిలో, రూ. 7 లకు కిలో. ఇది ఎంతో లాభదాయకం! 225 శాతం, 200 శాతం, 257 శాతం! కానీ మార్కెట్టు పరిమితంగా వుంటుంది. (ప్రసాదాలకు, చక్కెర బదులు బెల్లం తినదలుచుకున్నవారు మాత్రమే వాడతారు). ఒక్కో రైతు టన్నుల కొలది బెల్లం తయారు చేస్తే ఎక్కడ అమ్మాలి? తెల్లగా, వాసన లేకుండా చక్కెర వలే చేస్తే తప్ప బెల్లానికి భవిష్యత్తు లేదు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకొనవలసిందే. తెల్లగా, వాసన లేకుండా బెల్లం తయారికి కొన్ని పాత పద్ధతులున్నాయి. అవి కొంత కష్టతరం. ఈ కాలం అలా చేయడానికి ఎవరూ అంతసిద్ధంగా లేరు. అటువంటి పనులు చేయటానికి. వీటికి ఆధునిక పద్ధతిలో కొన్ని ప్రత్యేక యంత్రాలున్నాయి. అయితే వాటి పెట్టుబడి ఎక్కువ 1-11/2 లక్ష అవుతుంది. ఇంకా ప్రయోగాత్మక స్థాయిలోనే వున్నది.

అనుబంధం - 4

## టమోటా సేద్యం ఖర్చు - ఆదాయం - ఒక ఎకరాకు

మూలం : కరణం ధనుంజయులు నాయుడు, అభ్యుదయ రైతు,
నెల్లిమంద గ్రామం, సోమల మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## సంవత్సరం : 2007

| వివిధ రకాల పనులు | ఖర్చు రూ.లలో |
|---|---|
| 1. దుక్కం 3 సార్లు ట్రాక్టరు, 4.30 గంటలకు × 300 = 1350<br>+ డ్రైవరు బత్తా = 50 | 1400 |
| 2. సాలు తోలేదానికి 2 మడకలు × 200 = 400 | 400 |
| 3. పశువుల ఎరువు 4 లోడ్లు × 500 + లోడింగ్ చార్జి 70<br>+ బాడుగ 150 + ఎరువు చల్లటం 70 = 800 × 4= 3200<br>+ + ఇతర ఖర్చులు | 3200 |
| 4. సాలు ఎగేసే దానికి, గెనాలు వేసే దానికి 4 మగ × 60=240 | 240 |
| 5 నారు కొనుగోలు<br>అ) నెం. 618, 10,000 మొక్కలు × 35 పైసలు = 3500<br>ఆ) నెం. 5005, 10,000 మొక్కలు × 30 = 3000<br>ఇ) ఆదిత్యా 2 (హైబ్రిడ్) 10,000 మొక్కలు × 45 పైసలు = 4500<br>ఈ) అవినాష్ (హైబ్రిడ్) 10,000 మొక్కలు × 45 పైసలు = 4500 | 3000 నుండి 4500 |
| 6. నారు నాటుటకు 4 ఆడ × 40 + ఒక మగ (నీరు కట్టేదానికి) × 60= | 220 |
| 7. తొలి తవ్వకానికి 30 మంది ఆడవారు × 40 = 1200 | 1200 |
| 8. సాలు తవ్వకానికి 15 మంది × 40 = 600 | 600 |
| 9. సాలు తీయుటకు 10 మంది మగ × 60=600 | 600 |
| 10. కట్టెలు అడవి నుండి రెండు ట్రాక్టరు లోడులు 4000×2= 8000<br>(5 పంటలకు వస్తాయి. 5×1600=8000) | 1600 |
| 11. రబ్బరు / బేషరం / బ్యాండు కట్టెలు ఒక ట్రాక్టరు లోడ్ | 1000 |
| 12. ట్వైన్‌పురి 60 కిలోలు × 40 = 2400 | 2400 |
| 13. కట్టెలు నాటుటకు 20 మంది మగ × 50 = 1000 | 1000 |
| 14. ట్వైన్‌పురి కట్టుటకు 40 ఆడ × 40 = 1600 | 1600 |
| 15. రెండవ సారి ట్వైన్‌పురి కట్టుటకు 30 ఆడ × 40 = 1200 | 1200 |

16. మూడవ సారి ట్రెన్‌పురి కట్టుటకు 30 ఆడ × 40 = 1200 — 1200

17. కలుపు తీయుటకు 15 ఆడ × 40 = 600 — 600

18. నీరు కట్టుట 5 నెలలు (3 రోజులకు ఒక్కసారి) + కావిలి (కావలా కాయడం) = — 5000

19. కాయలు కోయుటకు ఒకసారి 6 ఆడ×40 = 240
30 కోతలు (రోజుమార్చి రోజు) = 30 × 240 = 7200 — 7200

20. పై ఎరువులు (రసాయనిక)
అ) సూపర్ ఫాస్ఫేట్ 4 బస్తాలు (50 కిలోలు) × 200 = 800
ఆ) 20-20-0-15 4 బస్తాలు ×400 = 1600
ఇ) డి.ఎ.పి 4 బస్తాలు × 500 = 2000
ఈ) పొటాష్ 4 బస్తాలు × 200 = 800
ఉ) 19×19×19 4 బస్తాలు × 450 = 1800
ఊ) 10×26×26 4 బస్తాలు × 450 = 1800
ఋ) కానుగ పిండి 4 బస్తాలు (75 కిలోలు) × 350 =1400 — 10,200

21. మందులు వివిధ రోగాలకు మామూలుగా వాడేవి
అ) ఎం-45 అరకిలో =100
ఆ) ఎండో సల్ఫాన్ అర లీటరు = 110
ఇ) బ్లైటెక్స్ ఒక కిలో = 380
ఈ) నూవాక్రాన్ ఒక లీటరు = 260
ఉ) బావిస్టాన్ ఒక కిలో = 420
ఊ) ఫోస్ఫాధిన్ ఒక లీటరు = 390
ఋ) డెసిస్ అరలీటరు = 220
ౠ) మల్టికే 6 కిలోలు = 450

- ఎర్రనల్లికి
ఌ) ఎక్సోడస్ ఒక లీటరు = 2300
ౡ) బయోస్పార్క్ 300 గ్రాములు = 450
ఎ) ఎం-45 2 కిలోలు × 200 = 400
ఏ) ఎకలెక్స్ ఒకటిన్నర లీటరు 270 = 410

ఐ) 5 సార్లు పిచికారి చేసే ఖర్చు
- ఒకసారికి ఇద్దరు మగ × 60 + ఒక ఆడ × 40 = 160 × 5 = 800

మొత్తం మందుల ఖర్చు — 6,690

22) మొత్తం సాగు ఖర్చు — 50,550 నుండి 52,050 (విత్తనం బట్టి)

23. దిగుబడి, కమిషను, రవాణా ఖర్చు, నికర ఆదాయం

| రకం | దిగుబడి ఎకరాకు | రవాణా+ కమిషను (1రూ కిలో చొప్పున) | రేటు కిలో చొప్పున | మొత్తం ఆదాయం | రవాణ, కమిషను తగ్గించి | ఇతర సేద్యపు ఖర్చులు తగ్గించి నికర ఆదాయం |
|---|---|---|---|---|---|---|
| 1) టమోటా రకం 618 | 25-30 టన్నులు | 25,000-30,000 | 8 రూ.లు | 2,00,000 నుండి 2,40,000 వరకు | 1,75,000 నుండి 2,10,000 వరకు | 1,76,000 - 51,050 = 1,23,950 |
| | | | | | | 2,10 000 - 51,050 = 1,56 950 |
| 2) 5005 | 15-20 టన్నులు | 15000 - 20,000 | 10 కిలో చొప్పున | 1,50,000 నుండి 2,00,000 వరకు | 1 35 000 నుండి 1,80,000 వరకు | 1,35,000 - 50,550 = 84,450 |
| | | | | | | 1,60,000 - 50,550 = 1,29,450 |
| 3) ఆదిత్యా -2 లేక అవినాష్ (హైబ్రిడ్) | 30-40 టన్నులు | 30,000-40,000 | 6కిలో చొప్పున | 1,80,000 నుండి 2,40,000 వరకు | 1,50,000 నుండి 2,00,000 వరకు | 1,50,000 - 52,050 = 97,950 |
| | | | | | | 2,00,000 - 52,050 = 1,47,950 |

## నోట్స్ :

★ వాతావరణం చల్లగా వుంటే దిగుబడి బాగా వస్తుంది. ఎండలెక్కువై 40 డిగ్రీల సెంటిగ్రేడ్ పైకి పోతే పంట సరిగా రాదు. ఋతుపవనాలు అనుకూలిస్తే ఇంకా ఎక్కువ దిగుబడి వస్తుంది.

★ ఈ సంవత్సరం (2007లో) ఆదిత్యా-2 హైబ్రిడ్ వేస్తే ఎకరాకు 35 టన్నుల దిగుబడి వచ్చింది. ధర సరాసరి 10 రూ. కిలో అమ్మినది. ఖర్చులు పోను నికర ఆదాయం ఎకరాకు 2,50,000 రూ.లు వచ్చాయి. రెండున్నర ఎకరాలు నాటారు. సుమారు 6 లక్షల ఆదాయం వచ్చింది.

★ 5 బోర్లు వేసినారు ధనుంజయులు నాయుడుగారు ఒక్కొక్క బోరుకు సగటున 35 వేల రూ.లు ఖర్చు అయినది. ప్రస్తుతం ఒకే ఒక్క బోరులో నీరు వస్తున్నది. (కరువులో కూడా ఒక ఎకరం పారగలదు) 12 హార్స్‌పవర్ మోటరుతో నీరు తోడుతున్నారు. మరో బావిలో 7 - హార్స్‌పవర్ మోటరు కూడా వున్నది.

★ ఒక్క సారి ఆరు నెలలు టమోటా పంట వేస్తే మళ్లీ రెండుసంవత్సరములు వరి మడిగానీ, వేరుశనగ కానీ వేయాలి. కొందరు చెరువు మట్టి తోలించి మళ్లీ సంవత్సరానికి కూడా వేస్తారు. కొట్టిన మందులు, వేసిన పై ఎరువుల "కారం" నచ్చిపోవలంటే అంత పని అన్నమాట!

★ ధనుంజయులు నాయుడు గారు ప్రతి సంవత్సరం తన పొలంలో ఏదో ఒకచోట రెండు ఎకరాలు టమోటా వేస్తూనే వుంటారు గత ఐదు సంవత్సరాలుగా వారికి వచ్చిన రేట్లు ఈ విధంగా వున్నాయి 2006లో రేటు 3 రూ.ల కిలో నుండి అర్థ రూపాయికి, 2005 లో 5 రూ.ల కిలో నుండి 6 రూ.లు కిలో, 2004 లో 10 రూ.ల కిలో నుండి 14 రూ.లకు కిలో, 2003లో 4 రూ.లనుండి 4 ½ రూ.లకు కిలో.

★ ఇలాంటిదే వంకాయ సాగు కూడా. కాకపోతే కట్టెపుల్లలు, దారాలు తెచ్చికట్టే ఖర్చు, కష్టం తగ్గిపోతుంది ( - 10 వేలు). రేటు / లాభం / నష్టం టమోటాలాగా వుండదు. ఎకరాకు 30 నుండి 50 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. ఖర్చు ఎకరాకు 20 నుండి 30 వేలు అవుతుంది. కిలో 3 రూ.లనుండి 4 రూ.లపైన అమ్మితే పరవాలేదు. ఒక మోస్తరుగా - ఎకరాకు లక్ష రూ.ల వరకు ఆదాయం గడించవచ్చు.

కానీ అందరికీ ధనుంజయులు నాయుడిగారి అదృష్టం దక్కకపోవచ్చు. వారి నెల్లిమంద గ్రామంలో సుమారు 750 ఇళ్లు వున్నాయి. ఇందులో సుమారు సగం మందికి అనగా ఒక 400 మందికి బోర్లు, బావులు వుండవచ్చును. గత 30 సం॥లలో నాయుడిగారి అంచనా ప్రకారం వారి ఊరిలో సుమారు 900 బోర్లువేసి వుండవచ్చును. వీటిలో ఇప్పుడు 200 బోర్లు మాత్రమే పని చేస్తున్నాయి. కరువు తీవ్రమైతే పనిచేసే బోర్ల సంఖ్య 100కు పడిపోవచ్చునని ధనుంజయులు నాయుడుగారంటున్నారు. ఇప్పుడు మనం ఒక చిన్న లెక్క వేద్దాం. 900 బోర్లు అంటే వారి లెక్కనే ఒక బోరుకు 35 వేల రూ.ల చొప్పున 3.15 కోట్ల రూ.ల పెట్టుబడి అన్నమాట! ఇందులో 78 శాతం అనగా 700 బోర్లు ఎండిపోయాయంటే 2.45 కోట్ల రూ.ల పెట్టుబడి బూడిదలో పోసినట్లే!! ఆ రైతుల భవిష్యత్తు ఏమిటి? ఇక ధనుంజయులు నాయుడుగారి లాంటి మిగిలిన 200 బోర్లు వున్న రైతుల వ్యవసాయం ఇంకెంత కాలం?

## సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో బ్రహ్మాండమైన ఫలితాలు సాధించిన కొందరు నిపుణుల చిరునామా

| | నైపుణ్యత |
|---|---|
| **1) ఎల్. నారాయణ రెడ్డి**<br>శ్రీనివాసపుర, మరళేనిహల్లి<br>(వయా) హణబే (పోస్టు)<br>దొడ్డబళ్ళాపురం (తాలూకా)<br>కర్నాటక - 561 206<br>ఫోను : 080 - 7651360 | అన్ని పంటలు, ముఖ్యంగా శ్రీవరి, కాయగూరలు, లాభసాటిగా పండిస్తారు. |
| **2) సురేష్ దేశాయ్**<br>బేడ్‌కి హల్,<br>చికొడి (తాలూకా), బెల్గాం,<br>కర్నాటక - 591 214<br>ఫోను : 08338 - 2662056 | చెరుకు రైతు, జొన్న పంటకయ్యే నీరు తోటి, 70-80 టన్నుల దిగుబడి, 7-8 సం॥లు మర్దాం పంట అలాగే ఉంచుతారు. |
| **3) ధీరేంద్ర సోనేజీ**<br>సకావా (పోస్టు)<br>సహరియా<br>భనాద్రా (బస్సు స్టాపు)<br>రాజ్‌పిప్లా తాలూకా<br>నర్మదా జిల్లా<br>గుజరాత్ - 393 145. | 2 ఎకరాలలో ఒక కుటుంబానికి సరిపడ పంటలు, కూరగాయలు పండించగలుగుతున్నారు. |
| **4) భాస్కర్ సావె**<br>దహేరి,<br>ఉమర్‌గావ్ దగ్గర<br>వల్సాద్ జిల్లా<br>గుజరాత్<br>ఫోను : 42135 | చెట్టు మొదలుకు నీరు పారించవలసిన అవసరం లేదంటారు. దూరంగా చివరి వేర్ల దగ్గర కాలువలు తీసి, చెత్త చెదారాలను వాటిలో వేసి మంచి దిగుబడి కొబ్బరి, సపోటా పంటల్లో సాధిస్తున్నారు. |
| **5) సందీపక్ ఐడ్‌గిరే**<br>సాళ్లి<br>ఆనందనగర్<br>నాందేడ్ రోడ్డు<br>లాతూర్<br>మహారాష్ట్ర. | మెట్ట పంటలు లాభసాటిగా పండిస్తారు. |

**6) వసంత్ ఫుటానె మరియు శ్రీమతి కరుణ**
షెందూర్ జానెఘాట్
వరూడ్ తాలూకా
అమరావతి జిల్లా
మహారాష్ట్ర

పశువుల పేడతో గోబర్ గ్యాస్, ఇంటికి కరెంటు, పొలానికి ఎరువు తయారు చేస్తారు. బిందుసేద్యంతో పంటలు పండిస్తారు.

**7) డా॥ వెంకట్, నర్సన్న**
పర్మాకల్చర్ నిపుణులు
117, ఈస్ట్ మారేడ్‌పల్లి
సికింద్రాబాదు - 500 026.
ఆంధ్రప్రదేశ్.

ఆస్ట్రేలియా నిపుణుడు బిల్ మాలిసన్ పద్ధతి పర్మాకల్చర్ ఆచరణలో పెట్టి, జహీరాబాద్ ప్రాంతంలో చేసి చూపించారు.

**8) పి. బాబు,**
ఇక్రా, సంస్కృతి
22, మైఖెల్‌పాల్య
కొత్త తిప్ప సంద్రా (పోస్టు)
బెంగుళూరు - 560 075
ఫోను : 080-25283370

బయోడైనమిక్ ఫార్మింగు: అనగా ఆవు కొమ్ములో పేడ నింపి భూమిలో పాతి పెట్టి (నిర్ణీత సమయంలో) 6 నెలల తరువాత తీసి వాడటం (హోమియోపతి మందులాగ).

**9) డా॥ లూకాస్ డెంగల్**
ఇకోప్రో, ఆరోసంజన్ కాంప్లెక్స్
ఆరో శిల్పమ్, ఆరోవిల్
605 101.
ఫోను : 0413-2623391

బయోడైనమిక్ ఫార్మింగు నిపుణులు

**10) డా॥ శ్రీపాద్ ఎ. దాభోల్కర్**
103, సలోఖానగర్, కొల్హాపుర్-416 007
మహారాష్ట్ర
ఫోన్ : 0231 - 620371

నీటి వసతి వుండే 1/4 ఎకరంలో మధ్య తరగతి కుటుంబానికి సరిపడ పంటలు / ఆదాయం గడించవచ్చంటారు. సూర్య రశ్మి బాగా తగలాలంటారు. సత్తువలు(సేంద్రీయ) బాగా వేయాలంటారు.

**10) ఎ. కృషి ప్రయోగ్ పరివార్**
చిత్ర కూట,
నెం : 14, రెండవ బ్లాకు,
మొదటి స్టేజి, మొదటి క్రాసు,
వినోభా నగర్, షియోగా (జిల్లా)
కర్నాటక - 577 204.

నీటి వసతి వుండే 1/4 ఎకరంలో మధ్య తరగతి కుటుంబానికి సరిపడ పంటలు / ఆదాయం గడించవచ్చంటారు. సూర్య రశ్మి బాగా తగలాలంటారు. సత్తువలు(సేంద్రీయ) బాగా వేయాలంటారు.

**11) శ్రీ సుభాష్ పాలెకర్**
ప్రాచీన (వైదిక) కృషి తంత్ర పరిశోధన,
అభివృద్ధి మరియు విస్తరణ ఆందోళన,
చందాస్మృతి, 19, జయకాలని,
టెలికాం కాలని దగ్గర
సాయినగర్ పోస్ట్ ఆఫీస్
అమరావతి - 444 607.
మహారాష్ట్ర.
సెల్ : 09423702877,
094 23601004,
098 50352745

ఒక్క దేశీయ ఆవు పేడ, మూత్రంతో 30 ఎకరాలకు ఎరువు సరిపోతుందంటారు. మంచి దిగుబడులు సాధించారు.

**12) డి.డి. భరమ గౌడ్ర**
ఎల్లవట్టి (పోస్టు)
షిరాహట్టతాలూకా
గదగ్ జిల్లా
కర్నాటక - 582 117
సెల్ : 09449514329

పత్తి, గత 20 ఏండ్లుగా సేంద్రీయ పద్ధతిలో లాభసాటిగా పండిస్తున్నారు.

**13) శ్రీ రామాంజనేయులు**
సెంటర్ ఫర్ సస్టేయినబుల్
అగ్రికల్చర్ (సి.ఎస్.ఎ),
స్ట్రీట్ నెంబర్ : 1,
తార్నాక,
సికింద్రాబాదు - 500 017.

వీరి సాయంతో ఎనబావి, ఖమ్మం జిల్లా రైతులు పత్తిని సేంద్రీయ పద్ధతిలో లాభసాటిగా పండిస్తున్నారు.

**14) శ్రీ సతీష్ గారు**
దెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ
జహీరాబాద్,
మెదక్ జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

మెట్ట పంటలను, సాంప్రదాయ విత్తనాలను, సేంద్రీయ పద్ధతుల్లో ప్రోత్సహించటంలో అగ్రగామి పాత్ర పోషిస్తున్నారు.

**15) డా॥ క్లాడ్ అల్వారిస్**
ఒఫై, ఆర్గానిక్ ఫార్మర్స్ అసోసియేషన్
ఆఫ్ ఇండియా, జి8-సెయింట్
బ్రిట్టోస్ అపార్ట్మెంట్స్,
ఆపోజిట్ సెయింట్ బ్రిట్టో హైస్కూల్
ఫెయిరాఅల్టా, మపూస, గోవా, 403 507,
(0832-2278740)
0832-2256479
సెల్ : 09326115907

వీరి వద్ద దేశంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న వారి మొత్తం లిస్టు వుంటుంది. సేంద్రీయ వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి కంపెనీల సర్టిఫికేట్లు అవసరం లేకుండా కృషి చేస్తున్నారు.

**16) శ్రీ సుందర రామన్ అయ్యర్ అయ్యర్ తొట్టం**
సత్య మంగళం (పోస్టు),
ఈ రోడ్ (జిల్లా), తమిళనాడు
ఫోను : 04295 - 225047.

అన్ని పంటలూ లాభసాటిగా సేంద్రీయ విధానంలో గత 20 సంవత్సరాలుగా పండిస్తున్నారు. వారం రోజులు శిక్షణ కూడా ఇస్తారు.

**17) డా॥ జి. నమ్మాళ్వార్,**
17/9, 5వ వీధి, శ్రీనివాస నగర్,
తిరువాన్నయ్ కొయిల్, తిరుచ్చి,
తమిళనాడు - 620 005.

సేంద్రీయ వ్యవసాయం గురించి శిక్షణ ఇవ్వగలరు, గొప్ప తత్వవేత్త.

**18) శ్రీ కె.వి. రావు,**
5-75, ఉత్తర వీధి,
కొల్లూరు,
గుంటూరు జిల్లా - 523 244

అన్నిరకాల సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లోనూ నిపుణులు. ముఖ్యంగా వ్యవసాయానికి తోడ్పడగల సూక్ష్మజీవుల ఉత్పత్తి, ప్రయోగాలపై నిష్ణాతులు

**19) శ్రీ పర్చా కిషన్ రావు**
ఇంటి. నెం. 7-1-246/ఎ/1/1
బల్కంపేట
యల్లమ్మ గుడి ఎదురు వీధి,
హైదరాబాద్ - 500 016.
ఫోను : 040-23733398
సెల్ : 94411 23197.

శ్రీ వరి పద్ధతిలో వరిసాగుపై నిపుణులు. ఖమ్మం జిల్లాలో వారి స్వగ్రామంలో ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు.

ఇంకా అనేక మంది నిపుణులు అన్ని ప్రాంతాల్లో వున్నారు. వారి నుండి సరైన గుణపాఠాలు నేర్చుకుని మన పొలాల్లో, మన పొలానికి మనకి అనుకూలంగా మన వ్యవసాయం లాభసాటిగా, శ్రమ అంతగా లేకుండా మనకు అవసరమైన పంటలు పండించేటట్లు తయారు చేయాలి. అదే మనముందున్న సవాల్.



తోటలో వర్మీ
కంపోస్టు తయారీ
(2005 సం॥)



శ్రీమతి
మేథాపాట్కర్ గారి
నాయకత్వాన
ఏర్పాటైన ప్రజా
ఉద్యమాల
జాతీయ సమాఖ్య
సమావేశం
(1999 సం॥)

పేదలకు భూములు స్వాధీనం చేయాలంటూ పాదయాత్ర (2000 సం॥)






మా మామిడి తోటలో పనిచేసే వ్యవసాయ కార్మికులు (1997 సం॥)



కరెంటు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ చిత్తూరు జిల్లాలో ఉద్యమం (1999 సం॥)




ప్రపంచీకరణను ఎదుర్కోవాలంటే "స్వదేశీ" ఉద్యమమే సరైన మార్గం. వెంకట్రామపురంలో సమావేశం (1995 సం॥)



చిత్తూరులో
"జలవనరుల
అభివృద్ధి" అనే
అంశంపై
సమావేశం
(1988 సం॥)



ఆర్.పి.ఐ రాష్ట్ర
రాజకీయ శిక్షణా
తరగతుల్లో
నరేంద్రనాథ్
ప్రసంగం



వెంకట్రామాపురం
లోని మా ఇంటి
అవరణ

చిత్తూరు జిల్లా,
యు కోట
మండలంలో
కైగల్ ఫాల్స్
(దుముకురాళ్ళు)ను
తిలకిస్తున్న
ఉమాశంకరి,
నరేంద్రనాథ్



కిరణ్ +
సంయుక్త,
పెద్దమ్మాయి
వివాహ
సందర్భంలో
ముగ్గురు
అన్నదమ్ముల
ఫోటో స్టిల్
(అన్నవరం,
(25.6.2003 సం॥ )



అన్నవరంలో
పెద్దమ్మాయి,
సంయుక్త
వివాహ
సందర్భంగా
ఉమాశంకరి,
నరేంద్రనాథ్
(అన్నవరం,
(25.6.2003 సం )



# దేశభక్తి

- మహాకవి గురజాడ అప్పారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్!

పాడిపంటలు పొంగి పొరలే
దారిలో నువు పాటుపడవోయ్
తిండి కలిగితే కండ గలదోయ్
కండ కలవాడేను మనిషోయ్

దేశాభిమానము నాకు కద్దని
వట్టిగొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనను వొక మేల్
కూర్చి జనులకు చూపవోయ్

ఈసురోయని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయ్
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నింపవోయ్

చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్

సొంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడు పడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

గురజాడ అప్పారావుగారి ఈ రచన
ప్రతి పద్యమూ నాకు స్ఫూర్తినిస్తోంది.
అందుకే పూర్తి పాఠాన్ని ఇక్కడ
ప్రచురిస్తున్నాము.

# కృతజ్ఞతలు ...

ఈ పుస్తకంలోని అనుభవాలు నాతో పంచుకుని, పుస్తకం ఎడిటింగ్‌తో సహా అన్ని విధాలా చేదోడు వాదోడుగా వున్న నా జీవిత సహచరి ఉమాశంకరికి, ఈ పుస్తకాన్ని ఎడిటింగ్ చేసిన వసంత గారికి, నీటి జలాల సమస్యపై నాకు సహాయపడిన బాలగోపాల్ గారికి, సూక్ష్మంగా ఎడిటింగ్ సలహాలిచ్చిన ప్రభాకర్ గారికి, రెండుసార్లు ఓపికగా ఎడిటింగ్ చేసిన సజయగారికి, రమేష్ గారికి క్రియాత్మక సలహాలిచ్చిన డా॥ సత్యలక్ష్మిగారికి, శ్రీ కిషన్ రావుగారికి, టీచర్ ఎర్రయ్య, ముందుమాట రాసిన ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి గారికి, ఓపికగా డి.టి.పి పని చేసిన తమ్ముడు విజయ్‌కి, పుస్తకం త్వరగా పూర్తి చేయమని నా తలకాయతిన్న గీతా రామస్వామిగారికి, నా వ్యవసాయ అనుభవాలు పంచుకుని ఈ పుస్తకం చదవలేని రాము, అన్నాసామి, జగన్నాథరెడ్డి, శిద్దయ్యలకు, లక్ష్మీరెడ్డికి, ముని కృష్ణారెడ్డికి, నా కష్టనష్టాలు పంచుకున్న బంధు మిత్రులకు, నాతోటి ఉద్యమకారులు, సంఘసేవకులు, ప్రజాసంఘాలు, ప్రభుత్వ అధికారులు ... వారందరికీ నా కృతజ్ఞతలు.

– గొర్రెపాటి నరేంద్రనాథ్

సుందరయ్య గ్రంథాలయ ట్రస్ట్
ACC No. 98487
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.



గొర్రెపాటి నరేంద్రనాథ్ కి వ్యవసాయమన్నా, ప్రజా ఉద్యమాలన్నా ఎనలేని మక్కువ. ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాలకు ఊతమిచ్చే 'లోకాయన్' అనే సంస్థతో కలసి పనిచేసేందుకు గాను ఆయన ఢిల్లీలో తన బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగానికి సైతం రాజీనామా చేశారు. ఆ తరువాత చిత్తూరు జిల్లాలోని పాకాల వద్దగల తన స్వగ్రామం వెంకటరామాపురంకు వెళ్లి సేంద్రీయ వ్యవసాయం మొదలుపెట్టారు. గత రెండు దశాబ్దాలుగా ఒక రైతు సేంద్రీయ వ్యవసాయం చేస్తూనే అంటరానితనంపై, భూ సమస్యలపై, నిర్వాసితుల పునరావాసంపై, రైతు సమస్యలపై ఎంతో కృషి చేశారు. ఎన్ఎపిఎం, హెచ్ఆర్ఎఫ్, రాష్ట్రీయ రైతు సేవా సమితి వంటి సంస్థల్లో పనిచేస్తున్నారు.

సేంద్రీయ వ్యవసాయదారుడిగా మారిన నరేంద్రనాథ్ చేసిన ప్రయోగాలు, సాధించిన ఫలితాలు, వ్యవసాయంలోని మంచిచెడు అనుభవాల సమాహారమే ఈ పుస్తకం. తన నిజజీవితంలోని ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావిస్తూనే సేంద్రీయ వ్యవసాయ ప్రాధాన్యతను, వ్యవసాయ రంగపు సాధక బాధకాలను, పల్లె జీవితంలోని ఒడిదుడుకులను ఆయన ఈ పుస్తకంలో కళ్లకు కట్టినట్టు వివరించారు. రైతులకూ, వ్యవసాయరంగం పట్ల ఆసక్తి వున్నవారికే కాక - క్షీణిస్తున్న పర్యావరణం గురించి తరుగుతున్న సహజ వనరుల గురించి ఆందోళన చెందుతున్న వారికీ, తాము తింటున్న ఆహారం మంచిదో చెడ్డదో తెలుసుకోవాలనుకునే వారికి ఈ పుస్తకం ఎంతగానో తోడ్పడుతుంది.